ఈనాడు

విజయవాడ 31-1-2018 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 171

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

భాగ్య భారతం

అత్యంత సంపన్న దేశాల్లో ఆరో స్థానం మనది



అత్యంత ధనిక దేశమంటే మనకు ముందుగా గుర్తొచ్చేది అమెరికానే. ఇప్పుడు ఈ అగ్ర దేశానికి ఐదు ర్యాంకుల దూరంలో భారత్ నిలిచింది. అత్యంత సంపన్నుల దేశాల జాబితాలో ఆరో స్థానం పొందింది. న్యూ వరల్డ్ వెల్త్ రూపొందించిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం అమెరికాకు అగ్రస్థానం దక్కగా.. ఆ తర్వాత చైనా, జపాన్, బ్రిటన్, జర్మనీలు నిలిచాయి. 2017లో భారత సంపద 25% పెరిగి 8,230 బిలియన్ డాలర్లకు చేరిందని నివేదిక వెల్లడించింది. గతేడాది ఏ దేశ సంపద కూడా ఈ స్థాయిలో పెరగకపోవడం గమనార్హం. అలాగే దశాబ్ద కాలంలో (2007-2017) భారత సంపద 160 శాతం వృద్ధి చెందింది. భారత్ 3,30,400 మంది సంపన్నులకు నిలయంగా ఉందని నివేదిక చెప్పింది. ఈ విషయంలో భారత్‌ది తొమ్మిదో స్థానం. దేశంలోని ప్రతి ఒక్కరి మొత్తం సంపదను కలిపి ఆ దేశ సంపదగా లెక్కిస్తారు. - వివరాలు బిజినెస్ పేజీలో

పాక్ భరతం పట్టిన యువతరం



అండర్-19 ప్రపంచకప్‌లో భారత యువ జట్టు జైత్రయాత్రను కొనసాగించింది. మంగళవారం సెమీ ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఏకంగా 203 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. మొదట శుభ్‌మన్ గిల్ (102 నాటౌట్; 94 బంతుల్లో 7x4) సత్తా చాటడంతో భారత్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. అనంతరం ఇషాన్ పోరెల్ (4/17)తో పాటు మిగతా బౌలర్లూ విజృంభించడంతో పాకిస్థాన్ 29.3 ఓవర్లలో కేవలం 69 పరుగులకే కుప్పకూలింది. భారత్ శనివారం ఆస్ట్రేలియాతో ఫైనల్ ఆడుతుంది.

- వివరాలు ఛాంపియన్‌లో



నవయుగకు పోలవరం పనులు

- నితిన్‌గడ్కరీ అంగీకారం
- వారంలో ఒప్పందంపై సంతకాలు
- 60సి నిబంధన కింద అప్పగింత

ఈనాడు - దిల్లీ

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో మరో కీలక అడుగు పడింది. స్పిల్‌వే పనుల నిర్మాణంలో జాప్యం చేస్తున్న గుత్తేదారు సంస్థ ట్రాన్స్‌ట్రాయ్ నుంచి 60సి నిబంధన కింద కొంత పనిని తప్పించి నవయుగ సంస్థకు అప్పగించడానికి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ ఆమోదముద్ర వేశారు. మంగళవారం సాయంత్రం ఇక్కడి శ్రమశక్తిభవన్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇకమీదట నవయుగ సంస్థ ఉపగుత్తేదారు సంస్థగా కాకుండా ప్రధాన గుత్తేదారు సంస్థల్లో ఇదీ ఒకటిగానే స్పిల్‌వే, స్పిల్ ఛానల్ నిర్మాణ పనులు చేపడుతుంది. మొత్తం 30 లక్షల క్యూబిక్‌మీటర్ల కాంక్రీట్‌పనుల్లో ఇప్పటివరకు 5 లక్షల క్యూబిక్‌మీటర్ల పని మాత్రమే పూర్తయింది. మిగతా 25 లక్షల క్యూబిక్‌మీటర్ల స్పిల్‌వే, స్పిల్‌ఛానల్ తదితర పనులను నవయుగ పూర్తిచేయాలి. 2019 డిసెంబరు నాటికి దీన్ని పూర్తిచేయడం లక్ష్యం కాగా వచ్చే సంవత్సరం మార్చికల్లా పూర్తిచేసి ప్రపంచరికార్డు సృష్టించాలనుకుంటున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. పనుల పూర్తికి 80 లక్షల టన్నుల రాయిని పిండి చేయాల్సి ఉంటుందని, ఇందుకోసం (మిగతా 2లో)

పోలవరంలో కానిది.. దిల్లీలో ఏం జరిగింది..? 2 లో

వినపడదా ప్రజావాణి

ఎంత కష్టం.. ఎంత నరకం!!
పింఛను కోసం.. భూ పట్టా కోసం..
స్థలం ఆక్రమణకు గురైందన్న ఆవేదనతో...
కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా
తిరుగుతుంటే..
కానరావడం లేదా పేదోళ్ల కష్టాలు!

కూలి వదులుకొని.. ఛార్జీలు పెట్టుకొని..
సమస్య తీరుతుందనే గంపెడాశతో
పదే పదే ప్రభుత్వ కార్యాలయ
గడప తొక్కుతున్నా..
కనికరం లేదా అధికారులకు!
కదలడం లేదు వారెందులకు!!
ఆ... మనల్ని అడిగేవారు
ఎవరున్నారు గనుక అనా!!!

చిన్న చిన్న సమస్యలకూ లభించని పరిష్కారం



- ఏళ్ల తరబడి ప్రదక్షిణలు... వ్యయప్రయాసలు
- యంత్రాంగంలో అంతులేని అలసత్వం
- రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లలో మీ కోసం (ప్రజావాణి)పై 'ఈనాడు' పరిశీలన

ఆస్తి ఉన్నా.. హక్కు లేని వాళ్లు కొందరు. అందరూ ఉన్నా నిరాదరణకు గురవుతున్న వారు మరికొందరు. చట్టప్రకారం రావాల్సిన పరిహారం కోసం ఏళ్ల తరబడి కాళ్లరిగేలా తిరుగుతున్న వారు ఇంకొందరు. మలిసంధ్యలో ఆసరా కోసం పింఛను మంజూరు చేయాలంటూ అధికార యంత్రాంగం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వారు మరెందరో. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాక ఎన్నో వ్యయప్రయాసల కోర్చుతూ జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లలో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి ఇలాంటి వారంతా పోటెత్తుతున్నారు. అక్కడ సమస్యలను స్వయంగా కలెక్టర్లకే విన్నవిస్తున్నా.. ఫలితం మాత్రం ఉండటం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద ఈ నెల 29వ తేదీన (సోమవారం) జరిగిన ప్రజావాణిలో వినతులు ఇవ్వడానికి వచ్చిన వారితో "ఈనాడు" ప్రతినిధి బృందం చర్చించి.. వారి ఆవేదనను తెలుసుకునే ప్రయత్నం చేసినప్పుడు అధికారులు మనసుపెట్టడం లేదని తేటతెల్లమైంది. - పూర్తి వివరాలు 11లో

ఓ వితంతు వేదన...

కూలీనాలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా. నాలుగేళ్ల కిందట నా భర్త చనిపోయారు. అప్పటి నుంచి వితంతు పింఛను కోసం తిరుగుతున్నా. కలెక్టరు వద్ద మొరపెట్టుకుంటే పింఛను వస్తుందని ఎవరో చెబితే ఆరు నెలలుగా తిరుగుతున్నా. అధికారులు ప్రతిసారీ అర్జీని పరిశీలించమని తహసీల్దారుకు రాస్తున్నారు. ఎలాంటి ప్రయోజనమూ ఉండటం లేదు.

- గుంజి పద్మ, కృష్ణపాడు, నెల్లూరు జిల్లా.

నిధులకూ సమీకరణే!

- రాజధానికి పన్ను రహిత బాండ్లు
- రూ.10వేల కోట్లకు సిద్ధం
- మసాలా, దేశీయ బాండ్ల ద్వారా మరో రూ.2వేల కోట్లు
- రాష్ట్ర ప్రభుత్వం యోచన
- అనుమతి కోరుతూ కేంద్రానికి ముఖ్యమంత్రి లేఖ



ఈనాడు - అమరావతి

భూసమీకరణలాగే రాజధాని నిర్మాణానికి నిధుల సమీకరణకు 'అమరావతి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్స్' పేరుతో పన్ను రహిత బాండ్లను విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ విధానంలో రూ.10వేల కోట్లు సమీకరించుకోవాలన్నది ఆలోచన. మరో రూ.2 వేల కోట్లను దేశీయ సంస్థాగత బాండ్లు, మసాలా బాండ్ల (విదేశాల్లో విడుదల చేసేవి) ద్వారా సమకూర్చుకునేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ బాండ్ల జారీకి అనుమతి కోరుతూ కేంద్ర ఆర్థికశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదన వెళ్లింది. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థికశాఖకు ఒక లేఖ రాశారు. బాండ్ల జారీకి అనుమతితోపాటు, రాజధానిలో చేపట్టే మౌలిక వసతుల ప్రాజెక్టులకు నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఎన్ఐఐఎఫ్) ద్వారా నిధులు సమకూర్చాలని కోరారు. రాజధానిలో (మిగతా 2లో)

6 నెలల కిందటే జీవో ఇస్తే మీకు తెలియదా?

- జన్మభూమి కమిటీల పునర్వ్యవస్థీకరణలో జాప్యంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి 2లో
- డీలిమిటేషన్‌పై చర్చ ప్రారంభమైందని వెల్లడి
- జమిలి ఎన్నికలపై అభిప్రాయం చెబుతామని స్పష్టీకరణ
- తెదేపా సమన్వయ కమిటీ భేటీ

దేదీప్య చంద్రప్రభ



- నేడు ఆకాశంలో అరుదైన అద్భుతం
- బ్లూ, బ్లడ్, సూపర్ మూన్‌లు ఒకేసారి
- పౌర్ణమి లేని ఫిబ్రవరి!

దిల్లీ, సంగం - న్యూస్‌టుడే

ఆకాశంలో నేడు అద్భుత దృశ్యం ఆవిష్కృతం కానుంది. పండు వెన్నెలను పంచే చంద్రుడు ఈ రోజు (బుధవారం) రాత్రి అత్యంత అరుదైన రూపంలో దర్శనమివ్వనున్నాడు. "సూపర్ మూన్", "బ్లూ మూన్", "బ్లడ్ మూన్"లను ఒకేసారి వెంటపెట్టుకు రానున్నాడు. ఈ పరిణామాన్ని "సూపర్ బ్లూ బ్లడ్ మూన్"గా పిలుస్తున్నారు. ఇలాంటి అత్యంత అరుదైన దృశ్యం చివరగా 1982లో చోటుచేసుకుంది. దీన్ని వీక్షించే అవకాశం నేటి తర్వాత మళ్లీ 2037 వరకూ ఉండబోదు. భ్రమణ సమయంలో భూమికి దగ్గరగా వచ్చినప్పుడు సంభవించే పౌర్ణమిని "సూపర్ మూన్"గా పిలుస్తారు. ఈ సమయంలో చంద్రుడు సాధారణ పౌర్ణమి కంటే కాస్త పెద్దగా కనిపిస్తాడు. మరోవైపు ఒకే నెలలో వచ్చే రెండో పౌర్ణమిని "బ్లూ మూన్"గా పిలుస్తారు. చంద్రగ్రహణంనాడు ఒక్కోసారి భూమి వాతావరణం గుండా చంద్రుడిపై సూర్య కిరణాలు పడతాయి. దీంతో చంద్రుడు గోధుమ వర్ణంలో కనిపిస్తాడు. ఈ పరిణామాన్ని బ్లడ్ మూన్‌గా చెబుతారు. బ్లూ, బ్లడ్, సూపర్ మూన్‌లు ఎప్పటికప్పుడు వస్తూనే ఉంటాయి. అయితే ఈ మూడు కలిసి రావడం అత్యంత అరుదు. ఈ పరిణామాన్ని స్పష్టంగా వీక్షించే అవకాశం ఉత్తర అమెరికా, తూర్పు ఆసియా వాసులకు దక్కనుంది. మరోవైపు భారత్‌లోనూ సాయంత్రం 5.20 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం మొదలవుతుందని (మిగతా 2లో)

ఇదీ సంగతి!



డబ్బుకొద్దీ పోస్టు!

- పాలిటెక్నిక్ పదోన్నతుల్లో రూ.లక్షలు చేతులు మారిన వైనం!
- ఇష్టారాజ్యంగా నియామకాలు
- చక్రం తిప్పిన ఓ కిందిస్థాయి అధికారి
- నష్టపోతున్న విద్యార్థులు

5 లో

నవ్యావిష్కరణలకు రాష్ట్రం ప్రధాన కేంద్రం

- రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలి
- అమెరికాలోని కంపెనీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి



మహాత్ముని అడుగుజాడలు

దిల్లీలోని 'గాంధీ స్మృతి'లో రాతితో ఏర్పాటు చేసిన మహాత్ముని చివరి పాద ముద్రల ప్రతి రూపం. గాంధీజీ తన చివరి రోజుల్లో ఈ ప్రాంతంలోనే గడిపారు. మంగళవారం గాంధీ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నేతలు, ప్రజలు ఘన నివాళులర్పించారు.

వైద్య విద్య.. పరీక్షలు మిథ్య!

- ఇష్టానుసారం ఇంటర్నల్స్, ప్రాక్టికల్స్
- విద్యార్థులకు 90-100% మార్కులు.. ఎగ్జామినర్లకు రాచమర్యాదలు
- ప్రశ్నలు.. పరీక్షించాల్సిన రోగుల వివరాలు ముందే లీక్



ఈనాడు, అమరావతి: ఉన్నతమైన వైద్య వృత్తిలోకి ప్రవేశించే విద్యార్థులకు కళాశాలల్లో గట్టి పునాది పడుతుందా? అంతర్గత (ఇంటర్నల్), ప్రయోగ (ప్రాక్టికల్స్) పరీక్షలు నిబంధనల మేరకు పక్కాగా జరుగుతున్నాయా?.. అంటే లేదనే సమాధానం వస్తోంది. రాష్ట్రంలో అధిక శాతం వైద్య కళాశాలల్లో అంతర్గత, ప్రయోగ పరీక్షల నిర్వహణలో పెద్దఎత్తున అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. ఇంటర్నల్స్‌ను అసలు నిర్వహించని కళాశాలలూ ఉన్నాయి. కొన్నిచోట్ల విద్యార్థులకు నూటికి నూరు మార్కులు వచ్చేస్తున్నాయి. రోగులను పరీక్షించినా, పరీక్షించకపోయినా పాసైపోతున్నందున విద్యార్థులు ఆసుపత్రులకు వెళ్లి నేర్చుకోవడంలో ఆసక్తి కనబరచడంలేదు. ఫలితంగా రోగి అవసరాలను, జబ్బును గుర్తించి వైద్యాన్ని అందించడంలో తగిన ప్రావీణ్యాన్ని సంపాదించలేకపోతున్నారు. దీని ప్రభావం సమాజంపైనా ఉంటుందని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోపాలు ఉన్నాయని, సవరించే ప్రయత్నాలు చేస్తున్నామని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

35% మార్కులు వస్తేనే..

- 490 మార్కులకు నిర్వహించే ఇంటర్నల్ పరీక్షలకు, 595మార్కులకు (మిగతా 2లో)

పోలవరంలో కానిది... దిల్లీలో ఏం జరిగింది?

- ఈపీసీ నుంచి తొలగించి ఎల్ఎస్ విధానంలో అప్పగింత
- పని పరిమాణం, వర్గీకరణ వర్తింపుతో అదనపు మొత్తాలు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పనులకు సంబంధించిన వ్యవహారం కొత్తరూపు తీసుకొని దిల్లీలో ఒక కొలిక్కివచ్చింది. పాత ధరలకే నవయుగ సంస్థకు అప్పచెబుతున్నట్లు కేంద్రమూ, రాష్ట్ర అధికారులు ప్రకటించారు. మరి అదే పాత ధరలతో ట్రాన్స్‌ట్రాయ్‌తో నవయుగకు ఎందుకు ఒప్పందం కుదరలేదు? అదే పాత ధరలకు ఇప్పుడు ఎందుకు అంగీకారం కుదిరింది? ప్రధాన గుత్తేదారుగా నవయుగ ఎలా రంగప్రవేశం చేస్తోందన్నదే ఆసక్తికరం.

1. ప్రధాన గుత్తేదారు ట్రాన్స్‌ట్రాయ్‌కి ప్రభుత్వం తొలుత ఈ పనులను ఈపీసీ విధానంలో అప్పగించింది. ఈ పద్ధతిలో ఏ పనికి ఎంత పరిమాణం నిర్దేశించారో అంత మొత్తమే ప్రభుత్వం చెల్లిస్తుంది. అంటే ఉదాహరణకు 30 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనికి ఒప్పందం కుదుర్చుకుంటే, వాస్తవంగా పని అంతకన్నా బాగా తక్కువైనా, అంతకన్నా ఎక్కువైనా అదే పని పరిమాణానికి ప్రభుత్వం బిల్లు చెల్లిస్తుంది.

2. ట్రాన్స్‌ట్రాయ్‌తో నవయుగ ఈ పనికోసం సంప్రదింపులు జరిగినప్పుడు తాము ఎంత పని చేస్తే అంతకు చెల్లించాలని అడిగింది. ఇందుకు ట్రాన్స్‌ట్రాయ్ అంగీకరించలేదు. ప్రభుత్వం నుంచి తమకు ఎంత వస్తుందో అంతే ఇస్తామని ప్రధాన గుత్తేదారు సంస్థ చెప్పింది. అక్కడే మెలిక పడింది. పంచాయతీ దిల్లీ చేరింది.

ఇప్పుడెలా...!

- ఇప్పుడు ఎంత పని చేస్తే అంత పని పరిమాణానికి ధర చెల్లిస్తారు. ఇది ఈపీసీ విధానం కాదు... లంప్సమ్ పద్ధతి. కొత్త పని పరిమాణం మేరకు (ఎంత పని చేస్తే అంత పని పరిమాణానికి ధర చెల్లించేలా) పని వర్గీకరించి అప్పచెబుతారు. దీని వల్ల అదనపు పని ఉంటే అదనపు మొత్తమూ లభిస్తుంది. అలాగే ఈపీసీలో ఇచ్చిన జీవో 22, జీవో 63 ద్వారా అదనపు ధరలు వర్తింపజేస్తారా లేదా అనేది చూడాలి. గతంలో పోలవరం కుడి, ఎడమ కాలువ పనుల్లో కొన్ని ప్యాకేజీల్లో ఇలాగే పనులు అప్పగించారు. లంప్సమ్ విధానంలో పనులను ఇస్తూ ఈపీసీ ప్రకారం అదనపు ధరలూ (జీవో 22, జీవో 63) వర్తింపజేశారు. ఇది కూడా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనే. అయితే దీనిని ఇప్పుడు కేంద్రం కూడా సమ్మతించింది.
- ఈపీసీలో రూ.100 కోట్ల పని 60 సి కింద తొలగించి మరో గుత్తేదారుకు అవే ధరలకు అప్పగిస్తే ఆ 100 కోట్లు + జీవో 22, 63 వల్ల వచ్చే అదనపు ధరలు మాత్రమే వస్తాయి. ఇప్పుడు లంప్సమ్ విధానంలో రూ.100 కోట్ల పని అప్పగిస్తే ఆ పనిలో ఎంత పని చేశారో అంతకు ధర లెక్కించి, ఏ వర్గీకరణ ప్రకారం ఎంత పని చేస్తే ఆ వర్గీకరణ ప్రకారం ధర లెక్కించి ఇస్తారు. దీని వల్లే కొంత అధనంగా పొందే పరిస్థితి ఉంటుంది.

రూ.2000 కోట్ల పని నవయుగకే..

పోలవరం ప్రాజెక్టులో ఇప్పుడు దాదాపు స్పిల్‌వే మొత్తం, స్పిల్ ఛానల్ మొత్తం, స్టిల్లింగ్ బేసిన్ పని మొత్తం నవయుగ సంస్థకే అప్పగించబోతున్నారు. ప్రస్తుతం 60 సి కింద కొంత పనే తొలగించి టెండర్లు పిలిచారు. మొదట ఆ మేరకు అప్పగిస్తారు. ఆ తర్వాత మిగిలిన పని కూడా ట్రాన్స్‌ట్రాయ్ నుంచి తొలగించి నవయుగకు అప్పగించనున్నారు. దాదాపు రూ.2000 కోట్ల విలువైన పని నవయుగకు అప్పచెప్పనున్నట్లు సమాచారం.

నవయుగకు పోలవరం పనులు



(మొదటి పేజీ తరువాయి)

సుమారు 20వేల మంది మానవ వనరులను మోహరించాల్సి ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న యువత ముందుకురావాలని పత్రికా ప్రకటన ఇస్తే ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే 3వేల దరఖాస్తులు వచ్చాయని, అనుకున్నంత సంఖ్యలో మానవ వనరులను మోహరించడం ఇబ్బందేమీ ఉండదని పేర్కొన్నారు. సమావేశానంతరం ఏపీ జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ "ఈ గుత్తేదారు 60-సి నిబంధన కింద వస్తున్నారు కాబట్టి ప్రధాన గుత్తేదారు అవుతారు. ప్రభుత్వంతో నేరుగా ఒప్పందం చేసుకుంటారు. అప్పగించే పనుల విలువ ఎంత ఉంటుందన్నది క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖరారు చేయాల్సి ఉంటుంది. మేం ఇదివరకు టెండర్‌కు వెళ్లినంత మొత్తమే దాదాపుగా ఉంటుంది. అది దాదాపు రూ.1300-1400 కోట్ల మధ్యలో ఉండొచ్చు. వారంలోపు ఒప్పందం చేసుకోబోతున్నాం. ఇది రేట్ కాంట్రాక్ట్‌కాబట్టి ఏకమొత్తంలో ఇస్తాం" అన్నారు. కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి యూపీసింగ్‌తోపాటు, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, ట్రాన్స్‌ట్రాయ్, నవయుగ సంస్థల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



కాలిఫోర్నియాలోని సిలికాన్ వ్యాలీకి చెందిన న్యూరో అంకుర సంస్థ రూపొందించిన డ్రైవర్‌రహిత డెలివరీ కారు ఇది.. చిన్న చిన్న వస్తువులను మోసుకెళ్లే దీనిని మంగళవారం ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఈ ఏడాది చివరికి దీనిని రోడ్లపై తిప్పేందుకు ఆ కంపెనీ ప్రణాళికలు రచిస్తోంది

6 నెలల కిందటే జీవో ఇస్తే మీకు తెలియదా?

- జన్మభూమి కమిటీల పునర్వ్యవస్థీకరణలో జాప్యంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి

ఈనాడు, అమరావతి: 'జన్మభూమి కమిటీల పునర్వ్యవస్థీకరణపై ఆరు నెలల కిందటే జీవో ఇచ్చినా మంత్రులెవరికీ తెలియక పోవడమేంటి? సరిగా పనిచేయని, ఆరోపణలున్న కమిటీలను తొలగించి కొత్తగా నియమించాలని మంత్రివర్గంలో కోరితేనే జీవో ఇచ్చా. ఇప్పటికీ ఒక్క జిల్లాలోనూ ఈ ప్రక్రియ ప్రారంభించక పోవడమేంటి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో మంగళవారం చంద్రబాబు అధ్యక్షతన పార్టీ, ప్రభుత్వ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో జన్మభూమి కమిటీలపై చర్చ సందర్భంగా కొందరు మంత్రులు వాటి పనితీరుపై విమర్శలొస్తున్న తీరును ప్రస్తావించారు. పునర్వ్యవస్థీకరించాలని కోరారు. దీంతో ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'కమిటీల పదవీ కాలం రెండేళ్లే. అది ఇప్పటికే పూర్తయింది. సరిగా పనిచేయని వాటి స్థానంలో కొత్త వాటిని నియమించి, సంతృప్తికరంగా ఉన్న వాటిని కొనసాగించాలన్న సూచనలతో కిందటి సెప్టెంబరులో జీవో విడుదలైంది. మీరెందుకు పట్టించుకోలేదు. ఇన్‌ఛార్జ్ మంత్రులు ఎందుకు సరిగా వ్యవహరించడం లేదు' అని ప్రశ్నించారు. అసలు జీవో విడుదలైన విషయమే తమకు తెలియదని కొందరు ప్రస్తావించారు. దీంతో ముఖ్యమంత్రి అప్పటికప్పుడు ఆ జీవోను తెప్పించి చూపించారు. రెండు వారాల్లోగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక సాధికార మిత్ర, జన్మభూమి కమిటీలు, గ్రామ స్థాయి ప్రభుత్వ సిబ్బందితో తాను వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని తెలిపారు. 'శాసనసభ నియోజకవర్గాల పెంపుపై చర్చ ప్రారంభమైంది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదనపై ప్రధాన మంత్రి కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్య పక్షాలతో చర్చలు ప్రారంభించారు. మన అభిప్రాయం చెబుతాం. రాబోయే ఏడాదిపాటు పార్టీ కార్యక్రమాలపై నాతో పాటూ అందరూ దృష్టి పెట్టాలి. దళిత తేజం మాదిరిగా ముస్లింలు, బీసీలు, ఎస్టీలు లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాల్ని రూపొందిస్తున్నాం. వీటిపై రెండో తేదీన జరిగే సమన్వయ భేటీలో పూర్తి వివరాలు చెబుతా' అని చంద్రబాబు వివరించారు.

నియోజక వర్గాల వారీగా సమీక్షిస్తా

వచ్చే నెల నుంచి నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తానని, పార్టీపై ఎక్కువగా దృష్టి పెడతానని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తస్థాయి డిసెంబరులో 57 శాతం ఉంటే, జనవరిలో 62 శాతానికి పెరిగిందని, ఇది 80శాతానికి చేరేలా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని రెండంకెల వృద్ధి రేటును కేంద్ర ఆర్థిక సర్వే నిర్ధారించిందని తెలిపారు. అంబేద్కర్ స్మృతివనం, జగజ్జీవన్‌రాం మెమోరియల్ తరహాలో జ్యోతిరావ్ పూలే మెమోరియల్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మంత్రులు యనమల రామకృష్ణుడు, పితాని సత్యనారాయణ, పుల్లారావు, నారాయణ, దేవినేని ఉమామహేశ్వరరావు, సునీత, కాలువ శ్రీనివాసులతోపాటు కమిటీ సభ్యులు ఆనం రామనారాయణరెడ్డి, వర్ల రామయ్య, టీడీ జనార్దన్, వీవీవీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

దేదీప్య చంద్రప్రభ

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని బీఎం బిర్లా సైన్స్ సెంటర్ డైరెక్టర్ బీజీ సిద్ధార్థ్ తెలిపారు. సూర్యాస్తమయం (6.25 గంటల) దాటిన తర్వాత ఆకాశంలో తూర్పు వైపు ఈ పరిణామాన్ని చక్కగా చూడొచ్చని పేర్కొన్నారు. 7.25 వరకూ ఇది కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నెలలో పౌర్ణమి, అమావాస్యలు ఉండడం సర్వసాధారణ విషయం. ఇందుకు భిన్నంగా ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో పౌర్ణమి ఉండదు. కేవలం అమావాస్య మాత్రమే ఉంటుంది. ఇది అత్యంత అరుదుగా జరిగే ఘటన.

ఎల్‌జీడీ ఏర్పాటుకు ఉన్నతస్థాయి కమిటీ

ఈనాడు, అమరావతి: గ్రామీణాభివృద్ధి పథకాల తీరు, తాజా సమాచారం తెలిసేలా 'స్థానిక ప్రభుత్వాల డైరెక్టరీ' (ఎల్‌జీడీ) ఏర్పాటుచేయాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలపై రాష్ట్రంలో వాటి అమలు కోసం ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి ఛైర్మన్‌గా, కమిషనర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన మరో 11మంది కమిషనర్/సంచాలకులను సభ్యులుగా నియమించారు.

క్రయవిక్రయాలపై నిషేధం రెండేళ్లకు తగ్గింపు

- గాజువాకలో క్రమబద్ధీకరించిన స్థలాలపై మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

ఈనాడు అమరావతి: విశాఖపట్నంలోని గాజువాక పరిధిలో క్రమబద్ధీకరించిన స్థలాల క్రయవిక్రయాలపై విధించిన ఐదేళ్ల నిషిద్ధ కాలాన్ని రెండేళ్లకు తగ్గిస్తూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. ఉప ముఖ్యమంత్రి (రెవెన్యూ) కేఈ కృష్ణమూర్తి సారథ్యంలో ఉపసంఘం మంగళవారం సచివాలయంలో సమావేశమైంది. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, రవాణాశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, విశాఖ కలెక్టరు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. గాజువాక పరిధిలో ఆక్రమణలో ఉన్న స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అప్పట్లో 301 జీవో జారీ చేసింది. దీని ప్రకారం వచ్చిన అర్జీల్లో 7,407 దరఖాస్తుల్ని ఆమోదించింది. అయితే స్థలాల్ని క్రమబద్ధీకరించినప్పటి నుంచి ఐదేళ్ల వరకూ ఎలాంటి క్రయవిక్రయాలు జరపకుండా ఆంక్షలు విధించింది. ఆ తర్వాత రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో క్రమబద్ధీకరించిన స్థలాల క్రయవిక్రయాలపై రెండేళ్లే ఆంక్షలు విధించింది. తమకూ ఇదే సూత్రాన్ని వర్తింపజేయాలని గాజువాక వాసులు కోరారు. దీంతో మంత్రివర్గ ఉపసంఘం సానుకూలంగా స్పందించి జీవో 301ని సవరించాల్సిందిగా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దీంతోపాటు క్రమబద్ధీకరించిన స్థలాల్ని తనఖా పెట్టుకునేందుకూ అనుమతివ్వాలని సూచించింది.



విశాఖ భూముల అంశంపై సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో చర్చిస్తున్న ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మంత్రులు యనమల రామకృష్ణుడు, నారాయణ



మంగళవారం కశ్మీర్‌లోని బారాముల్ల జిల్లా తంగ్‌మార్గ్‌లో భారీగా పేరుకుపోయిన మంచు

నిధులకూ సమీకరణే!

(మొదటి పేజీ తరువాయి)

శాసనసభ, హైకోర్టు, సచివాలయం వంటి ప్రభుత్వ భవనాల నిర్మాణానికి రూ.11,602 కోట్లు వ్యయమవుతుందని, దీనికి సంబంధించిన ప్రాజెక్టు నివేదికను ఇప్పటికే నీతి ఆయోగ్‌కి సమర్పించామని, ఆ నిధులు మంజూరు చేయాలని ఆయన లేఖలో విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం హామీ... రాజధాని నిర్మాణానికి దేశీయ, మసాలా బాండ్ల ద్వారా నిధులు సమకూర్చుకోవాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. దేశీయ మార్కెట్‌లో బాండ్లు విడుదల చేసేందుకు అవసరమైన క్రెడిట్ రేటింగ్ కోసం రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) 'కేర్' అనే క్రెడిట్ రేటింగ్ సంస్థను నియమించుకుంది. బాండ్ల జారీ ప్రక్రియ నిర్వహించేందుకు ఏకే కేపిటల్ అనే మర్చంట్ బ్యాంకర్‌నూ నియమించుకుంది. సీఆర్‌డీఏ జారీ చేసే బాండ్లకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రతిపాదనకు ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోద ముద్ర వేసింది. ఆ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు బాండ్ల జారీకి అనుమతి కోరుతూ కేంద్ర ఆర్థికశాఖకు లేఖ రాశారు. పన్ను రహిత బాండ్లలో వ్యక్తిగత మదుపుదారులు పెట్టుబడి పెట్టొచ్చు. ఈ బాండ్లలో మదుపు చేసిన మొత్తానికి 80(సి) కింద ఆదాయ పన్ను మినహాయింపు పొందవచ్చు. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), ఐడీఎఫ్‌సీ వంటి సంస్థలు ఇలా బాండ్లు జారీ చేయడం ద్వారా నిధులు సమకూర్చుకుంటాయి. అదే కోవలో రూ.10వేల కోట్ల సమీకరణకు అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. కేంద్రం సరేనంటే ఆర్‌బీఐ అనుమతులు వంటి ప్రక్రియలన్నీ పూర్తి చేసుకుని మూడు నాలుగు నెలల్లో మార్కెట్‌లోకి వెళ్లవచ్చని అధికారవర్గాలు చెబుతున్నాయి.

క్రెడిట్ రేటింగ్ కీలకం.. దేశీయ, మసాలా బాండ్ల ద్వారా రూ.2000 కోట్లు సమీకరించుకోవాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. ఈ రెండూ సంస్థాగత మదుపరులు పెట్టుబడులు పెట్టేవి. దేశీయ బాండ్లను మన దేశంలోనే విడుదల చేస్తారు. మసాలా బాండ్లు విదేశాల్లో అక్కడి స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా విడుదల చేస్తారు. లండన్, సింగపూర్ స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా మసాలా బాండ్లు విడుదల చేయాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. మొదట దేశీయ బాండ్లు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. తొలి విడతలో రూ.500 కోట్ల విలువైన బాండ్లు విడుదల చేయాలన్నది ఆలోచన. మార్కెట్ పరిస్థితిని బట్టి దశలవారీగా బాండ్లు విడుదల చేయాలని భావిస్తోంది. బాండ్లు విడుదల చేయడంలో క్రెడిట్ రేటింగ్ కీలకమైంది. క్రెడిట్ రేటింగ్ ఎంత బాగుంటే... పెట్టుబడులు పెట్టేందుకు సంస్థాగత మదుపరులు అంతగా ముందుకు వస్తారు. వడ్డీ శాతం తగ్గుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి క్రెడిట్ రేటింగ్ 'ఎ' ఉంది. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇస్తోంది కాబట్టి సీఆర్‌డీఏకి 'ఎ' లభించవచ్చని భావిస్తున్నారు. మసాలా బాండ్లను విదేశాల్లో డాలర్లలో కాకుండా, రూపాయి మారకం విలువతో జారీ చేస్తారు.

పంచాయతీలకు ఆర్థిక సంఘ నిధులపై మార్గదర్శకాల సవరణ

ఈనాడు, అమరావతి: మెరుగైన పనితీరును కనబరిచే గ్రామ పంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం అందించే నిధులపై మార్గదర్శకాలను సవరిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పంచాయతీల పనితీరును ఏవిధంగా విశ్లేషించాలి. ఇందుకోసం ఇచ్చే స్కోర్ తదితర అంశాలను ఇందులో ప్రస్తావిస్తూ, ఇకపై ఇదే విధానాన్ని అమలు చేసేలా తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులను పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి ఆదేశించారు.

గ్రహం అనుగ్రహం

31-1-2018 బుధవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
పూర్ణిమ: రా. 7-50 తదుపరి బహుళపక్ష పాడ్యమి
పుష్యమి నక్షత్రం: సా. 6-37 తదుపరి ఆశ్లేష
అమృత ఘడియలు: మ. 12-38 నుంచి 2-07 వరకు
వర్జ్యం: లేదు
దుర్ముహూర్తం: మ. 11-50 నుంచి 12-35 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6-37; సూర్యాస్తమయం: సా.5-50
సంపూర్ణ చంద్రగ్రహణం

'గాంధీ చివరి మాటలను వినలేదని మాత్రమే చెప్పాను'

ఈనాడు డిజిటల్, చెన్నై: మహాత్మా గాంధీ చివరి మాటలు 'హేరాం' కాదని తాను అనలేదని గాంధీ వ్యక్తిగత కార్యదర్శిగాపనిచేసిన వెంకట కళ్యాణం తాజాగా వివరణ ఇచ్చారు. 1943-48 మధ్య కాలంలో ఆయన గాంధీ వ్యక్తిగత కార్యదర్శిగా వ్యవహరించారు. 2006లో విలేకరుల సమావేశంలో కళ్యాణం చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. ఆ వ్యాఖ్యలను గాంధీ మునిమనవడు తుషార్ గాంధీ అప్పుడే ఖండించారు. ఆ విషయమై మంగళవారం వెంకట కళ్యాణం మాట్లాడారు.

'ఆయుష్'కు మరింత ప్రాధాన్యం!

- ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్న కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తే సరికొత్త కళ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఆయుష్ వైద్యానికి మరింత ప్రాధాన్యం దక్కనుంది. ఆయుర్వేద, యోగా, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్య సేవలు ఆయుష్ పరిధిలోనికి వస్తున్నాయి. వీటి ప్రాధాన్యాన్ని మరింత ప్రాచుర్యంలోనికి తెచ్చేందుకు కేంద్రం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రానికి ఆయుష్ పరిధిలో కొత్త వైద్య సంస్థలు రాబోతున్నాయి. ఇందులో కొన్నింటికీ పూర్తిగా.. మరికొన్నింటికి 60% మేర నిధుల కేటాయింపులకు కేంద్రం సిద్ధమైంది. ఇప్పటికే కేంద్రం మంజూరు చేసిన నిధులతో రాష్ట్రంలో ఎంపిక చేసిన 13 ఆయుర్వేద కేంద్రాల్లో 'వెల్‌నెస్' కేంద్రాల కార్యకలాపాలు త్వరలో ప్రారంభం కానున్నాయి.

సద్వినియోగం చేసుకుంటే.. కేంద్రం చేయూతను ప్రభుత్వం సకాలంలో సద్వినియోగం చేసుకుంటే ఆయుష్ సంస్థల రాకతో రాష్ట్రానికి సరికొత్త కళ రానుంది. ఈ సంస్థలు ఎక్కువగా విశాఖ జిల్లా కేంద్రంగా రాబోతున్నాయి. 200 పడకలతో ఆయుష్ విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుంది.

- రాష్ట్రంలో ఆల్‌ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఏఐఐఏ) అమరావతిలో ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకోసం కేంద్రం 30 ఎకరాల కేటాయించాలని కోరుతుండగా 16 ఎకరాలనే ఇవ్వగలమని సీఆర్‌ఏడీ అధికారులు చెబుతున్నారు. దీంతో అమరావతిలో ఈ సంస్థ రాకపై సందిగ్ధత నెలకొంది.
- కాకినాడ, విశాఖ నగరాల్లో 50 పడకల ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆస్పత్రులు రానున్నాయి. ఇందుకోసం రూ.9 కోట్ల వ్యయం కానుంది. కాకినాడ 2.5 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. కేంద్రం రూ.4.60 కోట్లు విడుదల చేయనుంది. వైజాగ్‌లో స్థల ఖరారు జరగలేదు. దానికి రూ.కోటి మంజూరు జరిగింది. వీటికయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60: 40 నిష్పత్తిలో భరించనున్నాయి.
- విశాఖపట్నంలోనే నేచురోపతి అండ్ యోగా కళాశాల, ఆస్పత్రి ఏర్పాటుకు కేంద్రం రూ.2 కోట్లు విడుదలకు ఆమోదం తెలిపింది. సబ్బవరం పరిధిలో స్థల సేకరణ వివిధ దశల్లో ఉంది.
- ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నేచురోపతి సంస్థ విశాఖలో రాబోతుంది. ఇందుకోసం 25 ఎకరాలను కేటాయించనున్నారు. కేంద్రం ఇప్పటికే ప్రాథమికంగా కోటి రూపాయలు విడుదల చేసింది.
- రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం వైజాగ్‌లో రూ.4.70.కోట్లతో డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. విశాఖ జిల్లా శొంఠ్యాం వద్ద స్థల కేటాయింపు జరిగింది.
- విజయవాడలో నూరురామశాస్త్రి పేరుతో మినీ ఫార్మసీని ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రూ.17.293 లక్షలను విడుదల చేసింది.
- విశాఖ జిల్లాలో ఆయుష్ విశ్వవిద్యాలయం రాబోతుంది. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే రూ.1050.00 లక్షలను విడుదయ్యాయి. 20 ఎకరాల కోసం జిల్లా యంత్రాంగం పరిశీలన జరుపుతోంది.
- కృష్ణా జిల్లా కొండపావులూరులో సెంట్రల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నేచురోపతి సంస్థను ఏర్పాటు చేయనున్నారు. నిధులను కేంద్రమే భరించనుంది.
- కేంద్ర నిధులతో రాయలసీమలో యునాని కళాశాల ఏర్పాటుకు అవకాశం ఉంది. నంద్యాల, ఇతర ప్రాంతాల్లో దీని ఏర్పాటుకు అవసరమైన స్థలసేకరణ వివిధ దశల్లో ఉంది.

వైద్య విద్య.. పరీక్షలు మిథ్య!

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించే ప్రాక్టికల్స్‌కు వైద్య విద్యలో తగిన ప్రాధాన్యం ఉంది. వీటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారవడంతో.. విద్యార్థులు ఎంతవరకు నేర్చుకున్నారు? ఏయే అంశాల్లో వెనుకబడి ఉన్నారన్న విషయం తెలుసుకునేందుకు అవకాశమే లేకుండా పోతోంది.

- ఇంటర్నల్ పరీక్షల్లో 35% మార్కులు వచ్చిన వారికే చివరి పరీక్షలు రాసేందుకు అర్హత ఉంటుంది. చివరి సంవత్సరం రాత పరీక్షలు, వైవాలో వచ్చిన వాటితో కలిపి 50% మార్కులు వస్తేనే ఉత్తీర్ణులవుతారు. చివరి ప్రయోగ పరీక్షల్లో 50% మార్కులు వచ్చిన వారిని మాత్రమే ఉత్తీర్ణులైనట్లుగా గుర్తిస్తారు.
- వైవాలో మార్కులు వేయటం ఎగ్జామినర్ల చేతిలో ఉంటుంది. ఇక్కడ ప్రశ్నలకు విద్యార్థులు ఏ సమాధానాలు చెప్పారన్న దానికి ఎక్కడా ఆధారం ఉండదు. దీంతో ఎగ్జామినర్లు 90-100% మార్కులు వేస్తున్నారు. రాత పరీక్షలు సరిగా రాయని వారు కూడా ఈ మార్కుల ఆసరాతో ఉత్తీర్ణులవుతున్నారు.
- కొన్ని కళాశాలల్లో ఈ పరీక్షలు అసలు జరగడం లేదని చెబుతున్నారు. మరికొన్ని కళాశాలల్లో వీటిని నిర్వహించినా జవాబుపత్రాలను మూల్యాంకనం చేయరు. కొన్నిచోట్ల ఇంటర్నల్ పరీక్షలకు ముందుగానే ప్రశ్నలను విద్యార్థులకు చెబుతున్నారు.
- ఒకట్రెండు మినహా అధిక శాతం కళాశాలల యాజమాన్యాలు విశ్వవిద్యాలయానికి పంపే మార్కుల జాబితాలను వేరుగా నిర్వహిస్తున్నాయి. అవి వచ్చిన మార్కులు కాదు. వేసిన మార్కులు. ఈ పరీక్షల నిర్వహణలో కళాశాలల మధ్య ఏకసారూప్యం లేదు.

ప్రాక్టికల్స్ నిర్వహణ తీరు ఇలా..

- కళాశాల నుంచి ఇద్దరు ఇంటర్నల్ ఎగ్జామినర్లు, ఎక్స్‌టర్నల్ ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు వేరే రాష్ట్రాల నుంచి ఇద్దరు ఆచార్యులు విశ్వవిద్యాలయం ద్వారా వస్తున్నారు. వీరికి రాచమర్యాదలు, ఖరీదైన బహుమతులు అందుతున్నాయి. ఇందుకోసం విద్యార్థుల నుంచి పలు కళాశాలల యాజమాన్యాలు అదనంగా వసూళ్లు చేస్తున్నాయి.
- విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు వెళ్లడానికి రెండు, మూడు రోజుల ముందే అక్కడున్న రోగులు, వారికి ఏఏ జబ్బులు ఉన్నాయన్న సమాచారం లీకైపోతుంది. ప్రాక్టికల్ పరీక్ష హాలులో రోగిని పరీక్ష చేయాల్సిన అవసరం లేకుండానే జవాబుపత్రాలపై వారి వివరాలను రాసేస్తున్నారు.
- ప్రాక్టికల్ పరీక్షల రోజు వైద్య కళాశాలల్లో ఎగ్జామినర్లు పెన్సిలును మాత్రమే ఉపయోగిస్తున్నారు. మార్కుల కేటాయింపులో తగిన జాగ్రత్తల్లో భాగంగా ఇలా చేస్తున్నారు.
- విద్యార్థులకు పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విశ్వవిద్యాలయం పతకాలను అందిస్తోంది. దీనిని అవకాశంగా తీసుకుని పలు కళాశాలలు ఇంటర్నల్స్, ప్రాక్టికల్స్, వైవాలో విద్యార్థులకు మార్కుల్ని గరిష్ఠంగా వేస్తున్నాయి.
- విద్యార్థుల ఉత్తీర్ణత కొన్ని కళాశాలల్లో 90% పైగా నమోదవుతోంది. పీజీ వైద్య విద్యలోనూ ఇదే తీరు నడుస్తోంది.

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.2	32.0
మెదక్	10.2	34.6
రామగుండం	11.5	31.6
కరీంనగర్	13.0	30.0
హైదరాబాద్	13.0	31.0
హన్మకొండ	13.5	31.0
నిజామాబాద్	14.0	31.0
గుంటూరు	16.5	32.8
శ్రీకాకుళం	16.5	33.0
మహబూబ్‌నగర్	16.5	33.0
అనంతపురం	16.6	31.3
విశాఖపట్నం	17.0	29.0
కడప	17.0	33.0
తిరుపతి	17.2	30.4
రాజమహేంద్రవరం	18.0	34.0
కర్నూలు	18.2	32.5
విజయవాడ	19.0	30.6
ఖమ్మం	19.0	32.0
తాడేపల్లిగూడెం	19.8	29.0
నెల్లూరు	20.0	29.0
సూర్యాపేట	20.0	35.0
నరసాపురం	20.2	30.5
ఒంగోలు	21.0	31.7

కర్కశంగా కడతేర్చారు.. కట్నపిశాచాలు కాటేశాయి

8 నెలల గర్భిణి దారుణ హత్య

- కడుపులో ఛిద్రమైపోయిన పిండం

ఈనాడు, హైదరాబాద్: హైటెక్‌సిటీ ప్రాంతం.. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రోడ్డు అది. కొండాపూర్ బొటానికల్‌గార్డెన్ నుంచి మసీదుబండకు వెళ్లే దారిలో రోడ్డు పక్కనే రెండు సంచుల మూటలు పడి ఉన్నాయి. వాటి నుంచి దుర్వాసన వస్తుండటాన్ని పారిశుద్ధ్య సిబ్బంది గమనించి పోలీసులకు మంగళవారం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వాటిని పరిశీలించగా ఒక సంచిలో తల, కాళ్లు, చేతుల ముక్కలు ఉండగా మరో గోనె సంచిలో మొండెం ఉన్నాయి. పూర్తిగా కుళ్లిపోయిన దశలో ఉన్నాయి. పోలీసులు వాటిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి వైద్యులతో శవ పరీక్ష చేయించగా కళ్లు చెమర్చే విషయాలు వెలుగు చూశాయి. ఆ మహిళను తీవ్రంగా కొట్టి చంపి.. తర్వాత ముక్కలుగా నరికినట్లు తేలింది. మొత్తం 8 ముక్కలు చేయగా అనేక ప్రాంతంలో ఎముకలను విరగినట్లు గుర్తించారు. ఆమె ఎనిమిది నెలల గర్భిణి కాగా కడుపులో మగ శిశువు పిండం పూర్తిగా ఛిద్రమైన స్థితిలో కనిపించింది. ఆమెకు 30 సంవత్సరాల వయసు ఉండొచ్చని, మెరూన్ రంగు టాప్, ఎరుపు రంగు కుర్తా పైజామా ధరించి ఉందని పోలీసులు తెలిపారు. ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ కారు అక్కడ చాలాసేపు ఆగి ఉన్నట్లు గుర్తించారు.



మహిళ శరీర భాగాలున్న సంచులను పరిశీలిస్తున్న పోలీసులు

ఆడబిడ్డల్నే కన్నావ్.. అదనపు కట్నం తేవాల్సిందే

- ఉసురుతీసిన భర్త, అత్త వేధింపులు
- ఇద్దరు కుమార్తెలకు ఉరివేసి తల్లి ఆత్మహత్య

లేపాక్షి, న్యూస్‌టుడే: ఇద్దరు ఆడబిడ్డలకు జన్మనివ్వడమే ఆ తల్లి చేసిన పాపమైపోయింది. కన్నది ఆడపిల్లల్నే కాబట్టి అదనపు కట్నం తేవాల్సిందేనంటూ కట్టుకున్న భర్త, అత్త తరచూ రాచిరంపాన పెడుతోండటంతో అభాగ్యురాలైన ఆ మాతృమూర్తి తనకిక చావే శరణ్యమనుకొంది. తాను కన్నుమూశాక.. తన ముద్దుబిడ్డల గతి ఏమవుతుందో అనుకుందో ఏమో.. వారిద్దరికీ ఉరివేసి తానూ బలవన్మరణానికి పాల్పడింది. ఈ దయనీయ ఘటన అనంతపురం జిల్లా లేపాక్షి మండలం నాయనిపల్లిలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు...నాయనిపల్లికి చెందిన వీరభద్రి అనే వ్యక్తికి సోమందేపల్లి మండలం తుంగోడుకు చెందిన కల్పన(28)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు మేఘన(6), యశస్విని(4). ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారని, పుట్టింటి నుంచి అదనపు కట్నం, బంగారం తేవాలంటూ భర్త, అత్త తరచూ వేధిస్తుండేవారు. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు చేసినా మార్పు రాలేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన కల్పన మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇద్దరు కూతుళ్లకు ఉరివేసి తానూ ఆత్మహత్య చేసుకుంది.



కుమార్తెలకు ఉరివేసి ఆత్మహత్య చేసుకున్న తల్లి కల్పన

మరింత కట్నమిస్తేనే పెళ్లాడతా..

- ప్రేమ నటించి, రూ.లక్ష గుంజి.. నిశ్చితార్థం అయ్యాక.. మాట మార్చిన ఘనుడు
- పురుగుల మందు తాగిన ప్రియురాలు
- చోద్యం చూసిన జనం
- ఆసుపత్రికి తరలిస్తుండగా కన్నుమూత



మృతురాలు వరలక్ష్మి (పాతచిత్రం)



రీసు చిన్నా

ఆనందపురం (విశాఖ), న్యూస్‌టుడే: విశాఖ జిల్లా ఆనందపురం మండలం పందలపాక గ్రామంలో మంగళవారం ఓ అమానవీయ సంఘటన చోటుచేసుకుంది. మనుషుల్లో మానవత్వం కనుమరుగవుతోందనడానికి సాక్ష్యంగా ఓ యువతి గ్రామస్తులందరి ఎదుటా బలవన్మరణానికి ఒడిగట్టింది. కనీసం ఆమెను ఎవరూ నిలువరించడానికి కూడా ప్రయత్నించకపోవడం నివ్వెరపరచింది.

పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన యర్రా రాము, కామమ్మల కుమార్తె వరలక్ష్మి(23), ఎదురింటి రీసు సూరి, లక్ష్మిల కుమారుడు చిన్నా(27) మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. రూ.2లక్షల కట్నానికి ఆమెను పెళ్లి చేసుకుంటానని చిన్నా రెండేళ్ల కిందట అంగీకరించాడు. ఏడాది కిందట రూ.లక్ష కట్నం ఇవ్వడంతో నాలుగు నెలల కిందట వీరికి నిశ్చితార్థం జరిగింది. మంగళవారం ఉదయం ముహూర్తాల గురించి మాట్లాడటానికి వెళ్లిన వరలక్ష్మి తల్లిదండ్రులపై తనకు మరింత కట్నం కావాలని చిన్నా గొడవపడి కొట్టాడు. వరలక్ష్మినిసైతం కొట్టి, పెళ్లి చేసుకోనని తెగేసి చెప్పాడు. తీవ్ర మనస్తాపానికి గురైన వరలక్ష్మి ఇంట్లోని పురుగుల మందు డబ్బాను ప్రియుడి వద్దకు తెచ్చుకొని గ్రామస్తులంతా చూస్తుండగానే తాగేసింది. ఆమె ఆవేశంతో చేస్తున్న చర్యల్ని గ్రామస్తులు ఆపే బదులు అక్కడ తతంగాన్నంతా ఓ వినోద సన్నివేశం చూస్తున్నట్లుగా అలానే ఉండిపోయారు. మందుతాగేసి పడిపోయాక వరలక్ష్మిని స్థానికులు వైద్యశాలకు తరలించే ప్రయత్నం చేసినా మధ్యలోనే మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు రీసు చిన్నా, సూరి, లక్ష్మిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఆర్.గోవిందరావు వెల్లడించారు.

వచ్చే నెలలో వివాహం.. ఇంతలోనే ఘాతుకం



అనూష (పాతచిత్రం)

హయత్‌నగర్, న్యూస్‌టుడే: ఉద్యోగ ఇంటర్వ్యూ కోసం నగరానికి వచ్చిన యువతి దారుణ హత్యకు గురైంది. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నల్గొండ జిల్లా దేవరకొండ మండలం గిరిజానగర్ తండాకు చెందిన నేనావత్ అనూష(25) బీటెక్ పూర్తిచేసింది. హయత్‌నగర్ మిథాని కాలనీలో ఉంటున్న అక్కా, బావల వద్ద ఉంటూ పోలీసు కానిస్టేబుల్ ప్రవేశ పరీక్ష కోసం శిక్షణ తీసుకుంటోంది. ఆమెకు నాలుగు నెలల క్రితం శంషాబాద్‌కు చెందిన మోతీలాల్‌తో వివాహం నిశ్చయమైంది. ఫిబ్రవరిలో పెళ్లికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమె స్వగ్రామంలో ఉండగా ఈనెల 25న మోతీలాల్ ఒక ఇంటర్వ్యూ కోసం నగరానికి రావాలని ఫోన్ చేసి చెప్పాడు. హయత్‌నగర్‌లోని అక్క, బావలు స్వగ్రామంలోనే ఉండటంతో ఆమె ఒక్కటే వారి ఇంటికి వచ్చింది. నాలుగైదు రోజులుగా ఆ ఇంట్లో ఒంటరిగానే ఉంది. ఫోన్ పనిచేయకపోవడంతో 26న హైదరాబాద్‌లోనే ఉంటున్న తన సోదరుడికి బయటినుంచి ఫోన్‌చేసి నగరానికి వచ్చిన విషయాన్ని తెలియజేసింది. అనూష నుంచి సమాచారం లేకపోవడంతో ఆమె అక్క మంగళవారం ఉదయం తమ పక్కింటి వారికి ఫోన్‌చేసి ఆమెను పిలవమని కోరారు. వారు వచ్చి చూసేసరికి అనూష రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బండరాయితో బాదడం వల్ల ఆమె మృతిచెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఇంటర్వ్యూ కోసం రమ్మన్న మోతీలాల్ ఒకరోజు అక్కడకు వచ్చిపోయినట్లుగా స్థానికులు చెబుతుండగా, అతడి సెల్‌ఫోన్ స్విచాఫ్ వస్తుండడంతో అనూష కుటుంబ సభ్యులు అతడిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మోతీలాల్‌ను అదుపులోకి తీసుకున్నారు.

8 నెలల పసిపాపపై అత్యాచారం

దిల్లీ: దేశరాజధాని దిల్లీలో మరో మహాఘోరం! అభంశుభం తెలియని ఎనిమిది నెలల పసిపాపపై కామాంధుడైన యువకుడు అత్యంత రాక్షసంగా ప్రవర్తించాడు. తన పశువాంఛను తీర్చుకోవటం కోసం ఆ చిన్నారి రహస్య భాగాలను దారుణంగా చిదిమివేశాడు. తీవ్ర రక్తస్రావమైన ఆ చిన్నారిని తల్లిదండ్రులు ఆస్పత్రిలో చేర్పించగా వైద్యులు శస్త్రచికిత్స చేసేందుకు రెండు గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. దారుణమైన ఈ ఘటన ఆదివారం వాయవ్య దిల్లీలోని నేతాజి సుభాష్ ప్లేస్‌లో జరిగింది. బాలిక తల్లిదండ్రులు ఇద్దరూ కూలీలు. ఆదివారం ఉదయం పనికి వెళ్తూ తమకు సమీప బంధువైన మహిళకు పాపను అప్పగించారు. 28 ఏళ్ల యువకుడైన ఆమె కుమారుడు పసిపాపను ఆడిస్తున్నట్లుగా నటించి పక్కకు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత నిందితుడు పరారయ్యాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన పాప తల్లి రక్తపు మరకలతో ఉన్న తన బిడ్డని చూసి విలవిలలాడిపోయింది. భర్తకు సమాచారం ఇచ్చింది. చిన్నారిని వెంటనే ఆస్పత్రిలో చేర్చి పోలీసు కేసు నమోదు చేశారు. తాగిన మైకంలో ఈ దుర్మార్గానికి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. ఆస్పత్రిలో ఆ చిన్నారిని చూసిన దిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మలివాల్ చలించిపోయారు. దిల్లీ మహిళా కమిషనే అత్యాచారానికి గురైనట్లుగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



భానుడు మెరిసే.. మంచు ముత్యమై మురిసె..!

అసలే శీతాకాలం.. ఉష్ణోగ్రతలు కనిష్ఠస్థాయికి చేరి వేకువజామున పొగమంచు దట్టంగా కురుస్తోంది. ప్రకృతిలోని పచ్చని చెట్లుచేమలు, పంట చేలపై ఈ మంచు పరుచుకోవడంతో వాటిని నూతన అందాలు చేకూరుతున్నాయి. ఇలా ఆరుబయట.. చేనేత కళాకారుడికీ ఏ మాత్రం తీసిపోని విధంగా ఓ సాలీడు అల్లిన ఈ గూడుపై హిమం కురవడంతో.. ఆ మంచు ఇలా ముత్యాపు చినుకుల్లా కనిపించాయి. భానుడి ప్రకాశానికి అవి మరింతగా తళుకులీనాయి. దినకరుడికి ముత్యాలహారంలా తలపించిన ఈ అపురూప దృశ్యం సోమవారం ఉదయం శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో సాక్షాత్కరించింది.

– ఈనాడు, శ్రీకాకుళం

మా హుందాతనానికి వక్రభాష్యం చెప్పొద్దు

- పాక్‌కు రాజ్‌నాథ్ గట్టి హెచ్చరిక

చండీగఢ్: సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందానికి పదేపదే తూట్లు పొడుస్తున్న పాకిస్థాన్‌పై కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ధ్వజమెత్తారు. భారత హుందాతనానికి వక్రభాష్యం చెప్పొద్దంటూ గట్టి హెచ్చరిక జారీ చేశారు. భారతీయ జనతా యువ మోర్చా సభ్యులతో సమావేశమయ్యేందుకుగాను చండీగఢ్ వచ్చిన రాజ్‌నాథ్.. మంగళవారం పలు అంశాలపై మాట్లాడారు. “3-4 రోజుల క్రితం పాక్ రేంజర్లు మనదేశ సరిహద్దు భద్రతా దళం(బీఎస్‌ఎఫ్) డైరెక్టర్ జనరల్‌తో సమావేశం నిర్వహించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించబోమని హామీ ఇచ్చారు. అయినా, పాక్ కాల్పులను కొనసాగిస్తూనే ఉంది. నేను వారికి ఒకే ఒక్క విషయం చెప్పాలనుకుంటున్నా. భారత హుందాతనానికి పరిమితి ఉంటుంది. పొరుగుదేశాలతో సత్సంబంధాలను మేం కోరుకుంటున్నాం. ఈ హుందాతనానికి వక్రభాష్యం చెప్పొద్దు. భారత్ బలహీన దేశం కాదు. ఇప్పుడు శక్తిమంతమైన దేశంగా అవతరించింది” అని ఆయన పేర్కొన్నారు. పాక్‌తో సరిహద్దుల్లో కంచె ఏర్పాటు ప్రక్రియ వేగంగా సాగుతోందని రాజ్‌నాథ్ తెలిపారు. షోపియాన్ జిల్లాలో గతవారం చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌కు సంబంధించి సైనిక సిబ్బందిపై కేసు నమోదవ్వడంపై అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ. . జమ్ముకశ్మీర్‌లో భద్రతా బలగాలు, సైన్యం సమర్థంగా పనిచేస్తున్నాయంటూ కితాబిచ్చారు.



విజయవాడలోని కొత్త ప్రభుత్వాసుపత్రిలో పడకలు ఖాళీగా లేకపోడంతో స్ట్రెచర్లపైనే రోగుల పడిగాపులు

రోగులు కిటకిట.. వసతులు కటకట

విజయవాడలోని కొత్త ప్రభుత్వాసుపత్రిలో ఉన్న అత్యవసర విభాగానికి రోగుల తాకిడి విపరీతంగా పెరిగింది. కృష్ణా జిల్లా సహా పొరుగు జిల్లాల్లోని రోడ్డు ప్రమాద ఘటనలు, క్రిమిసంహారక మందులు తాగిన బాధితులను పెద్ద సంఖ్యలో ఇక్కడికి తరలిస్తున్నారు. నిత్యం ఈ సంఖ్య సుమారు రెండొందల వరకు ఉంటోంది. ప్రస్తుతం ఈ విభాగంలో 18 పడకలే ఉండటంతో.. ఏ మూలకు చాలడం లేదు. దీంతో ఒక్కో మంచంపై ఇద్దరు, ముగ్గురుకి కలిపి చికిత్స అందిస్తున్నారు. ఇక బాధితులను ఆసుపత్రిలోని అత్యవసర విభాగానికి చేర్చేందుకు స్ట్రెచర్లూ అరకొరగానే ఉన్నాయి. మరికొన్ని సందర్భాల్లో వైద్యసేవలు అందడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో స్ట్రెచర్లపైనే వారు పడిగాపులుకాస్తూ ఆర్తనాదాలు చేస్తున్నారు. అత్యవసరంగా వైద్యం పొందాల్సిన రోగులు ఇలా గంటలకొద్దీ నిరీక్షించాల్సి వస్తుండటంతో.. కొందరు మృత్యువాత కూడా పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలోని సౌకర్యాలను సత్వరమే పెంచాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు.

–ఈనాడు, అమరావతి

ఎస్సీ, ఎస్టీలకు రైతు రథం రాయితీ పెంపు!

- ఉప ప్రణాళికలో ప్రతిపాదనలు
- మంత్రి ఆనంద్‌బాబు వెల్లడి

ఈనాడు డిజిటల్-అమరావతి: రైతు రథం పథకం పరిధిలో ఎస్సీ, ఎస్టీ రైతులకు ట్రాక్టర్ల కొనుగోలుకు ఇచ్చే రాయితీని వచ్చే బడ్జెట్‌లో పెంచబోతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల గిరిజనుల్లో పోషకాహార లోపాల నివారణకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మంగళవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికపై 19వ నోడల్ ఏజెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2016-17 సంవత్సరానికి సవరించిన కేటాయింపులు, 45 ప్రభుత్వ శాఖలు చేసిన ఖర్చులపై సమీక్షించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదనలు స్వీకరించారు. సమావేశ వివరాలను సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విలేకరులకు వెల్లడించారు.

ప్రధానాంశాలు..

★ జనవరి మాసాంతానికి ఎస్సీ ప్రణాళిక పరిధిలో రూ.7469 కోట్లు, ఎస్టీ ప్రణాళిక కింద రూ.2610కోట్లు ఖర్చుచేశాం. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా మిగిలినవి వ్యయం చేస్తాం.

★ రైతురథం కింద ఎస్సీ, ఎస్టీలకు అందజేసే ట్రాక్టర్లపై రాయితీ తక్కువగా ఉంది. దాన్ని పెంచడంతోపాటు అసలు మొత్తాన్ని బ్యాంకుల నుంచి ఇప్పించే ఏర్పాటుచేస్తాం.

★ గేదెల కొనుగోలు యూనిట్‌ను రూ.60వేల నుంచి పెంచే ప్రతిపాదనలున్నాయి. రాయితీ మొత్తాన్నీ పెంచుతాం.

★ కొన్ని మండీల్లోనే కొనాలనే నిబంధనలపై సమీక్షిస్తున్నాం.

★ రక్తహీనతతో బాధపడుతున్న గిరిజనులకు రూ.2.30కోట్లతో అదనపు పోషకాహారం అందజేస్తాం.

★ మత్స్యకారులకు మోపెడ్ల స్థానంలో మోటార్ సైకిళ్లు ఇచ్చేందుకు యోచిస్తున్నాం.

(ఇతర వివరాలు ఈనాడు.నెట్‌లో)

ప్రాణాధార మందుల్లో గోల్‌మాల్!

- టెటనస్ వ్యాక్సిన్ రీప్యాకింగ్
- 64 వేల సీసాలు స్వాధీనం

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రాణాధార మందుల్లోనూ గోల్‌మాల్. . అత్యంత కీలకమైన ఔషధాలను తగినంత శీతల ఉష్ణోగ్రత వద్ద కాకుండా మారుమూల గోదాముల్లో అడ్డదిడ్డంగా నిల్వచేయడం.. వాటిని అలాగే దుకాణాలకు సరఫరా చేయడం.. హైదరాబాద్‌లో జరుగుతున్న దారుణాలివి. ఇంతకంటే ఘోరమైన మరో ఉదంతం వెలుగుచూసింది. టెటనస్ వ్యాక్సిన్‌ను రీప్యాకింగ్ చేస్తున్న గోదాముపై ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 64 వేల టెటనస్ వ్యాక్సిన్ సీసాలను స్వాధీనం చేసుకుని ఔషధ నియంత్రణ విభాగానికి అప్పగించారు. ఈ సంఘటనలో ఏఆర్‌ఎస్ ప్యాకేజింగ్ అండ్ ప్రింటర్స్ యజమాని వేణుగోపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. టెటనస్ వ్యాక్సిన్‌ను తయారు చేసే ఘట్‌కేసర్‌కు చెందిన డానో కంపెనీ దానికి సంబంధించిన ప్యాకింగ్ అట్టపెట్టెలను గోల్నాకలోని ఏఆర్‌ఎస్ ప్యాకేజింగ్ అండ్ ప్రింటర్స్‌లో తయారు చేయిస్తుంటుంది. గర్భిణులకు ధనుర్వాతం రాకుండానూ, ఎవరికైనా గాయాలైన సందర్భంలోనూ ఈ మందును వాడుతుంటారు. దీనిని సాధారణంగా 2 నుంచి 8 సెంటీగ్రేడ్ ఉన్న శీతల ఉష్ణోగ్రతలో భద్రపర్చాలి. కానీ సీల్ లేకుండా మూతలు ఊడిపోయి, ఇతరత్రా సమస్యలతో ఉన్న వ్యాక్సిన్ సీసాలను ఇక్కడి ప్రెస్‌లోని గోదాముకు తరలించి నిబంధనలకు విరుద్ధంగా రీప్యాకింగ్ చేస్తున్నారు. అక్కడ ఒక్కోదానిలో 1600 చొప్పున 40 కార్టన్లలో ఉన్న 64 వేల టెటనస్ వ్యాక్సిన్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

అమల్లోకి వచ్చిన న్యాయమూర్తుల వేతనాల పెంపు

దిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల వేతనాల పెంపు అమల్లోకి వచ్చింది. పార్లమెంటు ఆమోదించిన బిల్లుపై రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నెలవారీ వేతనం రూ.లక్ష నుంచి రూ.2.80 లక్షలకు పెరిగింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల వేతనాలు రూ. 90,000 నుంచి రూ.2.50 లక్షలకు పెరిగాయని న్యాయ మంత్రిత్వశాఖ ప్రకటించింది. హైకోర్టుల న్యాయమూర్తులకు రూ.80,000 బదులు రూ.2.25 లక్షలు లభిస్తుంది. పెరిగిన వేతనాలు ఏడో వేతన సంఘం సిఫార్సులకు అనుగుణంగా 1.1.2016 నుంచి అమల్లోకి వస్తాయి. న్యాయమూర్తులకు కొన్ని భత్యాలు కూడా పెంచారు.

ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి అబ్దుల్ కలామ్ ట్రిపుల్‌ఐటీగా పేరు మార్పు

ఈనాడు, అమరావతి: ఒంగోలు ట్రిపుల్ ఐటీకి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ ట్రిపుల్ ఐటీగా పేరు మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విషయమై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌బాబు తెలిపారు. త్వరలో డీఏ ఉత్తర్వులను విడుదల చేయడంతోపాటు పీఆర్సీ కమిటీని నియమిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పీఆర్సీ బకాయిల విడుదలపై ఉద్యోగుల్లో ఉన్న ఆందోళనను ముఖ్యమంత్రికి వివరించామని చెప్పారు. దేశవ్యాప్తంగా వ్యతిరేకత ఉన్న సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరినట్లు వివరించారు. ఎన్జీవో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్ రెడ్డి, కోశాధికారి వీరేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

చెన్నంపల్లి కోటలో తవ్వకాలపై వివరాలివ్వండి

రెవెన్యూశాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: కర్నూలు జిల్లా తుగ్గలి మండల పరిధిలోని చారిత్రక కట్టడం చెన్నంపల్లి కోట వద్ద భాండాగారం వేట కోసం జరుగుతున్న తవ్వకాలపై వివరాలు సమర్పించాలని రెవెన్యూశాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎమ్మెస్కే జైశ్వాల్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. చెన్నంపల్లి కోట వద్ద తవ్వకాల్ని అడ్డుకొని.. ఆ కోటను కాపాడాలని కోరుతూ కర్నూలు (దూపాడు)కు చెందిన బ్రహ్మారెడ్డి రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది.

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుచేయాలి

ఏసీజేకు సాధన సమితి వినతిపత్రం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టును రాయలసీమ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు రాయలసీమ హైకోర్టు సాధన సమితి సభ్యులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరంపై న్యాయవాదులు ఈ సందర్భంగా ఏసీజేకు వివరించినట్లు సమాచారం. రాయలసీమ ప్రాంతాలైన కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు పట్టణాల్లో ఎక్కడైనా ఏపీ హైకోర్టు ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు. రాజధాని ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేస్తే తమకు అన్యాయం జరుగుతుందన్నారు. పరిపాలన వికేంద్రీకరణ జరగాలని ప్రస్తావించారు. వినతిపత్రాన్ని అందుకున్న ఏసీజే సహచర న్యాయమూర్తులతో చర్చిస్తానని చెప్పినట్లు రాయలసీమ హైకోర్టు సాధన సమితి సభ్యులు విలేకరులకు తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై విపక్ష నేతకు అవగాహన లేదు: కంభంపాటి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్ష నేతకు ఎలాంటి అవగాహనా లేదని తెదేపా జాతీయ అధికార ప్రతినిధి కంభంపాటి రామ్మోహనరావు ధ్వజమెత్తారు. ఆయనకు కావాల్సింది ముఖ్యమంత్రి పీఠమేనని విమర్శించారు. మంగళవారం అమరావతిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాదయాత్ర అంటూనే బ్రేక్ యాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ భృతి, ఎన్టీఆర్ క్యాంటీన్లు తప్పితే ఎన్నికల ప్రణాళికలో పొందుపరచిన అన్ని హామీలను అమలు చేశామని తెలిపారు. భాజపాతో మిత్రధర్మం పాటిస్తూనే నిధుల కోసం ఒత్తిడి చేస్తామని చేశారు. ఆర్థిక సర్వే ఫలితాలు ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టాయని వివరించారు.

మతం మార్చి, ఉగ్రవాదులకు విక్రయించాలని చూశారు

- మహిళ ఫిర్యాదుతో 9 మందిపై కేసు నమోదు చేసిన ఎన్‌ఐఏ

దిల్లీ: గుజరాత్‌కు చెందిన మహిళను బలవంతంగా మతం మార్చి సౌదీ అరేబియాలోని ఐసిస్ ఉగ్రవాదులకు విక్రయించడానికి ప్రయత్నించిన తొమ్మిది మందిపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) కేసు నమోదు చేసింది. వీరంతా కేరళ, బెంగళూరుకు చెందిన వారు. 25 ఏళ్ల మహిళ ఒకరు చేసిన ఫిర్యాదుతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఐఏ అధికార ప్రతినిధి వెల్లడించారు. మహ్మద్ రియాస్ రషీద్ అనే వ్యక్తి తనను మోసగించి పెళ్లి చేసుకున్నాడని ఆమె ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఐసిస్‌లో చేర్పించడానికి 2017లో సౌదీ అరేబియాకు తీసుకెళ్లాడని తెలిపారు. మత గురువు జకీర్ నాయక్‌కు శిష్యురాలిగా మారాలని బెదిరించారనిఆరోపించారు.

అన్ని రంగాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: గాలి

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు పాదయాత్రలంటూ తిరుగుతున్నారని ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలో గత మూడేళ్ల నుంచి రాష్ట్రం సగటున 10.36 శాతం జీఎస్‌డీపీ నమోదు చేసిందని వివరించారు. కరవు పరిస్థితులు ఉన్నా వ్యవసాయ రంగంలో 16 శాతం వృద్ధిని సాధించి రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. 2029 నాటికి అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలవడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.

పొత్తుల గురించి మాట్లాడే స్థాయి ఆ ముగ్గురిదే..

- ఎవరి ఇష్టప్రకారం వారు మాట్లాడితే అపోహలే
- మంత్రి కామినేని శ్రీనివాస్

ఒంగోలు, న్యూస్‌టుడే: ఈ సారి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో భాజపా పొత్తు ఉంటుందా? లేదా? అనే విషయం తేల్చాల్సింది ప్రధాని నరేంద్రమోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్‌షా, ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రమేనని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆయన మీడియాతో మాట్లాడారు. భాజపా, తెదేపా మిత్రపక్షంగా ఎన్నికల్లో పోటీ చేయగా ప్రజలు అయిదేళ్లు పాలించేందుకు అధికారం ఇచ్చారని, ఈ లోపలే లేనిపోని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఏదైనా అంశం ఉంటే అంతర్గత సమావేశాల్లో చర్చించుకోవచ్చన్నారు. ఇటీవల శ్రీధర్ అనే వ్యక్తి భాజపా నాయకుడినని చెప్పుకొంటూ టీవీల్లో చర్చా వేదికలకు హాజరయ్యారని, త్వరలో ఇద్దరు రాష్ట్ర మంత్రులను పార్టీ మార్చబోతోందని ఆయన చెప్పారన్నారు. ఆ వ్యక్తి హోదా ఏమిటని ఆరా తీస్తే... పార్టీలో ఉన్నాడో లేడో తెలియని పరిస్థితి అన్నారు. అలా స్థాయి మరిచి మాట్లాడకూడదనేది తన సిద్ధాంతమని తెలిపారు. ప్రభుత్వం చాలా మంచి పనులు చేస్తోందని, పట్టిసీమ వల్ల రెండు జిల్లాల్లో రైతులు చక్కగా పంటలు పండించుకున్నారని అన్నారు.

వైద్య విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరి. ..: వైద్య విద్యార్థులకు 75 శాతం హాజరు ఉంటేనే పరీక్షలకు అనుమతిస్తామని మంత్రి కామినేని స్పష్టం చేశారు. వైద్య విద్యార్థికి క్లీనికల్ డయాగ్నోసిస్ చాలా ముఖ్యమని, పుస్తకాలు, నెట్ చూసి పరీక్షలు రాస్తే ప్రయోజనం ఉండదన్నారు. రోగి పడక వద్ద వైద్యం నేర్చుకోవాలన్నారు. ప్రమాణాలు పెంచాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ కింద వైద్యం అందించడం లేదని ప్రతిపక్ష నాయకుడు వై.ఎస్.జగన్ విమర్శించడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని మంత్రి ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో 40 ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు.

ఈనాడు

ఎన్నికలకు 'నాగా'లాండ్

నామినేషన్ల ప్రక్రియకు నేడు తెరలేస్తున్న నాగాలాండ్‌లో ఫిబ్రవరి 27నాటి ఎన్నికల్ని బహిష్కరించడానికి 11 రాజకీయ పక్షాలు ఏకగ్రీవంగా నిర్ణయించడం దిగ్భ్రాంతపరుస్తోంది. ఎన్నికల కన్నా నాగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ప్రధానమంటూ ఎలెక్షన్లను వాయిదా వేసి మొదట శాంతి ఒప్పందాన్ని త్వరితంగా పట్టాలెక్కించాలన్న పార్టీలన్నీ ముక్తకంఠంతో కోరుతున్నాయి. నాగాలాండ్ శాసనసభ పదవీకాలం మార్చి 13వ తేదీతో ముగిసిపోనున్నందున, అంతకు పది రోజుల ముందే ఎన్నికల ఫలితాలు వెలువడేలా నిర్వాచన్ సదన్ కాలపట్టిక ప్రకటించడం తెలిసిందే. రాష్ట్రంలో శాంతి సద్భావాల పరిరక్షణ కోసం ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలుపు చెయ్యాలంటూ ఈసీకి విజ్ఞప్తి లేఖ రాయాలని గిరిజన సంఘాలు, పౌర సంస్థల సంయుక్త కీలక సమితి ఏకగ్రీవంగా తీర్మానించడం ఇటీవలి ముచ్చటే! ఎన్నికలకన్నా ముందే రాష్ట్ర సమస్యకు సానుకూల పరిష్కారం సాధించాలని 2017 డిసెంబరులో అసెంబ్లీ చేసిన తీర్మానానికి అనుగుణంగా పార్టీలను ఒప్పించాలని గణతంత్ర దినోత్సవం ముందునాడు కీలక సమితి నిర్ణయించింది. భారత ప్రభుత్వంతో కాల్పుల విరమణకు సిద్ధపడి రాజకీయ సంప్రదింపుల్లో పాల్గొంటున్న నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ (కప్లాంగ్) వర్గానికి విజ్ఞప్తి చేసింది. నాగా సమస్య పరిష్కారం కోసమే ఎన్నికలన్న భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ ప్రకటనను నిష్కర్షగా తోసిపుచ్చి- సమస్య పరిష్కరించాకే ఎన్నికలు నిర్వహించాలన్న పార్టీల ముకుమ్మడి నిర్ణయం, సంక్షుభిత రాష్ట్రంలో రాజకీయ అస్థిరతను ప్రోది చేసేదే. సరిగ్గా ఇరవయ్యేళ్ల క్రితం- భారత ప్రభుత్వంతో ఎన్ఎస్‌సీఎన్ (ఇజాక్-ముయివా) చర్చలు జరుపుతున్న తరుణంలో ఎన్నికల నిర్వహణ సరికాదంటూ నాగా హోహో (గిరిజన మండళ్ల కూటమి) బహిష్కరణ పిలుపిచ్చింది. మరికొద్ది గంటల్లో నామినేషన్ల గడువు ముగిసిపోనుందనగా కాల్పుల విరమణ పొడిగింపు, ఎన్నికల బహిష్కరణ పిలుపు ఉపసంహరణ దరిమిలా- 34 నియోజక వర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి. మరో తొమ్మిది చోట్ల బరిలో నిలిచిన స్వతంత్రులు వెనక్కి తగ్గడంతో- నాడు ఎన్నికలకుండానే 43 చోట్ల కాంగ్రెస్ విజయం సాధించింది. ఈసారి ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో చూడాలి!

వలస పాలనావశేషంగా మిగిలి నేటికీ భారతావనిని కుదుపులా సలుపుతున్న సంక్షోభాల్లో నాగాలాండ్ ఒకటి. 1881లో నాగా హిల్స్‌ను గుప్పిట పట్టిన బ్రిటిషర్లు దాన్ని ఇండియాలో అంతర్భాగం చేసెయ్యగా, 1918లోనే నాగా క్లబ్ పేరిట వారి ప్రతిఘటన మొదలైంది. అంగామి ఫిజో నేతృత్వంలో 1946లో ఏర్పాటైన నాగా జాతీయ మండలి (ఎన్ఎన్‌సీ)- 1947 ఆగస్టు 14న నాగాలాండ్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించింది. సార్వభౌమ నాగా దేశం ఏర్పాటు చేయడంపై 1951లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో 99 శాతం పౌరులు స్వతంత్ర నాగాలాండ్‌కే మద్దతు పలికినట్లు ఆ సంస్థ ప్రకటించింది. 1952లో నాగా సమాఖ్య ప్రభుత్వం, సైన్యమూ ఆవిర్భవించిన నేపథ్యంలో తీవ్రవాద అణచివేతకు మిలిటరీని పంపిన నెహ్రూ ప్రభుత్వం- 1958లో సైనిక బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం తెచ్చింది. సాయుధ పోరాటానికి తెరదించేలా 1975లో ఎన్ఎన్‌సీతో షిల్లాంగ్ ఒప్పందం కుదుర్చుకొన్నా- దాన్ని బేఖాతరు చేస్తూ ఎన్ఎస్‌సీఎన్ 1980లో ఆవిర్భవించింది. 1988లో అది కాస్తా రెండు ముక్కలై, పరస్పర దాడులతోనూ హింసాచరణ ధ్వంసరచనలతోనూ వేలమంది ఉసురుపోసుకొన్నాయి. నాగా ప్రజలు నివసిస్తున్న పరగణాలన్నింటినీ ఒకే పాలనా ఛత్రం కిందికి తీసుకొచ్చేలా 'మహా నాగలిమ్' ఏర్పాటును కోరుతూ నాగాలాండ్ శాసనసభ అయిదుసార్లు తీర్మానించింది. ఎన్ఎస్‌సీఎన్‌తో పాటు రాజకీయ పక్షాలు, గిరిజన, పౌర సంస్థల కీలక సమితికీ అదే అజెండాగా మారడంతో సానుకూల పరిష్కారానికి అడుగడుగునా ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయి!

సంస్కరణలతో దేశార్థిక రంగం చేవను, 'లుక్ ఈస్ట్' అంటూ విదేశాంగ వ్యూహంలో నవ చేతనకు ఊపిరులూదిన పీవీ- నాగా సమస్య పరిష్కారానికీ తన వంతు చొరవ చూపారు. 1997నుంచి ఎన్ఎస్‌సీఎన్(ఐఎమ్)తో కాల్పుల విరమణ కొనసాగుతున్నా సానుకూల పరిష్కారానికి ప్రతిబంధకాలు అన్నీ ఇన్నీ కావు! ప్రస్తుతం నాగాలాండ్ విస్తీర్ణం 16,527 చ.కి.మీ! అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లతో పాటు మియన్మార్‌లోనూ ఉన్న నాగా పరగణాలతో 'మహా నాగలిమ్' ఏర్పాటు చేస్తే అది లక్షా 20 వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతం అవుతుంది. పొరుగుదేశం మియన్మార్ సంగతి పక్కన పెట్టినా, పీసమెత్తు ప్రాంతాన్ని బదలాయించడానికి కూడా ఈశాన్యంలోని మూడు రాష్ట్రాలూ సిద్ధంగా లేవు. ఈ నేపథ్యంలోనే- 80సార్లు జరిగిన చర్చలకు ఫలశ్రుతిగా ఎన్ఎస్‌సీఎన్(ఐఎమ్) తో మోదీ ప్రభుత్వం 2015 ఆగస్టులో చరిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకొంది. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షల ఆదరేగ్గాల విస్తృత పరిధి భారత రాజ్యాంగానికి ఉండటంతో నాడు ఒప్పంద చట్రాన్ని ఆమోదించినా, ఇదమిత్థంగా అందులో ఏముందో సర్కారు వెల్లడించలేదు. కేంద్రం తరఫు మధ్యవర్తిగా సంయుక్త ఇంటెలిజెన్స్ కమిటీ ఛైర్మన్ ఆర్ఎన్ రవి ముసాయిదా ఒప్పంద రూపకల్పనలో తలమునకలై ఉన్నారని, అది సిద్ధమయ్యాక అందరి ఆమోదంతోనే ముందడుగేస్తామనీ మోదీ సర్కారు చెబుతోంది. ఎన్నికల తరవాత కొద్ది నెలల్లోనే ఆ తతంగం అంతా ఒక కొలిక్కి వస్తుందని, మొదట ప్రశాంతంగా ఎలెక్షన్లు ముగించాలనీ కేంద్రం కోరుతోంది. 1997 దరిమిలా నాలుగు ఎన్నికలు జరిగిపోయినా ఏం ఒరగలేదంటూ, ఈసారి నాగా సమస్య తేలాకే ఎలెక్షన్లంటున్న భిన్న వర్గాల మంకుపట్టు- సరికొత్త సంక్షోభాన్ని రాజేస్తోంది. మోదీ ప్రభుత్వ రాజనీతిజ్ఞతకు అతిపెద్ద సవాలు ఇది!

తీరు మారనుంది... రాత మారుతుందా?



'దేశంలో వెనకబడిన ప్రాంతాల పారిశ్రామికీకరణకు, పారిశ్రామిక ఎగుమతుల పెంపుదలకు ఏకీకృత పన్నుల వ్యవస్థ దోహదపడుతుంది... పన్నులకు సంబంధించి ఉత్పత్తిదారులు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలు తొలగిపోతాయి'

\- విజయ్ కేల్కర్ (జీఎస్‌టీ రూపకర్త)


కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ, సార్వత్రిక ఎన్నికలకు ముందు తమ ప్రభుత్వ చివరి పూర్తిస్థాయి బడ్జెట్ రేపు ప్రవేశపెట్టబోతున్నారు. ఇప్పటివరకు అత్యధికంగా పదిసార్లు బడ్జెట్ సమర్పించిన రికార్డు, దేశ నాలుగో ప్రధానిగా పనిచేసిన మొరార్జీ దేశాయ్‌ది. ఎనిమిది బడ్జెట్లతో చిదంబరం, తలా ఏడు బడ్జెట్లతో ప్రణబ్ ముఖర్జీ, యశ్వంత్ సిన్హా, వైబీ చవాన్, సీడీ దేశ్‌ముఖ్‌లు తరవాతి స్థానాల్లో నిలుస్తారు. వరసగా అయిదు బడ్జెట్లు సమర్పించినవారి జాబితాలో డాక్టర్ మన్మోహన్ సింగ్, యశ్వంత్ సిన్హా ఉన్నారు. కొత్తగా జైట్లీ ఆ వరసలో చేరబోతున్నారు! స్వతంత్ర భారత చరిత్రలో ఇంతవరకు వెలుగుచూసిన 88 బడ్జెట్లు ఒకెత్తు. వచ్చే బడ్జెట్ మరొకెత్తు. ఎందుకంటే, దేశంలో అతిపెద్ద పన్నుల సంస్కరణగా జీఎస్‌టీ (వస్తుసేవల సుంకం) పట్టాలకు ఎక్కిన దరిమిలా మొట్టమొదటి బడ్జెట్ కూర్పు ఇదే. జీఎస్‌టీ రాక బడ్జెట్ మౌలిక స్వరూప స్వభావాలను ఎంతగా ప్రభావితం చేసిందో రేపటి జైట్లీ ప్రసంగం స్పష్టీకరించనుంది. సాధారణంగా, కేంద్ర బడ్జెట్‌లో రెండు భాగాలుంటాయి. రంగాలవారీగా వివిధ పథకాలకు కేటాయింపుల వివరాలను పొందుపరచేది మొదటిది. ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించిన మార్పులూ చేర్పుల సమన్వితం రెండోది. వ్యాట్ (విలువ ఆధారిత పన్ను), ఎక్సైజ్ సుంకం సహా డజనుకుపైగా వేర్వేరు పరోక్ష పన్నులను జీఎస్‌టీ ఖర్చు రాసేసింది. వస్తు సేవలపై ఏమైనా నిర్ణయాలు తీసుకునే బాధ్యత, రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన జీఎస్‌టీ మండలికి దఖలుపడింది. పర్యవసానంగా పరోక్ష పన్నుల్లో ప్రధాన పద్దులుగా దశాబ్దాల తరబడి చలామణీ అయిన కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, సేవాసుంకాలతోపాటు తక్కినవాటిపై ప్రతిపాదనల ఊసే లేకుండా నూతన బడ్జెట్ రూపుదాల్చనుంది. ఆ మేరకు బడ్జెట్ ప్రసంగ నిడివి కుదించుకుపోవడం తథ్యం. కొన్నేళ్లుగా విద్య, కృషి కల్యాణ్, స్వచ్ఛభారత్, శుద్ధ ఇంధనం తదితరాల పేరిట రకరకాల సెస్సుల వడ్డన 'బడ్జెట్ సంప్రదాయం'గా స్థిరపడింది. అటువంటి ఇరవైరకాల సెస్సులూ జీఎస్‌టీ పద్దులో అంతర్భాగమైన కారణంగా, బడ్జెట్ ప్రసంగ సరళిలో గుణాత్మక పరివర్తన ప్రస్ఫుటం కానుంది.

లక్ష్యం విశాల జనహితం

ఏడాది క్రితం జైట్లీ బడ్జెట్ ప్రతిపాదనలు ప్రధానంగా పది అంశాల చుట్టూ పరిభ్రమించాయి. రైతులు, గ్రామీణులు, యువత, నిరుపేదలు, మౌలిక వసతులు, ప్రజాసేవలు, ఆర్థిక రంగం, డిజిటలీకరణ, ద్రవ్య స్థిరీకరణ, పన్ను సంస్కరణల పద్దులకింద ప్రతిపాదనల సమర్పణకు ఆయన ప్రాధాన్యమిచ్చారు. అంతకుముందు రెండేళ్లూ విద్య, వైద్యం, గ్రామీణ ఉపాధి, నైపుణ్య కార్మికులపై తగిన శ్రద్ధ కొరవడిందన్న విమర్శల నేపథ్యంలో- జైట్లీ నిరుడు సర్దుబాట పట్టారు. అంతకుమించిన దూకుడుతో, ఈసారి ప్రాధాన్యాల్లో విశేష మార్పులు అనివార్యమనేందుకు మునుపటి అనుభవాలే రుజువు. గతంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు రెండు పర్యాయాలు 2003-04, 2013-14 పూర్తిస్థాయి బడ్జెట్ల వ్యయఖాతాలో భారీ పెంపుదల నమోదైంది. 2019 సార్వత్రిక ఎన్నికలకు మునుపు చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌లో రేపు అదే దృశ్యం పునరావృతమయ్యే అవకాశాలు పుష్కలం. అదీకాక ఈ ఏడాది త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్‌తో ఆరంభించి కర్ణాటక, మిజోరం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ శాసనసభలకూ ఎన్నికలు జరగాల్సి ఉంది. వాటిలో నాలుగుచోట్ల అధికార పక్షంగా ఉన్న భాజపా స్వీయ పునాది గట్టిపరచుకోవడానికి, ప్రాబల్య విస్తరణకు- చేతిలో ఉన్న అమూల్య అవకాశాన్ని వదులుకోబోదన్న అంచనాలు తేలిగ్గా కొట్టిపారేయలేనివి. బడ్జెట్ కసరత్తు సన్నాహకాల్లో ఈసారి ఉపాధి కల్పన, వ్యవసాయ ప్రగతి, పెట్టుబడులకు ప్రోత్సాహకాలపై దృష్టి కేంద్రీకరించాల్సిందిగా ప్రధాని మోదీ స్వయంగా దిశానిర్దేశం చేసినట్లు కథనాలు వెలుగుచూశాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ గుజరాతీ ఓటర్లు ఆగ్రహం వెలిగక్కిన తీరును ఎన్డీయే వ్యూహనిర్ణేతలు విస్మరించజాలరు. అందువల్ల ఇది కర్షక బడ్జెట్ కానుందా, విశాల జనబాహుళ్యాన్ని మెప్పించే ఆకర్షక బడ్జెట్ అవుతుందా అన్న విశ్లేషణలు వినవస్తున్నాయి. క్రితంసారి రైతులకు రూ.10లక్షల కోట్ల వ్యవసాయ రుణ లక్ష్యం ప్రకటించిన కేంద్రం, పొలాల్లో నైరాశ్యాన్ని పారదోలేందుకంటూ ఈసారి ఇంకో లక్ష కోట్ల రూపాయల మేర రుణ వితరణను నిర్దేశించనున్న సూచనలు ప్రస్ఫుటమవుతున్నాయి. సేద్యానికి సమగ్ర బడ్జెట్ డిమాండ్లు పట్టించుకోకుండా అటువంటి అరకొర చర్యలతోనే ప్రవచిత లక్ష్యం నెరవేరుతుందా అంటే, సందేహమే. ఆరోగ్య, విద్యారంగాలకు సమధిక కేటాయింపులతోనే సుస్థిర వృద్ధిరేటు సుసాధ్యమన్న నిరుటి ఆర్థిక సర్వే హితవును ఏ బాధ్యతాయుత ప్రభుత్వమూ పెడచెవిన పెట్టే వీల్లేదు. వ్యవసాయానికి, మౌలిక పెట్టుబడులకు రేపటి బడ్జెట్లో పెద్దపీట దక్కనుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సూచిస్తుండగా- గ్రామీణ భారతంలో ఇతోధిక వ్యయీకరణ తక్షణ కర్తవ్యమని క్రెడిట్ రేటింగ్ సంస్థ 'ఇక్రా' వంటివి అభిప్రాయపడుతున్నాయి. పరోక్ష పన్నులపై ప్రతిపాదనల బాదరబందీ తొలగిపోయిన వేళ- బడ్జెట్ కసరత్తుకు కొత్త అర్థం, పరమార్థం కల్పించే అరుదైన అవకాశం నేడు మోదీ ప్రభుత్వ ముంగిట ఉంది. 'భారతీయ ఆత్మ'గా బాపూజీ అభివర్ణించిన గ్రామాలను సేదతీర్చడం మొదలు దేశ సమగ్ర వికాస సాధనకు బృహత్‌యత్నాన్ని చురుకెత్తించడం వరకు బడ్జెట్‌ను పదునైన సాధనంగా తీర్చిదిద్దగల చారిత్రక అవకాశాన్ని కేంద్ర సర్కారు ఎలా అందిపుచ్చుకొంటుందో వేచి చూడాలి. జనం గతిని, దేశ ప్రగతిని నిర్ధారించగల స్థాయి, సత్తా రేపటి బడ్జెట్ ప్రతిపాదనల్లో ఏమేరకు ఉట్టిపడతాయన్నదే ఇప్పుడు అశేష భారతీయుల్లో నెలకొన్న ఉత్కంఠ!

సవరణలతో సాంత్వన



లెక్కకు మిక్కిలి పరోక్ష పన్నులు, సుంకాలు, సర్‌చార్జీలతో అవినీతిభ్రష్ట కీకారణ్యాన్ని తలపిస్తున్న దారుణ అవ్యవస్థను తుడిచిపెడుతుందంటూ నిరుడు జులై ఒకటో తేదీ ముహూర్తాన దేశంలో జీఎస్‌టీ శకానికి శ్రీకారం చుట్టారు. ఆవిర్భావ దశలోనే అది సహకార సమాఖ్య భావనకు గొడుగు పట్టింది. అన్ని రాజకీయ పార్టీలు, రాష్ట్రాల అవిరళ కృషికి ఫలశ్రుతిగా సాకారమైన జీఎస్‌టీని ప్రధాని మోదీ 'గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్'గా అభివర్ణించారు. నల్లధనాన్ని, అవినీతిని నిరోధించే పారదర్శక విధానం సరికొత్త పాలన సంస్కృతినీ పెంపొందిస్తుందన్న ఆశావహ అంచనాలతో దేశంలో జీఎస్‌టీ ప్రస్థానం మొదలైంది. జీఎస్‌టీ రాక ముందు భారతీయ వినియోగదారులపై 35శాతందాకా పరోక్ష పన్నుల పోటు ఉండేది. వస్తుసేవల ధరవరల్ని ఒక పద్ధతి ప్రకారం నియంత్రిస్తున్న దాదాపు



జీఎస్‌టీ శకంలో తొలి బడ్జెట్

160 దేశాల్లో ఆ రేటు ఇంచుమించుగా 16శాతం. జీఎస్‌టీ తరహా వ్యవస్థ అమలుపరుస్తున్న చైనాలో పన్నురేటు 17శాతంగా ఉంది. ఆస్ట్రేలియా, సింగపూర్, మలేసియాల్లో అంతకన్నా తక్కువే. వివిధ దేశాల్లో విధివిధానాలను క్షుణ్నంగా పరిశీలించిన సుబ్రహ్మణ్యన్ కమిటీ దేశంలో అమలుపరచదగ్గ రేటుగా 15-15.5 శాతాన్ని ప్రతిపాదించింది. కడకు జరిగింది వేరు. కొన్నింటిని పన్ను పరిధినుంచి మినహాయించి సున్నాశాతం జీఎస్‌టీ పద్దులో చేర్చారు. అత్యధిక వస్తుసేవల్ని 5, 12, 18, 28 శాతాల శ్రేణుల కింద వర్గీకరించారు. పాన్‌మసాలాపై 135శాతం, సిగరెట్లమీద 290శాతం ప్రత్యేక వడ్డనను ప్రతిపాదించారు. మద్యం, పెట్రో ఉత్పత్తులపై రాష్ట్రస్థాయిలో సొంత రేట్ల ఖరారుకు వెసులుబాటు కల్పించారు. ఆపైనా దశలవారీగా పన్నుశ్రేణుల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. వీటన్నింటి కారణంగా జీఎస్‌టీ ఏకరూపతకు భంగం వాటిల్లిందన్నది నిష్ఠురసత్యం. యాంత్రికంగా వర్గీకరణ చేపట్టడమే అందుకు మూలకారణం. గరిష్ఠ పన్నురేటు 28శాతం వర్తించదగినవీ ఆ శ్లాబులో ఉన్నాయని ఒక దశలో విత్తమంత్రే అంగీకరించారు. కశ్మీర్, గువాహటీ తదితర సదస్సుల్లో సవరణలు, హేతుబద్ధీకరణల దరిమిలా వివిధ వస్తుసేవలపై పన్నురేట్లను కుదించారు. తొలుత జీఎస్‌టీ ప్రవేశపెట్టేనాటికి 149 అంశాలకు సున్నాశాతం, 262 రకాలకు అయిదుశాతం పన్నురేటు వర్తించేది. 12శాతం పద్దులో 242 వస్తుసేవలు ఉండేవి. 18శాతం కింద 453 అంశాలు, 28శాతం కింద 228 ఉండేవి. అనంతర పరిణామాల్లో 28 శాతం పరిధిలోని అంశాలు యాభైకి తగ్గిపోగా, తక్కినవీ తరతమ భేదాలతో మార్పులకు లోనయ్యాయి. ఈ సవరణల ప్రక్రియ ఇంకొన్నాళ్లు కొనసాగుతుందని జైట్లీ ప్రకటనే వెల్లడించింది. 12, 18 శాతం శ్లాబుల్ని ఒకే పద్దులోకి చేర్చాలన్న అజెండాకు ఆయన కట్టుబాటు చాటారు. ప్రవేశపెట్టిన ఏడాదిలోగా (జులై 2018 నాటికి) స్థిరాస్తి రంగానికి, రెండేళ్లలో (2019 జులై లోపు) చమురు ఉత్పత్తులకు జీఎస్‌టీ వర్తింపజేయదలచినట్లు జైట్లీ మార్గసూచీని విడుదల చేశారు. వాటి అమలు వేగాన్ని అనేక అంశాలు ప్రభావితం చేస్తాయనడంలో మరోమాట లేదు. గత సెప్టెంబరులో రూ.92వేల కోట్లకు పైబడిన జీఎస్‌టీ వసూళ్లు నవంబరులో సుమారు రూ.80వేలకోట్లకు పరిమితమై, డిసెంబరులో రూ.86 వేలకోట్లకు తిరిగి పుంజుకొన్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ లెక్క చెబుతోంది. ఈ రాబడి లెక్కల ప్రాతిపదికన 'ఒకే దేశం - ఒకే పన్ను' వ్యవస్థను అక్షరాలా సాక్షాత్కరింపజేయడంలో ఏమాత్రం రాజీపడినా, అలసత్వం వహించినా- బృహత్తర సంస్కరణల స్ఫూర్తికే విఘాతం వాటిల్లుతుంది. పొరుగున చైనా ఆరుశాతం పన్ను విధిస్తున్న ఆర్థిక సేవలు, బీమా, టెలికాం సేవలపై ఇక్కడ అంతకు మూడింతల రేటు నిర్ణయించడమేమిటన్న విమర్శలు నిరుడే వెల్లువెత్తాయి. సహేతుక రేటు నిర్ణయించడంలో చురుగ్గా వెయ్యాల్సిన అడుగులు మరెన్నో ఉన్నాయి. రాబడి నష్టాలపై మహారాష్ట్రలాంటి ఉత్పాదక రాష్ట్రాలు; హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి వినియోగ రాష్ట్రాల తొలినాళ్ల అంచనాలకు, నేటికి మధ్య అంతరాల్ని తాజా గణాంకాలు కళ్లకు కడుతున్నాయి. జీఎస్‌టీ పట్ల ఆదిలో కొన్ని రాష్ట్రాల గట్టి వ్యతిరేకత క్రమేణా ఉపశమించడమన్నది పాక్షిక విజయమే. రెండు లేదా మూడు శ్లాబులకే పరిమితమై పన్నురేటును సహేతుక స్థాయిలో స్థిరీకరించే వైపు పయనంలో మరెన్నో మైలురాళ్లను ఇంకా అధిగమించాల్సి ఉంది. అందుకు సరైన ప్రాతిపదికలు సిద్ధం చేయడంలో రేపటి బడ్జెట్ ఏపాటి క్రియాశీల చొరవ కనబరుస్తుందన్నది ఆసక్తి గొలుపుతున్న అంశం.



- ఇండియా కౌన్సిల్ ఆర్థిక సభ్యుడిగా భారతదేశ ప్రప్రథమ బడ్జెట్ సమర్పించినవారు జేమ్స్ విల్సన్ (18.02.1869)
- స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి బడ్జెట్ ప్రవేశపెట్టినవారు ఆర్ కే షణ్ముఖం చెట్టి (26.11.1947 సాయంత్రం అయిదు గంటలకు)
- భారత్ గణతంత్ర వ్యవస్థగా ఆవిర్భవించాక రిపబ్లిక్ ఆఫ్ ఇండియా తొలి బడ్జెట్ రూపశిల్పి జాన్ మథాయ్ (28 ఫిబ్రవరి, 1950)
- సాయంత్రం వేళ బడ్జెట్ సమర్పణ ఆనవాయితీకి చెల్లుకొట్టి మధ్యాహ్నం పదకొండింటికి లోక్‌సభలో ప్రసంగించిన తొలి వ్యక్తి యశ్వంత్‌సిన్హా (ఫిబ్రవరి 28, 2001)

సరళ విధానాలతో చికిత్స

ఉదాత్త ఆశయ ప్రకటన వేరు, నూటికి నూరుశాతం నిబద్ధతతో సమర్థ కార్యాచరణ వేరు. జీఎస్‌టీ ఆగమనం, అవినీతి పంకిల చెక్‌పోస్టులకు స్వస్తి వాచకమవుతుందన్న వివరణ తొలినాళ్లలో ఎందరినో ఉత్తేజపరచింది. కూరగాయలు, పాలు, పండ్లు, తిండిగింజలు వంటి ఎన్నో నిత్యావసరాల ధరలు తగ్గుతాయని, మరెన్నో వస్తూత్పాదనల రేట్లూ అందుబాటులోకి వస్తాయని, అవినీతి తగ్గుముఖం పడుతుందన్న అంచనాలతో ఆశలు మోసులెత్తాయి. జీఎస్‌టీ తరహా భారీ పన్నుల సంస్కరణల అమలులో కొన్ని సవాళ్లు తప్పవన్నది నిజం. తొలినాళ్లలో వ్యక్తమైన భయాందోళనలు నేడు చాలావరకు ఉపశమించినా- చిన్న వ్యాపారులు, వినియోగదారుల్లో అసంతృప్తి ఛాయలు తొలగడంలేదు. పన్నుల మదింపు, రిటర్నుల దాఖలుకు సంబంధించి జాప్యం, గందరగోళం సమసిపోనూ లేదు. ఇ-వే బిల్లులపై అయోమయాన్ని తొలగించి ప్రతిష్టంభనను రూపుమాపే యత్నం ఇటీవలి జీఎస్‌టీ మండలి సమావేశంలో చోటుచేసుకుంది. రేపటి (ఫిబ్రవరి ఒకటో తేదీ) నుంచి రూ.50వేలకు పైబడిన అంతర్రాష్ట్ర వస్తు రవాణాను ఇ-వే బిల్లు విధానం సరళతరం చేస్తుందంటున్నారు. వాస్తవానికి కర్ణాటక, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్ సహా పది రాష్ట్రాల్లో ఇప్పటికే ఇ-వే బిల్లు పద్ధతి అమలవుతోంది. అది దేశవ్యాప్తం కావడం ద్వారా నవ్య చరిత్ర పురుడు పోసుకోనుంది. జీఎస్‌టీ ప్రభావాన కుదేలైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఆదుకునే చర్యల ఆవశ్యకతపై సూచనలు మిన్నంటుతున్న తరుణాన, బడ్జెట్ కర్తలు ఆ మేరకు స్పందించాల్సి ఉంది. అంతకన్నా ముఖ్యాంశం, పన్నుల సరళీకరణ తాలూకు నికర ప్రయోజనాన్ని ప్రజానీకానికి బదలాయించడంలో అదృశ్య ప్రతిబంధకాల్ని ఛేదించడం. ఏ వస్తుసేవలపై ఎంత మొత్తం జీఎస్‌టీ విధించి వసూలు చేస్తున్నారన్న అంశంపై జనసామాన్యంలో స్పష్టమైన అవగాహన నేటికీ ఎండమావినే తలపిస్తోంది. జీఎస్‌టీ రాకముందు, తరవాత ధరవరల్ని సరిపోల్చుకుని ఎవరికెంత ఉపశమనం కలిగిందో నిర్ధారించుకునే వీలు కల్పిస్తూ అన్నిరకాల వస్తూత్పత్తులపై వివరాలు ముద్రించాలని పశ్చిమ్ బంగ, బిహార్, కేరళ ప్రభృత రాష్ట్రాలు గతంలోనే పట్టుపట్టాయి. పరోక్ష పన్నుల వ్యవస్థను ప్రక్షాళించి పారదర్శకతకు పెద్దపీట వేస్తామన్న ప్రభుత్వం, కంతలు ఎక్కడున్నా వడివడిగా పూడ్చాల్సిందే. దేశ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్థవంతమైన సమన్వయంతో ఆవాహన పలికిన జీఎస్‌టీ ప్రయోజకత్వానికి అక్రమార్కులు తూట్లు పొడవకుండా కాచుకుంటేనే- వినియోగదారుడు రాజుగా నిలబడతాడు. ఈ ఏడు నెలల అనుభవాల్ని కూలంకషంగా మదింపు వేసి సరైన దిద్దుబాటు చర్యలకు బడ్జెట్లో చోటు పెడితే- సామాన్యులు, రైతులు, చిన్నవ్యాపారులు తెరిపిన పడతారు!

– వై.ఆర్.బి. సత్యమూర్తి

అతివకు రక్షణ ఛత్రం

మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు అందించే క్రమంలో ఏం సాధించామన్న విషయాన్ని సమీక్షించుకుంటే ఆశనిరాశలు దోబూచులాడతాయి. స్త్రీ జాతికి సాధికారత ప్రసాదించే సదుద్దేశంతో 'జాతీయ మహిళా కమిషన్' ఏర్పడి నేటికి పాతికేళ్లు అవుతోంది. హింసను, వివక్షను ధైర్యంగా ఎదుర్కొనే క్రమంలో స్త్రీ జాతిని సంఘటితం చేయడంలో జాతీయ మహిళా కమిషన్ ప్రశంసనీయ పాత్ర పోషించిందనడంలో సందేహం లేదు. అణిచివేతను, అంతరాలను ఎదిరిస్తూ మహిళాలోకం దశాబ్దాలుగా పోరాటం చేస్తూనే ఉంది. ఆ క్రమంలోనే 1976-1985ల మధ్యకాలాన్ని మహిళా దశాబ్దిగా ఐక్యరాజ్య సమితి తీర్మానించింది. దేశంలో 1971లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మహిళా కమిషన్ స్త్రీల స్థితిగతులను నిశితంగా అధ్యయనం చేసి వారి అభ్యున్నతికి ఏం చేయాలో సూచిస్తూ ప్రభుత్వానికి అనేక నివేదికలు సమర్పించింది. అంతర్జాతీయ స్థాయిలోనూ పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆ క్రమంలో 1979లో రూపొందిన అంతర్జాతీయ మహిళా బిల్లు ఓ రకంగా ప్రపంచ దేశాల మహిళా కమిషన్లకు, చట్టాలకు మార్గదర్శకంగా నిలిచింది. ఆ బిల్లులోని అంశాలను స్ఫూర్తిగా స్వీకరిస్తూ 1992లో అంటే నేటికి సరిగ్గా పాతికేళ్ల క్రితం భారత్‌లో 'జాతీయ మహిళా కమిషన్' ఏర్పాటైంది. అది రాజ్యాంగబద్ధ సంస్థగా మొగ్గతొడిగింది. చట్టబద్ధంగా, రాజ్యాంగపరంగా మహిళలకు దఖలుపడిన హక్కుల అమలును పర్యవేక్షిస్తూ, అవసరమైన పక్షంలో ప్రభుత్వాలకు సలహాలు, సూచనలు ఇచ్చి దిశానిర్దేశం చేయడం ఈ కమిషన్ పని. ఆనాటికి భారత్‌లో వరకట్నం, భ్రూణహత్యలు, అవిద్య, లైంగిక వివక్ష, బాల్య వివాహాలు వంటి సమస్యలు ప్రబలంగా ఉన్నాయి. జాతీయ కమిషన్ ఏర్పడిన తొలినాళ్లలో ఈ సమస్యల పరిష్కారం కోసమే కృషి సాగింది. ఈ పాతికేళ్ల ప్రస్థానంలో కొన్ని సమస్యలు తొలగిపోతుంటే- కొత్త సవాళ్లు మొదలయ్యాయి.



స్త్రీల అస్తిత్వ పోరాటంలో ఈ పాతికేళ్లలో మహిళా కమిషన్ ఎన్నో విజయాలు సొంతం చేసుకుంది. దురాచారాలపై గ్రామీణ మహిళల్లో కొంతమేర అవగాహన తీసుకురాగలిగింది. 2005లో వచ్చిన గృహహింస నిరోధక చట్టాన్ని సవ్యంగా పట్టాలకు ఎక్కించడంలో కమిషన్ కీలక పాత్ర పోషించింది. పనిచేసే చోట వేధింపులను వ్యతిరేకిస్తూ భారత ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం అమలు విషయంలోనూ క్రియాశీల పాత్ర పోషించింది. అంతర్జాతీయంగా మహిళల అక్రమ తరలింపును వ్యతిరేకిస్తూ యునిఫెమ్‌తో(ఐరాస మహిళా విభాగంతో) చురుగ్గా కలిసి పనిచేసింది. పరువు హత్యలను వ్యతిరేకిస్తూ చట్టం తయారు చేయడం, యాసిడ్ బాధితులకు అండగా నిలవడం, వారికి పునరావాసం కల్పించడం వంటివన్నీ కమిషన్ సాధించిన విజయాలే. విదేశాల్లో ఉన్న భారతీయ మహిళలు ఎదుర్కొంటున్న కష్టాలకు స్పందిస్తూ వారికి అండగా నిలిచేందుకు 2009లో ఏర్పాటు చేసిన ఎన్నారై సెల్, ఈశాన్య రాష్ట్రాల స్త్రీల కోసం ఏర్పడిన 'నార్త్ ఈస్టర్న్ సెల్' వంటివి కమిషన్ విస్తరణలో భాగాలే. ఫిర్యాదులు, పరిశోధన విభాగం జాతీయ మహిళా కమిషన్‌లో కీలకం. వేల సంఖ్యలో స్త్రీలు తమ రక్షణకోసం కమిషన్‌ను ఆశ్రయిస్తుంటారు. వారందరికీ న్యాయం జరుగుతోందా అంటే ప్రశ్నార్థకమే! కమిషన్‌కు తగినమేర అధికారులు, సిబ్బంది లేకపోవడం, సభ్యుల ఎంపికలో పారదర్శకత కొరవడటం, రాజకీయ జోక్యం పెరగడం, స్వతంత్ర నిర్ణయాలు తీసుకొనే అవకాశాలు లోపించడం వంటివి ఇందుకు కారణాలు.

రాజకీయ జోక్యం లేని వాతావరణం సృష్టించి నిబద్ధంగా, నిజాయతీగా మహిళా కమిషన్ తన బాధ్యతలు నిర్వర్తించగల పరిస్థితిని సృష్టించాలి. మహిళా అభ్యున్నతికి చిత్తశుద్ధితో పోరాడిన వారికి కమిషన్‌లో చోటు కల్పించాలి. కేవలం సలహాలు, సూచనలు అందించే పాత్రకే కమిషన్‌ను పరిమితం చేయకుండా స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే నిజమైన అధికారాలను దానికి కట్టబెట్టాలి. నిధుల కొరత లేకుండా చూడాలి. గ్రామీణ స్థాయిలో స్త్రీల చైతన్యం కోసం రాష్ట్ర స్థాయి మహిళా కమిషన్లతో సమన్వయంగా కృషి చేయాలి. అప్పుడే స్త్రీ సమానతా హక్కు నిజమవుతుంది.

'స్త్రీలను చదువుకోనివ్వకుండా చేసి, వారిని అభివృద్ధికి దూరం చేస్తే... మనదేశం ఒంటి రెక్క మీద ఎగరాలనుకునే పక్షిలా, ఒకే చక్రం మీద ముందుకు వెళ్లాలనుకునే బండిలా మారుతుంది. మహిళల అభివృద్ధికి ఏం చేయాలని బుర్ర బద్దలు కొట్టుకోనవసరం లేదు. వారిని చదివించి, కొన్ని ప్రాథమిక నైపుణ్యాలు అందిస్తే చాలు- ఆపై వాళ్లకేం కావాలో వాళ్లే నిర్ణయించుకుంటారు' అన్న స్వామి వివేకానందుడి మాటలు అక్షర సత్యాలు. యాభైకోట్లకు మించిన మహిళా జనాభా ఉన్న దేశంలో వారి సమస్యలూ అదే స్థాయిలో ఉన్నాయి. ఉత్పాదక రంగంలో స్త్రీల భాగస్వామ్యం క్రమంగా పెరుగుతుండటం మోదం కలిగిస్తున్నా- చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం అంతంతమాత్రంగానే ఉండటం ఆందోళన పెంచుతోంది. మహిళా లోకం ఎదుర్కొంటున్న వేధింపులు, వివక్ష వంటి సమస్యలకు పూర్తిగా ప్రభుత్వాలే పరిష్కారాలు చూపించాలనుకోవడమే సహేతుకం కాదు. సమాజంలోని బుద్ధిజీవులు ఈ క్రమంలో చొరవగా ముందుకు రావాలి. హక్కుల సాధనలో సామాజిక మద్దతు కీలకావసరం. ముమ్మార్లు తలాక్ చెప్పి ముస్లిం వివాహిత మహిళలను నట్టేట్లో ముంచే సంస్కృతికి వ్యతిరేకంగా ప్రభుత్వం క్రియాశీలంగా ముందుకు వచ్చి చట్టరచనకు పూనుకోవడం మహిళా సాధికారత సాధనలో కీలక ముందడుగు. సంప్రదాయాల నీటిలో ఈతకొట్టడం వరకూ సబబే. మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించడంతోపాటు వారికి రాజకీయాల్లో సరైన స్థానం అందించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరగాలి. జాతీయ మహిళా కమిషన్ ప్రయత్నాలకు- పౌర సమాజమూ తోడుగా నిలిస్తే స్త్రీ వికాసం సత్వరం సాకారమవుతుంది!

– శ్రీ సత్యవాణి

జన జాతర

విశ్వంలో శాంతి సౌభాగ్యాలు నిలిపేందుకు దేవతలు దివ్యరూపాల్లోను, మానవ రూపాల్లోను భూమిపై అవతరిస్తుంటారన్నది విశ్వాసం. దుష్టత్వాన్ని నిర్మూలించి, సాధుజీవుల్ని కాపాడుతుంటారన్నది నమ్మకం. దివ్యగుణాలు గల మానవులూ దేవతల్లా ధర్మ పరిరక్షణకు ఎన్నో త్యాగాలు చేస్తుంటారు. సమాజం కోసం ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పిస్తుంటారు. అందరూ వారిని 'మహాత్ములు'గా కొలుస్తారు. అటువంటి మహనీయుల త్యాగనిరతిని స్మరిస్తూ, లోకులు జాతర జరపడం పరిపాటి. వాటిలో ప్రధానమైంది- సమ్మక్క సారలమ్మ జాతర. జన జీవన సంస్కృతిలో భాగమైన ఇది, ఉత్తర భారతదేశంలోని 'కుంభమేళా'ను తలపిస్తుంది.

ఉత్తర తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన తాడ్వాయి ప్రాంతంలో మేడారం గ్రామం ఉంది. ఇక్కడి అడవులు, కొండలు, కోనల మధ్య గిరిజన సంస్కృతికి ప్రతీకగా ఈ జాతర జరుగుతుంది. తెలుగు నేల నలు చెరగుల నుంచే కాకుండా; మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ రాష్ట్రాల నుంచి వచ్చిన లక్షలాది జనం ఈ వేడుకలతో మమేకం అవుతుంటారు.

ఈ జాతర వెనక ఒక చారిత్రక కథ ఉంది. పూర్వం జగిత్యాల ప్రాంతంలోని పొలాస (పొలవాస)ను మేడరాజు అనే గిరిజన దొర పాలించేవాడు. ఆయన కూతురు సమ్మక్క. ఆమెకు తన మేనల్లుడైన మేడారం పాలకుడికి ఇచ్చి వివాహం చేశాడు మేడరాజు. వారికి సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. కాకతీయ ప్రభువు మొదటి ప్రతాపరుద్రుడు పొలాసపై దండెత్తి వెళ్లాడు. ఆ శౌర్యానికి తట్టుకోలేక మేడరాజు పొలాస నుంచి వెళ్లిపోయి, మేడారంలో అజ్ఞాతవాసం చేశాడు.

మేడారం పాలకుడు కాకతీయులకు సామంతుడు. కరవు కాటకాలు ఏర్పడటంతో, ఆ రాజులకు పన్నులు కట్టలేకపోయాడు. మేడరాజుకు ఆశ్రయం- అగ్నికి ఆజ్యంలా మారింది. మేడారం పాలకుడు గిరిజనుల్ని రెచ్చగొడుతున్నాడని, తన సార్వభౌమత్వాన్ని చిన్నచూపు చూస్తున్నాడని ప్రతాపరుద్రుడు మండిపడ్డాడు. మాఘ శుద్ధ పౌర్ణమినాడు మేడారం మీద దండెత్తాడు. సమ్మక్క, సారక్క, నాగులమ్మ, జంపన్న వీరోచితంగా పోరాడారు. కాకతీయుల సైన్యం ధాటికి తట్టుకోలేక మేడరాజు, సారలమ్మ, నాగులమ్మ యుద్ధంలో మరణించారు. అవమానాన్ని తట్టుకోలేక జంపన్న సంపెంగ వాగులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడతాడు.

సమ్మక్క వీరోచితంగా పోరాడి, కాకతీయ సైన్యాన్ని ముప్పుతిప్పలు పెడుతుంది. ప్రతాపరుద్రుడు సైతం ఆమె వీరత్వాన్ని చూసి ఆశ్చర్యపోతాడు. గాయపడిన సమ్మక్క రక్తధారలతోనే యుద్ధభూమి నుంచి నిష్క్రమిస్తుంది. చిలుకల గుట్ట వైపు వెళుతూ, అందరూ చూస్తుండగానే



అంతర్వాణి

మాయమవుతుంది. వెదుకుతూ వెళ్లిన అనుచరులకు ఆమె జాడ కనిపించదు. మాయమైన చోట పసుపు, కుంకుమల భరిణె కనిపిస్తుంది. పవిత్ర భరిణెను సమ్మక్కగా భావించి, ప్రతి రెండేళ్లకూ ఒకసారి మాఘ శుద్ధ పూర్ణిమనాడు సమ్మక్క జాతర జరపడం ఓ సంప్రదాయంగా మారింది.

నాలుగురోజులు జరిగే ఈ జాతరలో మొదటిరోజు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దె వద్దకు తెస్తారు. రెండో రోజున- చిలుకల గుట్టలో కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠిస్తారు. మూడోరోజున సమ్మక్క, సారలమ్మ గద్దెపై కొలువుతీరి, భక్తుల్ని అనుగ్రహిస్తారు. నాలుగో రోజు సాయంకాలం ఇద్దరినీ యుద్ధభూమికి తెస్తారు. ఆ ఇద్దరు అమ్మలకూ బెల్లాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. ఇదంతా గిరిజన పూజారుల పర్యవేక్షణలోనే జరుగుతుంది.

సుదీర్ఘ చరిత్ర కలిగిన సమ్మక్క సారలమ్మ జాతర ఓ మహాపర్వంగా కొనసాగుతుంది. ఈ నాలుగు రోజుల తిరణాలలో జనం అసంఖ్యాకంగా ఉంటారు. పల్లెల ఒడిలో స్నేహ సౌజన్యాల్ని పెంపొందించే జాతరలు జనజీవన సంస్కృతికి అద్దం పడతాయి. సామాన్య జనుల వేషభాషలు, అభిరుచులు, కళలు, జీవన విధానాలు ఆవిష్కృతమవుతుంటాయి.

సంస్కృతి, సంప్రదాయం, నాగరికత- మనిషిని ఉన్నత స్థానంలో నిలుపుతాయి. అతడిలో సుగుణాలు రత్నాల్లా వెలుగొందడానికి ఇటువంటి జాతరలు దోహదం చేస్తాయి. జీవితం అంటే కేవలం తిండి, నిద్ర, సౌఖ్యం కాదని; మానసికోన్నతి సాధించడమేనని అందరూ తెలుసుకున్నప్పుడు- సమ్మక్క సారలమ్మ జాతరలోని పరమార్థం అవగతమవుతుంది.

– డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ

పాలిటెక్నిక్ కళాశాలల్లో డబ్బు కొద్దీ పోస్టు!

- పదోన్నతుల్లో రూ.లక్షలు చేతులు మారిన వైనం!
- ఇష్టారాజ్యంగా నియామకాలు
- చక్రం తిప్పిన ఓ కిందిస్థాయి అధికారి
- మారుమూల ప్రాంతాల్లో మిగిలిపోతున్న పోస్టింగులు
- నష్టపోతున్న విద్యార్థులు

ఈనాడు - అమరావతి

పాలిటెక్నిక్ కళాశాలల్లో పదోన్నతులు, పోస్టింగ్‌లు ఇచ్చేందుకు భారీగా డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి పోస్టు స్థాయిని అనుసరించి రూ.లక్షల్లో వసూలు చేశారంటూ సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విభాగంలో 2013 తర్వాత పదోన్నతులు లేకపోవడంతో సాంకేతిక విద్యాశాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది దీన్ని అవకాశంగా మలచుకున్నారు. ఉన్నతాధికారులకు ఇవ్వాలని చెబుతూ కిందిస్థాయి వారు పలువురి వద్ద నుంచి వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా 94 మంది అధ్యాపకులకు సీనియర్లుగా, 95 మందికి విభాగాధిపతులు(హెచ్‌వోడీ)గా, 32మందికి ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు కల్పించారు.

కిందిస్థాయి అధికారే కానీ..

సాంకేతిక విద్యాశాఖలో ఉన్నతాధికారి వద్ద గతంలో కీలకంగా వ్యవహరించిన కిందిస్థాయి అధికారి ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్లు ప్రచారం సాగుతోంది. ఈయనకు అర్హత లేకపోయినా ప్రభుత్వ వాహనాన్ని వినియోగించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. సీనియర్ అధ్యాపకుల పోస్టులకు రూ.1-2లక్షలు, విభాగాధిపతుల పోస్టింగ్‌కు రూ.3-4లక్షలు, ప్రిన్సిపాళ్లకు రూ.3-5లక్షలు చొప్పున కొంతమంది వద్ద నుంచి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఓ పాలిటెక్నిక్ అధ్యాపకురాలకు ఏఐసీటీఈ వేతన స్కేలు ఇచ్చారు. ఇది తనకు వద్దని, రాష్ట్ర స్కేలే ఉంచాలని కోరారు. ఎన్ని పర్యాయాలు విన్నవించుకున్నా సాంకేతిక విద్యా విభాగం అధికారులు పట్టించుకోలేదు. చివరికి రూ.40-50వేలు మామూళ్లు ఇవ్వడంతో దస్త్రంలో కదలిక వచ్చినట్లు ఆరోపణలొచ్చాయి. ఇలాంటి ఘటనలు ఇటీవల ఈశాఖలో కోకొల్లలుగా జరిగినట్లు సిబ్బంది వాపోతున్నారు.

ఇష్టారాజ్యంగా పోస్టింగ్‌లు..!

పదోన్నతుల నియామకాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో మారుమూల కళాశాలల్లో పోస్టులు మిగిలిపోయినట్లు సాంకేతిక విద్యా శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఎక్కువగా పట్టణాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లోనే భర్తీ చేసినట్లు విమర్శలున్నాయి. ఇందుకోసం ఒక గ్రూపు వారిని మరో గ్రూపులో విభాగాధిపతులుగా నియమించడం గమనార్హం. విశాఖపట్నం జిల్లాలో మెకానికల్ సెక్షన్‌కు చెందిన అధ్యాపకుడిని జనరల్ సెక్షన్ విభాగాధిపతిగా నియమించారు. ఆయన విద్యార్థులకు ఎలాంటి పాఠ్యాంశాలు బోధించాలనేది అధికారులకే తెలియాలి. ఒకవేళ ఆయన మెకానికల్ విభాగం అభివృద్ధికి కృషి చేద్దామన్నా అక్కడ అప్పటికే మరో విభాగాధిపతి ఉంటారు. ఇలాంటి చర్యలతో మానవవనరులు నిరుపయోగమవడం తప్ప విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. పోస్టులు ఖాళీలేని సమయంలో వేతనాలు ఇచ్చేందుకు సాధారణంగా ఇలా చేస్తారు. కానీ, పోస్టులు ఉన్నప్పటికీ ఇలా పోస్టింగ్‌లు ఇచ్చారనే ఆరోపణలున్నాయి. శ్రీకాకుళం, తూర్పుగోదావరి, రాయలసీమ జిల్లాల్లోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒక విభాగానికి చెందిన అధ్యాపకులకు వేరే విభాగం అధిపతిగా పోస్టింగ్‌లు ఇచ్చారు. మరోపక్క మారుమూల పాలిటెక్నిక్‌ల్లో విభాగాధిపతులు లేక విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యార్థులకు నష్టం కలిగిస్తూనే పోస్టింగ్‌ల కోసం రూ.లక్షలు దండుకోవడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనల ప్రకారమే చేశాం

పదోన్నతుల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదు. నిబంధనల ప్రకారమే జరిగాయి. అధ్యాపకులు ఇచ్చిన ఆప్షన్ల ప్రకారమే పోస్టింగ్‌లు ఇచ్చాం. విభాగాధిపతులు, ప్రిన్సిపాళ్ల దస్త్రాలను వారిచ్చిన ఆప్షన్ల ప్రకారం ప్రభుత్వానికి పంపాం. ఎవ్వరూ డబ్బులు వసూళ్లు చేయలేదు.

– సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ పండాదాస్

ప్రపంచ నైపుణ్య పోటీలకు సన్నద్ధం

- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ఏపీఎస్ఎస్‌డీసీ

ఈనాడు, అమరావతి: వచ్చే ఏడాది ఆగస్టులో రష్యాలో జరగనున్న ప్రపంచ నైపుణ్య పోటీలకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) సన్నద్ధమవుతోంది. గతేడాది అబుదాబి అనుభవాల నేపథ్యంలో ఈసారి దేశం తరఫున పాల్గొనే వారిలో రాష్ట్ర విద్యార్థులు ఎక్కువగా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 22ఏళ్లలోపు విద్యార్థులు మాత్రమే అర్హులు. ఈసారి జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఫిక్కీ సహకారంతో ఏపీఎస్ఎస్‌డీసీ మంగళవారం ప్రత్యేక సదస్సు నిర్వహించింది. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈఓ కె.సాంబశివరావు, సంచాలకులు లక్ష్మీనారాయణ, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి రాజన్‌చౌదరి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రపంచ నైపుణ్య పోటీల్లో పాల్గొనేందుకు ఎలా సన్నద్ధం కావాలి? ఎలాంటి శిక్షణ అవసరం తదితర సూచనలు చేశారు. ఈసారి ఎక్కువ మంది విద్యార్థులు జాతీయస్థాయిలో ఎంపికై, దేశం తరఫున పాల్గొనేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపైనా సూచనలిచ్చారు. 28 నైపుణ్య అంశాలకు సంబంధించి ఆరు విభాగాల్లో ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించేలా విద్యార్థులను తీర్చిదిద్దనున్నారు.

మరో రూ.2000 కోట్ల సేకరణకు అనుమతి

ఈనాడు–అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జలవనరుల ప్రాజెక్టుల నిమిత్తం అదనంగా మరో 2,000 కోట్ల రుణాల సమీకరణకు అనుమతిస్తూ జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. గతంలో ఉన్న పరిమితిని సడలిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులిచ్చింది, గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల కోసం రూ.10,796 కోట్లు అవసరమని ఇంజినీర్ ఇన్ చీఫ్ జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్‌కు తెలియజేశారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ మార్కెట్ నుంచి తక్కువ వడ్డీకి రుణాలు సేకరిస్తోంది. ఇందుకు ప్రభుత్వం అసలుకు హామీ ఇచ్చింది.

మంగళగిరి ఎయిమ్స్‌పై గెజిట్ నోటిఫికేషన్ జారీ

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశంలోని మరో రెండు రాష్ట్రాల్లో ఎయిమ్స్ ఏర్పాటుపై కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో రాష్ట్రంలోని మంగళగిరి, మహారాష్ట్రలోని నాగ్‌పూర్, పశ్చిమబంగలోని కల్యాణి ఎయిమ్స్ ఉన్నాయి. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ యాక్ట్ -1956లోని సెక్షన్ 3(1) కేంద్ర ప్రభుత్వానికి కొత్త ఎయిమ్స్‌ను ఏర్పాటుచేసే అధికారం కల్పిస్తోంది. ఆ నిబంధన కింద దేశంలో మూడు కొత్త ఎయిమ్స్‌లను అధికారికంగా ప్రకటిస్తూ గెజిట్‌నోటిఫికేషన్ జారీచేసింది.

రుణాల మంజూరులో జాప్యాన్ని పరిష్కరిస్తాం

- బీసీ సంక్షేమశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ సంక్షేమ సంఘాలు, సమాఖ్యలకు బ్యాంకుల నుంచి రుణాల మంజూరులో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు చర్యలు తీసుకుంటామని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వివిధ జిల్లాల శాలివాహన సంక్షేమ సంఘాల అధ్యక్షులు మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిశారు. బ్యాంకు రుణాల మంజూరులో జాప్యం నెలకొంటోందని ప్రస్తావించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ త్వరలో అధికారులతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. అంతకుముందు వివిధ జిల్లాల ఎమ్మెల్యేలు అచ్చెన్నాయుడిని కలిసి సమస్యలపై చర్చించారు.

హిందీ సేవాసదన్ అధ్యాపక బృందం రూపొందించిన హిందీ కంటెంట్ పుస్తకాన్ని, విద్యుత్తు ఉద్యోగుల బీసీ సంక్షేమ సంఘం ముద్రించిన క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

22న కియాకు భూమిపూజ

ఈనాడు, అనంతపురం: అనంతపురం జిల్లా పెనుకొండ సమీపంలో రూ.13 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటుకానున్న దక్షిణ కొరియాకు చెందిన కియా కార్ల పరిశ్రమకు భూమిపూజ తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 22న ముఖ్యమంత్రి చంద్రబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, కియా సంస్థల అధ్యక్షుడు తదితరుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. పరిశ్రమ కోసం ప్రభుత్వం 600 ఎకరాలు కేటాయించడంతోపాటు.. భూములను చదును చేసి కియా సంస్థకు అప్పగించింది. మరోవైపు విద్యుత్తు, తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతులు శరవేగంగా కల్పిస్తున్నారు. ఈ ఏర్పాట్లు కొలిక్కి రావడంతో భూమిపూజకు ముహూర్తం ఖరారు చేశారు.

పల్లె, పయ్యావులకు కేబినెట్ హోదా

ఈనాడు, అమరావతి: శాసనసభ, మండలిలో చీఫ్ విప్‌లు పల్లె రఘునాథరెడ్డి, పయ్యావుల కేశవ్‌లకు కేబినెట్ మంత్రి హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

కోమటి జయరాం పదవీకాలం పొడిగింపు

ఉత్తర అమెరికాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం పదవీకాలాన్ని రెండేళ్లు (2020 జనవరి 17 వరకు) పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

ప్రేమ్‌చంద్ రాజీనామాకు ఆమోదం

కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌లో సభ్యుడి పదవికి విశ్రాంత ఐఏఎస్ డా.ప్రేమ్‌చంద్.. వ్యక్తిగత, ఆరోగ్య కారణాలతో సమర్పించిన రాజీనామాను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఆమోదించింది. ప్రేమ్‌చంద్ 2012 మార్చి 1 నుంచి కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ సభ్యుడిగా సేవలందిస్తున్నారు.





విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు కాట్రగడ్డ బాబు, దోనేపూడి శంకర్, గన్నె వెంకటనారాయణ ప్రసాద్, దోనేపూడి కాశీనాథ్ తదితరులు ★ భవనంపైన పిట్టగోడను పడగొట్టిన దృశ్యం

కళాశాల స్థలం కోసం కదం

- ఆక్రమణలపై ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థుల ఆందోళన

ఈనాడు, అమరావతి: దశాబ్దాలుగా ఆక్రమణ చెరలో ఉన్న కళాశాల స్థలం కోసం విద్యార్థులు కదం తొక్కారు. వందలాది మంది ప్రస్తుత, పూర్వ విద్యార్థులు మంగళవారం విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలకు చెందిన స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది.

విజయవాడలోని మాచవరంలో 7.08 ఎకరాల్లో ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ఉంది. దీని వెనుకనే రైవస్ కాలువ గట్టున కళాశాలకు చెందిన మరో 6.67 ఎకరాల స్థలం ఉంది. ఈ స్థలం గత 40 ఏళ్లుగా ఆక్రమణల చెరలో ఉంది. 1954లో పెదర్ల నరసింహారావు అనే వ్యక్తికి ఈ స్థలాన్ని కౌలుకు ఇచ్చారు. చాలాకాలం తర్వాత ఆ భూమిని కళాశాల అవసరాల కోసం వినియోగించుకునేందుకు ఖాళీ చేసి ఇవ్వాలని యాజమాన్యం కోరగా నరసింహారావు తిరస్కరించారు. ఆ భూమికి తానే హక్కుదారునంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో అప్పటి నుంచి ఈ స్థలం వివాదంలో ఉంది. ఇదే అదనుగా స్థానికంగా ఉండే కొందరు స్థలాన్ని చాలావరకూ ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. కళాశాల యాజమాన్యమూ ఆక్రమణలను పెద్దగా పట్టించుకోలేదు. కొందరు తాము ఆక్రమించుకున్న స్థలాలను అమ్ముకున్నారు. ప్రస్తుతం ఈ స్థలంలో 50కు పైగా ఇళ్లను నిర్మించుకున్నారు. మరికొన్ని ఖాళీ స్థలాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 13న ఆక్రమణలపై కలెక్టరు, పోలీసు కమిషనరు, నగరపాలక సంస్థ కమిషనరు, విజయవాడ అర్బన్ తహసీల్దార్లకు కళాశాల యాజమాన్యం ఫిర్యాదు చేసింది. మరుసటి రోజు 14న పోలీసులు, రెవెన్యూ అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్ కలిసి వెళ్లి ఖాళీ స్థలాల్లో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకున్నారు. అయినా నిర్మాణాలు ఆపకపోవడంతో కళాశాల పూర్వ విద్యార్థుల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుతం రాజకీయ నాయకులుగా ఉన్న కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు కె.సుబ్బరాజు, దోనెపూడి శంకర్, గన్నె వెంకట నారాయణ, కాట్రగడ్డ బాబు, దోనెపూడి కాశీనాథ్, చెరుకూరి కృష్ణ కుమార్ తదితరులతో పాటూ పీజీ, డిగ్రీలు చదువుతున్నవారు ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నినాదాలు చేస్తూ ఆక్రమణ స్థలం వద్దకు చేరుకున్నారు. అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను తొలగించేందుకు ప్రయత్నించారు. పొక్లెయిన్‌ను సైతం తమతోపాటూ తీసుకెళ్లి స్థలంలో పాతిన బోర్డులు, గోడలను పాక్షికంగా కూల్చేశారు. ఈ స్థలాన్ని వెంటనే కళాశాలకు అప్పగించాలని, లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామంటూ దోనెపూడి శంకర్ తదితరులు హెచ్చరించారు. క్రీడామైదానం లేక ఇబ్బంది పడుతున్నామని, ఇప్పటికైనా ఖాళీ చేసి వెళ్లాలని పీజీ చదువుతున్న విద్యార్థి నాయకులు అజయ్, రాకేష్ తదితరులు డిమాండు చేశారు. మరోవైపు స్థలంలో మూడున్నర ఎకరాలు తమకే చెందుతుందని ఇప్పటికే న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని పెదర్ల నరసింహారావు కుమారుడు శివరామప్రసాద్ తెలిపారు. మిగతా స్థలం గురించి తమకు తెలియదని చెప్పారు. తమ స్థలాన్ని ఇప్పటికే కొందరికి విక్రయించామని, కొంత తమ వద్దే ఉందని వెల్లడించారు.

స్టీల్‌ప్లాంట్‌లో పోస్టుల భర్తీ ప్రకటనపై హైకోర్టు స్టే

- కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో పరీక్ష వాయిదా

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్-విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జూనియర్ ట్రైనీ, ఫీల్డ్ అసిస్టెంట్ ట్రైనీ పోస్టుల భర్తీ కోసం జారీచేసిన ఉద్యోగ ప్రకటనను హైకోర్టు నిలుపుదల చేసింది. ప్రకటనలో రాతపరీక్ష నిర్వహిస్తామని పేర్కొని.. అందుకు విరుద్ధంగా ఆన్‌లైన్లో పరీక్ష నిర్వహిస్తామనడం సరికాదని పేర్కొంటూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. 645 జూనియర్ ట్రైనీ, 91 ఫీల్డ్ అసిస్టెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకోసం విశాఖ స్టీల్ ప్లాంట్ అధికారులు గత ఏడాది ప్రకటన జారీచేశారు. ఉద్యోగ ప్రకటనలో రాతపరీక్ష నిర్వహిస్తామన్నారని.. ప్రస్తుతం ఆన్‌లైన్లో నిర్వహణకు చర్యలు చేపట్టారని అభ్యంతరం వ్యక్తంచేస్తూ పి.భాస్కరరావు అనే వ్యక్తితో పాటు మరొకరు హైకోర్టును ఆశ్రయించారు. పిటీషనర్ తరఫున న్యాయవాది రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఆ వివరాల్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. నోటిఫికేషన్‌పై 'స్టే' విధించారు. ఈ ఉత్తర్వులను స్టీల్ ప్లాంట్ అధికారులు ధర్మాసనం ముందు అత్యవసరంగా అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ సురేశ్‌కుమార్ కైత్‌తో కూడిన ధర్మాసనం ఆ ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో బుధవారం నుంచి ఫిబ్రవరి 4 వరకు జరగాల్సిన పరీక్ష వాయిదా పడింది.

నవ్యావిష్కరణలకు రాష్ట్రం ప్రధాన కేంద్రం

- రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలి
- అమెరికాలోని కంపెనీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి
- ఏపీపై వివిధ కంపెనీల ఆసక్తి
- లోకేష్‌తో భేటీ సందర్భంగా హామీ

ఈనాడు - అమరావతి



శాన్‌ఫ్రాన్సిస్కోలోని వివిధ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులు, ప్రవాసాంధ్రులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు



శాన్‌ఫ్రాన్సిస్కోలో ఫాల్కన్ ఎక్స్ ఇంక్యుబేటర్‌ను ప్రారంభిస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖల మంత్రి లోకేష్

అనేక కొత్త ఆవిష్కరణలకు రాష్ట్రం ప్రధాన కేంద్రం కావాలని, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి వ్యక్తి పారిశ్రామికవేత్తగా మారేందుకు ఫాల్కన్ ఎక్స్ ఇంక్యుబేటర్ కేంద్రం దోహదం చేస్తుందని ఆశిస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖల మంత్రి లోకేష్ శాన్‌ఫ్రాన్సిస్కోలో మంగళవారం కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా వివిధ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులు, ప్రవాసాంధ్రులను ఉద్దేశించి ముఖ్యమంత్రి అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. విజిబుల్ గవర్నెన్స్, ఇన్విజిబుల్ గవర్నమెంట్ తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నామని, సిలికాన్ వ్యాలీలో ఉండే స్టార్టప్ వాతావరణం ఆంధ్రప్రదేశ్‌లోనూ తీసుకొచ్చేందుకు ఫాల్కన్ కృషి చేస్తుందని, అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో విద్యార్థి దశ నుంచే స్టార్టప్ కల్చర్ పెంచడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు.

బ్లాక్‌చైన్ టెక్నాలజీ అభివృద్ధిలో ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు త్వరలోనే ఒక బృందాన్ని రాష్ట్రానికి పంపుతామని మంత్రి లోకేష్‌తో భేటీ సందర్భంగా వీఎంవేర్ కార్యనిర్వాహక అధికారి (సీఈవో) రఘురాం ప్రకటించారు. స్టార్టప్ కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చి వాటి అభివృద్ధికి సహకరిస్తామని స్పార్క్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ పార్టనర్ బెర్నార్డ్ మూన్ హామీ ఇచ్చారు. సైబర్, క్లౌడ్, డేటాబేస్ సెక్యూరిటీలో ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కలర్ టోకెన్స్ వైస్ ప్రెసిడెంట్ రాజేశ్ కాజాంచి వెల్లడించారు. రాష్ట్రంలో కంపెనీ ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రకటించిన విధానాలు, రాయితీలను అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామని క్లౌడ్ లెండింగ్ సొల్యూషన్స్ ప్రతినిధి స్నేహల్ తెలిపారు. ఫైబర్ గ్రిడ్‌తో సహా వివిధ ప్రభుత్వశాఖల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలకు సహకారాన్ని అందిస్తామని అరిస్తా కంపెనీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ అన్షుల్ ప్రకటించారు. జి స్టేషన్, క్లోమ్ బుక్స్, టెలీ మెడిసిన్‌లో ఫైబర్ గ్రిడ్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని గూగుల్ బృందానికి చెందిన అంజలి జోషి, సూరి కొడుకుల్లా, డేవిడ్ షాపిరో ప్రకటించారు. తాగునీటి నాణ్యత, వ్యవసాయం, తదితర రంగాల్లో ఐవోటీ వినియోగంపై రూపొందించిన పరికరాలను ఆంధ్రప్రదేశ్‌లో ప్రయోగిస్తామని, స్మార్ట్‌మీటర్లతో పైలెట్ ప్రాజెక్టు త్వరలో ప్రారంభిస్తామని ఆర్మ్ సీఈవో సైమెన్ మంత్రి వెల్లడించారు.

చిప్ డిజైనింగ్‌లో శిక్షణ, సెమీ కండక్టర్స్ పార్కు ఏర్పాటుకు సహకారం అందిస్తామని గ్లోబల్ ఫౌండరీస్ సీఈఓ సంజయ్‌జాహ్ మంత్రి లోకేశ్‌కు హామీ ఇచ్చారు.



మోకాళ్లపై కొండమెట్లు ఎక్కుతున్న ఏసుదేవరెడ్డి

బాబు మళ్లీ సీఎం కావాలని..

మోకాళ్లపై పానకాలస్వామి కొండమెట్లు ఎక్కిన తెలంగాణ తెదేపా నాయకుడు

మంగళగిరి, న్యూస్‌టుడే: వచ్చే ఎన్నికల్లో చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ తెలుగురైతు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సోలికురం ఏసుదేవరెడ్డి గుంటూరు జిల్లాలోని మంగళగిరి శ్రీపానకాలస్వామి కొండ మెట్లను మోకాళ్లపై ఎక్కారు. మంగళవారం ఉదయం శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని స్థానిక నాయకులతో కలిసి కొండమెట్లు ఎక్కారు. నల్గొండ జిల్లా వర్ధమానకోటకు చెందిన ఆయన తెలుగురైతు రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముళ్లపూడి వీరేంద్రనాథ్‌తో కలిసి వచ్చారు. ఇప్పటి వరకు 40 కొండలు మోకాళ్లపై ఎక్కినట్లు ఆయన చెప్పారు. 2018 సంవత్సరంలో వర్షాలు బాగా కురవాలని, 2019లో తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని శ్రీపానకాలస్వామిని కోరినట్లు చెప్పారు.

పాపికొండల యాత్ర ఇక దేవీపట్నం నుంచి

- పోలవరం ప్రాజెక్టు పనుల నేపథ్యంలో మార్పు
- నేటి నుంచే కొత్త ప్రాంతం నుంచి రాకపోకలు

దేవీపట్నం - న్యూస్‌టుడే



దేవీపట్నం మండలం పాత అంగుళూరు వద్ద గోదావరిలో అడ్డుకట్ట వేస్తున్న ప్రాంతమిదే..

తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం అంగుళూరు వద్ద గోదావరి నదిలో జరుగుతున్న పోలవరం ప్రాజెక్టు పనుల కారణంగా పాపికొండల సందర్శనకు బయలుదేరే ప్రాంతాన్ని మార్పు చేశారు. ప్రస్తుతం అంగుళూరు నుంచి బోట్లు బయలుదేరుతుండగా.. బుధవారం నుంచి ఎగువ ప్రాంతంలోని దేవీపట్నం నుంచి యాత్ర ప్రారంభించనున్నారు. పశ్చిమగోదావరి జిల్లా రామయ్యపేట నుంచి తూర్పుగోదావరి జిల్లాలోని అంగుళూరు వైపు గోదావరి మధ్యన అడ్డుకట్ట వేస్తున్నారు. దీంతో బోట్లు వెళ్లేందుకు మార్గం మూసుకుపోనుంది. దిగువ ప్రాంతంలోని బోట్లు, లాంచీలను దేవీపట్నం వైపు వెంటనే తరలించాలని మంగళవారం సాయంత్రం పోలవరం ప్రాజెక్టు అధికారులు పర్యాటకశాఖ అధికారులు ఆదేశాలు జారీచేశారు.

ఎక్కడ నిలపాలి? ఎలా వెళ్లాలి?: ఈ ప్రాంతం నుంచి బయలుదేరే 26 పర్యాటక బోట్లు, 8 లాంచీలను ఇక నుంచి ఎగువ ప్రాంతం దేవీపట్నంలోని గోదావరి తీరంలో ఎక్కడ నిలపాలనే అంశంపై పర్యాటకశాఖ అధికారులు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటి వరకు ఇతర ప్రాంతాల నుంచి పాపికొండల విహారయాత్రకు వెళ్లే పర్యాటకులు తొలుత వాహనాలపై అంగుళూరు చేరుకుని అక్కడి నుంచి బోట్లపై బయలుదేరుతున్నారు. ఇకపై సుమారు 10 కిలోమీటర్ల దూరంలోని దేవీపట్నం వెళ్లాలి. ఇరుకు రహదారి, మధ్యలో దండంగి వాగుపై చిన్నపాటి వంతెనపై పెద్ద బస్సులు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు.

దీనిపై బోటు జూనియర్ సూపరింటెండెంట్ బి.రత్నరాజు మాట్లాడుతూ.. బుధవారం దేవీపట్నం నుంచి యాత్ర ప్రారంభించనున్న నేపథ్యంలో ఇబ్బందులు లేకుండా బోట్లు నిలపడానికి అనుకూలమైన ప్రాంతాన్ని ఎంపిక చేస్తామన్నారు.

తలాక్ సమస్యను స్వతంత్రంగా పరిష్కరించుకోవాలి

ఈనాడు, హైదరాబాద్: తలాక్ బిల్లును హిందూ ఫాసిస్టు శక్తులు కుట్రపూరితంగా తీసుకొచ్చాయని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ స్పష్టం చేశారు. ఇటువంటి దాడులను ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ముస్లింలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, మోదీ ప్రభుత్వ హయాంలో మరింత పెరిగాయని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో ముస్లింలు ఎంత దయనీయ పరిస్థితుల్లో ఉన్నారో 2006లో వెలుగుచూసిన రాజేంద్ర సచ్చార్ కమిటీ నివేదిక వెల్లడించిందని, 4.9 శాతం ముస్లింలు మాత్రమే ఉద్యోగాలు చేస్తున్నారని, తలాక్ చట్టం కంటే ముందు ఇటువంటి వాటిని పరిష్కరించాలని అభయ్ వెల్లడించారు. ముమ్మారు తలాక్ అప్రజాస్వామికమేనని, ఎన్నో దేశాలు దీన్ని నిషేధించాయని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని తమ పార్టీ సమర్థిస్తోందని, ముమ్మారు తలాక్ వంటి సమస్యలను ప్రజలు స్వతంత్రంగా పరిష్కరించుకునేలా చైతన్య పరచాలన్నారు.

హజ్ యాత్రికుల మొదటి విడత చెల్లింపునకు గడువు పెంపు

ఈనాడు డిజిటల్, అమరావతి: హజ్ యాత్రికుల మొదటి విడత చెల్లింపు గడువును ఫిబ్రవరి 12 వరకూ పొడిగించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి మహ్మద్ లియాఖత్ అలీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి యాత్రికుడు రూ.81 వేలను బ్యాంకులో జమ చేయవచ్చని వెల్లడించారు. చలానా సహా వైద్య పరీక్షలు, ధారుడ్య ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు, ఫోటోలను విజయవాడలోని రాష్ట్ర హజ్ కమిటీ కార్యాలయంలో అందజేయాలని ఆయన పేర్కొన్నారు.



అమ్మల గద్దెల వద్ద భక్తజనం

మేడారం మహాజాతర నేడు ప్రారంభం

- గద్దెలపైకి వేంచేయనున్న వనదేవత

ఈనాడు, మేడారం: తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి గాంచిన మేడారం మహాజాతరలో తొలి ఘట్టానికి సర్వం సిద్ధమైంది. భక్త జనకోటి ఎప్పుడెప్పుడా అని వేయి కళ్లతో ఎదురుచూస్తున్న సారలమ్మ తల్లి రాకకు గద్దెలు ముస్తాబయ్యాయి. బుధవారం సారలమ్మను కన్నెపెల్లి నుంచి డప్పు వాయిద్యాల మధ్య, గిరిజన సంప్రదాయ రీతిలో మేడారానికి తీసుకురానున్నారు. మరోవైపు మంగళవారం ఉదయమే సమ్మక్క భర్త పగిడిద్దరాజు మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి బయలుదేరాడు. సారలమ్మ, పగిడిద్దరాజులతోపాటు గోవిందరాజులు బుధవారం మేడారంలోని గద్దెలపై కొలువుదీరనున్నారు. ఈ దివ్య ఘట్టాన్ని కళ్లారా చూసేందుకు లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు.

ఒకేసారి ఆ ముగ్గురు: సారలమ్మ రాకతో మేడారం మహాజాతర ఆరంభమవుతుంది. బుధవారం నుంచి నాలుగు రోజులపాటు జనసంద్రంగా మారిపోతుంది. సారలమ్మను వెదురుబుట్టలో (ముంటె) ముస్తాబుచేసి, జంపన్నవాగులో నుంచి జయజయధ్వానాల మధ్య మేడారం గద్దెల వద్దకు తీసుకొచ్చే అద్భుత ఘట్టంలో 30 మంది పూజారులు పాలుపంచుకోనున్నారు. కన్నెపల్లిలో సారలమ్మను పూజారులు బయటకు తీసుకొచ్చే సమయంలో దేవాలయం ముందు వందలాది భక్తులు వరంపడతారు. వారిపై నడుచుకుంటూనే పూజారులు అమ్మను బయటకు తీసుకొచ్చే దృశ్యాన్ని వీక్షించేందుకు భక్తులు వెల్లువెత్తుతారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఈ క్రతువు మొదలవుతుంది. అనంతరం ఇక్కడి నుంచి పాదయాత్రగా వచ్చి జంపన్నవాగు దగ్గరకు చేరుకుంటారు. అప్పటికే పగిడిద్దరాజు, గోవిందరాజులను తీసుకొచ్చి.. సారలమ్మ రాక కోసం వేచి ఉంటారు. సారలమ్మ జంపన్నవాగుకు చేరుకోగానే ముగ్గురు దేవతలను ఒకేసారి ఊరేగింపుగా గద్దెలపైకి తీసుకొచ్చి కొలువుదీరుస్తారు. జాతరలో దివ్యఘట్టం గురువారం ఆవిష్కృతం కానుంది. సమ్మక్కను చిలుకలగుట్ట నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి గద్దెలపైన ప్రతిష్ఠించనున్నారు.

ఎస్సీ వర్గీకరణపై హామీని నిలబెట్టుకోలేదు

నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసరావు

గుంటూరు, న్యూస్‌టుడే: అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామన్న పార్టీలు (తెదేపా, భాజపా) హామీని నిలబెట్టుకోలేక మాదిగలను మోసం చేశాయని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు మాదిగ తెలిపారు. గుంటూరులో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి ఎస్సీ వర్గీకరణ సాధించుకోవాలని, ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని వెంటనే దిల్లీకి పంపాలని తీర్మానించామన్నారు. ఎస్సీ ఉపప్రణాళిక నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నం.25ను సక్రమంగా అమలు చేసి మాదిగలకు సగం వాటా వచ్చేలా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. డప్పు కళాకారులకు, చెప్పులు కుట్టుకునే వారికి రూ.3 వేలు పింఛను అందించాలన్నారు.

వెల్లువచ్చె గంగమ్మ.. ఎల్లాకిల్లా పొంగేనమ్మ!

- కడప జిల్లాలో సత్ఫలితాలిస్తున్న 'రీఛార్జిబోర్‌వెల్' పథకం
- భారీగా పెరిగిన భూగర్భమట్టం
- 'ప్రధాని' పురస్కారానికి దరఖాస్తు

ఈనాడు – కడప

ఒట్టిపోయిన పాతాళ గర్భం వరదనీటితో నిండుతోంది.. కరవు కమ్మేసిన పొలం పచ్చదనం సంతరించుకుంటోంది.. రాష్ట్రంలోనే తొలిసారిగా చేపట్టిన ప్రయోగాత్మక 'రీఛార్జి బోర్‌వెల్' కార్యక్రమం కడప జిల్లాలో సత్ఫలితాలిస్తోంది. వర్షపునీరు ప్రతి చుక్కా భూమిలోకి చేరుతోంది. ఫలితంగా భూగర్భనీటిమట్టం పెరిగి పాతాళగంగమ్మ పైపైకి వస్తోంది.

రాయలసీమ జిల్లాల్లో భూభాగం రాళ్లతో నిండి ఉండటంతో కురిసిన వర్షపునీరు భూమిలోకి ఇంకకుండా దిగువకు వృథాగా పోతుంది. ప్రభుత్వం చెక్‌డ్యాంలు నిర్మించినా మట్టం వరకు నీరు ఉండి.. మిగిలినదంతా దిగువకు వెళ్లిపోయేది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని జలవనరులశాఖ అధికారులు ఏడాదిన్నర కిందట ప్రయోగాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బోర్లు వేసి భూగర్భంలోకి నేరుగా నీరు పంపాలని నిర్ణయించారు. ఆ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ రీఛార్జి వెల్ ప్రాజెక్టు (డీఆర్‌డబ్ల్యూపీ) అని నామకరణం చేశారు. ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీపీ) ద్వారా చెక్‌డ్యాములకు ఆనుకుని భూగర్భంలోకి డ్రిల్లింగ్ చేశారు. కొంతలోతు వరకు బావి మాదిరి తీసి అందులో మట్టిరాళ్లతో పాటు కేసింగ్, మెస్ వేసి భూఉపరితలంపై కాంక్రీటు కట్టడం నిర్మించారు. చెక్‌డ్యాం లోపలి భాగం నీటితో నిండగానే వివిధ దశల్లో బురద శుద్ధి జరిగి జలం నేరుగా పాతాళంలోకి చేరేలా ఏర్పాట్లు చేశారు.

ఇదీ పరిస్థితి: తొలుత ఒంటిమిట్ట మండలం మాధవరం వద్ద 16 కట్టడాలు నిర్మించారు. ఇందుకు రూ.40 లక్షల వరకు వ్యయమైంది. ప్రస్తుతం అట్లూరు మండలంలో 80 వరకు నిర్మితమవుతున్నాయి. ఇందుకు రూ.2 కోట్ల వరకు వ్యయం చేస్తున్నారు.





పైపునుంచి ఎగసివస్తున్న గంగమ్మ ★ పంటకు నీటిధార అందుతోందిలా..

ఫలితమిస్తోంది ఇలా..

- మాధవరం వద్ద నిర్మాణాలు పూర్తయి ఏడాదవడంతో వర్షాలకు ఈ బోర్‌వెల్స్ పనిచేయడం ఆరంభించాయి. 500 ఎకరాల పరిధిలో భూగర్భ జలమట్టం పెరిగింది. గతంలో 400-500 అడుగు ల్లోతుల్లో నీటి మట్టం ఉండేది. ఇప్పుడు సాగు బావుల్లోనూ జలసిరులు కనిపిస్తున్నాయి.
- అధికారులు నీరు-ఇంకుడు సామర్థ్య అంచనా పరీక్ష (సిట్ టెస్ట్) చేపట్టగా.. గంటకు 60 లీటర్లు కూడా భూమిలోకి ఇంకే శక్తి లేని చెక్‌డ్యాముల వద్ద ఈ బావుల ద్వారా గంటకు 5 వేల లీటర్ల నుంచి 31 వేల లీటర్ల వరకు ఇంకుతున్నట్లు గుర్తించారు.

త్వరలోనే మరిన్ని నిర్మాణాలు..

ఈ కార్యక్రమం సత్ఫలితాలివ్వడంతో ప్రభుత్వానికి నివేదించారు. ఇన్నోవేషన్ విభాగంలో ప్రధాన మంత్రి అవార్డు ఫర్ పబ్లిక్ గవర్నెన్స్ కింద దరఖాస్తు చేశారు. ఈ విషయమై రీఛార్జివెల్ రూపకర్త, తెలుగుగంగ ఈఈ ప్రతాప్ 'ఈనాడు'తో మాట్లాడుతూ కడప నేల స్వభావానికి అనుగుణంగా రీఛార్జి వెల్ నిర్మాణానికి పూనుకొన్నట్లు చెప్పారు. త్వరలోనే మరిన్ని నిర్మాణాలు చేపడ్తామన్నారు.

జేఎన్‌టీయూకే ఆచార్యుడు బాబులుపై పోలీసు కేసు

సస్పెన్షన్ వేటు వేసిన ఉపకులపతి

కాకినాడ, న్యూస్‌టుడే: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడలో (జేఎన్‌టీయూకే) మూడురోజులుగా చోటుచేసుకుంటున్న వివాదం ఎట్టకేలకు సద్దుమణిగింది. ఆచార్య బాబులుపై విశ్వవిద్యాలయం ఉపకులపతి సస్పెన్షన్ వేటు వేశారు. మరోవైపు బాబులుపై సర్పవరం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. విషయం తెలుసుకున్న ఆయన పరారీలో ఉన్నారు. ఆచార్య బాబులు వైవా సమయంలో లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ ఎంటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు ఇచ్చిన ఫిర్యాదుతో మూడురోజులుగా విశ్వవిద్యాలయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాబులును సస్పెండ్ చేయాలంటూ విద్యార్థులు నిరసన తెలిపారు. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు కమిషన్ వేసి రాజీకుదిర్చే ప్రయత్నం చేసినప్పటికీ విద్యార్థులు బాబులును సస్పెండ్ చేయాలంటూ పట్టుపట్టారు. సోమవారం రాత్రి కలెక్టర్ జోక్యం చేసుకోవడంతో సమస్య ఓ కొలిక్కి వచ్చింది. వెంటనే బాబులుపై చర్యలు చేపట్టాలని కలెక్టర్ విశ్వవిద్యాలయం ఉపకులపతిని ఆదేశించారు. అనంతరం ఉపకులపతి సూచనతో రిజిస్ట్రార్ వి.వి.సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు బాబులుపై 354, 354(ఎ), 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణచైతన్య తెలిపారు. మరోపక్క రెక్టార్ పూర్ణానందం అధ్యక్షతన వేసిన కమిటీ మంగళవారం వీసీకి నివేదిక అందజేసినట్లు తెలిసింది.

పాఠశాల విద్యాశాఖ తీరు ఇంతేనా?

- ప్రశ్నపత్రాల లీక్‌తో ఒకసారి రద్దు
- ఎట్టకేలకు సమ్మెటివ్-1 నిర్వహించినా.. ఫలితాల విడుదలలో తీవ్ర జాప్యం

ఈనాడు, అమరావతి: పరీక్షల నిర్వహణ.. ఫలితాల విడుదలలో పాఠశాల విద్యాశాఖ చేస్తున్న జాప్యంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. సమ్మెటివ్-1 పరీక్ష నిర్వహించి నెల రోజులు దాటినా ఫలితాలు విడుదల చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. జూన్‌లో పాఠశాలలు ప్రారంభం కాగా.. ఫార్మెటివ్ (యూనిట్ టెస్ట్) మినహా ఇప్పటి వరకు విద్యార్థులకు జరిగిన ఏకైక ప్రధాన పరీక్ష ఇదొక్కటే. 1 నుంచి 10వ తరగతి వరకూ ఏడాదికి మూడు సమ్మెటివ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా.. నవంబరులో నిర్వహించిన సమ్మెటివ్-1లో ప్రశ్నపత్రాలు లీక్ కావడంతో.. మళ్లీ నిర్వహించలేక ఈ పరీక్షలను రెండుకు కుదించారు.

ఎట్టకేలకు డిసెంబరు 16 నుంచి 22 వరకు సమ్మెటివ్-1 నిర్వహించినా.. ఇప్పటికీ ఫలితాల ఊసెత్తడంలేదు. ఈ ఏడాది తొలిసారి 8, 9 తరగతులకు బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఓఎంఆర్ విధానంలో పరీక్షలు నిర్వహించారు. ఫలితాలను వెంటనే ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని, పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఉపయోగపడుతుందని ఈ పద్ధతి చేపట్టారు. ఈ రెండు తరగతుల్లో కలిపి సుమారు 11.22 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారు. కొత్త విధానంలో నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థుల సామర్థ్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకుందామంటే మార్కులు విడుదల చేయడంలేదని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికీ ఓఎంఆర్ షీట్ల స్కానింగ్ జరుగుతోందని సమాచారం.



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి కాలవ శ్రీనివాసులు

భైరవానితిప్ప ప్రాజెక్టుతో రాయదుర్గం సస్యశ్యామలం: కాలవ

ఈనాడు, అమరావతి: భైరవానితిప్ప ప్రాజెక్టు నిర్మాణం వల్ల అనంతపురం జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణశాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. ఈ ప్రాజెక్టు పనులకు రూ.969కోట్లు కేటాయించినందుకు మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు, తాను రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో చోరీ

రూ.36.89 లక్షల సొత్తు అపహరణ

ఒంగోలు, న్యూస్‌టుడే: సికింద్రాబాద్- గూడూరు మధ్య నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో చోరీ జరిగింది. హైదరాబాద్ నుంచి ఒంగోలు వస్తున్న ప్రయాణికురాలి నగల సంచిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారు. ఒంగోలు సంతపేటకు చెందిన రావిపాటి సుశీల అనే మహిళకు చెందిన రూ.36.89 లక్షల విలువైన వజ్రాభరణాలు, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. సుశీల తన కోడలు రజని, మనవడితో కలిసి ఈ నెల 27న హైదరాబాద్‌లో జరిగే ఒక వేడుకకు వెళ్లారు. తిరిగి ఈ నెల 29వతేదీ రాత్రి సింహపురి ఎక్స్‌ప్రెస్ ఎ-2 బోగీలో ప్రయాణించారు. ఆభరణాలు, నగదు ఉన్న సంచిని తల కింద పెట్టుకుని పడుకున్నారు. రాత్రి 11 గంటల సమయంలో రైలు బయలుదేరింది. 11.30 గంటలకు సుశీల నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున 3 గంటలకు చూసేసరికి నగల సంచి కనిపించలేదు. అప్పటికి రైలు విజయవాడ - తెనాలి స్టేషన్ల మధ్య ఉంది. బాధితులు వెంటనే విధుల్లో ఉన్న టిక్కెట్ కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. మంగళవారం ఉదయం ఒంగోలు జీఆర్పీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంచిలో వజ్రాభరణాలు, బంగారు ఆభరణాలు, 1,500 డాలర్లు ఉన్నట్లు బాధితులు తెలిపారు.

ఈజిప్టులో బయటపడ్డ డైనోసార్ శిలాజం

కైరో: ఆఫ్రికాలో డైనోసార్ల పరిణామక్రమంపై మరిన్ని విస్తృత అధ్యయనాలు చేపట్టే దిశగా ముందడుగు పడింది. దాదాపు 8 కోట్ల ఏళ్ల క్రితం జీవించిన డైనోసార్ల శిలాజాలను ఈజిప్టులోని సహారా ఎడారిలో మన్సౌరా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఇటీవల గుర్తించారు. 'మన్సౌరసారస్ షహినే' జాతికి చెందిన రాక్షస బల్లులుగా వీటిని చెబుతున్నారు. బస్సు పరిమాణంలో ఉండే ఈ జాతి డైనోసార్లు పొడవైన మెడను కలిగిఉండేవని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

పాఠశాల స్థాయిలో కేంద్ర పథకాల విలీనం!

- రాష్ట్రాలతో కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ సమావేశం
- పలు అంశాలపై ప్రతిపాదనలు సమర్పించిన పాఠశాల విద్యాశాఖ

ఈనాడు, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాల విలీనానికి కేంద్రం చర్యలు చేపట్టింది. విద్యాహక్కు చట్టం కింద 1-8వ తరగతి వరకు సర్వశిక్షాభియాన్(ఎస్‌ఎస్‌ఏ), 9-10తరగతులకు రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్(ఆర్‌ఎంఎస్‌ఏ), ఉపాధ్యాయులు, ఇతరాత్ర శిక్షణలకు జాతీయ విద్యా పరిశోధన, శిక్షా మండలి(ఎన్‌సీఈఆర్టీ) కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ తరఫున కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. వీటికి వేర్వేరుగా నిధులు కేటాయిస్తున్నా క్షేత్రస్థాయిలో చేసే పనులు, కార్యక్రమాలు దాదాపుగా ఒకేలా ఉంటున్నాయి. ఎస్‌ఎస్‌ఏ తరఫున కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను నిర్వహిస్తుండగా. . ఆర్‌ఎంఎస్‌ఏ తరఫున ఆదర్శ పాఠశాలల వసతిగృహాలను నిర్వహిస్తున్నారు. ఈ రెండు విభాగాలు విడివిడిగా ఉపాధ్యాయులకు శిక్షణలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈశాఖలన్నింటిని ఒకే విభాగంగా విలీనం చేయాలని నిర్ణయించారు. ఎన్‌సీఈఆర్టీకి అనుబంధంగా రాష్ట్రంలో ఎస్‌సీఈఆర్టీ ఉంది. ఈ నేపథ్యంలో ఎస్‌సీఈఆర్టీకి కేవలం ఉపాధ్యాయుల శిక్షణ, ఉపాధ్యాయ విద్య బాధ్యతలను అప్పగించనున్నారు. ఎస్‌ఎస్‌ఏ, ఆర్‌ఎంఎస్‌ఏలను రెండిటిని కలిపి ఒకే విభాగంగా మార్చనున్నారు. దీనిపై రాష్ట్రాల అభిప్రాయాలు, సూచనలను సేకరించేందుకు కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంగళవారం దిల్లీలో సమావేశం నిర్వహించింది. 31అంశాలపై రాష్ట్రాల నుంచి సూచనలను కోరింది. వీటిని వచ్చే నెల 12లోపు సమర్పించాలని పేర్కొంది. పలు రాష్ట్రాలు ప్రతిపాదనలు సమర్పించాయి. ప్రస్తుతం కిలోమీటరులోపు ప్రాథమిక పాఠశాల ఉండాలనే నిబంధన ఉంది. దీనిపై మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉంది.

రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదనలిలా..


- ఏకరూప దుస్తులకు ప్రస్తుతం కేటాయిస్తున్న రూ.400ను రూ.వెయ్యికి పెంచాలి. 8వ తరగతి వరకు ఇస్తున్న దుస్తులను పదో తరగతి వరకు ఇవ్వాలి.
- ప్రత్యేక అవసరాల పిల్లలకు ఏటా ఇస్తున్న రూ.3వేలను రూ.10వేలకు పెంపుచేయాలి.
- పూర్వప్రాథమిక విద్య(ప్రీప్రైమరీ)ను పాఠశాలల్లో ప్రవేశపెట్టాలి. వీరికి సైతం పుస్తకాలను అందచేయాలి.
- ప్రస్తుతం 10వ తరగతి వరకే విద్యార్థులకు పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి ప్లస్‌టు వరకు ఇవ్వాలి. ఆదర్శ పాఠశాలల్లో ప్లస్‌టూ ఉన్నందున వీరికి ఉచితంగా పుస్తకాలు అందించాలి.

సులభంగా తత్కాల్ పాస్‌పోర్టు

- స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే చాలు

ఈనాడు, హైదరాబాద్: 'ఇక తత్కాల్ పద్ధతిలో పాస్‌పోర్టును పొందడం సులభం. దరఖాస్తు ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారుడు స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే రెండు, మూడ్రోజుల్లో పాస్‌పోర్టును జారీ చేయనున్నారు. సాధారణ పద్ధతిలో పాస్‌పోర్టు జారీకి పదిరోజులు పడుతుంది. అత్యవసరంగా పాస్‌పోర్టు కావాల్సినవారు 'తత్కాల్'ను ఆశ్రయిస్తున్నారు. పాస్‌పోర్టు జారీ అంశంపై ఫిర్యాదులు అందుతుండటంతో విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ క్షేత్రస్థాయిలో అధ్యయనం జరిపి.. తత్కాల్ దరఖాస్తు ప్రక్రియలో మార్పులు చేసింది'. అని సికింద్రాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి(ఆర్పీవో) విష్ణువర్ధన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు.

ఏవైనా రెండు పత్రాలు



తత్కాల్ పాస్‌పోర్టుకు స్వీయ ధ్రువీకరణ పత్రం.. ఆధార్ సంఖ్య లేదా ఎన్‌రోల్‌మెంట్ నంబర్.. ఏవైనా రెండురకాల పత్రాలు(ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, విద్యార్థి ఫొటో ఐడీకార్డు, పాన్‌కార్డు, బ్యాంకు, పోస్టాఫీస్ పొదుపు ఖాతా పుస్తకం, పింఛన్ డాక్యుమెంట్) దరఖాస్తుదారుడు సమర్పించాలి. అన్నీ సక్రమంగా ఉంటే రెండు, మూడ్రోజుల్లో పాస్‌పోర్టును జారీ చేస్తారు. సాధారణంగా పోలీస్ పరిశీలన పూర్తయ్యాక సాధారణ పద్ధతిలో పాస్‌పోర్టును జారీ చేస్తారు. ఇందుకు 10 రోజులు పడుతుంది. తాజాగా విధారం ప్రకారం పోలీస్ పరిశీలనకు ముందే పాస్‌పోర్టు జారీచేస్తారు. తర్వాత తనిఖీ చేస్తారు. కేవలం నాలుగైదు రోజులు పడుతుంది. అదనపు తత్కాల్ ఛార్జీలను చెల్లించనవసరంలేదు. దరఖాస్తు చేసేటప్పుడు ఈ సర్వీసును ఎంచుకోవాలి. ఇలా అందరికీ అవకాశమివ్వరు.

గ్రీన్‌కార్డును బి1/బి2 వీసాకు మార్చుకోవచ్చా?



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

నర్సింగ్‌లో మా అబ్బాయి నాలుగేళ్ల గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. అమెరికాలో మాస్టర్స్ చేయాలనుకుంటున్నాడు. ఏతరహావీసాకు దరఖాస్తు చేయాలి? అందుకు అనుసరించాల్సిన విధానం ఏమిటి? - *జానకి రామారావు*

అమెరికాలో చదువుకునేందుకు అర్హులైన వారిని ప్రోత్సహిస్తాం. ఎంపిక ప్రక్రియ ఎలా?, విద్యా సంస్థల కార్యక్రమాలు, అర్హతలు తదితర సమాచారం కోసం https://educationusa.state.gov/ ను పరిశీలించండి. విశ్వవిద్యాలయంతో సంప్రదింపులు నిర్వహించి ప్రవేశానికి ఆమోదం పొందిన తరవాత ఏ తరహా వీసాకు దరఖాస్తు చేయాలి, ఇంటర్వ్యూకి ఏయే ధ్రువపత్రాలు అవసరమనే విషయంలో వర్సిటీయే సహాయం చేస్తుంది. అధిక సందర్భాల్లో ఎఫ్-1 వీసా సరైనది. ఇతర వీసాలు కూడా ఉంటాయి.

నాకు గ్రీన్‌కార్డు ఉంది. దాన్ని బి1/బి2 వీసాకు మార్చుకోవాలనుకుంటున్నాను ఎలా? - *అశోక్‌కుమార్ యాదవ్*

గ్రీన్‌కార్డు(లీగల్ పర్మినెంట్ రెసిడెంట్)ను బి1/బి2 వీసాకు మార్చుకోవటం సాధ్యం కాదు. మీరు బి1/బి2 వీసాకు మార్చుకోవాలనుకుంటే ముందుగా గ్రీన్‌కార్డును సరెండర్ చేయాలి. సరెండర్ దరఖాస్తు అందినట్లు ధ్రువపత్రాన్ని పొందిన తరవాతే బి1/బి2 వీసా కోసం దరఖాస్తు చేయాలి. www.uscis.gov/i-407 లో ఐ-407 దరఖాస్తు భర్తీ చేసి అందులో పేర్కొన్న చిరునామాకు పంపాలి. మరింత సమాచారం కోసం https://www.ustraveldocs.com/in ను చూడండి.

అమెరికా మీదుగా పోర్ట్‌ఆఫ్ స్పెయిన్ వెళ్తున్నాను. అమెరికా ట్రాన్సిట్ వీసా తీసుకుందామనుకుంటున్నా. ఆవీసాకు ఎంత వ్యవధిస్తారు. దానిపై విమానాశ్రయం నుంచి బయటకు వెళ్లవచ్చా? - *వీరేశం గాజుల*

అమెరికా మీదుగా మీరు ప్రయాణం చేయాలంటే మీకు బి1/బి2 పర్యాటక వీసా లేదా సీ-1 ట్రాన్సిట్ వీసా ఉండాలి. సీ-1 వీసాదారులకు దీర్ఘ కాలంపాటు అమెరికాలో ఉండకూడదని కొన్ని పరిమితులు, ఆంక్షలు ఉంటాయి. ఆయా వీసా దరఖాస్తులు, అర్హతలు తదితర సమాచారం కోసం https://www.ustraveldocs.com/in ను పరిశీలించండి.

హెచ్1బి వీసాపై అమెరికాలో పని చేస్తున్నాను. ఇటీవల సంతానం కలిగింది. చిన్నారికి పౌరసత్వానికి సంబంధించి ధ్రువపత్రాలు జారీ అయ్యాయి. త్వరలో నా ప్రాజెక్టు పూర్తి కానుంది. భారతదేశం వెళ్లమని యాజమాన్యం చెబుతోంది. మా చిన్నారి అమెరికా పౌరసత్వం ఉన్నందున డిపెండెంట్లుగా మేము ఇక్కడే ఉండవచ్చా? - *దుర్గాప్రసాద్ ఎ*

మీ చిన్నారి వయసు 21 సంవత్సరాలలోపు ఉండటంతో మీరు అమెరికా శాశ్వత పౌరులుగా ఉండేందుకు దరఖాస్తును స్పాన్సర్ చేసేందుకు అవకాశంఉండదు. మీ చిన్నారికి అమెరికా పౌరసత్వం ఉన్నప్పటికీ మీ హెచ్1బి వీసా కాలవ్యవధి తీరిన తరవాత మీరు అమెరికాలో ఉండేందుకు అర్హత కల్పించదు. తల్లిదండ్రులు అమెరికాలో శాశ్వత పౌరులుగా ఉండేందుకు పిల్లలు స్పాన్సర్ చేయడానికి సంబంధించిన సమాచారం కోసం www.uscis.gov/family/family-us-citizens/parrents/bringing-live-united-states-permnanet=residents పరిశీలించండి.

- వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.comకు ఈ-మెయిల్‌చేయండి.
- మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.gov ను సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.netకు పంపగలరు.

అవగాహన లేకే కుష్ఠు వ్యాప్తి!

- ప్రజల్లో మచ్చల పట్ల అపోహలు
- ఉచిత చికిత్సనూ సద్వినియోగం చేసుకోని తీరు
- రాష్ట్రవ్యాప్తంగా ఆరు జిల్లాల్లో నమోదవుతోన్న కేసులు
- వైద్య ఆరోగ్యశాఖ అధ్యయనం!

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఇంకా కుష్ఠువ్యాధి కేసులు బయటపడుతూనే ఉన్నాయి. 'మైకో బాక్టీరియం లెప్రే' అనే సూక్ష్మక్రిమి(బ్యాక్టీరియా) ద్వారా ఈ రోగం వ్యాపిస్తోంది. బహుళ ఔషధ చికిత్స(ఎండీటీ)తో దీన్ని పూర్తిగా నయంచేసేందుకు వీలున్నా ప్రజల్లో ఇంకా సదవగాహన కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. శరీరంపై మచ్చలున్నప్పుడు అవి దేనికి సంబంధించినవో తెలుసుకునేందుకు ముందుకు రావడం లేదు. నలుగురికీ తెలిస్తే ఏమవుతుందోనని జంకుతున్నారు. అంతేకాక.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, స్వచ్ఛంద సంస్థల కుష్ఠునివారణ కేంద్రాల్లో ఉచిత చికిత్స అందుబాటులో ఉంటున్నా సద్వినియోగం చేసుకోవడంలేదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. తాజాగా వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్రవ్యాప్తంగా చేసిన అధ్యయనంలో ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, నెల్లూరు, గుంటూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో కుష్ఠు బారినపడిన వారు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. కొన్నేళ్లతో పోలిస్తే రోగ బాధితుల సంఖ్య తగ్గినా ప్రజల్లో ఇంకా అవగాహన రాలేదన్న విషయం స్పష్టమవుతోంది.

జిల్లా పేరు	మండలాలు	గుర్తించిన కేసులు
శ్రీకాకుళం	20	11.76
విజయనగరం	23	13.83
నెల్లూరు	14	10.87
గుంటూరు	25	10.4
అనంతపురం	23	10.45
కర్నూలు	23	10.13

లక్షలో పది మంది!

పై ఆరు జిల్లాల్లో ప్రతి లక్ష మందిలో పది మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. 2015-16లో కొత్తగా 4,355 కుష్ఠు కేసులు(లక్ష మందికి 8.37) నమోదయ్యాయి. 2016-17లో ఈ సంఖ్య 4,228(8.1)కు పరిమితమైంది. కేవలం 0.27% కేసుల సంఖ్య తగ్గింది. 2010-11లో కొత్త కేసుల సంఖ్య 7,448. 2011-12లో ఈ సంఖ్య 7,820. 2014-15 సంవత్సరంలో 4,687 కొత్త కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్య క్రమేణ తగ్గుతూ వస్తోంది.

లక్షణాలివి..

- ★ శరీరంపై మచ్చలతోపాటు స్పర్శ తెలియకపోవటం (పెన్నుతో గుచ్చినా)
- ★ శరీరంలోని కణితులుండినొప్పి, బాధ ఉండటం
- ★ ముక్కు దిబ్బడ, రక్తస్రావం కనిస్తుండడం
- ★ కాళ్లు, చేతులు తిమ్మిర్లు వస్తుండడం
- ★ కనురెప్పలు, కనుబొమల నుంచి వెంట్రుకలు రాలుతుండడం

ఇది అపోహ..

- ★ తీవ్ర అస్వస్థతతో ఉన్నపుడు మినహా.. కరచాలనం చేయటం, కలిసి ఆడుకోవడం, ఒకే చోట పనిచేయడం వల్ల కుష్ఠువ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు.
- ★ వంశపారంపర్యంగా ఇది సంక్రమించదు.

వైద్యులను సంప్రదించాలి

కుష్ఠువ్యాధి లక్షణాలను గమనిస్తూ అప్రమత్తత పాటిస్తే దాన్ని అదుపుచేయటం సాధ్యమే. గతంలో ఈ రోగ పీడితులకు తీవ్రతను బట్టి సర్కారు ఒక మాత్ర మాత్రమే ఇస్తుండగా ప్రస్తుతం మూడింటిని ఉచితంగా అందజేస్తోంది. శరీరంపై ఐదులోపు మచ్చలుంటే ఆరు నెలలు, అంతకంటే ఎక్కువుంటే ఏడాదిపాటు ఈ మాత్రలను వాడాల్సి ఉంటుంది. వ్యాధి పట్ల అప్రమత్తంగా లేకుండా, వైద్యులను సంప్రదించకుండా ఉంటే రోగులు ఒక్కోసారి శాశ్వత అంగవైకల్యం బారినపడే ప్రమాదం ఉంది. అందుకనే.. కుష్ఠుపై అవగాహన పెంచటానికి ప్రభుత్వం ఈ నెల 30 మంగళవారం నుంచి వచ్చేనెల 13 వరకు 'స్పర్శ' పేరుతో గ్రామస్థాయిలో కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

డా॥రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కుష్ఠువ్యాధి నివారణ విభాగ పర్యవేక్షణ అధికారి

అదెట్టా?

వ్యాయామ చెమటకి వెల...



రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఎంతో ఆరోగ్యమని ఇంట్లో వాళ్లు, శ్రేయోభిలాషులు చెబుతూనే ఉంటారు. కానీ, నిత్యం వ్యాయామం చేస్తూ ఫిట్‌గా ఉంటే మార్కులేసి డబ్బులిస్తామని ఎవరైనా చెప్పారా? లండన్‌కి చెందిన ఓ అంకుర సంస్థ ఇదే చేస్తోంది. 'స్వెట్‌కాయిన్స్' పేరుతో యాప్‌ని రూపొందించి క్రమశిక్షణతో వ్యాయామం చేసి చెమట చిందించేవారికి పాయింట్స్ రూపంలో మార్కులేస్తూ డబ్బులిస్తోంది. బిట్‌కాయిన్స్ మాదిరిగా స్వెట్‌కాయిన్స్‌ని క్రియేట్ చేసి ఎకౌంట్‌లో జమ చేస్తోంది. వాటితో సంబంధిత స్టోరుల్లో ఫిట్‌నెస్ ఉత్పత్తుల్ని కొనుగోలు చేసేందుకు వాడొచ్చు. ఉదాహరణకు 550 స్వెట్‌కాయిన్స్ ఎకౌంట్‌లో జమ అయితే రూ.6,000 విలువైన ఫిట్‌నెస్ ట్రాకర్‌ని కొనుగోలు చేయవచ్చు. అంతేనా... కాయిన్స్‌ని భవిష్యత్తులో అక్కడి పౌండ్‌లతో మారకం చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తేనున్నారు. యాపిల్, ఆండ్రాయిడ్ యూజర్లు యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకుని నిబద్ధతతో నిత్య వ్యాయామానికి సిద్ధం కావాలి. యూజర్ల వ్యాయామ పద్ధతుల్ని ట్రాక్ చేసేందుకు యాప్‌లో బిల్ట్‌ఇన్ సాఫ్ట్‌వేర్ ఉంది. ప్రస్తుతానికి అమెరికా, బ్రిటన్, ఐర్లాండ్ దేశాల్లోనే ఇది అందుబాటులో ఉంది. త్వరలోనే మరిన్ని దేశాల్లో ప్రవేశపెట్టేందుకు రూపకర్తలు సిద్ధం అవుతున్నారు. ముందే నోటిఫికేషన్ ద్వారా తెలుసుకోవాలనుకుంటే 'స్వెట్‌కో.ఇన్' వెబ్‌సైట్‌లో మెయిల్ ఐడీతో రిజిస్టర్ అవ్వండి.




గ్యాడ్జెట్ గురూ

నాజూకు స్పీకర్



ఫోన్‌ని జేబులో పెట్టుకున్న మాదిరిగానే స్పీకర్‌ని పెట్టుకుని మ్యూజిక్ మస్తీ చేయాలంటే ఈ 'సూపర్ స్లిమ్ బ్లూటూత్ స్పీకర్-ఎస్‌టీ150 ఉంటే సరి. దీని బరువు ఎంతంటే 450 గ్రాములే. దుమ్ము చేరకుండా 'డస్ట్‌ప్రూఫ్', కిందపడినా పగలకుండా 'షాక్‌ప్రూఫ్' రక్షణ కవచాలతో తీర్చిదిద్దారు. 10 మీటర్ల దూరం వరకూ నాణ్యమైన 'బాస్' క్వాలిటీతో మ్యూజిక్ వినిపిస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 4 గంటల పాటు పని చేస్తుంది. బ్యాటరీ సామర్థ్యం 700ఎంఏహెచ్. ధర రూ.1,770.

ఎరుపెక్కిన వన్‌ప్లస్



ట్రెండీగా ఎరుపు రంగులో వన్‌ప్లస్ కొత్త మోడల్ దేశీయ మార్కెట్‌లో సందడి చేస్తోంది. మోడల్ పేరు '5టీ లావా రెడ్ ఎడిషన్'. ర్యామ్ 8జీబీ. స్టోరేజ్ సామర్థ్యం 120జీబీ. వెనక డ్యూయల్ (16 మెగాపిక్సల్, 20 మెగాపిక్సల్) కెమెరాలు ఉన్నాయి. ముందు భాగంలో 16 మెగాపిక్సల్ కెమెరా ఉంది. 4కే రిజల్యూషన్‌తో వీడియోలు తీయొచ్చు. ఆండ్రాయిడ్‌ని పోలి ఉండే ఆక్సిజన్ ఓఎస్‌తో పని చేస్తుంది. ధర రూ.37,999.


సైబర్‌క్రైమ్ పరిశోధనకు కోర్సులేవి?

● కానిస్టేబుల్ శిక్షణ తీసుకుంటున్నాను. సైబర్ క్రైమ్‌కి సంబంధించిన కోర్సు నేర్చుకోవాలనుకుంటున్నాను. ఎలాంటి కోర్సులు, ఏయే మాధ్యమాల ద్వారా చేయవచ్చో తెలుపగలరు?

– ఎల్లీశ్వరయ్య, కర్నూల్

మీరు ట్రైనింగ్‌లోనే ఉంటే ఆన్‌లైన్ కోర్సులు చేయడం ఉత్తమం. సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లో ప్రావీణ్యత సాధించాలంటే టెక్నాలజీపై పట్టుండాలి. హ్యాకర్లు ఎలా పని చేస్తారో తెలుసుకోవడం అనివార్యం. దీనికి రెండు రకాలుగా ప్రణాళిక వేసుకోవాలి. ఒకటి కంప్యూటర్ బేసిక్స్ నేర్చుకోవడం. రెండోది నిపుణులు అయ్యేందుకు ప్రత్యేక కోర్సులు చేయడం. ముందుగా మీకు 'కంప్యూటర్ బేసిక్స్'పై అవగాహన లేకుంటే ఉచిత ఆన్‌లైన్ కోర్సులు చేయవచ్చు. అందుకు కింది సైట్‌లను చూడండి.

ప్రశ్నజవాబులు



సీహెచ్ఏఎస్ మూర్తి
సీ-డాక్, జాయింట్ డైరెక్టర్

- https://goo.gl/JySJvx
- https://goo.gl/WvsdEL

ఫీజు చెల్లించైనా కోర్సులు చేయగలిగే వెసులుబాటు ఉంటే https:/ertification.comptia.orgertifications లింక్‌లోకి వెళ్లండి. మీకు బేసిక్స్ వచ్చుంటే సరాసరి సైబర్ క్రైమ్ కోర్సులు చేయవచ్చు. కింది వెబ్‌సైట్స్ నుంచి తగిన కోర్సుల్ని ఎంచుకుని సాధన చేస్తూ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లో ఎక్స్‌పర్ట్ అవ్వొచ్చు.

- https://goo.gl/mbJAG7
- https://goo.gl/Q9FX84
- https://goo.gl/9FJvQN
- https://goo.gl351mV

మరిన్ని ప్రశ్నజవాబులకు eenadu.net చూడండి.

టెక్నాలజీ వాడకంలో సందేహం ఏదైనా మాకు పంపండి. నిపుణులతో సూచనలు అందిస్తాం. మా ఈ-మెయిల్: its@eenadu.in

మీకు తెలుసా?

వీడియోల 'పార్టీ'

ఫేస్‌బుక్ వినూత్నంగా మరో ఆప్షన్‌ని పరిచయం చేసేందుకు సిద్ధం అవుతోంది. అదే 'వాచ్‌పార్టీ'. గ్రూపుల్లో పోస్ట్ చేసిన వీడియోపై లైవ్ వీడియోల్లో మాదిరిగా మిత్రులు స్పందించొచ్చు. నెట్‌వర్క్ సభ్యుల స్పందనల్ని వీడియో చూస్తున్నప్పుడే పక్కన చూడొచ్చు. ఛాట్ చేసిన మాదిరిగా వెంటనే మీరూ స్పందించొచ్చు. టెక్స్ట్ కామెంట్సే కాకుండా ఎమోజీలతోనూ నెట్‌వర్క్ సభ్యులు ప్రతిస్పందించొచ్చు. 'వాచ్ పార్టీ'లో పంచుకునే వీడియోలన్నీ గ్రూపు అడ్మిన్‌ల పర్యవేక్షణలోనే ఉంటాయి. ఈ వీడియో కమ్యూనిటీలో పబ్లిక్ వీడియోలనూ చూసే వెసులుబాటు ఉంది.



వంట చేస్తూ అంజలి ఫ్రిడ్జ్ డోర్ తీసింది... చూస్తే అల్లం లేదు. వెంటనే ఫ్రిడ్జ్‌కి చెప్పింది. అల్లం ఆర్డర్ చేయమని. చిటికెలో అల్లం కిరాణా సంరకుల జాబితాలో జత అయ్యింది.

రవికి కాఫీతోనే రోజు ప్రారంభం. ఇంట్లో అమ్మ లేదు. ఎలా? గదిలో స్మార్ట్ కాఫీ మేకర్‌కి చెప్పాడు. 'వన్ బ్లాక్ కాఫీ' అని! అంతే... క్షణాల్లో వేడి వేడి కాఫీ సిద్ధం!

అలసి ఇంటికొచ్చిన కళ్యాణ్ సోఫాలో చతికిలబడ్డాడు. లేచే ఓపిక లేదు. అయితేనేం.. 'లైట్స్ ఆన్' అంటే హాలులో లైటు వెలిగింది. 'ప్లే మై ఫేవరేట్ సాంగ్స్' అనగానే హోం థియేటర్‌లో పాటలు... స్నానానికి వేడి నీళ్లకి 'గీజర్ ఆన్' అనగానే అదీ ఆన్ అయ్యింది. ప్రశాంతంగా కాసేపు కూర్చుని సేద తీరాడు.

పరికరాల్ని పలకరిస్తూ మాట్లాడేంతలా సాంకేతికత చిత్రంగా మారుతోంది!!
టెక్స్ట్ కమాండ్స్... క్లిక్ చేయడాలు... తెరలపై తాకడాలు...
అన్నీ దాటుకుని ఇప్పుడు మాటలే ఇన్‌పుట్స్‌గా మారిపోతున్నాయి...
టచ్‌తో పెద్దగా 'టచ్'లో లేకపోయినా ఫర్వాలేదు!
టెక్నాలజీ తలుపు తెరిచి వెబ్ విహారం చేయవచ్చు.
అందుకు తగిన సాంకేతిక సందడి రోజు రోజుకీ పెరుగుతోంది!
స్మార్ట్ స్పీకర్ అసిస్టెంట్‌లు దైనందిన జీవితంలో కలిసిపోతున్నాయి!

మాటే మంత్రము!





ఫ్రిడ్జ్‌లు మాట్లాడుతున్నాయ్

ఇంటిల్లిపాది వాడే ఫ్రిడ్జ్‌ని స్మార్ట్‌గా మార్చేస్తూ శామ్‌సంగ్ కంపెనీ 'ఫ్యామిలీ హబ్ 3.0' మోడల్‌ని ప్రపంచానికి పరిచయం చేసింది. దీంట్లో కూరగాయలు, పళ్లు, ఇతర ఆహార పదార్థాల్ని స్మార్ట్‌గా భద్రం చేయడంతో పాటు ఫ్రిడ్జ్‌తో మాట్లాడొచ్చు. అందుకు 'బిక్స్‌బీ' వాయిస్ అసిస్టెంట్ సాయం తీసుకోవచ్చు. ఫ్రిడ్జ్ డోరు తీసి 'బేబీ... బిక్స్‌బీ!!' అని పిలిస్తే చాలు. పలుకుతుంది. నిండుకున్న కూరగాయలు, పళ్లు, పాలు... అన్ని ఆర్డర్ చేస్తే చాలు. షాపింగ్ కార్టులో జత అవుతాయి. ఆహార ఉత్పత్తుల్లో ఏమేం పాడయ్యేలా ఉన్నాయో అడిగితే చెబుతుంది. తలుపుపై ఏర్పాటు చేసిన తాకేతెరని ఇంటర్ఫేస్‌గా వాడుకోవచ్చు. వంట చేస్తూ బోర్ అనిపిస్తే పాటల్ని ప్లే చేయమంటే చేస్తుంది. తలుపు తెరవకుండానే ఏమేం నిండుకున్నాయో చెబుతుంది. కావాలంటే స్మార్ట్‌ఫోన్‌తో ఫ్రిడ్జ్‌లో ఉన్నవాటిని లైవ్‌లో చూడొచ్చు కూడా. కుటుంబ సభ్యుల గొంతుల్ని గుర్తుపట్టి స్పందించడం మరో ప్రత్యేకత. కంపెనీ కొత్తగా పరిచయం చేయనున్న శామ్‌సంగ్ 4కే టీవీల్లోనూ వాయిస్ అసిస్టెంట్ బిక్స్‌బీని పరిచయం చేయనుంది. రిమోట్‌తో పని లేకుండా టీవీతో సంభాషించొచ్చు. ఎల్‌జీ కంపెనీ కూడా 'స్మార్ట్ ఇన్‌స్టావ్యూ' ఫ్రిడ్జ్‌ని అందుబాటులోకి తేనుంది. అమెజాన్ అలెక్సాని నిక్షిప్తం చేసుకుని 29 అంగుళాల తాకేతెరతో సిద్ధం అయింది. అడిగితే కృత్రిమ మేధస్సుని వాడుకుని ఫ్రిడ్జ్‌లో ఉన్న వాటితో ఏమేం వంటకాలు చేసుకోవచ్చో చెబుతుంది.

'చిత్తం!' అంటున్న బుల్లి యాపిల్

అలెక్సా, గూగుల్ అసిస్టెంట్‌లకు పోటీగా ఈ ఏడాదిలో యాపిల్ తనదైన శైలిలో స్మార్ట్ సేవకుడిని పరిచయం చేయనుంది. 'కటౌట్‌లో ఏముందీ డూడ్స్!!' అంటూ బుల్లి హోం పాడ్ ఇంటిల్లిపాది గొంతుల్ని గుర్తిస్తూ అడిగినవన్నీ చేసిపెడుతుంది. అడిగితే తనలో భద్రం చేసుకున్న 45 మిలియన్ల పాటల్లో ఏదైనా క్షణాల్లో ప్లే చేస్తుంది. అంతేనా... వార్తల్లో ముఖ్యాంశాలు చెబుతుంది. ట్రాఫిక్ అప్‌డేట్స్‌ని అందిస్తుంది. క్రికెట్, టెన్నిస్, హాకీ... స్పోర్ట్ ఏదైనా స్కోర్ ఎంతా? అని కోరితే చాలు. స్కోర్ చెప్పి, కామెంట్రీని వినిపిస్తుంది. ప్రయాణానికి ముందు వెళ్తున్న చోట వాతావరణ పరిస్థితులేంటో చెబుతుంది. ఇంకా చెప్పాలంటే... నెట్టింటితో అనుసంధానమై పని చేసే అన్ని పరికరాలతో జట్టుకట్టి పని చేస్తుంది. ఉదాహరణకు ఇల్లంతా స్మార్ట్ విద్యుత్ వ్యవస్థతో బల్బ్‌లను పెట్టుకుంటే వాటిని హోం పాడ్‌కి అనుసంధానం చేసి నియంత్రించొచ్చు. పడుకుని 'లైట్స్ ఆఫ్' అంటే చాలు. ఇంట్లో లైట్స్ అన్నింటినీ ఆఫ్ చేసి బెడ్ బల్బ్‌ని ఆన్ చేస్తుందన్నమాట. ఫోన్‌కి కాల్ వస్తే ఎక్కడుందో వెతుక్కునే పని లేకుండా పాడ్ నుంచి మాట్లాడొచ్చు. మెసేజ్‌లు పంపొచ్చు. సోషల్ మీడియాలో స్టేటస్‌లను అప్‌డేట్ చేయవచ్చు. ఆన్‌లైన్ అంగళ్లు ఏవైనా పాడ్‌కి చెబితే ఆయా షాపింగ్ కార్టుల్లోకి సరకులు జత అవుతాయి.




ష్... గోడలు వింటాయ్



ఏదైనా మాట్లాడుతూ 'ష్... గోడలకు చెవులుంటాయ్!!' అని సరదాకి అంటుంటాం. దీన్ని నిజం చేస్తూ గోడకున్న స్మార్ట్ స్విచ్‌లకు చెవులు వస్తున్నాయ్. మీరేం చెబుతారా? అని చెవులు రిక్కించి చూస్తాయి. కావాలంటే ఐడివైజెస్ సంస్థ రూపొందించిన ఈ 'ఇన్‌స్టింక్ట్ లైట్' స్విచ్‌ని చూడండి. అమెజాన్ అలెక్సాని దీంట్లో నిక్షిప్తం చేశారు. ఇంట్లోకి రాగానే మీ రాకని గుర్తించడమే కాదు. మీ వాయిస్‌ని గుర్తించి 'ఆజ్ఞాపించండి' అంటూ సేవకి సిద్ధంగా ఉంటుంది. ఇంట్లో మొత్తం విద్యుత్ వ్యవస్థని నియంత్రిస్తుంది. అడిగితే ఇష్టమైన పాటల్ని హోం థియేటర్‌లో ప్లే చేస్తుంది. సెన్సర్ల సాయంతో మీరు బయటికి వెళ్లగానే లైట్స్‌ని ఆఫ్ చేస్తుంది. ఇతరులు ఎవరైనా ఇంట్లోకి ప్రవేశిస్తే గుర్తించి వెంటనే ఫోన్‌కి ఎలర్ట్ మేసేజ్ పంపుతుంది. ఐడివైజెస్ తీర్చిదిద్దిన ఇతర స్మార్ట్ పరికరాలతో జతకట్టి పని చేస్తుంది. 'ఐడివైజెస్ కనెక్టెడ్ యాప్'తో కావాల్సిన మార్పులు చేసుకోవచ్చు.


అద్దంలో అలెక్సా అమ్మడు

అద్దం ముందు నిలబడి షేవింగ్ చేసుకునేటప్పుడో... మేకప్ వేసుకొనేటప్పుడో వెలుతురు చాలక ఇబ్బంది పడక్కర్లేదు. 'కొహెల్లర్ వెర్డెరా వాయిస్ లైట్' అద్దంతో దాగున్న అలెక్సాని ఆప్యాయంగా పలిచి 'లైట్స్ ఆన్' అంటే అద్దానికి ఇరువైపులా ఉన్న లైట్లు వెలుగుతాయి. షేవింగ్ చేసుకుంటూనే వార్తా విశేషాలేంటో అడిగి వినొచ్చు. 'కొహెల్లర్ కనెక్ట్' టెక్నాలజీతో ఇతర స్మార్ట్ ఫోన్ పరికరాల్ని వాయిస్ కమాండ్స్‌తోనే మేనేజ్ చేయవచ్చు. గీజర్ ఆన్ చేయమని కోరితే చేస్తుంది. షవర్ కింద నిలబడి పిలిస్తే చాలు. వర్షపు జల్లు మొదలవుతుంది. చాలని చెబితే ఆగిపోతుంది. గది నుంచి బయటికి వస్తూ 'లైట్స్ఆఫ్' అంటే అన్ని స్విచ్ ఆఫ్ అవుతాయి.



● ఫోన్‌తో 'ఒకే గూగుల్' అన్నట్టుగా ఇక మీదట కారు డ్యాష్‌బోర్డ్‌లతోనూ 'ఒకే గూగుల్' చెప్పొచ్చు. ఎందుకంటే ఆండ్రాయిడ్ ఆటో ఓఎస్‌తో గూగుల్ అసిస్టెంట్ జత అవుతోంది. దీంతో డ్రైవింగ్‌పై ధ్యాస పెట్టి కారుతో మాట్లాడుతూ అన్ని కంట్రోల్ చేయవచ్చు. వెళ్లే దారిలో కావాల్సిన సమాచారాన్ని సేకరించొచ్చు.

● ఇప్పటి వరకూ పాటలు వినిపించిన హెడ్‌ఫోన్లు ఇక మీదట మాటలు వినేందుకు సిద్ధం అవుతున్నాయి. చెబితే ఇష్టమైన పాటని ఇట్టే ప్లే చేస్తాయి. పలు భాషల్ని వింటూ అనువదించి వినిపిస్తాయి. అడిగిందే తడవుగా నెట్టింటి సమాచారాన్ని వెతికి వినిపిస్తుంది. సోనీ, జేబీఎల్... లాంటి ఇతర హెడ్‌ఫోన్ తయారీ కంపెనీలు వాయిస్ అసిస్టెంట్‌లతో కొత్తగా ముస్తాబవుతున్నాయి.



● తాకేతెరలు, కెమెరాలతో వాయిస్ అసిస్టెంట్‌లు వినూత్నంగా ముందుకొస్తున్నాయి. కేవలం మాటల్నే కాకుండా తాకేతెరతో ఆకట్టుకుంటున్నాయి. అమెజాన్ షో, స్పాట్‌లతో పాటు ఈ ఏడాది కొత్తగా గూగుల్ అసిస్టెంట్‌లు తాకేతెరతో టెక్ ప్రియుల్ని అలరించనున్నాయి. లెనోవో 'స్మార్ట్ డిస్‌ప్లే'తో 8, 10 అంగుళాల తాకేతెరలతో గూగుల్ అసిస్టెంట్ సిద్ధం చేస్తోంది. ఎల్‌జీ 'డబ్ల్యుకే9' పేరుతో మరోటి మార్కెట్‌లో ప్రవేశపెట్టనుంది.

నిజం...గా! ఇవన్నీ అందరికీ అందుబాటులోకి రావడానికి ఎంతో సమయం పట్టేలా లేదు. మార్కెట్‌లోకి వస్తున్న స్మార్ట్ స్పీకర్లే అందుకు సాక్ష్యం. గత ఏడాది అమెజాన్, గూగుల్ సంస్థలో మొదలైన డిజిటల్ అసిస్టెంట్‌ల హవా గత నెల్లో అమెరికాలో జరిగిన 'సీఈఎస్' షోతో మరింత పెరిగింది. పలు అంతర్జాతీయ కంపెనీలు భిన్నమైన నమూన పరికరాలతో పలకరించేందుకు సిద్ధం అవుతున్నాయి. అమెజాన్ అలెక్సా, ఓకే గూగుల్, యాపిల్ సిరి, మైక్రోసాఫ్ట్ కార్టానా, శామ్‌సంగ్ బిక్స్‌బీ... లాంటి స్పీకర్ అసిస్టెంట్‌లు పరికరాల్లో నిక్షిప్తమై వాటిని మరింత స్మార్ట్‌గా మార్చేస్తున్నాయి. ఫ్రిడ్జ్, వాషింగ్ మెషిన్, గీజర్, లైట్లు, హోం థియేటర్... ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్ని నెట్టింటికి అనుసంధానం చేసి స్పీకర్ అసిస్టెంట్‌లు స్మార్ట్‌గా మార్చేస్తున్నాయి. ఈ తరహా స్మార్ట్ గృహోపకరణాలు ఈ ఏడాది మార్కెట్‌లో సందడి చేసేందుకు సిద్ధం అవుతున్నాయి.



ఏక్ స్పెషల్ 'కాఫీ!'

జాగింగ్‌కి వెళ్లేప్పుడు మణికట్టుకి ఫిట్‌నెస్ బ్యాండ్. చేతిలో స్మార్ట్ వాచ్. ఇంటికి రాగానే చేసిన వ్యాయామం... ఖర్చయిన కేలరీలు అన్ని చెక్ చేసుకోవడం.. అన్నింటికీ స్మార్ట్ గ్యాడ్జెట్‌లే. మరి, జాగింగ్ తర్వాత తగిన పాళ్లలో తయారు చేసిన కాఫీ వేడి వేడిగా తాగుదాం అనుకుంటే? 'స్మార్టర్ కాఫీ' మెషిన్‌కి చెబితే చాలు. మీ స్వరాన్ని గుర్తించి మీరు కోరుకునే కాఫీని క్షణాల్లో తయారు చేసి అందిస్తుంది. వై-ఫై నెట్‌వర్క్‌ని వాడుకుని స్మార్ట్‌ఫోన్, ఫిట్‌నెస్ బ్యాండ్‌లు, వాయిస్ అసిస్టెంట్‌లతో జతకట్టి పని చేస్తుంది. ఉదాహరణకు ఇంట్లో అలెక్సా అసిస్టెంట్ ఉంటే. ఉన్నచోటునే కూర్చుని అలెక్సాకి ఆర్డర్ చేస్తే స్మార్టర్ కాఫీ మెషిన్‌లో ఎంచుకున్న పాళ్లలో కాఫీ సిద్ధం అవుతుంది. మరో ప్రత్యేకతేంటంటే... ఎలాంటి కమాండ్స్‌ని అందించకుండానే కాఫీ మెషిన్‌ని 'జీయో-కాచింగ్'తో మీ ఫాలోవర్‌గా మార్చేయవచ్చు. అంటే.. ఉదయం మీరు జాగింగ్ ముగించుకుని ఇంటికి చేరగానే మీ రాకని గుర్తించి కాఫీ సిద్ధం చేసేస్తుంది.

'యాప్'రే!

దేశం చాలా 'యాపీ'

ఖాళీ దొరికితే తాకేతెరపై తేలాడే యాప్‌లపైనే వాలిపోతున్నారట మన భారతీయులు. ఎలాగంటారా? అమెరికాకి చెందిన 'యాప్ అన్నే' సంస్థ నివేదికలో ఇదే తేలింది. అవసరం ఏదైనా యాప్‌ల వైపే మొగ్గు చూపుతూ డౌన్‌లోడ్స్‌లో అమెరికాని వెనక్కి నెట్టేసి ప్రపంచంలోనే రెండో స్థానానికి చేరింది. ఆండ్రాయిడ్, యాపిల్, ఇతర థర్డ్‌పార్టీ యాప్ స్టోర్‌ల నుంచి తీసుకున్న డేటా ఆధారంగా చేసిన సర్వేలో దేశంలో మొబైల్ అప్లికేషన్ల వినియోగం మరింత పెరిగిందట. ఎంతంటే... గతంతో పోల్చితే 215 శాతం పెరిగింది. దీనికి భిన్నంగా అమెరికాలో యాప్‌ల వాడకం 5 శాతం తగ్గింది.

● స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేస్తున్న యాప్‌లు సగటున 80 అయితే... వాటిలో ఎక్కువగా ఓ 40 యాప్‌లను విస్తృతంగా వాడుతూ మార్పులు చేస్తున్నారు.

● గత రెండేళ్లుగా యాప్‌ల పెరుగుదల
భారత్: 215% చైనా: 125% అమెరికా: - 5%

● సోషల్ మీడియా యాప్‌ల్లో గడిపిన మొత్తం గంటలు 71 బిలియన్లు అయితే దీంట్లో 50 శాతం వాట్సాప్‌కే కేటాయించారట.



ఆకట్టుకుంటున్న మొదటి పది...

యాప్‌లు	గేమ్‌లు
వాట్సాప్ మెసెంజర్	క్లాష్ ఆఫ్ క్లాన్స్
ఫేస్‌బుక్	క్యాండీ క్రష్ సాగా
ఫేస్‌బుక్ మెసెంజర్	డూడిల్ ఆర్మీ2
ట్రూకాలర్	లుడు కింగ్
షేర్‌ఇట్	8 బాల్ పూల్
ఎక్స్‌ప్లేయర్	సబ్‌వే సర్ఫర్స్
యూసీ బ్రౌజర్	వరల్డ్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ 2
అమెజాన్	టెంపుల్ రన్ 2
పేటీఎం	క్లాస్ రాయల్
ఇన్‌స్టాగ్రామ్	క్యాండీ క్రష్ సోడా

ఈనాడు సినిమా


కాజల్

ప్రేమలేఖలు చూసి భయపడ్డా!

వర్షం వస్తే చినుకులు, వయసొస్తే ప్రేమ లేఖలు మామూలే! ప్రేమలేఖ రాయని, అందుకోని యవ్వనం భారంగానే సాగుతుంది. కంప్యూటర్ రోజుల్లో రాసేంత తీరిక ఎక్కడ ఉంటుంది? అనుకోవద్దు. కథానాయికలకు ఇప్పటికీ ప్రేమలేఖలు అందుతూనే ఉన్నాయి. కాజల్ మాటలే ఇందుకు సాక్ష్యం. "కాలేజీ రోజుల్లో కంటే, కథానాయిక అయిన తరవాతే ఎక్కువ ప్రేమలేఖలు అందుకున్నా. ప్రతీ లేఖనీ నేను చదువుతా. వాటిలో పిచ్చి కంటే ప్రేమే ఎక్కువగా కనిపిస్తుంది. నాపై అభిమానాన్ని అక్షరాల్లో కురిపిస్తుంటారు. అయితే కొన్ని లేఖలు చూసి భయపడిపోయేదాన్ని. ఎందుకంటే అవన్నీ రక్తంతో రాసినవి. ఇలాంటి ప్రయత్నాల్ని నేనే కాదు, ఎవ్వరూ హర్షించరు. ప్రేమని ప్రకటించడానికి మార్గాలెన్నో ఉన్నాయి. ఈ రూపంలో మాత్రం కంగారు పెట్టొద్దు" అంటోంది కాటుక కళ్ల చిన్నది కాజల్.

రవితేజ అంటేనే ఉరిమే ఉత్సాహం. సినిమా ఏదైనా, పాత్ర ఎలాంటిదైనా... తన జోరునీ జోష్‌నీ చూపిస్తాడు. అదే అతనికి అభిమానుల్ని సంపాదించిపెట్టింది. 'రాజా ది గ్రేట్'తో గతేడాది ఓ మంచి విజయాన్ని అందుకున్న రవితేజ ఇప్పుడు.. 'టచ్ చేసి చూడు' అంటూ ప్రేక్షకుల్ని పలకరించబోతున్నాడు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం రవితేజ హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు.



కొత్తదనం కోసం ప్రయత్నిస్తే ఫలితాల్లో తేడా వస్తోంది!

మరోసారి పోలీస్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ పోలీస్ ఏం చేస్తాడు?

'విక్రమార్కుడు', 'పవర్' చిత్రాల్లో పోలీస్ ఆఫీసర్‌గా కనిపించా. 'విక్రమార్కుడు'లో సీరియస్‌గా సాగే పాత్ర. 'పవర్'లో వినోదం ఉంటుంది. అవి రెండూ కలగలిపిన కథానాయకుడు 'టచ్ చేసి చూడు'లో కనిపిస్తాడు. తనకి వృత్తి అంటే ఇష్టం.. కుటుంబం అంటే ప్రాణం. ఆ రెండింటినీ ఎలా సమన్వయ పరచుకున్నాడో సినిమా చూస్తే తెలుస్తుంది.

దర్శకుడు విక్రమ్ సిరికొండకు ఇదే తొలి చిత్రం.. ఈ కథని ఎలా నడిపించగలిగాడు?

విక్రమ్ దర్శకత్వ శాఖ నుంచి వచ్చిన వాడే. ఆ మధ్య ఓ కథ చెప్పాడు. 'ఓకే' చేశా. ఈలోగా వక్కంతం వంశీ ఓ కథ తీసుకురావడం, దాన్ని విక్రమ్ బాగా డీల్ చేస్తాడని అనిపించడంతో.. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది. విక్రమ్‌కి ఇది తొలి చిత్రమే. కానీ అనుభవజ్ఞుడిలా తెరకెక్కించాడు.

పోలీస్ పాత్ర అనగానే విక్రమార్కుడుతో పోలుస్తారేమో?

విక్రమార్కుడుతో పోలిక వద్దు. అది అదే.. ఇది ఇదే. 'టచ్ చేసి చూడు' ఎవ్వరినీ నిరుత్సాహపరచదు. నా పాత్రే కాదు, ప్రతీ పాత్రనీ బలంగా తీర్చిదిద్దారు. రాశీఖన్నా, సీరత్‌కీ మంచి పాత్రలు దక్కాయి. సంగీత దర్శకుడు శశిప్రీతమ్ జామ్ 8 అనే కంపెనీ పెట్టారు. అందులోంచి పాటల్ని తీసుకున్నాం. ఆ సౌండింగ్ చాలా కొత్తగా ఉంది. మణిశర్మ అందించిన నేపథ్య సంగీతం కూడా ఆకట్టుకుంటుంది.

రవితేజ అంటే వినోదం.. దాన్ని దాటి బయటకు రాలేకపోతున్నారా?

కొత్తదనం కోసం ప్రయోగాలు చేస్తే.. సినిమాలు పోతున్నాయండీ.. (నవ్వుతూ). ఆటోగ్రాఫ్, నేనింతే, శంభో శివశంభో.. లాంటి మంచి సినిమాలు చేశా. కానీ ఏమైంది? అయితే ఇప్పుడు ప్రేక్షకులు బాగా మారారు. కొత్త ప్రయత్నాల్ని ఆదరిస్తున్నారు. 'ఆటోగ్రాఫ్' లాంటి సినిమా ఇప్పుడు చేస్తే తప్పకుండా మంచి ఫలితం వస్తుందనిపిస్తోంది.

అంటే.. మళ్లీ ప్రయోగాలకు సిద్ధమేనా?

తప్పకుండా చేస్తా. కొన్ని కథలు విన్నా. భవిష్యత్తులో నా నుంచి ఆ తరహా సినిమాలు ఆశించొచ్చు.

ఈమధ్య తెలుగు సినిమా మార్కెట్లో గణనీయమైన మార్పులొచ్చాయి, ఇతర భాషలపై దృష్టి పెట్టే అవకాశం ఉందా?

అవును. అదంతా రాజమౌళి వల్లే. అవకాశం వస్తే తప్పకుండా హిందీ సీమకు వెళ్తా. నాకు హిందీ కూడా వచ్చు. 'రాజా ది గ్రేట్' షూటింగ్ కోసం డార్జిలింగ్ వెళ్లా. రోడ్డుపై షూటింగ్ చేస్తుంటే నన్ను చూసి అక్కడివాళ్లంతా అరిచేవారు. విషయమేంటంటే టీవీల్లో హిందీ డబ్బింగ్ సినిమాలు చూడడం వల్ల... వాళ్ల హీరోలుగా మారిపోయాం. అందుకే మనల్ని గుర్తు పడుతున్నారు.

'రాజా ది గ్రేట్'కి ముందు యేడాది విరామం తీసుకున్నారు. ఆ సమయంలో ఏం చేశారు?

విరామం తీసుకోలేదు. వచ్చింది. దానికి కారణం సరైన కథలు దొరక్కపోవడమే. ఆ సమయాన్ని నా కుటుంబానికి కేటాయించా. కొన్ని దేశాలు చుట్టి వచ్చాను. ఇప్పుడు మంచి కథలు కుదురుతున్నాయి. అందుకే వరుసగా సినిమాలు చేస్తున్నా.

శ్రీనువైట్లతో ఓ సినిమా ఒప్పుకున్నారు. స్నేహితుడు కదా అని అవకాశం ఇచ్చారా?

ఇక్కడ ఎవరి కోసం ఎవరూ సినిమాలు చేయరు. కథ నచ్చి అన్నీ కుదిరితేనే సినిమాలు చేస్తారు. నేనూ అంతే.

నవతరం దర్శకుల్ని చూస్తే ఏమనిపిస్తోంది?

చాలా మంచి కథలతో వస్తున్నారు. వాళ్ల దగ్గర ఉత్సాహం కనిపిస్తోంది. రాబోయే మూడు నాలుగేళ్లలో మరిన్ని మార్పులు చూస్తారు.


అశోక్, ప్రమోద్, వంశీ, అనుష్క, విక్కీ, తమన్

'భాగమతి' విజయోత్సాహం

అనుష్క ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'భాగమతి'. అశోక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని యువీ క్రియేషన్స్ సంస్థ నిర్మించింది. 'భాగమతి'కి వస్తున్న స్పందన పట్ల చిత్రబృందం సంతోషం వ్యక్తం చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించింది. అనుష్క, దిల్‌రాజులతో పాటు చిత్రబృందం ఈ వేడుకలో పాలుపంచుకుంది. తాము పెంచుకున్న నమ్మకాన్ని ప్రేక్షకులు నిలబెట్టారని, ఈ విజయం ఉత్సాహాన్ని నింపిందని చిత్రబృందం తెలిపింది. ఈ కార్యక్రమంలో నిర్మాతలు వంశీ, ప్రమోద్, సంగీత దర్శకుడు తమన్, కళాదర్శకుడు రవీందర్, విక్కీ, ఛాయాగ్రహకుడు మది తదితరులు పాల్గొన్నారు.

ఎవడు కొడితే దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అవుతుందో... ఆడే పండుగాడు!
చిత్రం: పోకిరి
- పంపినవారు: సదాశివ బీర్నెలి, హైదరాబాద్

వరుణ్.. మురిసెన్

బాలీవుడ్‌లో వరుస విజయాలతో జోరు మీదున్న కథానాయకుడు వరుణ్ ధావన్. ఎంతో మంది అగ్ర నటుల ప్రతిమల సరసన మేడమ్ టుసాడ్స్‌లో వరుణ్ మైనపు ప్రతిమ కొలువుతీరింది. తన మైనపు బొమ్మతో కలిసి ఓ ఫొటో తీసుకొని మురిసిపోయాడు వరుణ్. ఆ ఆనందాన్ని ఇదిగో ఇలా ట్విట్టర్‌లో పంచుకొన్నాడు వరుణ్.



సొంత భాషలో పనిచేసినట్టే ఉంది!



"తెలుగులో చేసిన తొలి సినిమాలోనే సొంత గొంతు వినిపించే అదృష్టం దక్కినందుకు ఆనందంగా ఉంది"ని చెప్పుకొచ్చింది రష్మిక మండన్న. కన్నడలో చేసిన 'కిరిక్ పార్టీ' చిత్రంతో అక్కడ స్టార్ హోదా సొంతం తెచ్చుకొన్న కథానాయిక ఈమె. 'ఛలో'తో తెలుగు పరిశ్రమలోకి అడుగుపెట్టింది. నాగశౌర్య కథానాయకుడుగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందిన ఆ చిత్రం ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో రష్మిక మండన్న విలేకర్లతో మాట్లాడింది. ఆ విషయాలివీ...

"కన్నడ అమ్మాయిని నేను. అక్కడ చేసిన తొలి చిత్రం 'కిరిక్ పార్టీ'తో మంచి పేరొచ్చింది. ఆ సినిమా చూసే 'ఛలో' దర్శకనిర్మాతలు నన్ను ఎంపిక చేశారు. ఇందులో కూడా కాలేజీ అమ్మాయి పాత్రే నాది. కానీ భిన్నంగా ఉంటుంది. ప్రేమ, భావోద్వేగాలు కలగలిసిన సంక్లిష్టమైన పాత్ర. నా గొంతు విని 'బాగుంది, నువ్వే డబ్బింగ్ చెప్పు' అని దర్శకుడు ప్రోత్సహించారు. చిత్రబృందంతో ఉన్న అనుబంధం వల్ల సొంత భాషలో పనిచేసినట్లే అనిపించింది. నాగశౌర్యతో కలిసిపోయి నటించా. తన నృత్యాలు చాలా బాగుంటాయి. స్వరసాగర్ మహతి పాటలు నాకెంతో ఇష్టం. 'చూసీ.. చూడంగానే' పాట చిత్రీకరణప్పుడే ప్రేక్షకాదరణ పొందుతుందని చెప్పా".

- "తెలుగులో రెండో సినిమా కూడా చేస్తున్నా. విజయ్ దేవరకొండ కథానాయకుడుగా పరశురామ్ దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ నిర్మిస్తున్న చిత్రమది. అందులో ఆత్మవిశ్వాసంతో నడిచే అమ్మాయి పాత్రని పోషిస్తున్నా. సినిమా సినిమాకీ వ్యత్యాసమున్న పాత్రల్నే ఎంచుకొంటున్నా. గ్లామర్‌గా కనిపించడం ఇష్టమే కానీ... ఆ పాత్రలు కూడా హుందాగా, అసభ్యతకి ఆస్కారం లేకుండా ఉండాలి. భవిష్యత్తులో చరిత్ర ఆధారంగా తెరకెక్కే చిత్రాల్లోనూ, క్రీడల నేపథ్యంలో సాగే చిత్రాల్లోనూ నటించాలని ఉంది. నటనలో నాకు అనుష్క స్ఫూర్తి".
- "డిగ్రీ చదువుతున్నప్పుడే నటనలోకి ప్రవేశించా. దక్షిణాది చిత్రాల్లోనే నా ప్రతిభని చాటుతూ మంచి కథానాయికగా గుర్తింపు తెచ్చుకొంటే చాలు. ఒక్క క్షణం కూడా ఖాళీగా ఉండలేను. 'కిరిక్ పార్టీ'లో నాతో కలిసి నటించిన రక్షిత్ శెట్టి కూడా అంతే. తను నటుడే కాదు, రచయిత, దర్శకుడు కూడా. రక్షిత్ శెట్టితో 'కిరిక్ పార్టీ' సమయంలో స్నేహం ఏర్పడింది. మా భావాలు, ఆలోచనలు కలిశాయి. దాంతో మా మధ్య అనుబంధం ఏర్పడింది. ఇద్దరూ ఒకే రంగంలో ఉన్నవాళ్లం కాబట్టి, జీవితంలోనూ కలిసి ప్రయాణం చేయాలని నిర్ణయించుకొన్నాం. మా అనుబంధం విషయాన్ని పెద్దలతోనూ పంచుకున్నాం. వాళ్లూ అంగీకరించారు. రాబోయే రెండేళ్లల్లో మేం పెళ్లి చేసుకుంటాం"

వింత జీవితో మూగ ప్రేమ

ఓ మూగ అమ్మాయి... నీటిలోనూ నేలపైనా నివసించగలిగే ఓ వింత రూపమున్న జీవి... ఈ ఇద్దరూ ప్రేమలో పడితే!

వినడానికే ఆసక్తికరంగా ఉంది కదూ. ఈ ఏడాది ఆస్కార్ బరిలో హాట్ ఫేవరెట్‌గా నిలిచిన 'షేప్ ఆఫ్ వాటర్' కథాంశం ఇదే.

ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటి, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ సహాయ నటి సహా 13 విభాగాల్లో నామినేషన్లు దక్కించుకుందీ చిత్రం. ఈ ఏడాది అత్యధిక నామినేషన్లు అందుకున్న చిత్రమిదే కావడం గమనార్హం. గుల్లెర్మో డెల్ టోరో దర్శకత్వంలో సాలీ హాకిన్స్, మైఖేల్ షన్నన్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన 'షేప్ ఆఫ్ వాటర్' విశేషాలివీ.



ఆస్కార్ బరి

గతేడాది డిసెంబరులో ఓ చిన్న చిత్రంగా అతి తక్కువ థియేటర్లలో విడుదలైన 'షేప్ ఆఫ్ వాటర్' క్రమంగా ప్రేక్షకుల ఆదరణ, విమర్శకుల ప్రశంసలతో పెద్ద చిత్రంగా మారిపోయింది. తొలుత రెండే థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ఆ తర్వాత 7 వందల కన్నా ఎక్కువ థియేటర్లలో ప్రదర్శితమైంది. 19.5 మిలియన్ డాలర్ల బడ్జెట్‌కుగానూ సుమారు 52 మిలియన్ డాలర్లు వసూళ్లు అందుకుంది.

చిత్రోత్సవ వేదికలపై సత్తా: బాక్సాఫీసు వద్దే కాదు... చిత్రోత్సవాల్లోనూ ఈ చిత్రం సత్తా చాటింది. మినీ ఆస్కార్‌లా భావించే గోల్డెన్ గ్లోబ్ పురస్కారాల్లో అయిదు నామినేషన్లకుగానూ ఉత్తమ దర్శకుడు, ఉత్తమ ఒరిజినల్ స్కోర్ విభాగాల్లో విజేతగా నిలిచింది. వెనిస్ అంతర్జాతీయ చిత్రోత్సవంలో ప్రదర్శితమై ఉత్తమ చిత్రంగా గోల్డెన్ లయన్ పురస్కారం గెలుచుకుంది. బ్రిటిష్ అకాడెమీ అందించే బాఫ్టా పురస్కారాలకుగానూ 12 నామినేషన్లు అందుకుంది. టొరంటో చిత్రోత్సవంలో ప్రదర్శితమై ప్రశంసలందుకుంది. గతేడాది వచ్చిన పది ఉత్తమ చిత్రాల్లో ఒకటిగా అమెరికన్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్ జాబితాలో చోటు దక్కించుకుంది. ఇప్పుడు ఆస్కార్ బరిలో అత్యధిక నామినేషన్లతో ఇతర చిత్రాలకు సవాల్ విసురుతోంది.

కథేంటి: ఎలీసా ఓ మూగ అమ్మాయి. సంజ్ఞల భాషలో మాట్లాడుతుంది. అమెరికాలోని ఓ రహస్య సైన్స్ పరిశోధన కేంద్రంలో సంరక్షకురాలిగా ఉంటుంది. ఆమెకున్నది ఇద్దరే స్నేహితులు. పక్కింట్లో ఉండే గైల్స్, సహోద్యోగిని జెల్డా. ఓ నదిలో దొరికిన ఓ వింత జీవిని పరిశోధన కేంద్రానికి తీసుకొచ్చి బంధిస్తారు శాస్త్రవేత్తలు. రెండు కాళ్లు, రెండు చేతులు, శరీరం మీద మొప్పలతో నీళ్లలోనూ, నేలపైనా జీవించగలిగే ఆ వింత జీవితో ఎలీసాకు స్నేహం ఏర్పడుతుంది. కొన్ని ప్రయోగాల కోసం శాస్త్రవేత్తలు ఆ జీవి శరీరాన్ని కోయడానికి సిద్ధమౌతారు. అది తెలిసి ఆ జీవిని తన ఇద్దరు స్నేహితుల సాయంతో అక్కడి నుంచి తప్పించి తన ఇంటికి తీసుకెళ్తుంది ఎలీసా. ఈ క్రమంలో వారిద్దరి మధ్య ప్రేమ చిగురిస్తుంది. ఓ సంఘటనతో ఆ జీవికి స్పర్శతో గాయాలను నయం చేసే శక్తి ఉందని తెలుస్తుంది. కొద్దిరోజులకు ఎలీసా ఇంట్లో ఆ జీవి ఉందన్న విషయం తెలుసుకున్న అధికారులు ఆమె ఇంటిపై దాడి చేస్తారు. వారి నుంచి తప్పించుకున్న ఎలీసా తను ప్రేమించిన ఆ జీవిని నదిలో వదిలేసిందా? చివరికి వారి ప్రేమకథ ఏమైందన్నది 'షేప్ ఆఫ్ వాటర్'లో భావోద్వేగభరితంగా తెరకెక్కించారు.

విశేషాలు

- ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను వర్షంలో చిత్రీకరించాల్సి వచ్చిందట. అందుకోసం వేడి నీళ్లతో ట్యాంకర్లు నింపి వర్షాన్ని సృష్టించారట. షూటింగ్ జరుగుతున్నప్పుడు కెనడాలో విపరీతమైన చలి ఉంటంతో ఆ ఏర్పాటు.
- వింత జీవి గెటప్‌ను రూపొందించడానికి 9 నెలలు పట్టిందట. ఆ కాస్ట్యూమ్స్‌లో సిద్ధమవడానికి ఆ పాత్రలో నటించిన డగ్ జోన్స్‌కు రోజూ మూడు గంటలు పట్టేదట.
- ఈ చిత్రం పరాజయం చెందితే ఇక మీదట దర్శకత్వం చేయనని ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు చెప్పాడు. ఈ కథపై అతనికున్న నమ్మకం అలాంటిది.

అమితాబ్ ఉత్తరం... ఓ పురస్కారం!


రణ్‌వీర్ సింగ్

పద్మావత్‌లో అల్లాఉద్దీన్ ఖిల్జీ పాత్రలో రణ్‌వీర్ సింగ్ నటనకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా రణ్‌వీర్ నటనను పొగుడుతూ రణ్‌వీర్‌కు ఓ ఉత్తరం రాశారు ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్‌బచ్చన్. ఆ ఉత్తరాన్ని ఓ పురస్కారంగా భావిస్తూ దాన్ని ట్విట్టర్‌లో పంచుకొన్నాడు రణ్‌వీర్. "నాకు బచ్చన్ సార్ నుంచి అవార్డు వచ్చింది" అని ట్వీటాడు. 'బాజీరావ్ మస్తానీ' విడుదలయ్యాకా కూడా అందులో రణ్‌వీర్ నటనను ప్రశంసిస్తూ అమితాబ్ ఉత్తరం రాశారు. దీపికా పదుకొణె టైటిల్ పాత్ర పోషించిన 'పద్మావత్' చిత్రం కొన్ని రాష్ట్రాల్లో విడుదల కాకపోయినా రూ.వందకోట్లు మార్క్ దాటి రూ.200కోట్ల దిశగా పరుగులు తీస్తోంది.

ప్రేమ ప్రయాణంలో


ప్రియాంక జైన్, విశ్వదేవ్ రాచకొండ

విశ్వదేవ్ రాచకొండ, ప్రియాంక జైన్ జంటగా నటించిన చిత్రం 'చల్తే చల్తే'. లవ్ ఆఫ్ వీల్స్ ఉపశీర్షిక. ప్రదీప్ కుమార్ కోనేరు స్వీయదర్శకత్వంలో శ్రీనివాసరావు పొట్లూరితో కలిసి నిర్మించారు. మంగళవారం హైదరాబాద్‌లో 'చల్తే చల్తే' టైటిల్ లోగోలను విడుదల చేశారు. నటుడు ఉత్తేజ్ ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించారు. ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ "ఓ ప్రయాణంలో కలసిన యువతీయువకుల మధ్య ఏర్పడిన పరిచయంతో వాళ్ల మధ్య ప్రేమ పుడుతుంది. తర్వాత వారి ప్రేమ ప్రయాణం ఏ తీరుగా సాగిందనేదే మా సినిమా. నవరసభరితంగా తీర్చిదిద్దాం. అయిదు పాటలున్నాయి. సంగీతాన్నీ నేనే అందించాన"న్నారు. పొట్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ "నటుడు ఉత్తేజ్ సూచించిన టైటిల్ ఇది. రెండు పాటల్ని మలేసియాలో చిత్రీకరించాం. ఫిబ్రవరిలో పాటల్ని విడుదల చేస్తామ"న్నారు. "అన్నిరకాల అంశాలు కలగలసిన ప్రేమకథ"ని కథానాయకుడు విశ్వదేవ్ చెప్పారు. "ఎన్నారై అమ్మాయిగా నటించాన"ని నాయిక ప్రియాంక జైన్ తెలిపింది. "కథా, సంభాషణలు అన్నీ పక్కాగా రాసుకుని దర్శకుడు చక్కగా తెరకెక్కించార"ని ఉత్తేజ్ అన్నారు. రావు రమేష్, నరేష్, షాయాజీ షిండే, సూర్య ప్రధాన పాత్రలలో నటించారు.

మంచి ఆలోచన ఉంది.. దాన్ని ఆచరణలో పెడితే వ్యాపారానికి తిరుగుండదు..
కానీ నిపుణుల సాయం కావాలి. ఎలా? అద్భుతమైన వస్తువుల్ని తయారు చేస్తున్నాం... మార్కెట్లోకి తీసుకెళ్లడమే ఆలస్యం... కానీ ఎలాగో అర్థంకావడం లేదు.. ఎవరైనా ఆ కిటుకులు చెబితే బాగుండు..
సంస్థ పెట్టాం... సిబ్బందీ ఉన్నారు. ఇంకా పనిచేసేందుకు అనువైన ప్రదేశమే లేదు. ఏం చేయాలో...!
ఇలా ఆలోచించేవారికి మేమున్నాం అంటోంది ఏడాదిన్నర క్రితం అందుబాటులోకి వచ్చిన జెక్స్టాపోజ్. దాన్ని ప్రారంభించిన శ్రుతీ రమేష్... స్టార్టప్‌లకు తాము ఏ విధంగా సాయం చేస్తామో వసుంధరతో చెప్పుకొచ్చారిలా...

ఈ స్టార్టప్... స్టార్టప్‌లకోసమే!





శ్రుతి

ఉద్యోగం, వ్యాపార ఆలోచనలు ఏదయినా సరే.. ఒకప్పుడు ముంబయి లేదా బెంగళూరు వెళ్లేవారు. కానీ ఇప్పుడు హైదరాబాద్ వినూత్న ఆలోచనలకు మంచి వేదికగా మారింది. అయినప్పటికీ ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటేనే గానీ.. ఔత్సాహికులు అనుకున్న స్థాయికి చేరుకోలేని పరిస్థితి. ఆ అడ్డంకులూ, అవరోధాలకు పరిష్కారం చూపించాలనే ఆలోచనతోనే జెక్స్టాపోజ్‌ని అందుబాటులోకి తెచ్చాం. ఏంటిది అంటారా? కలిసి పనిచేసేందుకు ఓ వేదిక. అంకుర పరిశ్రమలకు ఇంక్యుబేటర్. దీని గురించి వివరించాలంటే ముందు మాకీ ఆలోచన ఎలా వచ్చిందో చెప్పాలి. నేనూ గాయత్రి, ప్రేరణా షా, రచనా, తేజ, శ్రవణ్, అక్షయ్‌వర్మలు స్నేహితులం. మాలో ఆరుగురు ఆర్కిటెక్చర్ గ్రాడ్యుయేట్స్ అయితే ఒకరు మాత్రం సివిల్ ఇంజినీర్. మేమంతా ఎప్పుడు కలిసినా...మాకంటూ గుర్తింపు వచ్చేలా సొంతంగా ఓ సంస్థను ఏర్పాటు చేయాలనుకునే వాళ్లం. మొదట్లో చాలా వ్యాపార ఆలోచనలు చేసినా ఏవీ ఒక కొలిక్కి రాలేదు. కారణం సృజనాత్మకంగా ప్రారంభించాలనుకోవడమే. చివరకు బాగా ఆలోచించి మొదట వివిధ అంకుర పరిశ్రమలకు ప్రారంభదశలో అవసరమయ్యే సహకారం అందించాలనుకున్నాం. అవగాహనాలేమీ, సరైన మార్గదర్శకం లేకపోవడం, నిధుల కొరత వంటివి ప్రతి స్టార్టప్‌నీ ఇబ్బందిపెట్టే అంశాలే. అందుకే ఆ దిశగా ప్రోత్సహించాలనుకున్నాం. నెట్‌వర్కింగ్, నైపుణ్యాల అభివృద్ధికి తగిన శిక్షణ, సంస్థను ఏర్పాటు చేసుకోవడానికి అవసరమయ్యే స్థలం వంటివన్నీ మా దగ్గర ఉంటాయి. అందుకే అనుకున్నదే తడవుగా మా చదువులు పూర్తయిన వెంటనే ఆ దిశగా అడుగులు వేశాం.

పాత విషయమే అయినా...

మొదట్లో మేం అంకుర పరిశ్రమలకు కోవర్కింగ్ స్పేస్‌ని మాత్రమే అందించాలనుకున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో పోటీని తట్టుకునేలా ఆయా సంస్థలు నిలబడాలంటే అది మాత్రమే సరిపోదనిపించింది. ఈ తరం వ్యాపారాలన్నీ సాంకేతికతకూ, సృజనకూ ముడిపడి ఉన్నవే. ఇంక్యుబేషన్ కూడా ఉన్నప్పుడే అవి సుస్థిరంగా ఉండగలుగుతాయి. అంటే సాంకేతిక వినియోగానికి అనువైన ప్రదేశం కావాలి. ఆ ఆలోచనను వ్యాపారంగా మలుచుకోవడానికి నిపుణులైన మానవవనరులూ అవసరమే. దానికి చక్కటి మార్గదర్శకం కూడా ఉంటే ఆయా సంస్థలు అనుకున్న లక్ష్యాన్ని సులువుగా చేరుకోగలుగుతాయని అనిపించింది. ఉదాహరణకు మా దగ్గర వెబ్ డిజైనింగ్, ఆర్కిటెక్ట్స్, ఫ్యాషన్ స్టార్టప్‌లు ఉంటే...వీరిలో ఒకరి అవసరం మరొకరికి తప్పనిసరిగా ఉంటుంది. అలా సంస్థల్ని మేళవించాం. అసంపూర్తిగా ఉన్న ఆలోచనతో ఏదో చేయాలనే తపనతో మా దగ్గరకు వచ్చి వాటిని అభివృద్ధి చేసుకున్నవారు పదుల సంఖ్యలో ఉన్నారు. మరికొన్ని ఆ ప్రయత్నంలోనే ఉన్నాయి.

మేమేం చేస్తామంటే...

మా ఇంక్యుబేటర్‌లో ఉన్నవారందరికీ అవసరమైన నెట్‌వర్కింగ్‌ని కలుపుతాం. మెంటార్లనూ అందిస్తాం. మార్కెటింగ్ అవకాశాలకు దారి చూపుతాం. నిజానికి ఒక్కో రంగానికి ఒక్కోరకమైన ప్రత్యేక అవసరాలు ఉంటాయి. కలిసి పనిచేసేవీ... చేయలేనివీ ఉంటాయి. ఇలా ప్రతి ఒక్కరికీ వారి అవసరాలకు తగ్గట్లు చేసి ఇవ్వడమే మా ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం ప్రతి శనివారం ఎగ్జిబిషన్‌లూ, వర్క్‌షాప్‌లను నిపుణులతో నిర్వహిస్తాం. మా ఈ కాన్సెప్ట్ హైదరాబాద్‌లోనే మొదటిది అని చెప్పగలం. మా సంస్థలో కలిసి పనిచేసే వేదికను ఏర్పాటు చేయడమే కాదు.. వారు రకరకాల కార్యక్రమాలూ, ఎగ్జిబిషన్లు, నిర్వహించుకోవడానికి కూడా అనువైన ప్రదేశాలను మేం ఏర్పాటు చేస్తాం. స్టూడియోలూ, రీటైయిల్ అమ్మకాల కోసం స్థలాన్నీ కేటాయించాం. ఇవన్నీ అంకుర పరిశ్రమలకు ఉపయోగపడతాయి. నెట్‌వర్క్ బలపడే కొద్దీ అవకాశాలూ పెరుగుతాయి. అయితే వారికి కేటాయించిన స్థలం, వినియోగించుకున్న సదుపాయాలను బట్టి నెలకు ఇంత అని డబ్బు తీసుకుంటాం.



ఇబ్బందులూ తప్పలేదు...

వ్యాపారం అన్నాక ఇబ్బందులు ఎందుకు ఉండవు. దాంతో మాకూ తప్పలేదు. మా ఆలోచన కొత్తది. మేం కూడా అప్పుడే చదువులు ముగించుకుని బయటకి వచ్చాం. అవగాహన కోసం మొదట్లో కొంత అధ్యయనం చేసినా అనుభవాలకు మించిన పాఠాలు ఏముంటాయి చెప్పండి. అలా మొదట మాకు ఎదురైన సమస్య వివిధ రంగాలకు చెందిన వారందరికీ ఒకే చోట స్థలం కేటాయించాలి కాబట్టి స్థలం విషయంలో సమస్య ఎదురైంది. రెండు, మూడు స్థలాలను మొదట ఎంచుకున్నా అవి మేం అనుకున్నట్లుగా లేవు. దాంతో ఇచ్చిన అడ్వాన్స్‌లు కూడా వదులుకుని రావాల్సి వచ్చింది. కొంత నష్టపోవాల్సి వచ్చింది కూడా. చివరికి అనుకున్న స్థలం దొరికింది కానీ మేం ఇన్ని అవకాశాలు కల్పిస్తున్నామని అందరికీ తెలియాలిగా. అందుకే సామాజిక మాధ్యమాలను నమ్ముకున్నాం. సులువుగానే బ్రాండింగ్ చేసుకో గలిగాం. ఒకరితో మొదలై ఇప్పుడు కనీసం వంద మందికి మా దగ్గర ఇంక్యుబేషన్ సేవల్ని అందివ్వగలుగుతున్నాం. ఆర్థిక ఇబ్బందులు గట్టెక్కేందుకు రీటెయిల్ స్టోర్‌లకూ స్థానం కల్పించాం. ఆహా స్టఫ్ వంటివీ మా దగ్గర ఉన్నాయి. కేవలం మా దగ్గర ఉన్నవారే కాకుండా బయటి నుంచి కూడా వచ్చి మా దగ్గర వ్యాపార ప్రణాళికలను అమలు చేయడానికీ, ఈవెంట్లూ, ఎగ్జిబిషన్లూ నిర్వహించుకోవడానికి అనువైన ప్రదేశాన్ని కల్పిస్తాం. ఇవన్నీ ఒకెత్తయితే...ఇప్పటికీ మేము ఇష్టంగా పూర్తి చేసిన చదువును వదులుకోలేదు. మేం కూడా ఇక్కడే ఉండి మా పనుల్ని చేసుకుంటున్నాం. ఇదే పేరుతో ఆర్కిటెక్ట్ కన్సల్టెన్సీని పెట్టాం. వివిధ సంస్థలకు బ్రాండింగ్ కూడా చేస్తున్నాం. మార్వెల్ స్కూల్ ఇంటీరియర్స్, ఎమ్ఎల్ఆర్ఐటీ మేకర్‌స్పేస్, టూక్యో ఈవెంట్స్, రోబోటిచ్, టాలీవుడ్ కోతి వంటివి మా ఖాతా సంస్థల్లో కొన్ని. మరికొన్ని ప్రాజెక్ట్‌లూ నడుస్తున్నాయి. ఇబ్బందులు దాటి ఇప్పుడిప్పుడే ఆదాయం అందుకుంటున్నాం. భవిష్యత్తులో మరిన్ని ప్రదేశాలకు మా సేవల్ని విస్తరించుకోవాలనుకుంటున్నాం.

– స్వాతి కొరపాటి

కాబోయే సీఏ కేరాఫ్ ఇడ్లీబండి...!

సీఏ-ఐపీసీసీ ఫలితాల్లో ఆలిండియా 21వ ర్యాంకు





ఓ నిరుపేద కుటుంబంలో ముగ్గురు ఆడపిల్లలు పుడితే... ఇక ఆ కుటుంబం కష్టాల్లో మునిగిపోయినట్లేనా...?
పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే వారు వెనుకబడతారా...?
ఏదైనా మంచి ర్యాంకు కొట్టాలంటే... మిగిలిన అన్నీ పనుల్ని పక్కన పెట్టి రోజుకు 10 గంటల పాటు చదవాల్సిందేనా..?

ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం కావాలంటే తప్పనిసరిగా తిరుపతికి చెందిన నవ్య చదువుల దారిని... ఆమె కుటుంబ ప్రస్థానాన్ని చదవాల్సిందే. తాజాగా సోమవారం వెలువడిన సీఏ-ఐపీసీసీ ఫలితాల్లో నవ్య ఏకంగా ఆలిండియా 21వ ర్యాంకు సాధించింది. రోడ్డు పక్కన ఇడ్లీ బండి నడిపించే కుటుంబం నుంచి వచ్చిన ఆమె కసితో చదివింది. ఎలాంటి శిక్షణ లేకుండా.. . ఆమె సాగించిన చదువుల ప్రస్థానం ఎందరికో ఆదర్శం.

"కెరటం నాకు ఆదర్శం. లేచి పడుతున్నందుకు కాదు...పడినా లేస్తున్నందుకు" అన్న వివేకానందుడి స్ఫూర్తి వాక్యాలే నాలో నిరాశను దరి చేరనివ్వకుండా కాపాడాయి. మాది చిత్తూరు జిల్లా, పాకాల మండలం వల్లివేడు. నాన్న శివారెడ్డి, అమ్మ గోమతి. కూలీపని చేసేవారు. మేం ముగ్గురం ఆడపిల్లలం. నేను రెండోదాన్ని. పదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివా. తరువాత తిరుపతిలోని నవోదయలో సీటు వచ్చింది. మా చెల్లి దివ్యకు తరువాతి ఏడాది అక్కడే సీటు రావడంతో మేం అక్కడికి మారిపోయాం. ఊళ్లో కూలీపని చేసి ఉన్నదాంట్లో సర్దుకునే వాళ్లం. కానీ ఇక్కడికి వచ్చాక నాన్నకు ఏ పని చేయాలో తోచలేదు. కొన్నాళ్లు డబ్బుకోసం చాలా ఇబ్బంది పడ్డాం. కానీ మా చదువుల కోసం నాన్న ఎంత కష్టమైనా భరిస్తామనేవారు. అమ్మ టిఫిన్‌లు బాగా చేస్తుంది. దాంతో చిన్న తోపుడు బండిపై ఇడ్లీలు అమ్మడం మొదలు పెట్టాం.

సాయంత్రం వాళ్లకి తోడుగా...


మా కోసమే కష్టపడుతున్న వారి కోసం నేను తోడవ్వాలనుకున్నా. ఇంటర్ అయిపోగానే...సీఏ కోర్సుకు భవిష్యత్తు ఉందని తెలిసి దాన్నే లక్ష్యంగా పెట్టుకున్నా. కానీ కోచింగ్‌కు వెళ్లే స్తోమత లేదు. అధ్యాపకుల సాయంతో చదువుకునేదాన్ని. ఉదయం నాలుగు గంటలకే నిద్ర లేచి ఇడ్లీ బండికి అవసరమైన వస్తువులను సిద్ధం చేసి, కాలేజీకి వెళ్లేదాన్ని. తిరిగి వచ్చాక బండి దగ్గర అమ్మానాన్నకు సాయం చేసి, రాత్రుళ్లు చదువుకోవడం నా దినచర్యగా మారిపోయింది. సీఏలోని తొలి పరీక్ష (సీపీటీ)లో 200 మార్కులకు 173 వచ్చాయి. దాంతో సీఏలోని ఐపీసీసీకు అర్హత వచ్చింది. అప్పటినుంచీ రోజులో కనీసం రెండు గంటలు చదివేదాన్ని. బండి పక్కనే కూర్చుని చదివినా కూడా, ఏ రోజూ నా ఏకాగ్రత దెబ్బతినలేదు. తాజాగా విడుదలైన ఐపీసీసీ పరీక్షల ఫలితాల్లో 700కు 492 మార్కులు వచ్చాయి. నాది ఆలిండియా స్థాయిలో 21వ ర్యాంకు. ప్రస్తుతం బీకాం రెండో సంవత్సరం చదువుతున్నా. అయితే ఈ తుది ఫలితాలు తర్వాత ఆడిటర్ వద్ద రెండున్నర సంవత్సరాలు క్షేత్రస్థాయి ప్రాజెక్టు వర్క్ ఉంటుంది. తదుపరి పరీక్షలు పాసైతే, ఛార్టెడ్ అకౌంటెంట్‌గా అర్హత సాధించవచ్చు. అలాగే క్షేత్రస్థాయి ప్రాజెక్టు చేస్తూనే సివిల్స్ కూడా చేయాలని అనుకుంటున్నా.

– శివ మావూరి, ఈనాడు, తిరుపతి

బంగారం వెండి

30న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,892	2,895
వెండి (గ్రా)	42.10	42.60



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,360	31,330	30,100	30,100	30,750	30,880	30,920	30,950	30,930	31,160
ఆర్నమెంట్	29,290	29,260	28,800	28,800	28,520	28,660	28,920	28,950	29,770	29,980
వెండి(కిలో)	40,200	40,500	41,000	41,000	40,200	40,600	39,400	39,800	41,500	41,500

నజరానా

మీకిష్టమైన గోళ్ల రంగు గడ్డకట్టుకుపోయిందా? దాంట్లో కాస్త నెయిల్‌పాలిష్ రిమూవర్ కలిపి చూడండి. తిరిగి వాడుకోవచ్చు.

చెల్లి ఫోను చూసి.. షాకయ్యా!

? ఇది నా చెల్లి సమస్య. బీటెక్ రెండో ఏడాది హాస్టల్‌లో ఉండి చదువుతోంది. ఈ మధ్య ఇంటికి వచ్చినప్పుడు అనుకోకుండా తన ఫోను తీసుకున్నా. అన్నీ అభ్యంతరకరమైన సందేశాలూ, చిత్రాలే కనిపించాయి. అబ్బాయిలు మాత్రమే వాటిని చూస్తారని అనుకునే నేను తన ఫోన్ చూసి ఒక్కసారి షాకయ్యా. తనెందుకు వాటికి అలవాటు పడిందో అర్థం కాలేదు. పైగా అమ్మానాన్నలకు ఈ విషయం చెప్పలేను. ఎందుకంటే వారు తను ఎంతో ఉన్నతంగా చదువుతోందని ఉద్యోగం చేసి తమ పేరు నిలబెడుతుందని ఆశలు పెంచుకున్నారు. అడిగితే నాతో గొడవ పెట్టుకుంది. తన మీద అభాండాలు వేస్తున్నాని చెబుతూ ఆ ఫోన్‌లోవన్నీ తీసేసింది. వెంటనే కాలేజీలో వచ్చేయమన్నారంటూ వెళ్లిపోయింది. ఇప్పుడు నేనేం చేయాలి.

– ఓ సోదరి

డియర్ వసుంధర



డాక్టర్ పద్మజ
సైకాలజిస్టు

✔ అమ్మానాన్నలకు మీరు చెప్పలేకపోవడాన్ని అర్థం చేసుకోగలను. మీ చెల్లి తన విషయం బయటపడిందనీ, గొడవ పడి హాస్టల్‌కి వెళ్లిపోయిందని మీ ఉత్తరం ద్వారా అర్థమవుతుంది. అయితే కొన్ని రోజులాగి సందర్భాన్ని కల్పించుకునైనా, తనతో అనునయంగా మాట్లాడండి. టీనేజీలో శారీరకంగా, మానసికంగా ఎదురయ్యే మార్పులూ, లైంగిక విషయాలపై కలిగే తీవ్రమైన ఆసక్తి, దారి తీసే పరిస్థితులను గురించి అర్థమయ్యేలా చెప్పండి. మీరు చెప్పలేకపోయినా వారికి దగ్గరగా ఉండే ఎవరితోనైనా చెప్పించే ప్రయత్నం చేయండి. అలాగే ఆమెకు హాస్టల్‌లో స్నేహితులు ఉన్నారా? వారితో ఏ విధంగా వ్యవహరిస్తోందన్న విషయాలూ తెలుసుకోవడం తప్పనిసరి. కొన్నిసార్లు వారిలోని అభద్రతా, ఆత్మనూన్యతా, ఒంటరితనం వంటివన్నీ ఈ పరిస్థితికి కారణం అవుతాయి. వీటికి వయసుతో పాటు వచ్చే హార్మోన్ల హెచ్చుతగ్గులూ, స్నేహితుల ప్రభావం తోడవుతాయి. అందువల్లే మేం కూడా చేస్తే తప్పేంటని అనుకుంటారు. స్నేహితులే కారణమే అయితే, మంచి ఆలోచనలు, లక్ష్యాలున్న వారితో సాన్నిహిత్యం పెంపొందించుకునేలా చూడండి. అవసరమైతే ఈ సమయంలో అధ్యాపకుల సాయమూ తీసుకోండి. అలాగే ఒంటరితనమే ఈ పరిస్థితికి కారణమైతే, సామాజిక చొరవను పెంపొందించుకునేలా సాయం చేయండి. మంచి స్నేహితురాళ్లని ఏర్పరుచుకోవడం వల్ల ఇంతకంటే ఎక్కువ సరదాలూ, సంతోషాలు ఉంటాయని నచ్చచెప్పేందుకు ప్రయత్నించండి. అదే సమయంలో తల్లిదండ్రులకూ సున్నితంగా మీరీ విషయాన్ని తెలియజేయండి. అయినా ఆమెలో మార్పు రాకపోతే గనుక మానసిక నిపుణుల సాయం తీసుకోండి.

అయస్కాంతంతో అతుక్కుంటాయి..



వేడుకలకూ, పార్టీలకు కృత్రిమ కంటిరెప్పలను అంటించుకోవడం ఈ మధ్య సరదా అయిపోయింది. అయితే వాటిని రెప్పలకు అంటించడానికి ఎన్నో తిప్పలు పడాల్సి వస్తోంది. అలాంటిదేమీ లేకుండా ఈ 'మ్యాగ్నెటిక్ ఐ ల్యాషెస్' పని పూర్తి చేస్తాయి. వీటికి చాలా సూక్ష్మంగా అయస్కాంతాలు అంటించి ఉంటాయి. వాటిని కనురెప్పల మీద పెట్టేస్తే ఒకదానితో ఒకటి అతుక్కుంటాయి. తీసేయడం కూడా చాలా సులువు.

ముఖాముఖీకి వెళుతున్నారా..



పోటీ ప్రపంచమిది. ఇంటర్వ్యూకు పిలుపు రావడం ఒకెత్తయితే, అందులో ఎంపిక కావడం మరో ఎత్తు. అందుకే వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముఖాముఖీకి వెళ్లే ముందు మీరు కొన్ని ముఖ్యమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

- ఆ సంస్థ గురించి ముందుగానే తెలుసుకోవాలి. ఏదైనా వస్తువుల తయారీ సంస్థ అయితే దాని ఉత్పత్తులూ, ఆ సంస్థ వినియోగదారులూ, పోటీదారుల వివరాలను అధ్యయనం చేయాలి. వారు అడగబోయే సమాచారం మీవద్ద ఉంటే, సమాధానాలను సులువుగా చెప్పవచ్చు.
- మీ సర్టిఫికెట్లను ఓ ఫోల్డర్‌లో ఉంచుకోవాలి. అందులో వీటితోసహా ఫొటోలు వంటి ముఖ్యమైనవన్నీ పెట్టుకోవాలి. అదనపు కాపీలు ఉంటే మంచిది. అవసరమైతే వారికి ఇవ్వడానికి అవకాశం ఉంటుంది.
- ఇంటర్వ్యూకు సమయపాలన ముఖ్యం. పావుగంట ముందుగానే అక్కడికి చేరుకోవాలి. ఆలస్యం కారణంగా ఆందోళన మొదలై, సరిగ్గా సమాధానం ఇవ్వలేరు.
- చురుగ్గా ఉండాలి. ముఖాముఖీ గదిలోకి వెళ్లగానే ఎదుటివారికి మీరిచ్చే కరచాలనంలో కూడా మీ ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది. వారు చెప్పే అంశాలను పూర్తిగా విన్న తరువాతే మీరు మాట్లాడటం ప్రారంభించాలి. ఎదుటివారి కళ్లల్లోకి చూస్తూ, ప్రశాంతంగా సమాధానం ఇవ్వాలి. ఇటువంటి వాటినీ పరిగణిస్తారు.
- మీ గత ఉద్యోగానుభవం అడిగితే మీరు సాధించిన విజయాల్ని వివరించాలి. ఈ సంస్థకు ఎందుకు రావాలనుకుంటున్నారంటే స్పష్టంగా సమాధానం చెప్పగలగాలి. ముఖాముఖి ముగిసిందనుకుంటే నవ్వుతూనే కృతజ్ఞతలు చెప్పి బయటకు రావాలి.
- ఆ సంస్థకు చెందిన వెబ్‌సైట్‌లో ఇంటర్వ్యూ ఫలితాలను తెలుసుకోవాలి. మీరు ఎంపికైతే, అదనపు సమాచారం కోసం ఆ సంస్థ నుంచి మీకు మెయిల్ రావచ్చు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

తెలంగాణ స్టేట్, ప్రిజన్స్ డిపార్ట్‌మెంట్

ప్రిజన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఒప్పంద ప్రాతిపదికన ఖాళీల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: సూపర్‌వైజర్- 2, హెల్పర్- 12, డ్రైవర్(మేల్)- 10, కౌన్సెలర్- 4, ఇన్‌స్ట్రక్టర్- 2, డేటా ఎంట్రీ ఆపరేటర్- 2.

వయసు: 50 ఏళ్లు మించకూడదు. **అర్హతలు, దరఖాస్తు ఫారం వివరాలు:** 01.02.2018 నుంచి అందుబాటులోకి వస్తాయి. **చివరితేది:** 15.02.2018.

వెబ్‌సైట్: http://tsprisons.gov.in/

ఎస్‌బీఐలో 407 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్లు

పోస్టుల వివరాలు: రిలేషన్‌షిప్ మేనేజర్, ఏఆర్ మేనేజర్, ఇన్వెస్ట్‌మెంట్ కౌన్సెలర్, కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, జోనల్ హెడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ తదితర పోస్టులు **అర్హత:** పోస్టును బట్టి ఏదైనా డిగ్రీ, బీటెక్/ బీఈ, పీజీ, ఎంబీఏ/ ఎంఎంఎస్/ పీజీడీఎం, ఎంటెక్‌తో పాటు సంబంధిత రంగంలో పని అనుభవం అవసరం. **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్ **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 31.01.2018 నుంచి 15.02.2018. **వెబ్‌సైట్:** www.sbi.co.in

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

1. ఆఫీసర్ స్కేల్–1 (సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్, ఒరాకిల్ డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, ఎంఎస్ఎస్‌క్యూఎల్ డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్): 13 పోస్టులు

2. ఆఫీసర్ స్కేల్–2 (డేటా అనలిస్ట్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్): 15 పోస్టులు **అర్హత:** సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, బీఎస్సీ, బీసీఏ, ఎంఎస్సీ, ఎంసీఏతోపాటు పని అనుభవం అవసరం.

వయసు: స్కేల్-1 పోస్టులకు 23 నుంచి 30 ఏళ్లు, స్కేల్-2 పోస్టులకు 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **దరఖాస్తు ప్రక్రియ:** 03.02.2018 నుంచి 22.02.2018 వరకు. **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in/

ఎయిమ్స్- రిషికేష్‌లో 1126 నర్సింగ్ ఆఫీసర్లు

నర్సింగ్ ఆఫీసర్స్ (స్టాఫ్ నర్స్ గ్రేడ్–2): 1126 పోస్టులు

అర్హత: బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్/ బీఎస్సీ (నర్సింగ్/ పోస్ట్- సర్టిఫికెట్)/ పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం డిప్లొమాతోపాటు రెండేళ్ల పని అనుభవం.

వయసు: 21 - 30 ఏళ్ల మధ్య. **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.

చివరితేది: 12.03.2018. **వెబ్‌సైట్:** www.aiimsrishikesh.edu.in

వాక్ ఇన్

ఈసీఐఎల్, హైదరాబాద్

టెక్నికల్ ఆఫీసర్: 01 పోస్టు

అర్హత: ఇంజినీరింగ్ డిగ్రీ (ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్), సంబంధిత రంగంలో ఏడాది పని అనుభవం. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా. **వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేది:** 03.02.2018.

వేదిక: ఈసీఐఎల్ జోనల్ ఆఫీస్, సైదపేట, చెన్నై.

వెబ్‌సైట్: http://www.ecil.co.in/

ఫెలోషిప్స్

ఐఐఎస్ఈఆర్ తిరుపతి

ప్రాజెక్ట్ ఫెలో/ అసిస్టెంట్ పోస్టులు

అర్హత: ఎంఎస్సీ కెమిస్ట్రీ/ ఫిజిక్స్/ ఆస్ట్రోఫిజిక్స్/ బయోటెక్నాలజీ/ మైక్రోబయాలజీ/ బయోకెమిస్ట్రీ/ మాలిక్యులార్ బయాలజీ/ లైఫ్ సైన్సెస్/ అగ్రికల్చరల్ సైన్సెస్ లేదా ఎంటెక్ మెకానికల్/ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఉత్తీర్ణత. **దరఖాస్తు:** ఈమెయిల్ చేయాలి.

చివరితేది: 16.02.2018. **వెబ్‌సైట్:** http://www.iisertirupati.ac.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.



నాణ్యమైన విద్య దేశ ప్రగతికి ప్రధాన మార్గం. ఈ దృష్టితోనే ఇటీవల ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ఇంజినీరింగ్ విద్యలో పలు మార్పులను ప్రకటించింది. పరిశ్రమకు, సమాజానికి ఎలాంటి అవసరాలు ఉన్నాయో విద్యార్థులకు తెలియజేసే క్రమంలో కనీసం మూడు ఇంటర్న్‌షిప్‌లు తప్పనిసరిగా చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ఇంటర్న్‌షిప్ ఎప్పుడు చేయాలి, ఎలా ఎంచుకోవాలి తదితర అంశాల గురించి తెలుసుకుందాం.

● ఇంటర్న్‌షిప్

ఆచరణ.. అన్వయాలకు ఆసక్తికర మార్గం!

ఇంజినీరింగ్ కళాశాలలో చేరిన విద్యార్థులకు మొదటి సంవత్సరంలో పరిమిత సాంకేతిక నైపుణ్యాలే ఉంటాయి. ఇతరులతో భావాలు సరిగా తెలపటానికి సాయపడే సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవడానికి ఇది అత్యుత్తమ సమయం. కెరియర్‌లో విజయానికి ఇవి చాలా ముఖ్యమని అందరికీ తెలిసిందే. కాబట్టి సాఫ్ట్‌స్కిల్స్‌కు ఉపకరించే ఇంటర్న్‌షిప్‌ను ఎలాంటి తటపటాయింపూ లేకుండా ఎంచుకోవాలి.



సర్వేష్ అగర్వాల్
సీఈఓ, ఇంటర్న్‌శాల

మేనేజ్‌మెంట్, కంటెంట్ రైటింగ్, సేల్స్... ఇలాంటి రంగాల్లో ఇంటర్న్‌షిప్ చేస్తే భావప్రసార (కమ్యూనికేషన్) నైపుణ్యాలు పెరుగుతాయి. అదే సమయంలో బృందంలో పనిచేయటం అలవడుతుంది. కార్పొరేట్ ప్రపంచం ఎలా ఉంటుందో అవగాహన ఏర్పడుతుంది. ఇక ఎన్‌జీవో ఇంటర్న్‌షిప్ అయితే మనమేమిటో, మన శక్తియుక్తులు ఎలాంటివో తెలిసేలా చేస్తుంది.

ఆచరణలో అనుభవం

ఇంజినీరింగ్ రెండో, మూడో సంవత్సరాల్లో విద్యార్థులకు కమ్యూనికేషన్ నైపుణ్యాలూ, ఈ రంగంపై పెరిగిన అవగాహనతో ఆసక్తి ఉన్న అంశంపై ఇంటర్న్‌షిప్ చేయాలి. ఉదాహరణకు ప్రోగ్రామింగ్‌పై ఆసక్తి ఉంటే ఏదైనా స్టార్టప్ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేసి సీ, సీ++, జావా, పీహెచ్‌పీ లేదా వెబ్ డిజైనింగ్‌లో లైవ్ ప్రాజెక్టులు చేయాలి. రెండో ఇంటర్న్‌షిప్ చివరికొచ్చేసరికి ఆ రంగంలో కెరియర్‌ను కొనసాగించగలరా, మరో కొత్త రంగానికి మారాలా అనేదానిపై స్పష్టత వస్తుంది.

ఆ తర్వాత ఆసక్తి ఉన్న రంగంలో ప్రొఫెషనల్స్‌తో నెట్‌వర్క్ ఏర్పరచుకుని గతంలో పనిచేసిన బృందాన్ని సంప్రదిస్తూవుంటే వారు మూడో ఇంటర్న్‌షిప్‌కు సాయపడతారు.

తొలి ఉద్యోగ దిశగా...

మొదటి రెండు ఇంటర్న్‌షిప్‌ల ద్వారా సాధించిన అనుభవం మంచి రెజ్యూమేను నిర్మించుకోవడానికి ఉపయోగపడుతుంది. వివిధ రకాల ఇంటర్వ్యూ రౌండ్లకూ పనికొస్తుంది. అందుకని మూడో సంవత్సరం తర్వాత విద్యార్థులు తాము పనిచేయటానికి ఆసక్తి చూపే బ్రాండ్లు/సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేయటం ఆరంభించాలి. ఒకసారి ఇంటర్న్‌షిప్ వచ్చాక తమ పరిజ్ఞానాన్ని ఆచరణాత్మకంగా అన్వయించటంపైనా, తాజా టెక్నాలజీలపై, టూల్స్‌పై లోతైన అవగాహన సంపాదించటంపైనా దృష్టిపెట్టాలి. ఇలా మూడో ఇంటర్న్‌షిప్ విద్యార్థి తన తొలి ఉద్యోగంలో చేరేందుకు సాయపడుతుంది. ఈ రకంగా గ్రాడ్యుయేషన్ పూర్తికాకముందే ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్ అవకాశం పొందుతారు!

దరఖాస్తుకు ముందు, తర్వాత

ఇప్పుడు విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ను ఎలా ఎంచుకోవాలో చూద్దాం.

◆ **ఆసక్తి దేని మీద?**

వందలకొద్దీ ఇంటర్న్‌షిప్‌లకు దరఖాస్తు చేసే ముందు ఈ ప్రశ్నను ఎవరికి వారు వేసుకోవాలి. ప్రొఫైల్‌కు సరిపోయే ఇంటర్న్‌షిప్‌లకే మొగ్గుచూపటం ఎల్లప్పుడూ మంచిది. కొంచెం సమయం తీసుకున్నప్పటికీ చివరకు తమ ఆసక్తి, నైపుణ్యాలకు తగ్గ ఇంటర్న్‌షిప్‌ను ఎంచుకోగలుగుతారు.

◆ **రెజ్యూమేను మెరుగుపరచండి**

ఇంటర్న్‌షిప్‌కు కీలకమైన విషయమిది. క్లుప్తమైన విషయంతో, అతి తక్కువ డిజైన్‌తో ప్రొఫెషనల్‌గా రెజ్యూమేను తీర్చిదిద్దాలి. కాంటాక్టు, ఇతర వివరాలను అవసరమైతే మార్చండి. ప్రాజెక్టు లింక్సు జోడించి, నైపుణ్యాలను కూడా ప్రస్తావించాలి.

◆ **కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగుపరుచుకోండి**

మిగతా అభ్యర్థులను మించిపోవాలంటే విద్యార్థులు తమ ప్రొఫైల్‌తో సంబంధమున్న నైపుణ్యాలను నేర్చుకోవాలి. అదే సమయంలో సాఫ్ట్‌స్కిల్స్‌ను మెరుగుపరచటంపై దృష్టిపెట్టాలి. ఇంకా ఇంగ్లిష్ పదజాలం, వ్యాకరణంపై పట్టు పెంచుకుంటే చక్కని దరఖాస్తులూ, కవర్ లెటర్లూ, ఈ-మెయిల్స్ రాయగలుగుతారు. ఒకసారి ఇంటర్న్‌షిప్ పని మొదలైతే రిపోర్టులూ బాగా రాయగలుగుతారు.

◆ **వారం చూసి వాకబు చేయాలి**

ఇంటర్న్‌షిప్‌కు ఇంటర్వ్యూ జరిగాక సుమారు ఏడు రోజులు ఎదురుచూడవచ్చు. అప్పటికీ సమాచారమేదీ రాకపోతే ఇంటర్వ్యూ చేసినవారికి ఈ-మెయిల్ పంపితే ఎంపిక విషయం తెలుస్తుంది.

ఇవి పాటిస్తే చాలు!

ఇంటర్న్‌షిప్‌లో చేరి ఇంటర్న్‌గా ఉన్నపుడు కొన్ని బాధ్యతలు నెరవేర్చాల్సివుంటుంది. అప్పుడే ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తిచేసుకోగలుగుతారు.

1 కచ్చితమైన సమయపాలన: చాలా సంస్థలు సిబ్బంది సమయపాలన చేస్తారో లేదో పట్టించుకుంటాయి. అందుకే కచ్చితంగా నిర్ణీత సమయానికే కార్యాలయానికి గానీ, నిర్దేశించిన కార్యక్రమానికి గానీ హాజరవ్వటం ఎంతో ముఖ్యం.

2 చొరవ, భాగస్వామ్యం: ఇంటర్న్‌షిప్ అనేది విద్యార్థులు సంబంధిత నైపుణ్యాలు నేర్చుకోవటానికి వచ్చిన అవకాశం. ఇంటర్న్‌షిప్‌లో ఎంత నేర్చుకుంటున్నారన్నది విద్యార్థులపైనే ఆధారపడివుంటుంది. శిక్షణ సందర్భంగా వారు తమ భావాలూ, దృక్పథాలూ పంచుకోవటానికి సంకోచపడకూడదు.

3 గడువులోపే పని పూర్తి: కళాశాల ప్రాజెక్టు అయితే గడువు తేదీలోగా ముగించకపోయినా పెద్ద సమస్య కాదు. అక్కడ అశ్రద్ధ జరిగినా చెల్లుతుంది. ఇక్కడ అది ఏమాత్రం సరి కాదు. ఒక నిర్ణీత సమయంలో పూర్తవ్వాల్సిన దానిలో జాప్యం జరిగితే అది కంపెనీకి భారీ నష్టం కలుగజేస్తుంది. విద్యార్థి కెరియర్‌కూ ఇది నష్టదాయకమే. అందుకే ఇంటర్న్‌షిప్ చేసేటపుడు గడువు తేదీలను సరిగా పాటించాల్సిందే.



4 పరిచయాలతో నెట్‌వర్క్: విద్యార్థులు తమ బృందానికే పరిమితం కాకుండా ఇతర సిబ్బంది గురించి కూడా తెలుసుకోవాలి. పరిచయం పెంచుకుని, మాట్లాడుతూ ఉండాలి. ఇలా తాము పనిచేసే పరిశ్రమలో ఒక నెట్‌వర్క్‌ను తయారుచేసుకుని వారితో ఆలోచనలు పంచుకుని, వారి నుంచి నేర్చుకోవటానికి ప్రయత్నిస్తుండాలి.

5 ఫీడ్‌బ్యాక్ తెలుసుకోవటం: కొత్త అంశాలూ, నైపుణ్యాలూ నేర్చుకోవాలన్నా, వాటిని నిరంతరం మెరుగుపరుచుకోవాలన్నా ఇతరుల సలహాలూ గ్రహించటం అవసరం. సీనియర్లనూ, అధికారులనూ అడిగి మీ వ్యవహార శైలి, పనితీరుపై వారి అభిప్రాయాలూ, సూచనలూ తెలుసుకోవాలి. దానికి అనుగుణంగా మార్పులు చేసుకుంటే తిరుగుండదు!

అత్యున్నత ప్రమాణాలకు చిరునామా ఐఎస్ఐ

భిన్నత్వంలో ఏకత్వం నినాదం ప్రధానంగా పార్లమెంటు చట్టంతో ఏర్పడిన జాతీయస్థాయి సంస్థ ఐఎస్ఐ (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్). విభిన్న పరిశోధనలకు ప్రోత్సాహాన్నిస్తూ పలురకాల కోర్సులను నిర్వహిస్తోంది. స్టాటిస్టిక్స్, నేచురల్ సైన్సెస్, సోషల్ సైన్సెస్‌లో పరిశోధన, బోధన, అనువర్తనలకు అంకితమైన ఈ సంస్థ ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది. కొత్తగా ప్రారంభిస్తున్న క్రిప్టాలజీ అండ్ సెక్యూరిటీ కోర్సు ఈ విద్యా సంవత్సరానికి ప్రధాన ఆకర్షణ.

స్టాటిస్టిక్స్, మ్యాథ్స్, ఎకనామిక్స్ కోర్సులపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు దృష్టిసారించాల్సిన సంస్థల్లో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) ముఖ్యమైంది. వీటిలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయుల్లో కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ చదువుకునే వారికి నాణ్యమైన బోధన, ఉన్నత ప్రమాణాలు, వసతులతోపాటు ప్రతినెలా స్టైపెండ్ అందించడం ఐఎస్ఐ ప్రత్యేకత. డిగ్రీ కోర్సుల్లో చేరినవారికి నెలకు రూ.3 వేలు, అదే పీజీ కోర్సులైతే రూ.5 వేలు, ఎంటెక్ కోర్సులకు ఎంపికైనవారికి రూ.8 వేలు స్టైపెండ్ చెల్లిస్తారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే నెలకు రూ.28,000 ఇతర కోర్సులకు అయితే రూ.25,000 చొప్పున చెల్లిస్తున్నారు. ప్రవేశపరీక్షలో చూపిన ప్రతిభ, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రకటన వెలువడిన నేపథ్యంలో ఐఎస్ఐలో కోర్సులు, అర్హతలు, సీట్ల వివరాలు తెలుసుకుందాం..

ఐఎస్ఐ స్టాటిస్టిక్స్‌లోనే కాకుండా మ్యాథ్స్, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు ప్రసిద్ధి చెందింది. బీస్టాట్, బీమ్యాథ్స్, ఎంస్టాట్, ఎంమ్యాథ్స్, ఎంఎస్ (క్యూఈ), ఎంఎస్ (క్యూఎంఎస్), ఎంఎస్ (ఎల్ఐఎస్), ఎంటెక్ (సీఎస్), ఎంటెక్ (సీఆర్ఎస్), ఎంటెక్ (క్యూఆర్ఓఆర్), పీజీ డిప్లొమాలు, రిసెర్చ్ ఫెలోషిప్పులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఈ సంస్థ కేంద్ర కార్యాలయం కోల్‌కతాలో ఉంది. దిల్లీ, బెంగళూరు, చెన్నై, తేజ్‌పూర్‌లో శాఖలున్నాయి. అలాగే కోయంబత్తూరు, హైదరాబాద్, ముంబయి, పుణెల్లో నెట్‌వర్క్ కార్యాలయాలు ఉన్నాయి. అమెరికన్ ఎక్స్‌ప్రెస్, సిబిల్, డెలాయిట్, డాక్టర్ రెడ్డీస్, ఎర్నెస్ట్ అండ్ యంగ్, సిటీ కార్పొరేషన్, గోల్డ్‌మన్ శాక్స్, మెకిన్సే, హెచ్ఎస్‌బీసీ, ఐబీఎం, ఐసీఐసీఐ, జేపీమోర్గాన్, కేపీఎంజీ, నీల్సన్, మైక్రోసాఫ్ట్, రిలయన్స్, శాంసంగ్, వాల్మార్ట్ తదితర కంపెనీలెన్నో ఐఎస్ఐ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తున్నాయి.

ముఖ్యమైన తేదీలు

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: ఫిబ్రవరి 7

చివరి తేదీ: మార్చి 9. **అడ్మిట్ కార్డులు:** ఏప్రిల్ 11 నుంచి అందుబాటులో ఉంటాయి.

పరీక్ష తేదీ: మే 13

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: గుంటూరు, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం. **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఓబీసీలకు రూ.500.

››› యూజీ

బీస్టాట్: మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసినవాళ్లు ఈ కోర్సుకు అర్హులు. కోల్‌కతా క్యాంపస్‌లో ఆనర్స్ విధానంలో కోర్సు నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి మూడేళ్లు. నెలకు రూ.3000 స్టైపెండ్ చెల్లిస్తారు. 50 సీట్లు ఉన్నాయి.



బీమ్యాథ్స్: మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తిచేసినవాళ్లు ఈ కోర్సుకు అర్హులు. బెంగళూరు క్యాంపస్‌లో ఆనర్స్ విధానంలో కోర్సు నిర్వహిస్తున్నారు. నెలకు రూ.3000 స్టైపెండ్ చెల్లిస్తారు. కోర్సు వ్యవధి మూడేళ్లు. సీట్ల సంఖ్య 50.

››› పీజీ

మాస్టర్ ఆఫ్ స్టాటిస్టిక్స్: స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా మూడేళ్ల డిగ్రీ లేదా బీఈ / బీటెక్ కోర్సు చదివి ఉండాలి. ఈ కోర్సు దిల్లీ, చెన్నై క్యాంపస్‌ల్లో అందిస్తున్నారు. ఎంపికైనవారికి నెలకు రూ.5000 స్టైపెండ్ చెల్లిస్తారు. 30 సీట్లు ఉన్నాయి.

మాస్టర్ ఆఫ్ మ్యాథమేటిక్స్: మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా మూడేళ్ల డిగ్రీ లేదా బీఈ / బీటెక్ కోర్సు పూర్తిచేసినవారు అర్హులు. ఈ కోర్సు కోల్‌కతా క్యాంపస్‌లో అందిస్తున్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.5000 స్టైపెండ్ చెల్లిస్తారు. 20 సీట్లు ఉన్నాయి.

క్వాంటిటేటివ్ ఎకనామిక్స్: ఏదైనా డిగ్రీ కోర్సుతోపాటు ఇంటర్‌లో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదవాలి. కోల్‌కతా, దిల్లీ క్యాంపస్‌ల్లో అందిస్తున్నారు. దిల్లీలో 27, కోల్‌కతాలో 18 సీట్లు ఉన్నాయి.

క్వాలిటీ మేనేజ్‌మెంట్ సైన్సెస్: మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఏదైనా విభాగంలో బీఈ/ బీటెక్ పూర్తి చేయాలి. బెంగళూరు, హైదరాబాద్ క్యాంపస్‌ల్లో కోర్సు నిర్వహిస్తున్నారు. 16 సీట్లు ఉన్నాయి.

లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సుకి దరఖాస్తు చేసుకోవచ్చు. బెంగళూరు క్యాంపస్‌లో అందిస్తున్నారు. పది సీట్లు ఉన్నాయి.

››› ఎంటెక్

కంప్యూటర్ సైన్స్: మ్యాథ్స్/ స్టాటిస్టిక్స్/ ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వీటిలో ఎందులోనైనా పీజీ లేదా బీఈ/ బీటెక్ చదివినవారు ఈ కోర్సుకు అర్హులు. కోల్‌కతా క్యాంపస్‌లో కోర్సు అందిస్తున్నారు. 35 సీట్లు ఉన్నాయి.

క్రిప్టాలజీ అండ్ సెక్యూరిటీ: మ్యాథ్స్/ స్టాటిస్టిక్స్/ ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ.. వీటిలో ఎందులోనైనా పీజీ లేదా బీఈ/ బీటెక్ చేసి ఉండాలి. కోల్‌కతా క్యాంపస్‌లో కోర్సు అందిస్తున్నారు. 20 సీట్లు ఉన్నాయి. ఇది కొత్త కోర్సు. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తున్నారు.

క్వాలిటీ, రిలయబిలిటీ అండ్ ఆపరేషన్స్ రిసెర్చ్: స్టాటిస్టిక్స్‌లో మాస్టర్ డిగ్రీ ఉండాలి. దీంతోపాటు ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివి ఉండాలి. లేదా మ్యాథ్స్‌లో మాస్టర్ డిగ్రీతోపాటు డిగ్రీలో స్టాటిస్టిక్స్, ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ చదవాలి. లేదా బీఈ/ బీటెక్ ఉండాలి. కోల్‌కతా క్యాంపస్‌లో కోర్సు అందుబాటులో ఉంది. 25 సీట్లు ఉన్నాయి.

పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ స్టాటిస్టికల్ మెథడ్స్ అండ్ అనలిటిక్స్: మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/ బీటెక్ చదివిన వాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. తేజ్‌పూర్ క్యాంపస్‌లో అందిస్తున్నారు. 30 సీట్లు ఉన్నాయి.

పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్: మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసినవాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు. 15 సీట్లు ఉన్నాయి. గిరిడీ క్యాంపస్‌లో కోర్సు అందిస్తున్నారు.

జేఆర్ఎఫ్

స్టాటిస్టిక్స్, మ్యాథ్స్, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్; క్వాలిటీ, రిలయబిలిటీ అండ్ ఆపరేషన్స్ రిసెర్చ్; ఫిజిక్స్, జియాలజీ, బయలాజికల్ సైన్స్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ సబ్జెక్టుల్లో జేఆర్ఎఫ్ అందిస్తోంది ఐఎస్ఐ. ఎంపికైన వారికి ఇంజినీరింగ్ కోర్సులకైతే ప్రతినెలా రూ.28,000, మిగిలిన అన్ని కోర్సులకు రూ.25,000 చొప్పున చెల్లిస్తారు.

ఇంటర్/ డిగ్రీ/ పీజీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా అర్హతల ప్రకారం తాము కోరుకున్న కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

కెమికల్ సింథసిస్‌లో..

తాజా ఇంటర్న్‌షిప్స్

ఆపరేషన్స్
సంస్థ: BookMyShow ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.5000
లింకు: internshala.com/i/8656
గడువు: ఫిబ్రవరి 5, 2018
అర్హులు: ఎంఎస్ ఆఫీస్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.

ఈవెంట్ కోఆర్డినేషన్
సంస్థ: Strategy and Business Solutions
ప్రదేశం: అనంతపురం, గుంటూరు, కడప, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, నెల్లూరు, చిత్తూరు, విజయవాడ, తిరుపతి
స్టైపెండ్: వారానికి రూ.3000
లింకు: internshala.com/i/8657
గడువు: ఫిబ్రవరి 5, 2018
అర్హులు: ఎంఎస్ ఎక్సెల్ నైపుణ్యాలు ఉన్నవారు.

కెమికల్ సింథసిస్
సంస్థ: Biocon Limited
ప్రదేశం: విశాఖపట్నం, హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.8000 లింకు: internshala.com/i/8659 గడువు: ఫిబ్రవరి 6, 2018
అర్హులు: కెమిస్ట్రీ అర్హతగా ఉన్నవారు.

సేల్స్ అండ్ ఇన్ స్టోర్ ఆపరేషన్స్
సంస్థ: Marks and Spencer
ప్రదేశం: హైదరాబాద్, చెన్నై, బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ.8000 లింకు: internshala.com/i/8662 గడువు: ఫిబ్రవరి 7, 2018
అర్హులు: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.

మరిన్ని ఇంటర్న్‌షిప్‌లకు **www.eenadupratibha.net** చూడవచ్చు.

కాళ్లరిగినా.. కనికరించరే..

- పరిష్కారం కాని ప్రజా సమస్యలు
- కలెక్టరేట్‌లకు మళ్లీ మళ్లీ వస్తున్న అర్జీదారులు

ఈనాడు డిజిటల్, అమరావతి, న్యూస్‌టుడే-యంత్రాంగం

సరైన విశ్లేషణ... లోటుపాట్ల సమీక్షలు పకడ్బందీగా సాగితే అర్జీదారుల ముఖం ఎందుకు చిన్నబోతుంది? ఒకసారి వచ్చిన ఫిర్యాదు మళ్లీ వచ్చిందంటే.. మళ్లీ మళ్లీ వచ్చిందంటే ఎందుకిలా జరుగుతుందో ఆరా తీయద్దా? కారణాలేమిటో... కారకులెవరో తేల్చి ఒకవేళ అధికారులదే తప్పయితే వారిని బాధ్యుల్ని చేయొద్దా! పోనీ ఫిర్యాదులో వాస్తవం లేదనుకుంటే దాన్నే స్పష్టం చేయాలిగా!! ఈ ప్రక్రియ సవ్య దిశలో సాగడం లేదని చెప్పడానికి ఉదంతాలు లెక్కలేనన్ని. మొక్కుబడి పర్యవేక్షణకు ప్రజావాణి ప్రతిబింబంగా తయారైంది. ఇటీవలే దీనిని 'మీకోసం' అని పేరు మార్చారు. ఫలితం సున్నా. చాలా చోట్ల యంత్రాంగంలో లెక్కలేనితనం కనిపిస్తోంది. అర్జీదారులను కదిలిస్తే ఆక్రోశం.. ఆవేదన కలగలసి వారి కంఠం గద్గదమైంది. ముఖంలో ఉబికి వస్తున్న దుఃఖం ఛాయలు కనిపించాయి. ప్రభుత్వం ఇస్తామన్న భూమి, ఇంటి స్థలం కోసం ఒక స్వాతంత్ర్య సమరయోధుడి కుటుంబం 18 ఏళ్లుగా తిరుగుతూనే ఉంది. విషాదమేమంటే ఆ స్వాతంత్ర్య సమరయోధుడు అప్పారావురెడ్డి అదేమీ అనుభవంలోకి రాకమునుపే కాలం చేశారు. ఇప్పుడు తిరగడం 86 ఏళ్ల వయసున్న ఆయన భార్య డెక్కత రాంబాయమ్మ వంతైంది. ఈమెది విజయనగరం జిల్లా సాలూరు. "మాకున్న 15 సెంట్ల స్థలంలో చిన్న గుడిసె వేసుకుని బతుకుతున్నాం. కొడుకులు లేకపోవడం, వృద్ధులం కావడంతో మా ఇంటి స్థలాన్ని ఆక్రమించేందుకు చుట్టు పక్కల వాళ్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వీఆర్వో, తహసీల్దార్‌లను మూడు సార్లు కలిసినా వారు మా వల్ల కాదని చేతులెత్తేశారు. దీంతో కలెక్టర్‌ను కలిసి విన్నవించుకోవాలని వచ్చాం. ఈ వయసులో కార్యాలయాల చుట్టూ తిరిగే సత్తువ కూడా మాలో లేదు" అని వాపోయారు పశ్చిమగోదావరి జిల్లా పెదవేగికి చెందిన వృద్ధులు రాజ మణెమ్మ-పోతురాజు. ఇలాంటి వారి ఆవేదన వింటుంటే ఎవర్కైనా ఈ వయసులో వీరికి ఇంత కష్టమా అనిపిస్తుంది. మరి మన అధికారులకో!!



12 ఏళ్లు...



యురేనియం పరిశ్రమ ఏర్పాటుకు 2006లో కడప జిల్లా వేముల మండలం రాచగుంటపల్లిలో నాకున్న 7.57 ఎకరాల పట్టా భూమిని భూసేకరణ కింద తీసుకున్నారు. ఎకరాకు రూ.1.20 లక్షలు చొప్పున 2.43 ఎకరాలకే పరిహారమిచ్చి, మిగతా 5.14 ఎకరాలకు ఇవ్వలేదు. అది పొందేందుకు 12 ఏళ్లుగా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. కలెక్టరేట్‌లోనే 22 సార్లు ఫిర్యాదు చేశా. అయినా పరిష్కారం కాలేదు. మా ఊరు నుంచి కడప రావాలంటే ఒక్కసారికి రూ.200 ఖర్చవుతుంది. చేసేది లేక నెలకు రూ.1600 చెల్లించి కడపలోనే ఇల్లు అద్దెకు తీసుకున్నా.

– ఉదయగిరి మస్తాన్, రాచగుంటపల్లి, కడప జిల్లా.

సంవత్సరాల తరబడి తిరుగుతున్నా...

7 ఏళ్లు...

గత ఏడేళ్లలో నలుగురు కలెక్టర్లు మారారు. కలెక్టరేట్‌కు అనేక సార్లు వచ్చా. ప్రతి అధికారికీ వినతులు ఇస్తూనే ఉన్నా. అయినా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. నా పొలంలో కాలుష్య రహిత ఫీడ్ ప్లాంట్ పెట్టడానికి అనుమతులు తీసుకున్నా. స్థానికుడి ఫిర్యాదు మేరకు ప్లాంటు ఏర్పాటును నిలిపేయమని కాలుష్య నియంత్రణ మండలి ఆదేశించింది. వీటిని ప్రశ్నిస్తూ 2011లో ప్రజావాణిలో ఫిర్యాదు చేశాను. ప్లాంటు ఏర్పాటు చేసుకోవచ్చని న్యాయస్థానం తీర్పిచ్చినా ఇప్పటికీ అందుకు అవసరమైన అనుమతులు రాలేదు. ఏడేళ్ల కిందట తెచ్చుకున్న యంత్ర పరికరాలు తుప్పు పడుతున్నాయి. పరిష్కార వేదిక 1100ను ఆశ్రయిస్తే మీ సమస్య పరిష్కారమైందంటూ రెండు సార్లు సమాధానం వచ్చింది. సమస్య మాత్రం అలాగే ఉంది.

– కృష్ణారావు, చల్లపల్లి మండలం, కృష్ణా జిల్లా.

5 ఏళ్లు...



స్వయం ఉపాధి కోసం కార్పొరేషన్ రుణం మంజూరు చేయాలని అయిదేళ్లుగా కలెక్టరేట్‌కు వస్తున్నా. హైదరాబాద్‌లో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసేవాణ్ని. ప్రమాదవశాత్తూ పైనుంచి జారిపడటంతో రెండు కాళ్లూ దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి నా భార్యే కూలి పనులు చేస్తూ నన్ను, పిల్లలనూ పోషిస్తోంది. గతంలో రుణం మంజూరైందని ఓ సారి చెప్పారు. నిజమేనని బ్యాంకుకు వెళ్తే అక్కడ మేనేజర్ ఈసడించుకున్నారు. జన్మభూమి గ్రామసభలో దరఖాస్తు చేసుకున్నా. కలెక్టర్‌ను కలిసినా ప్రయోజనం లేదు. జిల్లా కేంద్రానికి రావాలంటే కాలు పనిచేయకపోవడంతో బస్సులో ప్రయాణించలేను. ఆటోకి రూ.వెయ్యి చెల్లించాలి. తోడుగా ఒకర్ని వెంటబెట్టుకురావాల్సి వస్తోంది. అయినా ఫలితం లేదు.

–ముప్పవరపు చిన శ్రీనివాసులు, పల్లామల్లి, ప్రకాశం జిల్లా.

ఇంత చిన్న సమస్యలు కూడా...

తప్పు ఒకరిది... శిక్ష నాకా?

నాకు తెలియకుండానే నా పేరున గత ప్రభుత్వ హయంలో ఇతర వ్యక్తులు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించుకున్నారు. నేను ఇంటికోసం దరఖాస్తు చేసుకుంటే ఇప్పటికే మంజూరు చేశామని అధికారులు తిరస్కరించారు. గృహ నిర్మాణ శాఖకు ఫిర్యాదు చేస్తే వారు విచారణ జరిపి బాధ్యుల నుంచి డబ్బులు రికవరీ చేశారు కానీ ఆన్‌లైన్‌లో మాత్రం నా రేషన్‌కార్డు సంఖ్యను తొలగించలేదు. దీంతో ఎన్ని సార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరైనట్లే చూపిస్తోంది. ఆన్‌లైన్‌లో నా రేషన్ కార్డు సంఖ్యను తొలగించాలని అయిదేళ్లుగా తిరుగుతున్నా. గృహనిర్మాణ కార్యాలయంలో 20 అర్జీలు పెట్టుకున్నా. కలెక్టరేట్‌కు అయిదుసార్లు వచ్చా. అయినా ఫలితం లేదు.

– అల్లు చిన అప్పారావు, నక్కపల్లి మండలం గొడిచర్ల, విశాఖపట్నం జిల్లా

ఇంటి స్థలం కోసం

నా భర్త మద్దిలేటి అనారోగ్యంతో మంచాన పడ్డారు. నలుగురు ఆడపిల్లలు. కూలి పని చేసుకుంటూ, అద్దె ఇంట్లో ఉంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. సొంత ఇంటి స్థలం కోసం చాలా రోజుల నుంచి ప్రయత్నిస్తున్నా. వీఆర్వో, తహసీల్దార్‌కు, స్థానిక ప్రజా ప్రతినిధులకు దరఖాస్తు చేసుకున్నా. జన్మభూమి జరిగిన ఐదు విడతల్లోనూ అర్జీ చేసుకున్నా. ప్రజా దర్బారుకు రావడం ఇది మూడోసారి. ఏ అధికారి, ప్రజాప్రతినిధి పట్టించుకోవడం లేదు. అధికారుల వద్దకు వెళ్లాల్సిన ప్రతిసారి పనులు మానుకోవాల్సి వస్తోంది. దీంతో రోజు కూలీ రూ.180 నష్టపోతున్నా.



– పద్మావతి, గని, కర్నూలు జిల్లా.

ఆస్తి కోసం కన్నకొడుకులే వేధిస్తున్నారు!



కన్న కొడుకులే ఆస్తి కోసం వేధిస్తున్నారని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఏలూరుకు చెందిన కీర్తి వెంకట సత్యనారాయణ, లక్ష్మీశ్యామల 'ఈనాడు' ప్రతినిధి ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. తమ రెండో కొడుకు రాజకీయాల్లో క్రియాశీలంగా ఉంటాడని, పలుకుబడిని వినియోగిస్తూ తమకు న్యాయం జరగకుండా అడ్డుపడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. "మాకు ఇద్దరు కొడుకులు. అంతా కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాం. ఆస్తిని వారి పేరున రాయలంటూ రోజూ కొడుకులు, కోడళ్ల నుంచి వేధింపులే. వారు పెట్టే బాధలు భరించలేక.. ఇల్లు వదిలేసి బయటకు వెళ్లిపోయి ప్లాటు అమ్ముకుని బతుకుదామంటే వారు కదలనివ్వడం లేదు. ప్రస్తుతం పింఛను, కుమార్తెలు ఇచ్చే ఆర్థిక సాయంతో బతుకుతున్నాం. గతంలోనే సమస్యను తహసీల్దార్‌కు విన్నవించాం. కలెక్టర్ దగ్గరికీ రెండు సార్లు వచ్చాం. అయినా ఫలితం లేదు" అన్నారు.

29నాడు మీ కోసం వచ్చిన వినతులు ఇలా..

జిల్లా	వచ్చిన అర్జీలు (సుమారుగా)	ఎక్కువగా ఏ సమస్యలపై అర్జీలు వస్తున్నాయంటే
శ్రీకాకుళం	300	రెవెన్యూ, గృహనిర్మాణాలు, పింఛన్లు
విజయనగరం	170	భూ సమస్యలు, పింఛన్లు
విశాఖపట్నం	248	రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాల మంజూరు
తూర్పుగోదావరి	400	భూ సమస్యలు, పింఛన్లు
పశ్చిమగోదావరి	500	నిరాదరణకు గురైన వారు, భూఆక్రమణలు
కృష్ణా	150	రెవెన్యూ, ఇళ్ల స్థలాలు
గుంటూరు	275	భూముల సమస్యలు
ప్రకాశం	339	రెవెన్యూ
నెల్లూరు	270	రెవెన్యూ
కడప	400	పింఛన్లు, ఇళ్ల స్థలాలు
కర్నూలు	700	పట్టాలు, పింఛన్లు
అనంతపురం	500	పింఛన్లు, ఇళ్ల మంజూరు

★ సీఎం చంద్రబాబు సొంత జిల్లా అయిన చిత్తూరులో ఈ నెల 29వ తేదీ (సోమవారం) మీకోసం జరగలేదు.

శ్రీచైతన్య విద్యా సంస్థలకు ఏషియాన్ గ్రేటెస్ట్ బ్రాండ్స్-2017 అవార్డు

ఈనాడు, హైదరాబాద్: విద్యా రంగంలో అత్యుత్తమ సేవలు అందించినందుకు, సంస్థ నిర్వహణలో అత్యంత ప్రతిభ చూపినందుకు గాను... శ్రీచైతన్య విద్యా సంస్థలకు ప్రతిష్ఠాత్మక 'ఏషియాన్ గ్రేటెస్ట్ బ్రాండ్స్-2017' అవార్డు దక్కింది. ఏషియావన్ మేగజైన్ సంస్థ సోమవారం సింగపూర్‌లో నిర్వహించిన ప్రదానోత్సవంలో సంస్థ అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ అవార్డు తమ విద్యా సంస్థ అత్యుత్తమ ప్రతిభకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ డా.బి.యస్.రావు పేర్కొన్నారు.



అవార్డు అందుకుంటున్న శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ సుష్మ

ఓటర్ల నమోదుకు ఆధార్ తప్పనిసరి కాదు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వెల్లడి

ఈనాడు అమరావతి: ఓటర్ల నమోదుకు ఆధార్ తప్పనిసరి కాదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సిసోడియా వెల్లడించారు. పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లిన పౌరులను అక్కడి సిబ్బంది స్థానిక చిరునామా కలిగిన ఆధార్‌కార్డులు చూపాలని కోరుతున్నారు. దీనివల్ల ఉద్యోగులు, సొంతూళ్లకు దూరంగా ఉన్న వారు ఓటర్లుగా పేర్లను నమోదు చేసుకునేందుకు వీలుకావడం లేదు. దీనిపై సిసోడియా స్పందిస్తూ.. డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు, రేషన్‌కార్డు, ఇతర ఆధారాలను చూపి ఓటర్లుగా పేర్లు నమోదు చేయించుకోవచ్చునని పేర్కొన్నారు.

రేపటి నుంచి గ్రానైట్ క్వారీల తనిఖీలు

ఈనాడు, అమరావతి: ఫిబ్రవరి ఒకటి నుంచి విశాఖ, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల్లోని గ్రానైట్ క్వారీలను తనిఖీ చేయనున్నట్లు రాష్ట్ర గనుల శాఖ కార్యదర్శి శ్రీధర్ వెల్లడించారు. అనంతపురం, కర్నూలు, చిత్తూరు, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో తనిఖీలు పూర్తయినట్లు తెలిపారు. ఈ నివేదికలకు అనుగుణంగా త్వరలో చర్యలు ఉంటాయని వెల్లడించారు. తొలి విడత తనిఖీల్లో... లీజు విస్తీర్ణం కంటే ఎక్కువగా ఆక్రమించి తవ్వకాలు కొనసాగించడం, నిబంధనలకు విరుద్ధంగా రవాణా, ఇతర ఉల్లంఘనలు జరిగినట్లు తెలిసింది.

మెప్మా రాష్ట్రస్థాయి సదస్సు ప్రారంభం

ఈనాడు, అమరావతి: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే పథక సంచాలకుల (పీడీ), క్షేత్రస్థాయి సిబ్బంది రాష్ట్రస్థాయి సదస్సు తాడేపల్లిలోని కేఎల్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మంగళవారం ప్రారంభమైంది. మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ చినతాతయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలు, నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాల్సిన లక్ష్యాలపై ప్రధానంగా చర్చించారు. 2020 నాటికి పట్టణ ప్రాంతాల్లోని 20 లక్షల కుటుంబాలు అభివృద్ధి సాధించేలా కృషి చేయాలని ఈ సందర్భంగా చినతాతయ్య సూచించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ విశ్వవిద్యాలయ ఉప కులపతి సీవీ రావు, డాక్టర్ కరుణామూర్తి అవయవ దానంపై అగాహాగాన కల్పించారు.

6న దేవాదాయ ఉద్యోగుల చలో కమిషనరేట్

ఈనాడు అమరావతి: రాష్ట్రంలోని ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక, ఉద్యోగులకు జీతభత్యాల నిధి ఏర్పాటు చేసి వేతనాలు చెల్లించాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినప్పటికి దేవాదాయశాఖ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ధర్మాదాయ సంస్థల వేతన అర్చక, ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి కన్వీనర్ వి.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కమిషనర్ వైఖరికి నిరసనగా ఫిబ్రవరి 6న చలో కమిషనరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఆదేశించిన మేరకు జీతభత్యాల నిధిని వెంటనే ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

తెలంగాణ, ఆంధ్ర మహిళా కమిషన్ల పనితీరు భేష్

- జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖాశర్మ

ఈనాడు, దిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మహిళా కమిషన్ల పనితీరు భేష్ అని జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖాశర్మ ప్రశంసించారు. మంగళవారమిక్కడ ఏపీ భవన్‌లో తెలంగాణ, ఏపీ మహిళా కమిషన్ల ఛైర్‌పర్సన్లు త్రిపురాన వెంకటరత్నం, నన్నపనేని రాజకుమారిలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. జాతీయ మహిళా కమిషన్ 25వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 7వేల మందితో సమావేశం నిర్వహిస్తున్నామని, ఇందులో తొలిసారిగా అన్ని రాష్ట్రాల మహిళా కమిషన్ల ఛైర్‌పర్సన్లు, సభ్యులు పాల్గొంటున్నారన్నారు. గృహహింస, పనిచేసే ప్రాంతాల్లో లైంగిక వేధింపులు, ఎన్ఆర్ఐ వివాహాలతో వస్తున్న సమస్యలు, యాసిడ్ దాడులు, అత్యాచారాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు రేఖాశర్మ తెలిపారు.

మార్చి 9, 10తేదీల్లో లేపాక్షి ఉత్సవాలు



హిందూపురం, న్యూస్‌టుడే: లేపాక్షి ఉత్సవాలు మార్చి 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు అనంతపురం జిల్లా కలెక్టర్ వీరపాండియన్ తెలిపారు. లేపాక్షిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరిలోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

పురపాలక ఉపాధ్యాయుల పదోన్నతులకు ఉత్తర్వులు

ఈనాడు అమరావతి: పురపాలక ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేశారని పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. పదోన్నతుల జాబితా రూపకల్పనలో ఎదురవుతున్న సందేహాలకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ స్పష్టత ఇచ్చారని తెలిపారు. పుర, నగరపాలక సంస్థల్లో కొత్త రోస్టరును అనుసరించాలని, విశాఖ, విజయవాడల్లో పాతరోస్టర్‌ను అనుసరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు వెల్లడించారు.

ఆదర్శ పాఠశాలలకు నిధులకు అంగీకారం: ఎంఎస్‌పీటీఏ

బడ్జెట్‌లో ఆదర్శ పాఠశాలలకు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు, దీనిపై ప్రభుత్వానికి నివేదిస్తామని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ తెలిపినట్లు ఆదర్శ పాఠశాలల ప్రోగెసివ్ టీచర్స్ అసోసియేషన్(ఎంఎస్‌పీటీఏ) రాష్ట్ర గౌరవ సలహాదారు ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

రూ.2వేల కోట్ల రుణానికి ఏపీఐఐసీకి అనుమతి

పరిశ్రమల విధానానికి అనుగుణంగా ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(ఏపీఐఐసీ) బ్యాంకుల నుంచి రూ.2వేల కోట్ల రుణం తీసుకోనుంది. ఈ మేరకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

12 మందిపై విచారణకు ఆదేశం

స్త్రీ, శిశు సంక్షేమశాఖలో అభియోగాలు ఎదుర్కొంటున్న పన్నెండు మంది అధికారుల, ఉద్యోగుల, విశ్రాంత అధికారుల పాత్రపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. వీరిపై వివిధ సందర్భాల్లో వచ్చిన అభియోగాలపై విచారణ కోసం కె.సహదేవరెడ్డిని కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీగా నియమించారు.

ప్రభుత్వ పరువు తీస్తున్నారు

- కనకదుర్గమ్మ ఫ్లైవోవర్ నిర్మాణ సంస్థపై ముఖ్యమంత్రి ఆగ్రహం
- ప్రాజెక్టు పనుల్లో జాప్యంపై మండిపాటు
- బెంజ్‌సర్కిల్ ఫ్లైవోవర్ పొడిగించాలని సూచన
- రాష్ట్రంలో రహదారుల ప్రాజెక్టులపై సమీక్ష



రోడ్లు, భవనాల నిర్మాణంలో పురోగతిపై సచివాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి అయ్యన్నపాత్రుడు తదితరులు

ఈనాడు - అమరావతి, ఈనాడు డిజిటల్ - అమరావతి: విజయవాడలో కనకదుర్గమ్మ ఫ్లైవోవర్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ సంస్థ చేతగానితనంవల్ల ప్రభుత్వం పరువు పోతోందని ఆయన మండిపడ్డారు. వంతెన పై భాగాన్ని 13వ పిల్లర్ వరకూ పూర్తి చేసి మార్చి నాటికి ప్రధాన రహదారిపై రాకపోకలు పునరుద్ధరించకపోతే తీవ్ర చర్యలుంటాయని గుత్తేదారు సంస్థను హెచ్చరించారు. నిర్మాణ సంస్థ కోరినట్టుగా రూ.10కోట్లు ఇవ్వడానికి సీఎం అంగీకరించారు. రాష్ట్రంలోని రహదారులపై మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు, ఆ శాఖ అధికారులు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు పాల్గొన్నారు. విజయవాడలో బెంజ్ సర్కిల్ ప్రాంతంలో నిర్మిస్తున్న పై వంతెనను నిడమానూరు వరకూ పొడగించే అంశాన్ని పరిశీలించాలని అధికారుల్ని ఆదేశించారు. హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే తరహాలో అభివృద్ధి చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఫిబ్రవరి నాటికి ఎక్కడా రహదారులపై గుంతలు కనిపించకూడదని, కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై దిశానిర్దేశం చేసేందుకు డస్సాల్డ్ ఏవియేషన్ సంస్థ త్వరలో రాష్ట్రానికి రానుందని చెప్పారు. రాజమహేంద్రవరం-విజయవాడ మధ్య దెబ్బతిన్న రహదారికి వెంటనే మరమ్మతులు చేయాలని, విజయవాడ-గుండుగొలను, గుండుగొలను-రాజమహేంద్రవరం మధ్య రహదారులను రెండు దశల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. నెల్లూరు-తడ మార్గంలో కృష్ణపట్నం ఓడరేవు, శ్రీసిటీ, స్పెషల్ ఎంప్లాయిమెంట్ జోన్ ఉన్న దృష్ట్యా ఈ మార్గాన్ని ఆరు వరుసలుగా మార్చాలని సూచించారు. వైకుంఠమాల రహదారి నాయుడుపేట, చిత్తూరు, మదనపల్లి తదితర ప్రాంతాలకు అనుసంధానమయ్యేలా సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి తదుపరి సమావేశానికి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. కృష్ణపట్నం నుంచి సత్యవేడు మీదుగా తిరుపతికి వంపులు లేని రహదారి నిర్మించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

తగ్గనున్న మొక్కజొన్న, వరి దిగుబడులు

రబీలో వర్షాభావ పరిస్థితుల ప్రభావం పంట దిగుబడులపై గణనీయమైన ప్రభావం చూపిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధరల కల్పనపై మంగళవారం రాత్రి సచివాలయంలో ఆయన సమీక్షించారు. పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడంతోపాటు రైతులకు అధిక ఆదాయం వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. అందుకు అనువైన పంటలను ఎంపిక చేసి రైతులను అటువైపు నడిపించాలని, దళారులబారిన పడకుండా చూడాలని చెప్పారు.



సెల్‌ఫోన్ మంటలు

కాకినాడ, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి కాలిబూడిదైంది. వినియోగదారుడికి ప్రమాదం తప్పింది. ఈ సంఘటన మంగళవారం తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో చోటుచేసుకుంది. బాధితుడు గౌతమ్, అతడి తండ్రి మురళీకృష్ణ చెప్పిన వివరాల ప్రకారం.. కాకినాడ అయోధ్య నగర్‌లో ఉంటున్న వీరు 3 నెలల క్రితం ఆసుస్ కంపెనీకి చెందిన సెల్‌ఫోన్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశారు. మంగళవారం భోజనానికి ఇంటికి వచ్చిన సమయంలో గౌతమ్ ప్యాంటు జేబులో ఉన్న ఫోన్ వేడెక్కి తొడభాగంవద్ద మండుతున్నట్లు అనిపించింది. వెంటనే ఆయన దానిని బయటకు తీశారు. ఆ సమయంలో చిన్న శబ్దంతోపాటు మంటలొచ్చాయి. క్షణాల్లో అది కాలిపోయింది.

రూ.2లక్షల కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేయాల్సిందే

- గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.80వేల కోట్లు కేటాయించాలి
- జాతీయ రైతు సంఘాల డిమాండ్

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రైతులకున్న రూ.2లక్షల కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని వివిధ రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం కేంద్ర ప్రభుత్వం 2018-19 బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్న నేపథ్యంలో కిసాన్ స్వరాజ్ అలయన్స్, జై కిసాన్ ఆందోళన్, నరేగా సంఘర్ష్ మోర్చా, పీపుల్స్ యాక్షన్ ఆన్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ, రైతు స్వరాజ్య వేదిక, స్వరాజ్ ఇండియా సంస్థలు మంగళవారం దిల్లీలో తమ డిమాండ్లను విడుదల చేశాయి. రుణమాఫీ మొత్తంలో కనీసం 25 శాతాన్ని... వడ్డీ వ్యాపారుల నుంచి రుణాలు తీసుకున్న కౌలు రైతులు, ఆదివాసీ, మహిళా రైతుల కోసం ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన రుణమాఫీ వాగ్దానాలను అర్థవంతంగా అమలుచేయడానికి వీలుగా కేంద్ర బడ్జెట్‌లో తగిన కేటాయింపులు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో దేశంలో వ్యవసాయ రంగం పరిస్థితిని వివరిస్తూ 31 పేజీల నివేదికను వారు విడుదల చేశారు. ఇందులో వారు బడ్జెట్ పరంగా చేసిన ప్రధాన డిమాండ్లు...

- రైతాంగాన్ని రుణ విముక్తుల్ని చేయడానికి శాశ్వతంగా 'రుణ ఉపశమన కమిషన్'ను, ఆదాయం పెంపుదలకు 'రైతు ఆదాయ కమిషన్' ఏర్పాటు చేయాలి.
- ప్రకృతి వైపరీత్య నివారణ వ్యవస్థను పూర్తిస్థాయిలో సంస్కరించాలి. కరవుబారిన పడ్డ రైతులకు ఉపశమనం కల్పించడానికి రూ.25వేల కోట్ల నిధి కేటాయించాలి.
- రైతులు సంప్రదాయబద్ధ పంటమార్పిడిని అనుసరించే విధానాన్ని ప్రవేశపెట్టాలి. దేశీయ పశు సంతతి వృద్ధికి చర్యలు తీసుకోవాలి.
- ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కేటాయింపులను కనీసం రెట్టింపు చేయాలి.
- కౌలు రైతుల రుణాలకు వీలుగా రుణ భరోసా నిధి (క్రెడిట్ గ్యారెంటీ ఫండ్) ఏర్పాటు చేయాలి.
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ బడ్జెట్‌లో రూ.80వేల కోట్లు కేటాయించాలి.
- పెట్టుబడి వ్యయంపై 50% లాభం వచ్చేలా కనీస మద్దతు ధర నిర్ణయించాలి.

ఆరోగ్యశాఖ ఒప్పంద ఉద్యోగుల వేతనాలపై సమీక్ష!

ఈనాడు అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసే ఒప్పంద ఉద్యోగుల వేతనాల పెంపుపై సచివాలయంలో మంగళవారం సాయంత్రం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ శాఖలో సుమారు 17వేల మంది ఒప్పంద విధానంలో పని చేస్తున్నారు. అప్పటి అవసరాలను అనుసరించి ఒప్పంద విధానంలో నర్సులు, రేడియోగ్రాఫర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర హోదాల్లో ఉద్యోగాల్లో చేరిన వారికి వేతనాల చెల్లింపుల్లో వ్యత్యాసాలున్నాయి. త్వరలో పెంచనున్న వేతనాల ద్వారా వ్యత్యాసాలు లేకుండా చూడాలని భావిస్తున్నారు. కొంతమంది వైద్యులకు నెలకు 32వేల రూపాయల వంతున చెల్లిస్తున్నారు. దీనిని పెంచి రూ.52,500కు, నర్సులకు రూ.15,000 నుంచి 22,500 వరకు ఇవ్వాలన్న అంశంపై చర్చలు జరిగాయి. త్వరలో ప్రతిపాదనలు ఖరారు కానున్నాయి. అనంతరం మంత్రివర్గ ఉపసంఘానికి వెళ్తాయి. సమావేశంలో వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ సుబ్బారావు, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి రత్నకుమార్, ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


వలసదారుల ఉద్యమనేత రవి విడుదలకు అమెరికా కోర్టు ఆదేశం

వాషింగ్టన్: వలసదారుల హక్కుల ఉద్యమకర్త, భారతదేశ మూలాలున్న రవి రఘువీర్‌ను వెంటనే విడుదల చేయాలని మన్‌హట్టన్ ఫెడరల్ న్యాయస్థానం ఆదేశించింది. ఆయన్ని నిర్బంధించడం అనవసరం, క్రూరమని వ్యాఖ్యానించింది. దేశ బహిష్కరణపై ట్రినిడాడ్-టొబాగోకు వెళ్లాల్సిన అవసరం లేదని సోమవారం ప్రకటించింది. రఘువీర్‌ను ఈ నెల 12న అరెస్టు చేశారు. ఆకస్మికంగా, అనవసరంగా ఆయన్ని నిర్బంధంలో తీసుకున్నారనీ, ఎలాంటి హక్కుల్నీ వాడుకోనివ్వలేదనీ న్యాయమూర్తి తప్పుపట్టారు. కనీసం కుటుంబ సభ్యులకు చెప్పి వచ్చే అవకాశమైనా ఇవ్వకుండా అకస్మాత్తుగా అలాంటి వారిని నిర్బంధించడం సరికాదన్నారు. ఈ తీర్పుపై అప్పీలుకు వెళ్లే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని అమెరికా ఇమ్మిగ్రేషన్-కస్టమ్స్ శాఖ తెలిపింది.

నాన్నా క్షమించు

- కర్నూలులో మెడికల్ పీజీ విద్యార్థిని బలవన్మరణం

కర్నూలు, న్యూస్‌టుడే: పీజీ వైద్య విద్యార్థిని అర్ధాంతరంగా తనువు చాలించింది. అనంతపురానికి చెందిన విశ్రాంత జియాలజిస్టు ఎం.వి.మోహన్‌రెడ్డి, సువర్ణమ్మల రెండో కుమార్తె విష్ణుప్రియ (26) ఎస్వీ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. రెండేళ్ల క్రితం కర్నూలు వైద్య కళాశాలలో పీజీ సీటు రావడంతో ఆమె చిన్నాన్న, చిన్నమ్మల ఇంట్లో ఉండి చదువుకుంటున్నారు. మంగళవారం రాత్రి 7.30 గంటలకు కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి ఆమె గదిలో ఉరి వేసుకుంది. 'నేను పిరికిదానిని. జీవించడానికి అనర్హురాలిని. నాన్నా క్షమించు' అని ఆంగ్లంలో ఆమె రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



మృతి చెందిన విష్ణుప్రియ

సెన్సెక్స్ ▼ 250		36034
నిఫ్టీ ▼ 81		11050
రూపాయి 63.60 ▼ (ఒక అమెరికా డాలరుకు)	02 పైసలు	
బంగారం 30,455 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత)	రూ.లలో 70	
వెండి 39,190 ▼ ముంబయిలో కిలో	రూ.లలో 195	
ముడి చమురు 68.88 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)		



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	26,069	−371
నాస్‌డాక్	7,389	−78
నిక్కీ 225 (జపాన్)	23,292	−337
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,549	−28
షాంఘై(చైనా)	3,488	−35
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,588	−84
డాక్స్ (జర్మనీ)	13,198	−127

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	57.93	67.17
పౌండ్ స్టెర్లింగ్	81.36	94.38
యూరో	71.69	82.14
జపనీస్ యెన్/100	53.14	61.64
ఆస్ట్రేలియా డాలరు	46.80	54.15
సింగపూర్ డాలరు	44.14	52.29
థాయ్ బాత్/100	184.17	220.26
బహ్రెయిన్ దీనార్	156.89	179.79
కువైట్ దీనార్	175.77	218.81
సౌదీ రియాల్	15.40	18.26
యూఏఈ దిర్హమ్	15.77	18.43
మలేషియా రింగిట్	14.56	17.91
చైనీస్ యువాన్	7.12	11.54



మంగళవారం నిఫ్టీ కదలికలు



నెట్.. మన భాషలోనే!

- 2021కి ప్రాంతీయ భాషల్లోనే 75 శాతం
- టైమ్స్ ఇంటర్నెట్ అధ్యయనం

ముంబయి: దేశీయంగా ఇంటర్నెట్‌ను ప్రాంతీయ భాషల్లోనే వినియోగించే వారు 2021కి 75 శాతం మంది ఉంటారని ఒక నివేదిక అంచనా వేస్తోంది. స్మార్ట్‌ఫోన్లు అందుబాటు ధరల్లో లభ్యం కావడం, ప్రాంతీయ భాషల్లో వినియోగానికి ఇవి అనువుగా ఉండటం, 3జీ-4జీ డేటా వ్యయాలు తగ్గడం ఇందుకు ప్రధాన కారణాలని టైమ్స్ ఇంటర్నెట్ అధ్యయనం పేర్కొంది. ఇందువల్లే ఇంటర్నెట్ వినియోగం, దీనిపై అవగాహన అధికమవుతోందని తెలిపింది. అధికవేగం ఇంటర్నెట్ మహా నగరాలకే పరిమితం అనుకునే పరిస్థితి పోయినట్లేనని వివరించింది. 9 కోట్ల మంది నుంచి అభిప్రాయాలు సేకరించి, ఈ నివేదికను రూపొందించినట్లు సంస్థ తెలిపింది.



- ✦ ప్రాంతీయ భాషల్లో నెట్ వినియోగించే వారి సంఖ్య 2011-16 మధ్య 41 శాతం వృద్ధి చెంది 23.40 కోట్లకు చేరింది. ఇప్పటినుంచి 18 శాతం వార్షిక వృద్ధితో 2021 నాటికి 53.40 కోట్లకు చేరొచ్చు.
- ✦ ఆంగ్లభాషలో నెట్ వినియోగదార్ల సంఖ్య 3 శాతం వార్షిక వృద్ధితో 2021 నాటికి 19.90 కోట్లకు పెరగొచ్చు.
- ✦ నెట్‌లో ప్రాంతీయభాషా విషయాలకు (కంటెంట్) గిరాకీ పెరుగుతోందని, సగానికి పైగా వినియోగదార్లకు ఆంగ్లం రాకపోవడం ఇందుకు కారణమని తెలిపింది. మొత్తం కంటెంట్‌లో 66 శాతం ప్రాంతీయ భాషలవేనని వివరించింది. హిందీ చదివేవారిలో మూడింట రెండొంతుల మంది ఆంగ్లం చదవగలరని పేర్కొంది.
- ✦ ప్రాంతీయ భాషల్లోనూ వార్తలు చదవడం అత్యధికమని, మొత్తం విషయంలో 67 శాతం ఇదేనని పేర్కొంది. తరవాత క్రీడలకు 17 శాతం, వినోదాంశాలకు 16 శాతం వాటాలు లభించాయని పేర్కొంది.

బిర్లాసాఫ్ట్, కేపీఐటీల విలీనం

- 700 మి. డాలర్ల కంపెనీ ఆవిర్భావం
- మళ్లీ 2 కంపెనీలకు విభజన

రెండు కంపెనీలు విలీనమైతే ఒక కంపెనీ ఏర్పడుతుంది. అది సహజం. ఆ కొత్త కంపెనీని తిరిగి రెండు కంపెనీలుగా ఏర్పాటు చేయడమన్నది అరుదే. అలాంటి సంఘటనే భారత వాణిజ్య విలీనాలు-కొనుగోళ్లలో చోటు చేసుకోవడం విశేషం.

సీకే బిర్లా గ్రూప్ కంపెనీ బిర్లాసాఫ్ట్, కేపీఐటీ టెక్నాలజీస్‌లు విలీనం కానున్నాయి. విలీన కంపెనీ విలువ 700 మిలియన్ డాలర్లు(రూ.4550 కోట్లు). తిరిగి ఈ సంస్థ రెండు కొత్త కంపెనీలుగా విడిపోనుంది. ఒకటి 500 మి. డాలర్ల కంపెనీ. మరొకటి 200 మిలియన్ డాలర్ల కంపెనీగా.. రెండు పబ్లిక్లీ ట్రేడెడ్ కంపెనీలుగా విడిపోనున్నాయి. ఈ సంక్లిష్ట ప్రక్రియ వల్ల రెండు కంపెనీలు కలిసి.. రెండు ప్రత్యేక ఐటీ కంపెనీలుగా తిరిగి విడిపోనున్నాయన్నమాట.

వీరు అధిపతులు..

ఈ ప్రణాళికకు స్టాక్ ఎక్స్ఛేంజీలు, వాటాదార్ల అనుమతులు లభించాల్సి ఉంది. డిజిటల్ ఐటీ సేవల కంపెనీని బిర్లాసాఫ్ట్‌గా పిలుస్తారు. దీనికి అంజన్ లాహిరి సీఈఓగా



వ్యవహరిస్తారు. ఆటోమోటివ్ ఇంజినీరింగ్ కంపెనీని కేపీఐటీ టెక్నాలజీస్ అంటారు. కిశోర్ పాటిల్ ఆధ్వర్యంలో ఈ కంపెనీ నడుస్తుంది. దేశంలో దిగ్గజ 'ఎంటర్‌ప్రైజ్ డిజిటల్' కంపెనీగా బిర్లాసాఫ్ట్ ఎదగడానికి ఈ విలీనం ఉపయోగపడుతుందని బిర్లాసాఫ్ట్ ఛైర్మన్ అమిత్ బిర్లా పేర్కొన్నారు.

కేపీఐటీ షేర్ల పరుగులు: పునర్నిర్మాణ ప్రణాళికను ప్రకటించిన నేపథ్యంలో కేపీఐటీ టెక్నాలజీస్ షేర్లు 5 శాతం దాకా లాభపడ్డాయి. బీఎస్ఈలో 4.8% లాభంతో రూ.200 వద్ద ముగిసింది. ఒక దశలో 6.71% పెరిగి రూ.223.30 వద్ద 52 వారాల గరిష్ఠ స్థాయికి చేరింది. ఇక ఎన్ఎస్ఈలోనూ 5.25% లాభంతో రూ.219.35 వద్ద స్థిరపడింది.

ఇదీ ప్రక్రియ

బిర్లాసాఫ్ట్, కేపీఐటీ ప్రమోటర్లు కేపీఐటీ మైనారిటీ వాటాదార్ల కోసం ఓపెన్ ఆఫర్‌ను ప్రకటిస్తాయి. (అదనంగా 26% వాటా కొనుగోలు చేయడం కోసం ఒక్కో షేరుకు రూ. 182 ఆఫర్ చేస్తుంది). తొలుత బిర్లాసాఫ్ట్ కేపీఐటీతో విలీనమవుతుంది. ఆ తర్వాత డిజిటల్ ఐటీ సేవల కంపెనీపై దృష్టి సారించే ఒక కంపెనీ(500 మి. డాలర్లు)గా; ఆటోమోటివ్ ఇంజినీరింగ్, మొబిలిటీ సొల్యూషన్ల కంపెనీ(200 మి. డాలర్లు)గా తిరిగి విడిపోతుంది.

ప్రతీ 9 షేర్లకు 22 షేర్లు: కేపీఐటీ బోర్డు సైతం బిర్లాసాఫ్ట్‌తో విలీనానికి, తిరిగి తన ఇంజినీరింగ్ వ్యాపారాన్ని కేపీఐటీ ఇంజినీరింగ్(కేఈఎల్)గా విభజించడానికి అనుమతించింది. ఒప్పందం కింద బిర్లాసాఫ్ట్ వాటాదార్లకు ప్రతీ 9 షేర్లకు విలీన కంపెనీలో 22 షేర్లను ఇస్తారు. కేపీఐటీ ఇంజినీరింగ్ వ్యాపారాన్ని విడదీసిన తర్వాత కేపీఐటీ ఇంజినీరింగ్ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేస్తారు. కేపీఐటీ బిర్లాసాఫ్ట్ వాటాదార్లకు ఒక్కో షేరుకు ఒక్కో కేఈఎల్ షేరును పొందుతారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత కేఈఎల్‌లో బిర్లాసాఫ్ట్ ప్రమోటర్లకు చెందిన వాటాను కేపీఐటీ టెక్నాలజీస్ కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తుంది.

రైతులకు ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులు

కోల్‌కతా: రైతుల్లో రుణ సంస్కృతిని పెంపొందించే ఉద్దేశంతో క్రెడిట్ కార్డులు అందజేయనున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మన్ రజనీశ్ కుమార్ తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లో తొలుత క్రెడిట్ కార్డులు ఇవ్వడం ప్రారంభించి అక్కడ వచ్చే స్పందన ఆధారంగా ఆ తరవాత అన్ని రాష్ట్రాలకు దీన్ని విస్తరిస్తామని తెలిపారు. ఈ కార్డులకు 40 రోజుల రుణ పరిమితి ఉంటుందని, వడ్డీ రేట్లు మిగతా ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులకు వర్తించే విధంగానే ఉంటాయని వివరించారు. అయితే రైతులు క్రెడిట్‌గా వాడుకున్న మొత్తాన్ని సరైన సమయంలో తిరిగి చెల్లించలేకపోతే వేసే రుసుములు మాత్రం తక్కువగా ఉంటాయని చెప్పారు. ఈ కార్డుల ద్వారా 20 శాతం వినియోగ వస్తువులు, మిగతా 80 శాతం వ్యవసాయానికి అవసరమైన ముడిసరుకు కొనుగోలు చేసేందుకు వినియోగించుకోవచ్చని సూచించారు. మంగళవారం పూర్తి ఫార్మ్‌కార్ట్, డీలర్ బంధు యాప్‌లను విడుదల చేసిన ఆయన వ్యవసాయ రంగంలో ఈ-కామర్స్‌ను విరివిగా ఉపయోగించుకుంటామని పేర్కొన్నారు.



రూ.74,000 కోట్ల పెట్టుబడులు!

- నెట్‌వర్క్ మెరుగుకు సంస్థల హామీ
- కాల్ అంతరాయాల పరిష్కారమే ధ్యేయం
- టెలికాం కార్యదర్శి అరుణ సుందరరాజన్

దిల్లీ: కాల్ అంతరాయాలు నివారించేందుకు, నెట్‌వర్క్ విస్తరణ, మౌలిక వసతులు మెరుగు పరచేందుకు రూ.74,000 కోట్లు పెట్టుబడి పెడతామని భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో సహా టెలికాం సంస్థలు హామీ ఇచ్చాయి. సేవల నాణ్యత మెరుగుపరచడంపై టెలికాం కార్యదర్శి అరుణా సుందరరాజన్ నిర్వహించిన సమావేశంలో టెలికాం సంస్థలు ఈ హామీ ఇచ్చాయి. ఇతర సమస్యలతో పాటు మొబైల్ టవర్ల నిర్మాణానికి స్థలం లభించడం లేదని సంస్థల సీనియర్ అధికారులు తెలిపినట్లు కార్యదర్శి వెల్లడించారు. 'మౌలిక వసతుల కల్పనకు రూ.16,000 కోట్లు వెచ్చించామని, మరో రూ.24,000 కోట్లు పెట్టుబడి పెడతామని భారతీ ఎయిర్‌టెల్ తెలిపిందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో లక్ష టవర్లు నెలకొల్పేందుకు రూ.50,000 కోట్లు పెట్టుబడి పెడతామని రిలయన్స్ జియో తెలిపిందని' సుందరరాజన్ వివరించారు. ఐడియా సెల్యులార్, వొడాఫోన్ కూడా మొబైల్ టవర్లు పెంచుతామని పేర్కొన్నాయన్నారు. కాల్ అంతరాయాలు తగ్గాయని ఆయా సంస్థల నివేదికలు పేర్కొంటున్నాయని, అయితే వేర్వేరు కారణాల వల్ల కాల్ నాణ్యత తగ్గుతోందని వివరించారు. ప్రమాణాలకు అనుగుణంగా మొబైల్ ఫోన్లు తయారు కాకపోవడమూ ఒక కారణమని పేర్కొన్నారు. అంతర్జాతీయ ధ్రువీకరణ ముసాయిదా ప్రకారం తయారైన సెల్‌ఫోన్లలో కాల్ అంతరాయాలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. నెట్‌వర్క్‌లలో చట్టవిరుద్ధంగా రిపీటర్లు ఏర్పాటు చేయడం వల్ల కాల్ నాణ్యతపై ప్రభావం పడుతోందని, ఈ విషయంలో నిబంధనలు కఠినంగా అమలు చేస్తామని టెలికాం కార్యదర్శి వివరించారు.



డేటా వినియోగం 6 రెట్లు, కాల్స్ 2 రెట్లు పెరిగాయ్: ఒకే సమయంలో, ఒక మొబైల్ టవర్‌ను 400 మంది కాలర్లు వినియోగిస్తున్నారని, చైనా వంటి దేశాల్లో ఈ సగటు 250-300 మాత్రమేనని ఆపరేటర్లు తెలిపారు. డేటా వినియోగం ఆరేడు రెట్లు పెరిగిందని, ప్రతినెలా 20-25 శాతం వృద్ధి లభిస్తోందని వివరించారు. ఇదే సమయంలో వాయిస్ కాల్స్ కూడా రెండు రెట్లు పెరగడంతో, నెట్‌వర్క్‌పై ఒత్తిడి పెరిగిందన్నారు.

సువెన్ లాభం రూ.34 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సువెన్ లైఫ్ సైన్సెస్ మధ్యంతర డివిడెండు ప్రకటించింది. రూపాయి ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.1.5 (150 శాతం) మధ్యంతర డివిడెండు చెల్లించాలని బోర్డు నిర్ణయించిందని సువెన్ లైఫ్ వెల్లడించింది. మధ్యంతర డివిడెండు చెల్లింపునకు ఫిబ్రవరి 7ను రికార్డు తేదీగా నిర్ణయించారు. 15 తేదీ నుంచి చెల్లింపు చేస్తారు. 2017, డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు కంపెనీ రూ.34.59 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.24.27 కోట్లతో పోలిస్తే 42 శాతం పైగా పెరిగింది. సమీక్ష త్రైమాసికానికి మొత్తం ఆదాయం రూ.120.45 కోట్ల నుంచి రూ.166.94 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలలకు రూ.425.57 కోట్ల ఆదాయంపై రూ.95.91 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.380.48 కోట్లు, నికర లాభం రూ.83.40 కోట్లు ఉన్నట్లు కంపెనీ తెలిపింది. 2017, డిసెంబరుతో ముగిసిన 9 నెలలకు పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై రూ.41.6 కోట్ల నిధులు ఖర్చు చేసింది. ఇది ఆదాయంలో 9.76 శాతానికి సమానం.

రాణించిన భారత్ ఫైనాన్షియల్

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ (గతంలో ఎస్‌కేఎస్ మైక్రో ఫైనాన్స్) రూ.163 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.143 కోట్లతో పోలిస్తే 14 శాతం పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. ఇదే కాలానికి నికర వడ్డీ ఆదాయం 34 శాతం వృద్ధితో రూ.221 కోట్ల నుంచి రూ.296 కోట్లకు పెరిగింది. స్థూల రుణ పోర్టుఫోలియో 34 శాతం పెరిగి రూ.8,531 కోట్ల నుంచి రూ.11,466 కోట్లకు చేరింది. 2017, డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు రూ.4,712 కోట్ల రుణాలను కంపెనీ పంపిణీ చేసింది. ఇందులో 97 శాతం రుణ పంపిణీలు నగదు రహిత రుణ పంపిణీలే. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అత్యధికంగా 8.6 లక్షల సభ్యులు చేరినట్లు తెలిపింది.

అరబిందో ఫార్మా మధ్యంతర డివిడెండు!

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రెండో మధ్యంతర డివిడెండును ప్రకటించే అంశాన్ని అరబిందో ఫార్మా పరిశీలించనుంది. ఫిబ్రవరి 7న జరిగే సమావేశంలో రెండో మధ్యంతర డివిడెండు చెల్లించే అంశాన్ని బోర్డు పరిశీలిస్తుందని అరబిందో ఫార్మా వెల్లడించింది. సమావేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక, తొమ్మిది నెలల ఫలితాలను కూడా బోర్డు పరిగణనలోకి తీసుకుంటుంది.

కొత్త మార్గాల్లో ట్రూజెట్ సేవలు

ఈనాడు, హైదరాబాద్: ఉడాన్ పథకం కింద మరిన్ని మార్గాల్లో హైదరాబాద్‌కు చెందిన టర్బో మేఘా ఎయిర్‌వేస్ విమాన సేవలను అందించనుంది. అహ్మదాబాద్-కాండ్ల-అహ్మదాబాద్, గువహతి-రూప్సి-గువహతి సహా మొత్తం పది మార్గాల్లో సేవలందించడానికి అనుమతి లభించిందని కంపెనీ అధిపతి (కమర్షియల్) సెంథిల్ రాజా తెలిపారు. ట్రూజెట్ పేరుతో టర్బో మేఘా విమాన సేవలను అందిస్తోంది. ఇటీవల కంపెనీ 5వ ఏటీఆర్ 72-600 విమానంతో సేవలను ప్రారంభించింది.

హీరో కొత్త బైకు ఎక్స్‌ట్రీమ్ 200ఆర్

దిల్లీ: హీరో మోటోకార్ప్ మంగళవారం 200 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో సరికొత్త మోడల్ ఎక్స్‌ట్రీమ్ 200ఆర్ బైకును ప్రవేశపెట్టింది. వచ్చే ఏప్రిల్ నుంచి ఇది విపణిలోకి రానుంది. బీఎస్-4 సాంకేతికత, గంటకు 60 కి.మీ. వేగాన్ని 4.6 సెకన్లలో అందుకోగలగడం, గరిష్ఠంగా గంటకు 114 కి.మీ. వేగంతో ప్రయాణించడం దీని ప్రత్యేకతలు. ఈ ఏడాది ప్రారంభం నుంచి హీరో మోటోకార్ప్ 150 సీసీ, అంతకంటే ఎక్కువ సీసీ బైకులపై దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఈ విభాగంలో మరిన్ని రకాల్ని విపణిలోకి తీసుకురావాలని కంపెనీ యోచిస్తోంది. ప్రీమియం రకం బైకుల విభాగాన్ని బలోపేతం చేయాలన్న ఉద్దేశంతోనే ఈ అధిక సీసీ కలిగిన బైకులను తీసుకొస్తున్నట్లు కంపెనీ ప్రతినిధి మాలో లె మాసన్ తెలిపారు.


కొత్త బైక్‌తో కంపెనీ సీటీఓ మార్కస్, గ్లోబల్ హెడ్ మాలో లె మాసన్

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు


(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017–18	నికర లాభం/(నష్టం) 2016–17	మొత్తం ఆదాయం 2017–18	మొత్తం ఆదాయం 2016–17
టీవీఎస్ మోటార్	154.25	132.67	3,684.95	3,239.55
ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్	7,883	3,995	---	---
జేకే పేపర్	69.81	35.89	796.76	677.63
టీమ్‌లీజ్ (కన్సా)	18.4	9.2	922.3	818.2
రిలయన్స్ పవర్(కన్సా)	280.34	275.7	2,590.32	2,984.56
సుందరం ఫాజనర్స్	91.66	75.34	272.26	227.82
సుందరం ఫైనాన్స్	154	138	710.28	623.65
గుజరాత్ పిపవావ్	49.9	64.5	170.09	180.03
మన్‌పసంద్ బెవరేజెస్	11.91	7.24	148.43	112.15
గోద్రేజ్ కన్జ్యూమర్(కన్సా)	429.87	352.20	2,666	2,056.85
పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్(కన్సా)	490.47	404.08	2,858	2,341.74
ఎస్‌బీఐ లైఫ్	230.28	190.43	9,720	6,060
ఓరియెంటల్ బ్యాంక్	(1,985)	(130)	2,340	1,429
ఏయూ స్మాల్ ఫైనాన్స్	78.92	82.92	570.20	353.23
మహీంద్రా లైఫ్‌స్పేస్(కన్సా)	25.97	35.22	185.64	228.07
ఇంటెలెక్ట్ డిజైన్	12.16	(16)	270.67	226.46
ఈఐహెచ్	42.65	54.31	362.07	361.46
డీహెచ్ఎఫ్ఎల్ ప్రమెరికా	27.3	5.4	359	223

నేటి బోర్డు సమావేశాలు

★ ఐసీఐసీఐ బ్యాంక్ ★ కోరమాండల్ ఇంటర్నేషనల్ ★ డాబర్ ఇండియా ★ వేదాంతా ★ ఎన్‌టీపీసీ ★ అరవింద్ ★ ఐడీబీఐ బ్యాంక్ ★ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ★ రిలయన్స్ ఇన్‌ఫ్రా ★ మహీంద్రా హాలీడేస్ ★ అలెంబిక్ ఫార్మా ★ కరూర్ వైశ్యా బ్యాంక్ ★ ఎస్కార్ట్స్ ★ ఎక్సైడ్ ఇండస్ట్రీస్ ★ హెచ్‌సీసీ ★ హెచ్ఈజీ ★ హిందుస్థాన్ కాపర్ ★ ఐఐఎఫ్ఎల్ హోల్డింగ్స్ ★ జమ్మూ అండ్ కశ్మీర్ బ్యాంక్ ★ నేషనల్ ఫెర్టిలైజర్స్ ★ నోసిల్ ★ విమ్టా ల్యాబ్స్ ★ వీఆర్ఎల్ లాజిస్టిక్స్

30వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	360	వరంగల్	362
చిల్లరగా(ఒక గుడ్డు)	4.20	విశాఖపట్నం	382
బెంగళూరు	380	చెన్నై	390
31న		చిత్తూరు	383
విజయవాడ/గోదావరి	372	నమక్కల్	375

ముందు జాగ్రత్తతో..

- మదుపర్ల లాభాల స్వీకరణ

సమీక్ష

సూచీల జోరుకు అడ్డుకట్ట పడింది. సాధారణ బడ్జెట్ వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు జాగ్రత్తపడ్డారు. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాలు ఇందుకు తోడవ్వడంతో మార్కెట్లకు అమ్మకాలు వెల్లువెత్తాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు పరపతి విధాన సమీక్షా సమావేశాల కూడా అప్రమత్తతకు కారణమయ్యాయి. ఆసియా సూచీలు డీలాపడగా, ఐరోపా మార్కెట్లూ అదే ధోరణిలో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 36,277.12 పాయింట్ల వద్ద నష్టాల్లోనే ప్రారంభమైంది. రోజంతా మదుపర్లు అమ్మకాలకు మొగ్గుచూపడంలో ఏదశలోనూ కోలుకోని సూచీ.. ఇంట్రాడేలో 35,993.41 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 249.52 పాయింట్ల నష్టంతో 36,033.73 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 80.75 పాయింట్లు కోల్పోయి 11,049.65 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 11,033.90 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది.

అంబర్ అదుర్స్: అంబర్ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు స్టాక్ మార్కెట్లలో నమోదైన తొలిరోజే అదరగొట్టాయి. బీఎస్ఈలో ఇష్యూ ధరైన రూ.859తో పోలిస్తే 37.36 శాతం ఎక్కువగా రూ.1,180 వద్ద షేరు నమోదైంది. చివరకు 44 శాతం లాభంతో రూ.1,237.25 వద్ద ముగిసింది. ఒకానొకదశలో షేరు 47 శాతం దూసుకెళ్లింది. ఇక ఎన్ఎస్ఈలో సైతం 44.96 శాతం లాభపడి రూ.1,245.25 వద్ద స్థిరపడింది. బీఎస్ఈలో 18 లక్షల షేర్లు, ఎన్ఎస్ఈలో కోటికి పైగా షేర్లు చేతులు మారాయి.

- ✦ ఇక మూడో త్రైమాసికంలో నష్టం తగ్గడంతో ఆర్‌కామ్ షేర్లు పరుగులు తీశాయి. ఇంట్రాడేలో 18.89 శాతం దూసుకెళ్లిన షేరు.. చివరకు 10.46 శాతం లాభంతో రూ.30.10 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 23 నష్టాలను చవిచూశాయి. ఏషియన్ పెయింట్స్ 2.22%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.15%, యాక్సిస్ బ్యాంక్ 1.98%, డాక్టర్ రెడ్డీస్ 1.86%, అదానీ పోర్ట్స్ 1.84%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.51%, విప్రో 1.36%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.32%, టీసీఎస్ 1.30%, యెస్ బ్యాంక్ 1.15%, హెచ్‌డీఎఫ్‌సీ 1.02%, ఇన్ఫోసిస్ 1% చొప్పున డీలాపడిన వాటిలో ఉన్నాయి. కోల్ ఇండియా 1.71%, హీరో మోటోకార్ప్ 1.33%, సన్‌ఫార్మా 0.72%, ఎస్‌బీఐ 0.56%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో మన్నికైన వినిమయ వస్తువులు 1.74% నీరసపడింది. ఐటీ 1.07%, టెక్ 1.02%, బ్యాంకింగ్ 0.85%, స్థిరాస్తి 0.80%, లోహ 0.63%, ఆరోగ్య సంరక్షణ 0.61%, మౌలిక 0.56% చొప్పున డీలాపడ్డాయి.

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 428.25 (436.65) 2389618
AMBUJA CEMEN 261.50 (263.65) 1787102
ASIAN PAINTS 1126.70 (1152.05) 1404578
AUROBIND PHA 631.70 (635.25) 1996711
AXIS BANK LT 593.75 (605.55) 6447963
BAJAJ AUTO L 3358.30 (3363.90) 425678
BAJAJ FINANC 1678.40 (1715.30) 680104
BHARTI AIRTE 440.60 (440.60) 9624998
BHARTI INFRA 344.45 (353.40) 3724844
BOSCH LTD 19495.55 (19879.20) 8399
BPCL 485.60 (469.80) 6592554
CIPLA 605.95 (615.00) 596682
COAL INDIA L 305.90 (301.75) 3085086
DR. REDDYS 2306.15 (2357.10) 858002
EICHER MOTOR 26689.40 (27453.65) 141663
GAIL 476.10 (474.35) 2885234
HCL TECH 1000.40 (1012.05) 1355676
HDFC 1937.50 (1967.60) 4066082
HDFC BANK 1995.50 (1999.65) 1599390
HERO MOTOCOR 3687.85 (3641.75) 540432
HINDALCO IND 253.55 (258.60) 5286436
HINDUSTAN UN 1400.25 (1397.30) 1310365
HPCL 393.00 (375.15) 8974769
ICICI BANK 353.25 (357.65) 13358981
INDIABULLS H 1415.00 (1421.15) 1147808
INDIAN OIL 416.25 (399.65) 25628953
INDUSINDBANK 1736.05 (1742.50) 653937
INFOSYS LTD 1170.65 (1182.90) 4314156
ITC 275.20 (275.65) 13057276
KOTAK MAHIND 1088.05 (1115.10) 2692935
LARSEN & TOU 1429.90 (1431.95) 1988140
LUPIN 902.75 (912.20) 941196
M&M 764.90 (764.35) 1648188
MARUTI SUZIK 9571.55 (9630.70) 573988
NTPC LTD 170.30 (171.05) 7670738
ONGC 204.80 (205.15) 7323876
POWER GRID C 194.95 (194.15) 12839776
RELIANCE IND 950.40 (964.50) 4198139
SBI 313.55 (312.10) 25810404
SUN PHARMA 591.95 (587.95) 3542190
TATA CONSULT 3152.85 (3198.85) 787379
TATA MOTORS 395.85 (399.25) 6963005
TATA STEEL L 775.85 (783.15) 6019374
TECH MAHINDR 602.95 (604.80) 6290644
ULTRATECH 4363.20 (4390.70) 201842
UPL LIMITED 770.75 (788.50) 2353656
VEDANTA LIMI 341.30 (345.00) 7382593
WIPRO 307.30 (311.15) 2279998
YES BANK LTD 353.35 (358.00) 7890491
ZEE ENTERTAI 603.00 (608.90) 1627474

నిఫ్టీ నెక్ట్స్ 50

ABB 1605.80 (1621.80) 39453
ACC 1728.10 (1738.70) 150137
ASHOK LEYLAN 125.75 (125.40) 12328142
AVENUE SUPER 1184.60 (1181.90) 992399
BAJAJ FINSER 4875.65 (4912.40) 104332
BANK OFBAROD 160.20 (162.35) 11158191
BEL 177.00 (175.65) 3397580
BHEL 101.60 (101.90) 6760018
BRITANNIA 4705.60 (4692.10) 129166
CADILA HEALT 425.30 (419.80) 810714
COLGATE PALM 1138.60 (1148.80) 85730
CONTAINER 1380.00 (1400.40) 278281
CUMMINS INDI 909.20 (897.20) 301583
DABUR INDIA 358.60 (359.70) 774775
DLF LIMITED 253.90 (254.05) 5013590
EMAMI LIMITE 1142.60 (1230.45) 583554
GLAXOSMI CON 6540.55 (6476.65) 15404
GLAXOSMI PHA 2456.30 (2449.55) 9505
GLENMARK PHA 615.80 (622.10) 411149
GODREJ CONSU 1057.70 (1060.00) 273474
HAVELLS INDI 552.85 (575.50) 1050928
HINDUSTAN ZI 310.90 (304.15) 2129122
ICICI PRU LI 414.75 (417.20) 620560
IDEA CELLULR 94.00 (93.60) 14010970
INTERGLOBE A 1213.10 (1200.40) 780898
JSW STEEL LT 289.10 (293.45) 2152791
LIC HOUS.FIN 537.60 (547.80) 2143886
MARICO LIMIT 315.45 (310.70) 1182868
MCDOWELL 3281.15 (3284.75) 599936
MOTHERSON 362.30 (369.95) 2920306
MRF 68261.55 (66906.75) 6008
NHPC LTD 29.90 (29.85) 5495757
NMDC LTD 143.70 (143.30) 2274406
OIL INDIA 359.45 (366.45) 690191
ORACLE FIN S 4121.35 (4206.15) 20100
P&G HYG&HEAL 9310.60 (9252.15) 11367
PETRONET LNG 257.90 (250.50) 10281267
PIDILITE IND 885.95 (893.60) 234709
PIRAMAL ENTE 2766.95 (2794.05) 296055
PNB 172.65 (173.95) 16914910
POWER FIN CO 117.35 (117.60) 2998357
RURAL ELEC C 156.80 (157.60) 2123255
SAIL 91.10 (91.85) 8525052
SHREE CEMENT 17326.55 (17826.70) 41116
SHRIRAM TRAN 1374.85 (1431.45) 759223
SIEMENS 1289.25 (1288.05) 177143
SUN TV LTD 1027.55 (1021.10) 479265
TATA POWER 90.60 (90.05) 6984202
TITAN IND 884.15 (896.20) 2101888
TORRENT PHAR 1356.60 (1378.35) 174008

ఘనం (+)

నిఫ్టీ	30న	మార్పు %
HPCL	393.00	4.76
INDIAN OIL CORP	416.25	4.15
BPCL	485.60	3.36
COAL INDIA	305.90	1.38
HERO MOTOCORP	3687.85	1.27
SUN PHARMA	591.95	0.68
SBI	313.55	0.46

గ్రహణం (-)

నిఫ్టీ	30న	మార్పు%
EICHER MOTORS	26689.40	-2.78
BHARTI INFRATEL	344.45	-2.53
KOTAK MAHI BANK	1088.05	-2.43
UPL	770.75	-2.25
ASIAN PAINTS	1126.70	-2.20
DR. REDDYS LAB	2306.15	-2.16
BAJAJ FINANCE	1678.40	-2.15

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 8.98 (9.04) 36047
ALPHAGEO 907.50 (916.55) 1548
AMAR RAJA BA 812.10 (807.95) 27633
ANDHRA BANK 53.15 (54.25) 417458
ANDHRA CEMEN 12.46 (12.05) 63043
ANDHRA PAPER 346.15 (347) 7895
ANDHRA PETRO 69.25 (72.85) 127552
ANDHRA SUGAR 652.55 (651.95) 13485
ASTRA MICROW 113.75 (117.70) 107792
AUROBINDO PH 631.15 (635.20) 148717
AVANTEL SOFT 553.20 (526.90) 56996
AVANTI FEEDS 2271.65 (2378.25) 16918
AVON ORG 15.57 (14.87) 10003
BALAJI AMIN 682.15 (719.25) 24304
BARTRONICS 14.10 (14.16) 9562
BHAGIRA CHEM 305.05 (315.65) 7585
BN RATHI SEC 43.05 (44) 8503
BRILLIANT SE 16.04 (15.28) 393854
CONT COFFEE 285.25 (290.75) 20028
COROMAN FERT 528.35 (532.90) 11249
CYBERMATE 3.63 (3.60) 52745
CYIENT LIMIT 627.35 (649.25) 194592
DECCAN CEMEN 579.45 (580.40) 576
DIVI'S LAB 1084.85 (1100.25) 42790
DR REDDY 2312 (2355.75) 50316
FOUR SOFT 103.20 (103.75) 1417
GATI CORPN 129.95 (133.20) 146157
GAYATRI PROJ 210.20 (217.05) 57745
GMR INFRASTR 22.10 (22.70) 15648012
GOLDST INFRA 224.25 (215.20) 90153
GRANULES (I) 132.50 (134.95) 89308
GVK POWER 20.75 (20.20) 897454
HBL NIFE POW 61.90 (64.25) 100411
HERITAGE FOO 768.50 (777.10) 23347
HIND FLUROCA 14.92 (14.25) 5297
HYD INDUS 1788.20 (1844.10) 3757
IDL INDUSTRS 615.85 (615.75) 3100
INNAREDY COM 4.09 (4.30) 13019
IVRCL INFRAS 5.35 (5.44) 71500
KAKATIYA CEM 365.45 (371.10) 22671
KAVERI SEED 488.10 (504.40) 88243
KNR CONSTRUC 312.95 (313.55) 14709
LANCO INDUS 382.10 (393.10) 12791
LANCO INFRAT 1.53 (1.61) 1341229
LAURUS LABS 516.25 (538.65) 25154
MADHUCON PRO 32.20 (32.20) 20508
MIC ELECTRON 8.97 (9.19) 69469
MOLD-TEK.TEC 70.35 (69.80) 2991
MOLDTK PLA 349.75 (351.70) 7402
NAGARJAGRICH 54.25 (53.95) 28635
NATCO PHARMA 965.60 (982.85) 39163
NAVA BH VENT 161.40 (159.45) 95254
NCC 125.25 (127) 2348962
NCL IND 267.50 (278.30) 14962
NETTLINX 89.95 (85.90) 50243
NEULAND LAB 840.90 (865.35) 4683
NIHAR INFO 14.49 (14.60) 1250
PANYAM CEMEN 57.25 (58.80) 28354
PENNER IND 61.25 (62.20) 66265
PHYTOCHEM I 74.90 (76) 14667
PIONEER DIST 197.35 (205.80) 3056
PITTI LAMIN 84.60 (88.60) 18311
POKARNA 218.20 (219.05) 5072
PRAJAY ENGS 14.72 (15.45) 73640
PRISM CEMENT 137.85 (130.30) 184311
PRUDENTL PHA 4.79 (4.89) 166901
RAIN INDUSTR 395.65 (403.30) 520419
SAMKRG PIST 324.15 (330.85) 3470
SAMPRE NUTRI 69.80 (72.05) 5473
SATVAH. ISPA 27.40 (27.70) 10332
SMS PHARMA 99.35 (100.30) 44161
SPHERE GLOBA 41.20 (43.05) 6320
SREE RAYAL A 63.85 (65.15) 272564
STEEL EXCHAN 33.15 (34.35) 89237
SUJANA METAL 1.60 (1.60) 17999
SUJANA UNIVE 1.07 (1.02) 121031
SURYALAKSH.C 90.25 (90.10) 10845
SUVEN PHARMA 224.40 (240) 524549
TAJ GVK HOTE 177 (175.80) 10831
TANLA 33.75 (33.55) 182410
TERA SOFTWAR 68.80 (73.50) 30178
VICEROY HOTE 17.70 (17.80) 57030
VIMTA LABS 212.55 (208.15) 83067
VISAKA IND 740.05 (757.90) 9420
VIVIMED LABS 84.75 (89.45) 220581
YBRANT DIGIT 6.22 (6.46) 212029
ZENTECH 122.75 (125.20) 40143



భారత భాగ్య విధాత

- అత్యంత సంపన్న దేశాల్లో మనకు ఆరో స్థానం
- సంపన్నుల సంఖ్యలో తొమ్మిదో ర్యాంకు
- న్యూ వరల్డ్ వెల్త్ నివేదిక

దిల్లీ: ప్రపంచంలో అత్యంత సంపన్న దేశాల్లో భారత్‌కు ఆరో స్థానం దక్కింది. 2017లో దేశ సంపద గణనీయంగా పెరగడం ఇందుకు దోహదం చేసింది. న్యూ వరల్డ్ వెల్త్ రూపొందించిన నివేదిక పై విషయాన్ని వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. ప్రపంచంలో అత్యంత సంపన్న దేశంగా అమెరికాకు అగ్రతాంబూలం దక్కింది. చైనా, జపాన్‌లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఇక్కడ ఒక దేశ సంపద అంటే ఆ దేశంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరి మొత్తం సంపద. ఈ సంపదను ఆస్తులు (స్థిరాస్తి, నగదు, షేర్లు, వ్యాపారాలు) అప్పుల మధ్య వ్యత్యాసం ఆధారంగా లెక్కించారు. 'తొలి 10 అత్యంత సంపన్న దేశాలకు 2017 అత్యుత్తమ సంవత్సరం. ముందుగా స్టాక్ మార్కెట్లకు ధన్యవాదాలు. ఎంఎస్‌సీఐ సూచీ 23% పెరగగా, డోజోన్స్ సూచీ 26 శాతం లాభపడింది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే చైనా, భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాల సంపద గణనీయంగా పెరిగింద'ని నివేదిక తెలిపింది.

నివేదికలో మరికొన్ని వివరాలు..

✦ సంపద వృద్ధిలో మనమే నెం.1

2017లో అత్యధికంగా సంపద పెరిగిన దేశాల్లో భారత్‌దే అగ్రస్థానం. 2016లో భారత సంపద 6,584 బిలియన్ డాలర్లుగా ఉండగా.. 2017లో 25% పెరిగి 8,230 బిలియన్ డాలర్లకు చేరింది. సంపద వృద్ధిలో చైనాకు రెండో స్థానం దక్కింది. ఈ దేశ సంపద 22 శాతం పెరిగింది. ఇక ప్రపంచ సంపద 12 శాతం వృద్ధి చెందింది. గత పదేళ్లలో భారత సంపద రెండున్నర రెట్లు పెరిగింది. 2007లో మన దేశ సంపద 3,165 బిలియన్ డాలర్లు ఉంది. కిందటేడాదిలో ఇది 8,230 బిలియన్ డాలర్లకు పెరిగింది.

✦ 3,30,400 మంది సంపన్నులకు నిలయం

సంపన్నుల సంఖ్య విషయంలో మన దేశం తొమ్మిది స్థానంలో ఉంది. భారత్ 3,30,400 మంది సంపన్నులకు (హెచ్ఎన్‌డబ్ల్యూఐ) నిలయంగా ఉంది. నికర సంపద 10 లక్షల డాలర్లు (సుమారు రూ. 6.5 కోట్లు) లేదా అంతకుమించి కలిగి ఉన్నవారిని హెచ్ఎన్‌డబ్ల్యూఐలుగా పరిగణిస్తారు. ఇక 50,47,400 మంది సంపన్నులతో అమెరికా అగ్రస్థానంలో నిలిచింది.

✦ కుబేరుల్లో మూడో స్థానం

భారత్‌లో 119 మంది కుబేరులు ఉన్నారు. ఈ విషయంలో భారత్ మూడో స్థానంలో ఉండగా.. . అమెరికా, చైనా తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. 100 కోట్ల డాలర్లు (దాదాపు రూ. 6500 కోట్లు) లేదా అంతకుమించి సంపద ఉంటే కుబేరులుగా (బిలియనీర్స్) పరిగణిస్తారు. మల్టీమిలియనీర్ల సంఖ్యలో భారత్‌ది ఏడో స్థానం.

అత్యంత సంపన్న దేశాలు ఇవే..

ర్యాంకు	దేశం	సంపద (బి.డాలర్లలో)
1	అమెరికా	64,584
2	చైనా	24,803
3	జపాన్	19,522
4	బ్రిటన్	9,919
5	జర్మనీ	9,660
6	భారత్	8,230
7	ఫ్రాన్స్	6,649
8	కెనడా	6,393
9	ఆస్ట్రేలియా	6,142
10	ఇటలీ	4,276

మౌలికానికి మరిన్ని నిధులు!

ఈనాడు - హైదరాబాద్

గత బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి రికార్డు స్థాయిలో కేటాయింపులు చేసిన ప్రభుత్వం ఈ సారి బడ్జెట్‌లో కూడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధుల కేటాయింపును పెంచడంతోపాటు, ప్రైవేటు పెట్టుబడులు ఈ రంగంలోకి వచ్చే విధంగా విధానపరమైన నిర్ణయాలను, ప్రోత్సాహకాలను ప్రకటించే అవకాశం ఉంది. రహదారులు, రైల్వేలు, పట్టణాభివృద్ధి, ఓడరేవులు తదితర మౌలిక సదుపాయాల రంగాలకు గత బడ్జెట్‌లో రూ. 3.96 లక్షల కోట్ల కేటాయింపులు చేసింది. వృద్ధిరేటుకు ఊతం ఉవ్వడానికి, ఉద్యోగావకాశాల కల్పనకు ప్రభుత్వ నిధులతోపాటు ప్రైవేటు నిధులను కూడా ఆకర్షించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. సాగర్ మాల, భారత్ మాల, స్మార్ట్ సిటీల వంటి ప్రత్యేక ప్రాజెక్టులపై ఈ సారి బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి పెట్టే వీలుంది. అంచనాలివీ..

- ✦ రహదారులు, రైల్వేలు, ఓడరేవులు గ్రామీణ అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాల రంగం కిందకు వచ్చే మొత్తం విభాగాల కేటాయింపులు ఈ సారి బడ్జెట్‌లో 10 శాతం పెరగొచ్చని అంచనా.
- ✦ గత బడ్జెట్‌లో అనేక చర్యలు తీసుకోవడంతోపాటు రహదారులకు కేటాయింపులను రూ. 1.2 లక్షల కోట్లకు పెంచారు. ఈ పరిణామం రహదారుల రంగం గాడిలో పడేందుకు దోహదం చేసింది. దీన్ని కొనసాగించడానికి 2018-19లో బడ్జెట్ కేటాయింపులు 10-15 శాతం పెంచొచ్చని భావిస్తున్నారు.
- ✦ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌ల (ఇన్విట్) ఫండ్‌లలో రిటైల్ మదుపర్లు కూడా పెట్టుబడులు పెట్టడానికి వీలుగా పెట్టుబడుల పరిమితిని రూ. 10 లక్షల నుంచి రూ. 2 లక్షలకు తగ్గించ గలరని పరిశ్రమ ఆశిస్తోంది.
- ✦ రహదారుల స్థాయిలోనే రైల్వేలకు కూడా కేటాయింపులు 10 శాతం పెరగొచ్చు. గత బడ్జెట్‌లో రైల్వేలకు రూ. 1.3 లక్షల కోట్లు కేటాయించారు.
- ✦ ఒక ప్రాజెక్టుకు అన్ని అనుమతులను ఒకే చోట పొందేందుకు వీలుగా ఒక కొత్త అథారిటీని ఏర్పాటు చేయాలని మౌలిక పరిశ్రమ వర్గాలు కోరుకుంటున్నాయి. కొత్త ప్రాజెక్టులను చేపట్టడానికి వీలుగా మౌలిక సదుపాయాల్లో ప్రత్యేక రంగాల కోసం ప్రత్యేక నియంత్రణ ప్రాధికార సంస్థలను ఏర్పాటు చేసే ప్రతిపాదన కూడా ఉంది.
- ✦ నష్టాల ఊబిలో కూరుకుపోయి.. ఇబ్బందులు పడుతున్న ప్రాజెక్టులను గట్టెక్కించడానికి ఒక ప్రత్యేక ఫండ్‌ను ఏర్పాటు చేయాలని పరిశ్రమ ప్రతిపాదిస్తోంది.
- ✦ కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్) వసూలుపై కొన్ని వెసులుబాట్లు కల్పించే వీలుంది.
- ✦ హౌసింగ్, స్మార్ట్ సిటీలకు కూడా కేటాయింపులు పెరిగే అవకాశం ఉంది.









☛ నిలిచిపోయిన ప్రాజెక్టులపై..

నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణకు బడ్జెట్లో ప్రాధాన్యం ఇవ్వాలి. ముందుగా భూసేకరణ ప్రక్రియపై దృష్టి సారించాలి. స్పష్టమైన భూసేకరణ విధానాలు ఉంటే అటు నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణకే కాదు మరిన్ని కొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి దోహదం చేస్తాయి. ఈ పరిణామం ఉద్యోగ సృష్టికి కూడా తోడ్పడుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో కొన్ని రంగాలు కీలక పాత్ర పోషిస్తుంటాయి. ఉదాహరణకు విద్యుత్ రంగం. దేశంలో మొట్టమొదటిసారి తగినంత విద్యుత్ లభ్యత ఉంది. అయితే ఎక్కువ మంది ప్రజలకు విద్యుత్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చే విషయంలో విద్యుదుత్పత్తి వనరులను పంపిణీ సంస్థలు పూర్తిగా సద్వినియోగం చేసుకోలేకపోతున్నాయి.

☛ నెమ్మదించినా.. ముందుకే

జీఎస్‌టీ, పెద్ద నోట్ల రద్దు లాంటి అంశాలు దేశ వృద్ధి నెమ్మదించేందుకు దోహదం చేశాయి. పెద్ద నోట్ల రద్దు నిర్ణయం విఫల ప్రయత్నమని చెప్పేందుకు తగిన రుజువులు ఉన్నాయని నేను అనుకోవడం లేదు. అయితే వృద్ధిని మాత్రం ఇది వెనుకకు తీసుకెళ్లింది. దీర్ఘకాల దృష్ట్యా జీఎస్‌టీ తప్పనిసరిగా చేపట్టాల్సిన సంస్కరణే. దీని వల్ల కూడా వృద్ధి నెమ్మదించింది. అయితే రానున్న సంవత్సరాల్లో వృద్ధి పుంజుకుంటుందని, వేగంగా ముందుకు వెళుతుందని భావిస్తున్నాను.

\- రఘురామ్ రాజన్, ఆర్‌బీఐ మాజీ గవర్నర్

1 టర్నోవరు పరిమితి రూ.30 లక్షలకు పెంచాలి

జీఎస్‌టీ చట్టం ప్రకారం.. రూ. 20 లక్షల్లోపు వార్షిక టర్నోవరు ఉంటే జీఎస్‌టీ పరిధిలోకి రారు. అయితే ఈ పరిమితిని రూ. 30 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే.. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం వార్షికాదాయం రూ. 2,50,000 లోపు ఉంటే పన్ను మినహాయింపు ఉంది. అలాగే ఏ వ్యాపారానికైనా వార్షిక టర్నోవరులో 8 శాతాన్ని ఆదాయంగా ఆదాయపు పన్ను చట్టం పరిగణిస్తుంది. రూ. 20 లక్షల టర్నోవరుపై 8 శాతం అంటే ం`రూ. 1,60,000గా లెక్క తేలుతుంది. అదే రూ. 30 లక్షలకైతే ఇంచుమించు రూ. 2,50,000 అవుతుంది. ఈ ప్రకారం కనీస వార్షిక టర్నోవరు రూ. 30 లక్షలు ఉండటమే సబబు. ఇలా చేస్తే చిన్న వర్తకులకూ ఊరట కలుగుతుంది.

2 రిటర్న్‌ల సవరణకు వీలు కల్పించాలి

జీఎస్‌టీ చట్టంలో సవరణ రిటర్న్‌ల దాఖలుకు సంబంధించి నిబంధనలేమీ నిర్దేశించలేదు. అయితే జీఎస్‌టీ అమల్లోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నప్పటికీ, ఇప్పటికీ రిటర్న్‌ల దాఖలు విషయంలో చాలా మంది వ్యాపారులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కొత్త చట్టం, అందులో ప్రక్రియ కొత్తది కావడంతో రిటర్న్‌ల దాఖలు సమయంలో తప్పులు చేస్తున్నారు. మరోవైపు ఈ తప్పులు సరిదిద్దేందుకు కూడా వీలు లేకుండా ఉంది. వ్యాపారులు ఎదుర్కొంటోన్న ఈ సమస్యను పరిగణనలోకి తీసుకొని, రిటర్న్‌ల సవరణకు ప్రభుత్వం వీలు కల్పిస్తే బాగుంటుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఏదేని ప్రకటన వస్తుందేమోని అటు వ్యాపారులు కూడా ఎదురుచూస్తున్నారు.

3 పన్ను రేట్లు హేతుబద్ధీకరించాలి

జీఎస్‌టీ మండలి ఇప్పటివరకు 25 సార్లు సమావేశాలు నిర్వహించి.. పలు వస్తువులు, సేవల పన్ను రేట్లను సవరించింది. అయినప్పటికీ పన్ను రేట్లను మరింత హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం కొన్ని ఉత్పత్తులు లేదా ఇన్‌పుట్ సేవలకు అధిక పన్ను రేటు విధిస్తుండగా, అవుట్‌పుట్ లేదా అవుట్‌పుట్ సేవల పన్ను రేట్లు తక్కువగా ఉన్నాయి. పన్ను రేట్లలో ఇలాంటి తారతమ్యాల కారణంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్ మొత్తాలు ఎక్కువగా ఉంటున్నాయి. జీఎస్‌టీ వసూళ్లు తక్కువగా ఉండటానికి ఇది కూడా ఓ కారణమే.

4 రివర్స్ ఛార్జీ అమలు మళ్లీ వాయిదా వేయొద్దు

జీఎస్‌టీ కింద నమోదు కాని వ్యక్తుల దగ్గర కొనుగోళ్లు చేసినప్పుడు రివర్స్ ఛార్జీ వర్తిస్తుంది. ప్రస్తుతం ఈ విధానం అమల్లో లేదు. దీనిని మార్చి 31 వరకు ప్రభుత్వం వాయిదా వేసింది. అయితే ఆ తేదీ తర్వాత కచ్చితంగా ఈ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలి. మళ్లీ ఒకటి రెండేళ్లకు వాయిదా వేయడంగాని, ఆ గడువు తేదీని పెంచడం కాని చేయొద్దు. అలా చేస్తే జీఎస్‌టీ అమలు వెనక ఉన్న సదుద్దేశం నీరుగారుతుంది.

5 వ్యాపార నిలయాల సర్వే

ఎక్కువ మందిని పన్ను పరిధిలోకి తేవాలన్నది జీఎస్‌టీని తీసుకొనిరావడం వెనక ప్రధాన లక్ష్యం. అయితే ఇప్పటివరకు ఈ లక్ష్యాన్ని సాధించలేదనే చెప్పాలి. పన్ను చెల్లింపుదార్ల సంఖ్యను పెంచేందుకు, ఎగవేతదార్లను కనుగొనేందుకు నిర్దిష్ట విధివిధానాలతో ప్రభుత్వం వ్యాపార నిలయాల సర్వే చేపట్టాలి.

విజయానికి 10 వినతులు

వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానం అమల్లోకి వచ్చి దాదాపు ఏడు నెలలు పూర్తి కావస్తోంది. అయినా ఇంకా బాలారిష్టాలు వేధిస్తూనే ఉన్నాయి. వ్యాపారులకు ఇబ్బందులు కొనసాగుతూనే ఉన్నాయి. అటు పన్ను రేట్ల విషయంలో వినియోగదారుల్లోనూ అయోమయ పరిస్థితి నెలకొంది. జీఎస్‌టీ వల్ల ఎదురవుతున్న ఇబ్బందులకు ఏమేమి చేయాలో ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి వివిధ పరిశ్రమ సంఘాలు ప్రతిపాదనలు కూడా సమర్పించాయి. వీటిల్లో ఆయన వేటివేటికి పరిష్కారం చూపుతారో.. ఎన్నింటిని పరిగణనలోకి తీసుకుంటారో తెలియాలంటే ఫిబ్రవరి 1 వరకు ఆగాల్సిందే. ఎందుకంటే ఆయన బడ్జెట్‌ను ప్రవేశపెట్టేది ఆ రోజే.


సతీష్ సరాఫ్
చార్టర్డ్ అకౌంటెంట్

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అతిపెద్ద సంస్కరణ జీఎస్‌టీ. మరి ఇంతటి కీలకమైన ఈ కొత్త పన్నుల విధానం అమలును విజయవంతం చేయడం ఆర్థిక వ్యవస్థకు ఎంతో అవసరం. ముందుగా జీఎస్‌టీని తీసుకొనిరావడం వెనక ఉన్న ప్రధాన ఉద్దేశం నెరవేరేలా తక్షణ చర్యలు తీసుకోవాలి. దీంతో పాటు జీఎస్‌టీ అమలు విజయవంతానికి అవరోధంగా ఉన్న సవాళ్లను సమస్యలను పరిష్కరించాలి. వ్యాపారుల్లో ఉన్న సందేహాలను తొలగించాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. వీటన్నింటికీ బడ్జెట్టే వేదిక కావాలి. జీఎస్‌టీ అమలు విజయవంతానికి ప్రభుత్వం ఏమేమి చేపడితే బాగుంటుందో 10 వినతుల రూపంలో ఇలా..



6 అధికారులకు జరిమానా

పన్ను చెల్లింపుదార్లు ఏమైనా తప్పులు చేస్తే వారి నుంచి పన్ను మొత్తంతో పాటు వడ్డీని, జరిమానాను వసూలు చేస్తుంటారు. అదే అధికారులు చట్టాన్ని అతిక్రమించినా, నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు జారీ చేసినా వాళ్లపై జరిమానా విధించేందుకు, చర్యలు చేపట్టేందుకు ఇప్పటివరకు దేశంలో ఎలాంటి చట్టాలు, నిబంధనలు రాలేదు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడినప్పుడు ఆ అధికారులను జవాబుదారీ చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే జీఎస్‌టీ చట్టం కింద ఆదేశాలు జారీ చేసే విషయంలో అధికారులు సహేతుకంగా వ్యవహరిస్తారు. వివిధ కోర్టులు, ట్రైబ్యునళ్లు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. ప్రభుత్వం కూడా ఈ దిశగా చర్యలు చేపడితే ఇదో గొప్ప పరిణామం అవుతుంది.

7 శక్తిమంతంగా యాంటీ ప్రాఫిటీరింగ్ వ్యవస్థ

వినియోగదారులకు బదిలీ చేయాల్సిన పన్ను ప్రయోజనాలను కొందరు వ్యాపారులే తమ జేబులో వేసుకుంటున్నారు. ఇప్పటివరకు రూ. 1,00,000 కోట్లకు పైగా ఐటీసీకి క్లెయిమ్‌లు వచ్చాయి. అంటే ఆ మేరకు వ్యాపారులు వినియోగదారులకు పన్ను ప్రయోజనం బదిలీ చేసి ఉండాలి. కాని ఇది జరగలేదనే మాట వినిపిస్తోంది. కొందరు వ్యాపారులు పాల్పడుతున్న ఇలాంటి కార్యకలాపాల నియంత్రణకు యాంటీ ప్రాఫిటీరింగ్ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే దీనిని శక్తిమంతం చేయాలంటే బడ్జెట్లో మరిన్ని అధికారాలు కల్పిస్తూ తగినన్ని నిధులు కేటాయించాలి.

8 నగదు నిల్వ సర్దుబాటు

వ్యాపారులు తాము చెల్లించే పన్నులను ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద క్లెయిమ్ చేసుకుంటే ఆ మొత్తాన్ని తిరిగి పొందొచ్చు. లెడ్జర్ (పద్దు)లోని నిల్వకు (బ్యాలెన్స్) ఇది చేరుతుంది. అయితే ఈ నిల్వను సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ, యూటీజీఎస్‌టీ, ఇతర త్రా సుంకాల్లో వేటికైనా సర్దుబాటు చేస్తామంటే కుదరదు. ఉదాహరణకు సీజీఎస్‌టీ చెల్లింపుపై ఐటీసీ పొంది ఉంటే మళ్లీ ఆ మొత్తాన్ని సీజీఎస్‌టీ చెల్లించేందుకే వాడాల్సి ఉంటుంది. దీంతో నగదు నిల్వ సర్దుబాటు విషయంలో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే నగదు నిల్వ మొత్తాన్ని ఏ పన్ను చెల్లింపునకైనా సర్దుబాటే చేసే వీలు కల్పించాలి.

9 జీఎస్‌టీ పరిధిలోకి ఆ మూడూ తేవాలి

స్థిరాస్తిపై స్టాంప్ డ్యూటీ సహా పెట్రోలియమ్ ఉత్పత్తులు, విద్యుత్ తదితరాలపై పన్ను మీద పన్ను భారం పడుతోంది. అందుకే వీటిని కూడా జీఎస్‌టీ పరిధిలోకి తేవాలి. ఇలా చేస్తే వినియోగదారులకు పన్నుల వ్యయం తగ్గడమే కాకుండా ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దోహదం చేస్తుంది.

10 సులువుగా రిటర్న్‌ల ప్రక్రియ

రిటర్న్‌ల దాఖలు విషయంలో వ్యాపారులు పడుతున్న ఇబ్బంది అంతా ఇంతా కాదు. కొందరైతే నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. రిటర్న్‌ల దాఖలు ప్రక్రియను సులభతరం చేయకుంటే. భారత్‌లో జీఎస్‌టీ అమలు విజయవంతం కావడం అసాధ్యమే. అందుకే ఈ దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టడం అవసరం.

నోట్లరద్దు అనంతరం వసూలైన నల్లధనం ఎంతో వెల్లడించండి

- కేంద్ర ఆర్థికశాఖను కోరిన సీఐసీ

దిల్లీ: నోట్లరద్దు అనంతరం వసూలు చేసిన నల్లధనం ఎంతో వెల్లడించాలంటూ సమాచార హక్కు చట్టం కింద దాఖలైన దరఖాస్తుకు.. బదులివ్వమని కేంద్ర ఆర్థికశాఖను ప్రధాన సమాచార కమిషనర్ (సీఈసీ) ఆదేశించారు. గతేడాది జనవరి 9న ప్రధానమంత్రి కార్యాలయాని (పీఎంఓ)కి ఓ వ్యక్తి ఈ దరఖాస్తును సమర్పించారు. అదే ఏడాది జనవరి 25న దీన్ని రెవెన్యూ విభాగానికి పీఎంఓ మార్పిడి చేసింది. ఆ తర్వాత రెవెన్యూ విభాగం నుంచి స్పందన కరవవడంతో.. దరఖాస్తుదారుడు కేంద్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. జాప్యంపై పీఎంఓ అధికారులు దరఖాస్తుదారుడికి క్షమాపణలు తెలియజేయడంతో.. వారిపై జరిమానా వేయకుండా సీఈసీ వదిలేశారు. 30 రోజుల్లోగా దరఖాస్తులో అడిగిన సమాచారాన్ని వెల్లడించాలని రెవెన్యూ విభాగాన్ని ఆదేశించారు. చట్టప్రకారం సహ దరఖాస్తుకు 30 రోజుల్లోగా అధికారులు బదులు చెప్పాలి. ఒకవేళ సహేతుకమైన కారణాలు ఉంటే ఇందుకు మినహాయింపు ఉంటుంది.

9 నుంచి ప్రధాని పశ్చిమాసియా పర్యటన

అబుదాబిలో తొలి హిందూ దేవాలయాన్ని ప్రారంభించనున్న మోదీ

ఈనాడు, దిల్లీ: పశ్చిమాసియా పర్యటనకు వెళ్తున్న ప్రధాని మోదీ వచ్చే నెల 10న అబుదాబిలో తొలి హిందూ దేవాలయాన్ని ప్రారంభించనున్నారు. వచ్చే నెల 9 నుంచి 12 మధ్య పశ్చిమాసియా పర్యటనలో భాగంగా ప్రధాని.. పాలస్తీనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ), ఒమన్ దేశాలను సందర్శించనున్నారు. ప్రధాని 2015లో అబుదాబిని సందర్శించినప్పుడు యూఏఈ ప్రభుత్వం.. అల్ వత్‌బా ప్రాంతంలో దేవాలయ నిర్మాణానికి 20 వేల చదరపు మీటర్ల భూమిని కేటాయించింది. ప్రైవేటు నిధులతో ఆలయ నిర్మాణం చేపట్టారు. యూఏఈలో ప్రస్తుతం దుబాయిలో మాత్రమే హిందూ ఆలయం ఉంది. యూఏఈలో దాదాపు 26లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. అక్కడి జనాభాలో భారతీయులు 30శాతం. ప్రధాని మోదీ 2015లో యూఏఈని సందర్శించినప్పటి నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు పెరిగాయి. 2017లో గణతంత్ర దినోత్సవానికి అబుదాబి రాకుమారుడు మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాంతె ప్రధాన అతిథిగా హాజరయ్యారు.

సౌదీలో అవినీతిపరుల నుంచి 10వేల కోట్ల డాలర్ల సొత్తు స్వాధీనం

రియాద్: అత్యున్నత స్థానాల్లో జరుగుతున్న అవినీతిపై సౌదీ అరేబియా కొరడా ఝుళిపించింది. ఈ కేసుల్లో ఏకంగా 10700 కోట్ల డాలర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆ దేశ అటార్నీ జనరల్ షేక్ సౌద్ అల్ మోజెబ్ తెలిపారు. 56 మంది అనుమానితులపై ఇంకా దర్యాప్తు సాగుతోందన్నారు. 381 మంది అనుమానితులపై విచారణను పూర్తి చేశామని మోజెబ్ చెప్పారు. వీరిలో 56 మందిని కస్టడీలోకి తీసుకున్నామని, మిగతావారిని విడుదల చేశామన్నారు. ఈ అవినీతి వ్యతిరేక పోరుకు 32ఏళ్ల యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ నేతృత్వం వహిస్తున్నారు. సౌదీలోనే అత్యంత ధనికుడైన ప్రిన్స్ అల్-వలీద్ బిన్ తలాల్ కూడా అధికారుల వలలో చిక్కారు. ప్రభుత్వంతో ఆర్థిక సర్దుబాటు తర్వాత విడుదలయ్యారు.

యశ్వంత్ సిన్హా కొత్త రాజకీయ వేదిక

- 'రాష్ట్ర మంచ్' ప్రారంభం.. శతృఘ్న సిన్హా చేరిక



దిల్లీ: భాజపా అసంతృప్త నేత, కేంద్రంపై తరచూ విమర్శలు చేస్తున్న మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా మంగళవారం 'రాష్ట్ర మంచ్' పేరిట కొత్త రాజకీయ వేదికను ప్రారంభించారు. భాజపా ఎంపీ శతృఘ్నసిన్హా నేతృత్వంలోని పలువురు ఇందులో చేరారు. అయితే ఇది పార్టీ వ్యతిరేకచర్య కాదని ఆయన పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వ విధానాలపై ఉద్యమిస్తామని.. రైతుల సమస్యలే తమకు ప్రధానమని యశ్వంత్ సిన్హా ఈ సందర్భంగా తెలిపారు. 'రాష్ట్ర మంచ్' సంస్థ కాదని.. పార్టీలతో సంబంధంలేని రాజకీయ క్రియాశీల బృందమని వివరించారు. ఏ పార్టీకి వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. 70ఏళ్ల క్రితం మహాత్ముడు హత్యకు గురయ్యారని.. ప్రస్తుతం ప్రజాస్వామ్యం, సంబంధిత సంస్థలపై దాడి జరుగుతోందంటూ మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. భాజపాలో అంతా భయంగా బతుకుతున్నారన్నారు. ప్రారంభ కార్యక్రమానికి ఎంపీలు రేణుకాచౌదరి(కాంగ్రెస్), దినేశ్‌త్రివేది(తృణమూల్), మజీద్ మెమోన్(ఎన్‌సీపీ), సంజయ్ సింగ్(ఆప్)లతో పాటు జేడీయూ, ఆర్జేడీ నేతలు తదితరులు హాజరయ్యారు.

ఈపీఎఫ్‌ఓ బకాయిలను సంస్థలు ఇక ఆన్‌లైన్‌లోనే చెల్లించొచ్చు

దిల్లీ: బకాయిల చెల్లింపు, యాజమాన్య మార్పిడి వివరాల నమోదును.. ఆన్‌లైన్‌లోనే చేసుకునే సదుపాయాన్ని సంస్థలకు కల్పించినట్లు ఈపీఎఫ్‌ఓ (ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ) తెలిపింది. యాజమాన్య మార్పిడికి సంబంధించిన 5ఎ ఫారంను ఈపీఎఫ్‌ఓ ఫీల్డ్ కార్యాలయంలో సమర్పించే విధానాన్ని తొలగించినట్లు పేర్కొంది. దీంతో కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన అవసరం సంస్థలకు ఉండదని తెలిపింది. సెక్షన్ 14బి, సెక్షన్ 7క్యూలకు సంబంధించిన బకాయిలను ఆన్‌లైన్‌లో చూసుకుని.. చెల్లించేయొచ్చని పేర్కొంది. 'సులభతర వ్యాపారా'నికి అవకాశం ఉండేలా ఈ చర్య తీసుకున్నట్లు తెలిపింది.

జమిలి ఎన్నికలు ఓ గారడీ: చిదంబరం

దిల్లీ: జమిలి ఎన్నికల ప్రతిపాదన మోదీ ప్రభుత్వ ఎన్నికల గారడీల్లో భాగమేనని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం వ్యాఖ్యానించారు. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చిన మరుసటిరోజే ఆయన తాజా వ్యాఖ్యలు చేశారు. 'స్పీకింగ్ ట్రూత్ టు పవర్'అనే పుస్తకాన్ని మంగళవారం ఆయన విడుదలచేశారు. అనంతరం మాట్లాడుతూ.. జమిలి ఎన్నికలకు ప్రస్తుత రాజ్యాంగం అనుమతించదని చెప్పారు. "ఒకే దేశం ఒకే పన్ను... ఓ ఎన్నికల గారడీ. తాజా జమిలి ప్రతిపాదన మరో ఎన్నికల గారడీ"అంటూ మోదీ ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు.



మంగళవారం దిల్లీలో రాజ్‌ఘాట్ వద్ద జరిగిన సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ప్రధాని మోదీ

బాపూజీకి రాష్ట్రపతి, ప్రధాని, ఉప రాష్ట్రపతి నివాళులు

- 'గాంధీ స్మృతి'లో సర్వమత ప్రార్థనలు

దిల్లీ: మహాత్ముని 70వ వర్ధంతి సందర్భంగా 'గాంధీ స్మృతి' వద్ద జరిగిన సర్వమత ప్రార్థనలకు ప్రధాని నరేంద్ర మోదీ, ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడులు మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా బాపూజీకి పూలతో నివాళులర్పించారు. హిందూ, బౌద్ధ, ఇస్లాం, క్రైస్తవ, బహై, సిక్కు, జూడాయిజమ్, జొరాస్ట్రియన్‌లకు చెందిన మత గురువులు ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దంపతులు, కేంద్ర మంత్రులు హర్షవర్ధన్, మహేశ్‌శర్మలతో పాటు గాంధీజీ మనుమడు గోపాలకృష్ణ గాంధీ తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన విద్యార్థులతో ప్రధాని ముచ్చటించారు. ఇక్కడి బిర్లా భవన్‌ను బాపూజీ హత్యానంతరం 'గాంధీ స్మృతి'గా వ్యవహరిస్తున్నారు. అంతకుముందు ప్రధాని ట్విట్టర్ ద్వారా కూడా మహాత్మునికి నివాళులర్పించారు. దేశం కోసం సర్వస్వం త్యాగం చేసిన అమరులకు శిరసు వంచి వందనాలు సమర్పిస్తున్నామని.. వారి అంకిత భావం, ధైర్య సాహసాలు ఎప్పటికీ స్మరించుకుంటూనే ఉంటామని పేర్కొన్నారు.

వృద్ధులను పట్టించుకోవట్లేదు

- రాష్ట్రాల తీరుపై సుప్రీం అసంతృప్తి

దిల్లీ: కొన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వృద్ధులను పట్టించుకోవడం లేదంటూ సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. వృద్ధుల హక్కుల పరిరక్షణకు సంబంధించి దాఖలైన ఓ అభ్యర్థనపై.. స్పందన తెలియజేయాలని గతేడాది సెప్టెంబర్‌లో కోర్టు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరింది. వృద్ధాశ్రమాల పరిస్థితికి సంబంధించిన వివరాలతో ప్రమాణ పత్రం దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇంకా ప్రమాణ పత్రాలు దాఖలు చేయలేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. దీనిపై తాజాగా జస్టిస్ మదన్ లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసం అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రమాణ పత్రాలు దాఖలు చేయకపోవడం, ఆయా రాష్ట్రాల తరఫున ఎవరూ హాజరుకాకపోవడం.. వృద్ధులపై వారికి పట్టింపు లేదన్న విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయని వ్యాఖ్యానించింది. మూడు వారాల్లోగా వాటిని దాఖలు చేయాలంటూ 'చివరి గడువు'ను విధించింది.

వినియోగదారుల న్యాయస్థానాలపై నియమాలకు గడువు పెంపు

దేశంలో వినియోగదారుల న్యాయస్థానాలు పనిచేయాల్సిన తీరుపై సమగ్ర, ఆదర్శవంతమైన నియమాలు రూపొందించడానికి కేంద్రానికి మరో నాలుగు వారాల గడువునిస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్ర నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం మంగళవారం కేంద్ర సర్కారును ఈ మేరకు ఆదేశించింది. వినియోగదారుల న్యాయస్థానాలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల కొరతను గత నవంబరులో న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. వినియోగదారుల పరిరక్షణ చట్టం కంటితుడుపు చర్యగా మిగిలిపోకుండా క్రమబద్ధ ప్రక్షాళన చేయాలంటూ ఆదేశాలిచ్చింది.



ప్రయోజనాలు అర్హులకు చేరడంపై ప్రభుత్వం ఆందోళనపడకూడదా?

'సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులకే చేరుతున్నాయో లేదో అని ప్రభుత్వం ఆందోళన పడకూడదా?' అంటూ.. ఆధార్ చట్టబద్ధతను సవాలుచేసినవారిని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధి పొందుతున్నవారు జీవించి ఉన్నారా లేదా అన్నది తెలుసుకునేందుకే ప్రభుత్వం పరిమితమైతే తప్పేముందని పేర్కొంది. ఆధార్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరుపుతున్న.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. పౌరులందరి వ్యక్తిగత, బయోమెట్రిక్ వివరాల సేకరణతో.. వారందరిపై నిఘా పెట్టేందుకు దారి తీయొచ్చని పిటిషన్‌దారుడి తరఫు న్యాయవాది వాదించారు. అయితే ఉపాధి హామీ పథకం, ప్రత్యక్ష నగదు బదిలీ, వంటగ్యాస్, కిరోసిన్ పంపిణీల్లో.. ఆధార్‌తో ఎంతో నగదును పొదుపు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించిన విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. ఈ అంశంలో తదుపరి విచారణను కోర్టు బుధవారం కొనసాగించనుంది.

ఆస్తుల జప్తుపై 'సుప్రీం'ను ఆశ్రయించిన కార్తి

ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ ఒప్పందం కేసులో తన ఆస్తుల తాత్కాలిక జప్తును వ్యతిరేకిస్తూ కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తి చిదంబరం దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానమివ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశించింది. ఈ కేసులో అదనపు పత్రాలను దాఖలు చేయడానికి తమకు మరికొంత సమయం కావాలని ఈడీ కోరింది. ఈ పత్రాలతో పాటు పిటిషనర్ లేవనెత్తిన అంశంపై మార్చి 8లోగా సవివర సమాధానం దాఖలు చేయాలని జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ అమితవ రాయ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది.

గాంధీ హత్య కేసు విచారణ న్యాయ అంతిమత్వానికి చేరుకోలేదు!

- అనుమానిత కుట్రదారులను ముందే ఉరితీశారు
- సుప్రీంకోర్టులో పిటిషనర్ అఫిడవిట్

దిల్లీ: మహాత్మా గాంధీ 70వ వర్ధంతిని యావత్తు దేశం జరుపుకుంటున్న వేళ... బాపూజీ హత్య కేసులో విచారణ న్యాయ అంతమత్వానికి చేరుకోక ముందే అనుమానిత కుట్రదారులను ఉరితీశారంటూ మంగళవారం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఒక పిటిషనర్ ఆరోపించారు. గాంధీజీ హత్య కేసు పునర్విచారణ కోరుతూ ఇటీవల దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని(పిల్) సుప్రీంకోర్టు నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. ఈ పిల్‌ను ముంబయికి చెందిన డాక్టర్ పంకజ్ ఫడణవీస్ దాఖలు చేశారు. ఆయన సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో.."గాంధీజీ హత్య కేసులో నాథూరాం గాడ్సే, ఎన్.డి.ఆప్టేలను 1949 నవంబరు 15న ఉరితీశారు. భారత సుప్రీంకోర్టు మరో 71రోజుల్లో (1950 జనవరి26) ఆవిర్భవించనుంది. ఆ లోగానే మరణ దండన అమలయ్యింది. సుప్రీంకోర్టు ఏర్పడే వరకూ ఆగి ఉంటే అనుమానిత కుట్రదారుల వాదనలను సర్వోన్నత న్యాయస్థానం వినే అవకాశం లభించేది. అనుమానిత కుట్రదారుల్లో ఒకరైన ఆప్టే కుటుంబ సభ్యులు ఈ మేరకు విజ్ఞప్తి చేసుకున్నా ఆలకించలేదు. గాంధీజీ హత్య కేసు న్యాయ అంతిమత్వానికి చేరుకోకముందే అనుమానిత కుట్రదారులకు శిక్ష అమలయ్యింద"ని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యంలో కోర్టుకు న్యాయ సహాయకుడు,అమరేందర్ శరణ్ సమర్పించిన నివేదికను తోసిపుచ్చుతూ పిటిషనర్ తన అఫిడవిట్‌ను దాఖలు చేశారు.

సీజేఐతో న్యాయమూర్తుల కరచాలనం

- బార్ అసోసియేషన్ కార్యక్రమానికి హాజరైన జడ్జీలు
- జమిలి ఎన్నికలపై న్యాయవ్యవస్థ ఆలోచించాలి: రవిశంకర్ ప్రసాద్

దిల్లీ: కేసుల కేటాయింపులో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్ర తీరును తప్పుపట్టిన న్యాయమూర్తుల్లో ఇద్దరైన జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్... మంగళవారం ఆయనతో కలిసి ఒక కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు కరచాలనం కూడా చేశారు. ఈ సన్నివేశాన్ని కెమేరాల్లో బంధించడానికి ఛాయాగ్రహకులు పోటీ పడ్డారు. జనవరి 12న విలేకరుల సమావేశాన్ని నిర్వహించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తుల్లో మిగిలిన ఇద్దరు (జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగొయ్) మాత్రం దీనికి హాజరు కాలేదు. వీరిద్దరూ యథావిధిగా కేసుల విచారణలో పాల్గొన్నారు. 'సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్' (ఎస్‌సీబీఏ) మంగళవారం సుప్రీంకోర్టు ఆవరణలోనే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'ఎస్‌సీబీఏ టైమ్స్' సంచికను కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సమక్షంలో సీజేఐ ఆవిష్కరించారు. పార్లమెంటుకు, శాసన సభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదన గురించి రవిశంకర్ ప్రసాద్ ప్రస్తావించారు. ఈ ఆలోచనపై న్యాయవ్యవస్థ కూడా ఆలోచించాలని కోరారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులైన జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ ఎ.ఎం.ఖన్విల్కర్, జస్టిస్ ఎం.ఎం.శాంతనుగౌడర్, జస్టిస్ అశోక్ భూషణ్ హాజరయ్యారు. కార్యక్రమం తర్వాత న్యాయశాఖ మంత్రితో న్యాయమూర్తులు తేనీటి విందులో పాల్గొన్నారు. న్యాయవ్యవస్థలో ఇటీవల తలెత్తిన సంక్షోభం గురించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలివ్వడానికి జస్టిస్ మిశ్ర, జస్టిస్ లోకుర్, జస్టిస్ జోసెఫ్‌లు నిరాకరించారు.



షిల్లాంగ్‌లో జరిగిన సంగీత కార్యక్రమం 'సెలబ్రెషన్ ఆఫ్ పీస్'లో పాల్గొన్న రాహుల్‌గాంధీ, మేఘాలయ సీఎం ముకుల్ సంగ్మా

ప్రజాస్పందన ఉత్సాహభరితం: రాహుల్

దిల్లీ: మేఘాలయలో ఎన్నికల ప్రచారం తనకెంతో ఉత్సాహాన్ని, ఆనందాన్ని ఇస్తోందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావటం తనను ఉద్వేగానికి గురిచేస్తోందన్నారు. షిల్లాంగ్‌లో పార్టీ ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈశాన్య రాష్ట్రాలతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమంలో ట్వీట్ చేశారు.

సొంతిల్లు లేని త్రిపుర సీఎం

- చేతిలో రూ.1520...బ్యాంకు ఖాతాలో రూ.2,410 నగదు...
- ఇవే మాణిక్ సర్కార్ వ్యక్తిగత ఆస్తులు
- ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి

అగర్తల

త్రిపుర ముఖ్యమంత్రిగా గత నాలుగు దఫాలుగా కొనసాగుతున్న మాణిక్ సర్కార్ తన జీవితంలో ఇంత వరకూ ఆదాయపు పన్ను మదింపు (ఐటీ రిటర్న్స్) పత్రాలను దాఖలు చేయలేదని వెల్లడించారు. తన వద్ద కేవలం రూ.3,930 నగదు మాత్రమే ఉందని ఎన్నికల ప్రమాణ పత్రం (అఫిడవిట్)లో పేర్కొన్నారు. ఈ మొత్తంలోనూ చేతిలో ఉన్న సొమ్ము రూ.1,520లేనట. మిగిలిన రూ.2410 తనకున్న ఒకేఒక జాతీయబ్యాంకు ఖాతాలో ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ధన్‌పుర్ నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా తనకు వచ్చే జీతం మొత్తాన్ని సీపీఎంకే విరాళంగా ఇస్తున్నానని, పార్టీ ప్రతినెలా ఇచ్చే రూ.5వేలనే ఖర్చులకు వినియోగిస్తున్నట్లు వామపక్ష నేత వివరించారు. తనకు వ్యవసాయ భూమి, సొంతిల్లు, స్థలం వంటి స్థిరాస్తులేమీ లేవని ప్రమాణపత్రంలో వెల్లడించారు.



అయితే, మాణిక్ సర్కార్ సతీమణి పాంచాలీ భట్టాచార్యకు ఆమె పుట్టింటి వారిచ్చిన 888.35 చదరపు అడుగుల స్థలం ఉంది. కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి అయిన ఆమెకు రెండు బ్యాంకు ఖాతాల్లో రూ.1,24,101; రూ.86,473.78 నగదు ఉంది. చేతిలో రూ.20,140 నగదును, 20 గ్రాముల బంగారు ఆభరణాలను కలిగి ఉన్నారు. మూడు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో మొత్తం రూ.9.25 లక్షలను పొదుపు చేశారు. పుట్టింటివారిచ్చిన స్థలంలో రూ.15లక్షలు వెచ్చించి భవన నిర్మాణం చేపట్టారని, ఆ ఆస్తి మొత్తం విలువ రూ.21 లక్షలుగా అఫిడవిట్‌లో మాణిక్ సర్కార్ పేర్కొన్నారు. పాంచాలీ భట్టాచార్య చివరిసారిగా 2011-12లో ఆదాయపు పన్ను మదింపు పత్రం సమర్పించారు. అప్పుడు ఆమె వార్షికాదాయం రూ.4.49లక్షలుగా చూపారు.

నాగాలాండ్‌లో ఎన్నికల బహిష్కరణ నుంచి వైదొలగిన భాజపా

- సంయుక్త ప్రకటనపై సంతకం చేసిన పార్టీ రాష్ట్రనేతపై వేటు

కోహిమా/లీ: నాగాలాండ్‌లో అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలన్న అఖిలపక్ష సంయుక్త ప్రకటన నుంచి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ వైదొలగింది. బహిష్కరణ నిర్ణయాన్ని భాజపా జాతీయ నాయకత్వం తీవ్రంగా వ్యతిరేకించటంతో పాటు సంయుక్త ప్రకటనపై సంతకం చేసిన రాష్ట్ర నేత ఖేటో సెమాపర్తిపై వేటు వేసింది. ఎన్నికల నిర్వహణ రాజ్యాంగ ప్రక్రియ అని, రాజ్యాంగానికి కట్టుబడి కేంద్ర ప్రభుత్వం పనిచేయాల్సి ఉంటుందని నష్టనివారణ చర్యలకు రంగంలోకి దిగిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరన్ రిజిజు తెలిపారు. ఆయన నాగాలాండ్‌లో భాజపా ఎన్నికల ఇన్‌ఛార్జి కూడా. నాగాలాండ్‌లో అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్, దాని మిత్రపక్షం భాజపా, కాంగ్రెస్ సహా 11 రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికల బహిష్కరణ సంయుక్తప్రకటనపై సోమవారం సంతకం చేశాయి.

ఇద్దరు మేఘాలయ ఎమ్మెల్యేల రాజీనామా

షిల్లాంగ్: మేఘాలయలో రాజీనామాల పర్వం నడుస్తోంది. తాజాగా స్వతంత్ర ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసనసభ్యుడు కూడా తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ లేఖలను అసెంబ్లీ కమిషనర్, కార్యదర్శికి పంపించారు. వీరితో సహా ఇప్పటి వరకూ 20 మంది రాజీనామాల బాటపట్టారు. వీరిలో నలుగురు భాజపాలో చేరారు.

కాంగ్రెస్‌లో నేడు ట్రంప్ తొలి ప్రసంగం

- హాజరుకానున్న శ్రీనివాస్ కూచిభొట్ల భార్య సునయన



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. బుధవారం కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తారు. కేన్సస్ రాష్ట్రంలో జరిగిన జాతి విద్వేష కాల్పుల్లో మరణించిన తెలుగు ఇంజినీరు శ్రీనివాస్ కూచిభొట్ల భార్య సునయన కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. కాంగ్రెస్ ఉభయ సభలను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు ఏటా ప్రసంగిస్తుంటారు. దీన్ని 'స్టేట్ ఆఫ్ ది యూనియన్ అడ్రస్'గా పేర్కొంటారు. దేశంలో నెలకొన్న తాజా స్థితిగతులను ఆయన ఇందులో వివరిస్తుంటారు. తన తొలి ప్రసంగంలో ఎక్కువగా వాణిజ్యం, వలసల గురించి ప్రసంగిస్తానని ట్రంప్ ఇప్పటికే చెప్పారు. సురక్షితమైన, బలమైన, గర్వకారణమైన అమెరికా నిర్మాణమే ఈ ప్రసంగ ఇతివృత్తమని వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి శారా శాండర్స్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే అతిథుల గురించి వివరిస్తూ.. "కొందరి గాథలు వీరోచితంగా ఉంటాయి. కొందరివి దేశభక్తితో నిండి ఉంటాయి. మరికొందరివి విషాదమయంగా ఉంటాయి. అయితే వారందరూ అవిచ్ఛిన్న అమెరికా స్ఫూర్తికి నిదర్శనం" అని ఆమె తెలిపారు.

మరోపక్క కాంగ్రెస్ సభ్యులు దేశవ్యాప్తంగా పలువురు అతిథులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. శ్రీనివాస్ కూచిభొట్ల భార్య సునయనను కాంగ్రెస్ సభ్యుడు కెవిన్ యోడర్ ఆహ్వానించారు. శ్రీనివాస్‌ను గత ఏడాది ఓలేథ్ ఒక బారులో ఆడమ్ ప్యూరింటన్ అనే వ్యక్తి జాతి విద్వేషంతో కాల్చి చంపిన సంగతి తెలిసిందే. "శాంతిని పెంపొందించడానికి అవిశ్రాంతంగా చేసిన కృషికి గుర్తింపుగా సునయనను నా ఆతిథిగా ఆహ్వానించా. అమెరికా.. వలసదారుల దేశమని, మిమ్మల్ని ఇక్కడికి స్వాగతిస్తామని భారతీయులకు సందేశమివ్వడం దీని ఉద్దేశం" అని యోడర్ తెలిపారు. సునయనను ఆహ్వానించడంపై భారత-అమెరికన్ సమాజం హర్షం వ్యక్తంచేసింది.

తాలిబన్లతో చర్చలుండవు: తాలిబన్లతో చర్చలుండవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. వారిని అంతమొందిస్తామని చెప్పారు. అఫ్గానిస్థాన్‌లో ఉగ్రవాదులు వరుస దాడులతో 130 మందిని బలి తీసుకున్న నేపథ్యంలో తనతో సమావేశమయిన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి రాయబారులతో ట్రంప్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. తాలిబన్లు ప్రజలను ఎడాపెడా చంపేస్తున్నారని, ఎక్కడ పడితే అక్కడే బాంబులతో దాడులు చేస్తున్నారని ట్రంప్ అన్నారు. తాలిబన్లపై గట్టి సైనిక చర్య ఉంటుందని ఈ సందర్భంగా ట్రంప్ సంకేతాలిచ్చారు.

గ్రీన్‌కార్డుల జారీలో జాప్య నివారణ కోరుతూ ప్రచారం

వాషింగ్టన్: భారీ ఎత్తున పేరుకుపోయి ఉన్న గ్రీన్‌కార్డు దరఖాస్తుల పరిష్కారాన్ని కోరుతూ ప్రముఖ భారతీయ అమెరికన్లు దేశ వ్యాప్త ప్రచారాన్ని ప్రారంభించారు. ఇందుకోసం జిసిరిఫార్మ్స్.ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. గ్రీన్‌కార్డుల పరిష్కారానికి సంస్కరణలు చేపట్టకపోవడం వల్ల దాదాపు 3లక్షల మంది అత్యంత నిపుణులైన భారతీయులపై ప్రభావం పడుతోంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం భారత్‌కు చెందిన నైపుణ్య వలసదారులు గ్రీన్‌కార్డు కోసం 25-92 ఏళ్ల పాటు వేచి చూడాల్సి వస్తోందని ఈ వెబ్‌సైట్ పేర్కొంది. దేశాల వారీ కోటానే ఇందుకు కారణం. వలసల సంస్కరణల వివరాలను శ్వేతసౌధం.. కాంగ్రెస్‌కు పంపించిన నేపథ్యంలో దేశవ్యాప్త ప్రచారం చేపట్టడం గమనార్హం.

వలసల సమస్యలో ఫిజిషియన్ వర్గాలకు మద్దతు పలకడంతో పాటు ఇంజినీర్లకు సముచిత రీతిలో గ్రీన్‌కార్డుల కేటాయింపు ప్రక్రియను అనుసరించాలని కూడా తాము కోరుతున్నట్లు జిసిరిఫార్మ్స్.ఓఆర్‌జీ ప్రెసిడెంట్ సంపత్ శివంగి చెప్పారు. గ్రీన్‌కార్డుల జారీలో జాప్యాన్ని తొలగించాలని, జాప్యం కారణంగా అమెరికా నవ్యావిష్కరణలు, ఉద్యోగాల సృష్టి మందగిస్తున్నాయని జిసిరిఫార్మ్స్.ఓఆర్‌జీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన కిరణ్‌కుమార్ తోట అన్నారు.

రేపు యథావిధిగానే కేంద్ర బడ్జెట్ సమర్పణ

- భాజపా ఎంపీ వనగా కన్నుమూత

దిల్లీ/ ముంబయి: మహారాష్ట్రలోని పాల్ఘడ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ భాజపా ఎంపీ చింతామన్ వనగా (67) మంగళవారం కన్నుమూసినా గురువారం కేంద్ర బడ్జెట్టును మాత్రం యథావిధిగా ప్రవేశపెట్టనున్నారు. ఉదయం 11.15 గంటల సమయంలో దిల్లీలోని ఫిరోజ్‌షా రోడ్‌లోని తన నివాసంలో కుప్పకూలిన ఎంపీని వెంటనే రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రికి తరలించారు. అరగంట పాటు విఫల యత్నాలు చేసిన వైద్యులు... ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు ధ్రువీకరించారు. వనగాకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మహారాష్ట్రలోని తల్సారిలో ఆయన స్వగ్రామమైన కవాద్‌కు భౌతిక కాయాన్ని తరలించారు. బుధవారం మధ్యాహ్నం అక్కడ అంత్యక్రియలు జరుగుతాయి. వృత్తిరీత్యా న్యాయవాది అయిన వనగా ఒకసారి ఎమ్మెల్యేగా, మూడుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ఆయన మృతిపట్ల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. మంగళ, బుధవారాల్లో పార్లమెంటు సమావేశాలు లేనందున గురువారం సభ ప్రారంభం కాగానే తొలుత సంతాప సందేశం ప్రవేశపెడతారు. ఆ తర్వాత బడ్జెట్ సమర్పణ ఉంటుంది. బడ్జెట్టుకు ఎలాంటి అంతరాయం కలగబోదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ వర్గాలు తెలిపాయి. గత ఏడాది బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తున్నప్పుడు ఎంపీ, ఐయూఎంఎల్ నేత ఇ.అహ్మద్ కుప్పకూలి ప్రాణాలు విడిచారు. బడ్జెట్ సమర్పణను యథావిధిగా పూర్తి చేసి, మరుసటి రోజు సభను అహ్మద్ మృతికి సంతాప సూచికంగా వాయిదా వేశారు.

ఛాంపియన్స్



అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్న భారత యువ జట్టు దెబ్బకు మరో జట్టు బెంబేలెత్తింది. ఇటు బ్యాటింగ్‌లో, అటు బౌలింగ్‌లో భారత కుర్రాళ్లు సమష్టిగా సత్తా చాటడంతో పాకిస్థాన్ నిలవలేకపోయింది. చిత్తుగా ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఏకంగా 203 పరుగుల తేడాతో భారీ విజయం సాధించిన యువ భారత్.. కప్పు కోసం కంగారూ జట్టుతో అమీతుమీకి సిద్ధమైంది. ఆస్ట్రేలియాను లీగ్ దశలో భారత్ 100 పరుగుల తేడాతో చిత్తు చేయడం విశేషం.


యువ.. హవా



- సెమీస్‌లో చెలరేగిన భారత కుర్రాళ్లు
- 203 పరుగుల తేడాతో పాక్ చిత్తు
- 69కే కుప్పకూలిన ప్రత్యర్థి
- కప్పు కోసం ఆసీస్‌తో అమీతుమీ

క్రైస్ట్‌చర్చ్

భారత యువ జట్టు అండర్-19 ప్రపంచకప్ అందుకోవడానికి ఇంకొక్క విజయం చాలు. టోర్నీలో మరే జట్టుకూ సాధ్యం కాని రీతిలో జైత్రయాత్ర సాగిస్తూ పృథ్వీ షా సేన ఫైనల్‌కు దూసుకొచ్చింది. మొన్న క్వార్టర్స్‌లో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించిన భారత్.. మంగళవారం పాకిస్థాన్‌ను 203 పరుగుల తేడాతో చిత్తు చేసి ఫైనల్‌కు దూసుకెళ్లింది. భీకర ఫామ్‌లో ఉన్న యువ బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్ (102 నాటౌట్, 94 బంతుల్లో 7×4) జోరు కొనసాగిస్తూ అజేయ సెంచరీ సాధించడంతో మొదట భారత్.. 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. అనంతరం ఏమాత్రం పోరాట పటిమ చూపించని పాక్ 29.3 ఓవర్లలో కేవలం 69 పరుగులకే కుప్పకూలింది. ఇషాన్ పోరెల్ (4/17), శివ సింగ్ (2/20), పరాగ్ (2/6) పాక్ పతనాన్ని శాసించారు. శుభ్‌మన్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఫైనల్ శనివారం జరుగుతుంది.



ఇషాన్ (4/17)

వీళ్ల మెరుపులు.. వాళ్ల తప్పులు: టోర్నీ ఆరంభం నుంచి శుభారంభాలందిస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఓపెనర్లు పృథ్వీ షా (41; 42 బంతుల్లో 3×4, 1×6), మన్‌జోత్ కల్రా (47; 59 బంతుల్లో 7×4) .. సెమీస్‌లోనూ మెరిశారు. ఇద్దరూ చక్కటి షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఐతే పాకిస్థాన్ ఫీల్డింగ్ సరిగ్గా ఉంటే భారత్ ఇబ్బందుల్లో పడేదే. నాలుగు క్యాచ్‌లు, మూడు రనౌట్ అవకాశాల్ని ఆ జట్టు వృథా చేసింది. దీంతో ఓపెనర్లకు ఎదురులేకపోయింది. ఇద్దరూ ధాటిగా ఆడుతూ అర్ధసెంచరీల దిశగా అడుగులేశారు. ఐతే 16వ ఓవర్లో షా రనౌటై వెనుదిరిగాడు. కాసేపటికే కల్రా కూడా ఔటయ్యాడు. దేశాయ్ (20), పరాగ్ (2)లతో పాటు క్వార్టర్స్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన అభిషేక్ శర్మ (5) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవకపోవడంతో భారత్ 166/5తో కష్టాల్లో పడింది. ఈ దశలో శుభ్‌మన్ అద్భుత బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌ను నడిపించాడు. అనుకుల్ (33) నుంచి అతడికి సహకారం అందింది. వీళ్లిద్దరూ ఆరో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయడంతో స్కోరు 230 దాటింది. అనుకుల్ ఔటయ్యాక.. మిగతా బ్యాట్స్‌మెన్ నుంచి పెద్దగా సహకారం లేకపోయినా శుభ్‌మన్ మరో ఎండ్‌లో చక్కగా ఆడుతూ భారత్‌కు మంచి స్కోరు సాధించి పెట్టాడు. అతను ఇంకో బంతి మిగిలుండగా సెంచరీ పూర్తి చేశాడు. పాక్ బౌలర్లలో ముసా (4/67), ఇక్బాల్ (3/51) రాణించారు.

ఎలా పడితే అలా..: పాక్ ఏ దశలో లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించలేదు. భారత బౌలింగ్ కట్టుదిట్టంగా సాగింది. అందరూ క్రమశిక్షణతో బంతులేశారు. ముఖ్యంగా పోరెల్‌ను ఎదుర్కోవడం పాక్ బ్యాట్స్‌మెన్‌కు శక్తికి మించిన పనే అయింది. వారు పేలవ షాట్లు ఆడారు. బంతిని ఎలా పడితే అలా గాల్లోకి లేపారు. భారత ఫీల్డింగ్.. పాక్‌కు భిన్నంగా సాగింది. పృథ్వీ స్లిప్‌లో రెండు కళ్లు చెదిరే క్యాచ్‌లు అందుకున్నాడు. శుభ్‌మన్ సైతం వెనక్కి పరుగెడుతూ చక్కటి క్యాచ్ పట్టాడు. మావి బౌండరీ దగ్గర ఓ క్యాచ్ అద్భుత రీతిలో అందుకున్నాడు. 18 పరుగులు చేసిన రోహైల్ నజీరే పాక్ జట్టులో టాప్‌స్కోరర్. ఇంకో ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు.

భారత్ ఇన్నింగ్స్: పృథ్వీ షా రనౌట్ 41; మన్‌జోత్ కల్రా (సి) నజీర్ (బి) మూసా 47; శుభ్‌మన్ గిల్ నాటౌట్ 102; హార్విక్ దేశాయ్ (సి) సాద్ ఖాన్ (బి) ఇక్బాల్ 20; పరాగ్ (సి) నజీర్ (బి) ఇక్బాల్ 2; అభిషేక్ శర్మ (సి) నజీర్ (బి) ఇక్బాల్ 5; అనుకుల్ (సి) నజీర్ (బి) మూసా 33; నాగర్‌కోటి (బి) షా అఫ్రిది 1; శివమ్ మావి (సి) అండ్ (బి) మూసా 10; శివ సింగ్ ఎల్బీ (బి) మూసా 1; పోరెల్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (50 ఓవర్లలో 9 వికెట్లకు) **272; వికెట్ల పతనం:** 1-89, 2-94, 3-148, 4-156, 5-166, 6-233, 7-242, 8-265, 9-267; **బౌలింగ్:** అర్షద్ ఇక్బాల్ 10-0-51-3; మహ్మద్ మూసా 10-0-67-4; షా అఫ్రిది 10-0-62-1; హసన్ ఖాన్ 10-0-46-0; మహ్మద్ తాహా 7-0-35-0; జర్యబ్ అసిఫ్ 3-0-11-0

పాకిస్థాన్ ఇన్నింగ్స్: ఇమ్రాన్ షా (సి) షా (బి) పోరెల్ 2; జైద్ ఆలమ్ (సి) మావి (బి) పోరెల్ 7; రోహైల్ నజీర్ (సి) శుభ్‌మన్ (బి) పరాగ్ 18; జర్యబ్ అసిఫ్ (సి) షా (బి) పోరెల్ 1; అమద్ ఆలమ్ (సి) మావి (బి) పోరెల్ 4; తాహా (సి) నాగర్‌కోటి (బి) శివ సింగ్ 4; సాద్ ఖాన్ (స్టంప్డ్) దేశాయ్ (బి) అనుకుల్ 15; హసన్ ఖాన్ (సి) శుభ్‌మన్ (బి) పరాగ్ 1; షా అఫ్రిది (సి) అండ్ (బి) శివ సింగ్ 0; మూసా నాటౌట్ 11; అర్షద్ ఇక్బాల్ (సి) పోరెల్ (బి) అభిషేక్ శర్మ 1; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (29.3 ఓవర్లలో ఆలౌట్) **69; వికెట్ల పతనం:** 1-10, 2-13, 3-20, 4-28, 5-37, 6-41, 7-45, 8-48, 9-68; **బౌలింగ్:** శివమ్ మావి 4-3-6-0; పోరెల్ 6-2-17-4; నాగర్‌కోటి 5-1-7-0; శివ సింగ్ 8-0-20-2; పరాగ్ 4-1-6-2; అనుకుల్ రాయ్ 2-0-11-1; అభిషేక్ శర్మ 0.3-0-0-1

"పాకిస్థాన్ జట్టులో అత్యధిక వ్యక్తిగత స్కోరు 18. అండర్-19 క్రికెట్ అంటే పాక్ ఆటగాళ్లు మరోలా అర్థం చేసుకున్నట్లున్నారు"
– భారత్–పాక్ సెమీఫైనల్ అనంతరం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్న జోక్ ఇది.

"పాకిస్థాన్‌పై ఆడిన ఈ ఇన్నింగ్స్‌ను చాలా ఉన్నతమైందిగా భావిస్తున్నా. పిచ్ నెమ్మదిగా ఉంది. ఇక్కడ షాట్లు ఆడటం అంత తేలిక కాదు. సెంచరీ సాధించి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' గెలవడం చాలా ఆనందంగా ఉంది" – శుభ్‌మన్ గిల్

"బ్యాట్స్‌మెన్‌తో పాటు బౌలర్లూ అద్భుతంగా రాణించారు. ఈ ప్రదర్శన నాకెంతో సంతృప్తినిచ్చింది. ఆస్ట్రేలియాతో ఫైనల్ కోసం చాలా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాం"
– పృథ్వీ షా, భారత అండర్–19 కెప్టెన్



"శుభ్‌మన్ క్రికెట్‌కే అంకితమయ్యాడు. ప్రస్తుత ప్రపంచకప్‌లో అతని ప్రదర్శన పట్ల గర్విస్తున్నా. పాకిస్థాన్‌తో సెమీఫైనల్లో అతను సెంచరీ చేయడం ఇంకా ఆనందంగా ఉంది. శుభ్‌మన్ చిన్నప్పటి నుంచి ఏ ఆట వస్తువులు ఇష్టపడలేదు. క్రికెట్ బ్యాట్ తప్ప. అతను ప్రపంచ స్థాయి క్రికెటర్‌గా తయారు కావడానికి 15 ఏళ్లు ఎంతో కష్టపడ్డాం. ఫలితం ఇప్పుడు కనిపిస్తోంది"
– గిల్ నాన్న లఖ్విందర్‌సింగ్



శుభ్‌మన్ 102 నాటౌట్

1
యూత్ వన్డేల్లో వరుసగా ఆరు 50+ స్కోర్లు సాధించిన తొలి బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్. చివరి ఆరు ఇన్నింగ్స్‌ల్లో అతను 147, 66, 63, 90, 86, 102 పరుగులు చేశాడు.


3
ఆస్ట్రేలియాతో సమానంగా భారత్ అండర్-19 ప్రపంచకప్ గెలిచిన సందర్భాలు. ఫైనల్లో గెలిచిన జట్టు అత్యధికసార్లు విజేత అవుతుంది.

6
అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్ చేరడమిది ఆరోసారి. 2000, 2008, 2012ల్లో విజేతగా నిలిచిన భారత్.. 2006, 2016 టోర్నీల్లో ఓటమి పాలైంది.

నయా యువీ

అండర్-19 ప్రపంచకప్‌లో జింబాబ్వేతో భారత్ లీగ్ మ్యాచ్. . పేసర్ నుంగు వేసిన బంతిని ఒక కుర్రాడు మిడ్ వికెట్ మీదుగా పుల్ చేసి సిక్స్ కొట్టాడు. చిత్రం ఏమిటంటే అచ్చంగా ఆ షాట్ విరాట్ కోహ్లి ఆడే పుల్ షాట్‌ను పోలి ఉండడం! ఆ మ్యాచ్ అయిన వెంటనే బీసీసీఐ ఆ కుర్రాడు ఆడిన షాట్‌కు సంబంధించిన వీడియోను విరాట్ వీడియోను పోల్చి అధికారిక వెబ్‌సైట్లో పెట్టింది. అతని మెరుపు ఆటకు ఇదో మచ్చుతునక మాత్రమే. ఈ కుర్రాడే శుభ్‌మన్ గిల్. ప్రస్తుత అండర్-19 ప్రపంచకప్‌లో 341 పరుగులు చేసి భారత్ ఫైనల్ చేరడంలో కీలకపాత్ర పోషించాడీ పంజాబ్ యువ కెరటం. పంజాబ్ అనగానే యువరాజ్ గుర్తొస్తాడు. ఇప్పుడు 18 ఏళ్ల శుభ్‌మన్ అతని బాటలోనే పయనిస్తున్నాడు. పాకిస్థాన్‌తో సెమీఫైనల్లో సెంచరీ సాధించిన శుభ్‌మన్ భవిష్యత్ ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు. ఆఫ్‌సైడ్ అతనాడే డ్రైవ్‌లు, మిడ్ వికెట్ మీదుగా కొట్టే పుల్ షాట్లు విరాట్‌ను గుర్తుకు తెస్తాయి. ఇంతటి ప్రతిభావంతుడు కనుకే ఈ ఏడాది ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.1.8 కోట్లు ఇచ్చి మరీ అతణ్ని సొంతం చేసుకుంది. పంజాబ్ బ్యాటింగ్ అంటే పవర్, నైపుణ్యం కలయిక. గతంలో మొహిందర్ అమర్‌నాథ్, నవ్‌జ్యోత్‌సింగ్ సిద్ధూ.. ఇప్పటిదాకా యువరాజ్‌సింగ్ ఈ ఒరవడిని కొనసాగించారు. తాజాగా వారి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుంటూ శుభ్‌మన్ వెలుగులోకి వచ్చాడు. అందుకే అతణ్ని నయా యువరాజ్ అంటున్నారు మాజీలు. "ప్రస్తుత తరం ఆటగాళ్లు ఆడే అన్ని రకాల వైవిధ్యమైన షాట్లు అలవోకగా కొట్టడం శుభ్‌మన్ ప్రత్యేకత. దిల్‌స్కూప్, ర్యాంప్ షాట్ ఇలా చాలా అస్త్రాలు ఉన్నాయి అతని దగ్గర. ముఖ్యంగా డీప్ స్క్వేర్ లెగ్ మీదుగా అతను కొట్టే పుల్ షాట్ అద్భుతం. కష్టమైన ఈ షాట్‌ను చాలా తేలిగ్గా కొట్టేస్తున్నాడతను. యువీ లాగే అతను గొప్ప ప్రతిభావంతుడు" అని శుభ్‌మన్ ఆటతీరును అతని చిన్నప్పటి నుంచి గమనిస్తున్న హర్భజన్‌సింగ్ అన్నాడు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ జిల్లా ఫాజిల్‌కాకు చెందిన శుభ్‌మన్.. ధనవంతుల కుటుంబం నుంచి వచ్చాడు. అతని తండ్రి లఖ్విందర్‌కి వ్యవసాయక్షేత్రం ఉంది. దీనిలోనే శుభ్‌మన్‌కు ఒక టర్ఫ్ పిచ్ ఏర్పాటు చేశాడాయన. ఆ తర్వాత శుభ్‌మన్‌ను మొహాలీలోని అకాడమీలో చేర్పించాడు. ఇక్కడే అతను రాటుదేలాడు.

వాండరర్స్ పేలవం



దుబాయ్: భారత్, దక్షిణాఫ్రికా మూడో టెస్టుకు వేదికైన వాండరర్స్ మైదానంలోని పిచ్‌కు ఐసీసీ పేలవ రేటింగ్ ఇచ్చింది. అస్థిర బౌన్స్ కారణంగా బంతి అనేకసార్లు బ్యాట్స్‌మెన్ శరీరాలకు తగిలిన సంగతి తెలిసిందే. బుమ్రా బౌన్సర్ ఎల్గర్ హెల్మెట్‌ను తగలడంతో ఆటను కొనసాగించడం ప్రమాదకరమని భావించిన అంపైర్లు మూడో రోజు ఆటను నిర్ణీత సమయం కంటే ముందే ముగించారు కూడా. ఈ నేపథ్యంలోనే ఐసీసీ.. వాండరర్స్ పిచ్ బాగా లేదని తేల్చింది. "వాండరర్స్ పిచ్ 'పేలవం'గా ఉన్నట్లు ఐసీసీ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ రేటింగ్ ఇచ్చాడు. దీంతో నిబంధనల ప్రకారం ఆ పిచ్‌కు మూడు అయోగ్యతా పాయింట్లు లభించాయి" అని ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. ఐసీసీ నిబంధనల ప్రకారం.. పిచ్ నాణ్యత సగటు కన్నా తక్కువగా ఉందని మ్యాచ్ రిఫరీ తేలిస్తే ఒక అయోగ్యతా పాయింటు, పేలవంగా ఉందని పేర్కొంటే మూడు పాయింట్లు, పిచ్ పనికిరాదని తేలిస్తే ఐదు పాయింట్లు ఇస్తారు. ఈ పాయింట్లు ఐదేళ్లపాటు లెక్కలో ఉంటాయి. ఈ సమయంలో అయోగ్యతా పాయింట్లు ఐదుకు చేరిన పిచ్‌ను అంతర్జాతీయ క్రికెట్‌కు ఆతిథ్యం ఇవ్వకుండా ఏడాది నిషేధం విధిస్తారు.

తటస్థ క్యూరేటర్లు ఉండాలి... వెంగ్‌సర్కార్: టెస్టుల్లో తటస్థ అంపైర్లు ఉన్నట్లే తటస్థ క్యూరేటర్లూ ఉండాలని భారత మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ అభిప్రాయపడ్డాడు. "దక్షిణాఫ్రికాలో పిచ్‌లు పేలవం. ఐసీసీ టెస్టులకు తటస్థ అంపైర్లను నియమిస్తున్నప్పుడు తటస్థ క్యూరేటర్లను ఎందుకు నియమించకూడదు? మూడో టెస్టు దాదాపు రద్దయినంత పనైంది. అలాంటి పిచ్‌లను ఎక్కడా అనుమతించకూడదు" అని అన్నాడు.



డివిలియర్స్ ఔట్

భారత్‌తో తొలి మూడు వన్డేలకు దూరం

డర్బన్: భారత్‌తో వన్డే సిరీస్ ముంగిట దక్షిణాఫ్రికాకు ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ తొలి మూడు వన్డేలకు దూరమయ్యాడు. అతడి కుడి చేతి వేలికి గాయం కావడమే ఇందుకు కారణం. డివిలియర్స్ స్థానంలో వేరే ఆటగాడిని సెలక్టర్లు ఎంపిక చేయలేదు. ఆరు వన్డేల సిరీస్ గురువారం ఆరంభమవుతుంది. ఫిబ్రవరి 10న జరిగే నాలుగో వన్డేకు ఏబీ అందుబాటులోకి వస్తాడని దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు ఆశాభావం వ్యక్తం చేసింది.

వన్డేల్లో పరుగుల వరదే.. డుమిని: వన్డే సిరీస్‌లో పరుగుల వరద ఖాయమని దక్షిణాఫ్రికా ఆటగాడు జేపీ డుమిని అన్నాడు. "పిచ్‌లు బ్యాట్స్‌మెన్‌కు అనుకూలంగా ఉంటాయి. దేశవ్యాప్తంగా భారీ స్కోర్లు నమోదు కావడం ఖాయమనిపిస్తోంది. దీని వల్ల పోటీ మరింత తీవ్రం కానుంది. వన్డే క్రికెట్లో బ్యాటుతో, బంతితో భాగస్వామ్యాలు ముఖ్యం. అవి నమోదు చేయడంలో విజయవంతమైన జట్టుకు విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి" అని చెప్పాడు.

ఐపీఎల్ లేదు.. పుజారా మళ్లీ అక్కడికే!



లండన్: వరుసగా రెండో ఏడాది కూడా ఐపీఎల్ వేలంలో అమ్ముడుబోని టీమ్‌ఇండియా టెస్టు ఆటగాడు చెతేశ్వర్ పుజారా.. గత ఏడాది లాగే కౌంటీల బాట పట్టనున్నాడు. నిరుడు ఐపీఎల్‌లో ఆడే అవకాశం లేకపోవడంతో అతను ఇంగ్లాండ్ వెళ్లి కౌంటీల్లో ఆడిన సంగతి తెలిసిందే. భారత్ ఈ ఏడాది ఆగస్టు నుంచి ఇంగ్లాండ్‌లో పర్యటించాల్సి ఉన్న నేపథ్యంలో ఖాళీగా ఉన్న ఈ సమయంలో కౌంటీలు ఆడటం మేలు చేస్తుందని పుజారా భావిస్తున్నాడు. అతను యార్క్‌షైర్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు.



శరత్ ఎనిమిదోసారి

దిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ స్టార్ ఆచంట శరత్ కమల్ రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి జాతీయ ఛాంపియన్‌గా నిలిచాడు. మంగళవారం జరిగిన ఫైనల్లో అతను 4-1తో ఆంథోని అమల్‌రాజ్‌ను ఓడించాడు. దీంతో అత్యధిక పర్యాయాలు జాతీయ ఛాంపియన్ అయిన కమలేశ్ మెహతా (8) రికార్డును శరత్ సమం చేశాడు. మహిళల విభాగంలో సుచిత్ర ముఖర్జీ ఛాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో ఆమె 4-3తో మనిక బాత్రాను ఓడించింది.

సెమీస్‌లో శ్యామ్‌కుమార్



దిల్లీ: ఇండియన్ ఓపెన్ బాక్సింగ్ టోర్నమెంట్లో తెలుగు తేజం శ్యామ్‌కుమార్ (49 కేజీలు) కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నాడు. అతను సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. మంగళవారం జరిగిన క్వార్టర్స్‌లో శ్యామ్ 5-0తో స్వామి నీరజ్‌ను చిత్తు చేశాడు. శివ థాప (60 కేజీలు), మహిళల్లో మేరీకోమ్ (49 కేజీలు), సరితాదేవి (60 కేజీలు) కూడా సెమీఫైనల్లో ప్రవేశించారు. క్వార్టర్స్‌లో శివ.. షెర్‌బెక్ రక్మటులెవ్ (ఉజ్బెకిస్థాన్)ను ఓడించాడు. సెమీస్‌లో శివ.. మన దేశానికే చెందిన మనీష్ కౌశిక్‌ను ఢీకొంటాడు. క్వార్టర్స్‌లో ఫిలిపినో సురెజ్‌పై గెలిచి కౌశిక్ ముందంజ వేశాడు. సతీష్ కుమార్ (91 కేజీలపైన), అంకుశ్ దహియా (60 కేజీలు) కూడా తుది నాలుగు జాబితాలో చోటు సంపాదించారు. మహిళల క్వార్టర్స్‌లో ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ మేరీకోమ్ 5-0తో బీనాదేవిని చిత్తు చేసింది. సరితాదేవి 4-1తో పిమ్‌విలయ్ (థాయ్‌లాండ్)పై గెలిచి ముందంజ వేయగా.. పూజారాణి (75 కేజీలు) క్వార్టర్స్‌లోనే ఓడిపోయింది.



రింకూ సింగ్

వాళ్ల జీవితాలు మారిపోయాయ్

ఈ ఏడాది ఐపీఎల్ వేలం.. కొంతమంది యువ క్రికెటర్ల జీవితాలనే మార్చేయబోతోంది. అలాంటి వారిలో రింకూ సింగ్, మంజూర్‌దార్ ముందు వరుసలో ఉంటారు. బీద కుటుంబ నేపథ్యం నుంచి వీళ్లిద్దరి జీవితాల్లో ఐపీఎల్ పుణ్యంతో కొత్త వెలుగులొచ్చాయి. కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.80 లక్షలు పెట్టి ఉత్తరప్రదేశ్‌కు చెందిన అలీగఢ్ ఆటగాడు రింకూను దక్కించుకుంటే.. కశ్మీర్ బ్యాట్స్‌మన్ మంజూర్‌దార్‌ను కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రూ.20 లక్షలు పెట్టి కొనుక్కుంది. ఇంటింటికి వెళ్లి ఎల్‌పీజీ సిలిండర్ చేర వేసే వృత్తిలో ఉన్న తన తండ్రికి తాను ఇలా ఉపయోగపడుతున్నందుకు రింకూ చాలా చాలా ఆనందంగా ఉన్నాడు. నిజానికి రింకూను గతేడాదే కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రూ.10 లక్షలు పెట్టి వేలంలో కొంది. ఇప్పుడు ఏకంగా రూ.80 లక్షలు తీసుకోబోతున్నాడు. ఇది అతని కనీస ధరకన్నా నాలుగు రెట్లు ఎక్కువ. ఐపీఎల్‌కి రాకముందు వరకు అతని కుటుంబం ఒక చిన్న షెడ్డులోనే జీవించేది. 2009లో క్రికెట్ ఆడడం మొదలుపెట్టిన రింకూ.. యూపీ అండర్-16, 19 జట్లకు ఎంపికయ్యాడు. 2014 విజయ్ హజారే ట్రోఫీలో 206, 154 పరుగులు చేసి అందరి దృష్టిలో పడ్డాడు. 2016లో రంజీ ట్రోఫీలో కూడా ఆడాడతను.

అప్పుడు రూ.60 కూలీ.. ఇప్పుడు రూ.20 లక్షలు: *రింకూతో పోల్చుకుంటే మంజూర్‌దార్‌ది మరీ దీన స్థితి. కుటుంబానికి గడవని నేపథ్యంలో అతను కూలీగా పని చేశాడు. రోజుకు రూ.60 చొప్పున తీసుకుంటూ పనులకు వెళ్లాడు. అలాంటి అతను ఈ ఐపీఎల్‌లో పంజాబ్ తరపున రూ.20 లక్షలు అందుకుంటున్నాడు. బందిపోర జిల్లాలో నివసించే అతని నిరుపేద కుటుంబానికి ఇదెంతో గొప్ప భాగ్యం. జమ్ము కశ్మీర్ నుంచి ఐపీఎల్‌కు ఎంపికైన తొలి ఆటగాడతను. అతను ఐపీఎల్‌కు ఎంపికయ్యాడన్న విషయం తెలిసి దాదాపు 30 వేల మంది జనం ఇప్పటిదాకా వచ్చి అభినందించారంటేనే అర్థం చేసుకోవచ్చు మంజూర్ ఎంత పెద్ద ఘనత సాధించాడో! ఖాళీ సమయాల్లో క్లబ్ క్రికెట్ ఆడే దార్.. భారీ సిక్స్‌లు కొట్టడంలో సిద్ధహస్తుడు. కూలీ పనే కాదు డబ్బులు సరిపోక 2008-12 మధ్య అతను రాత్రి వేళల్లో ఇళ్లకు పహారా కాసే వృత్తి చేశాడు. క్లబ్ క్రికెట్ ఆడే సమయంలో అతనికి కనీసం బూట్లు కూడా లేవు. 2011లో తొలిసారి రాష్ట్ర స్థాయి క్రికెట్ సెలక్షన్స్‌కు వెళ్లి సత్తా చాటిన మంజూర్‌దార్.. గతేడాదే దేశవాళీ అరంగేట్రం చేశాడు. అయితే క్రికెట్ కన్నా ముందు కబడ్డీ ఆడే మంజూర్‌దార్‌ను కశ్మీర్‌లో జనం 'పాండవ్' అని ముద్దుగా పిలుచుకుంటారు. ఐపీఎల్ ద్వారా వచ్చే డబ్బులతో అనారోగ్యంతో ఉన్న తన తల్లికి వైద్యం చేయిస్తానని.. నిర్మాణంలోనే ఆగిపోయిన ఇంటిని పూర్తి చేస్తానని అతను చెబుతున్నాడు.*



మంజూర్‌దార్

భారత్‌లో తీవ్రంగా మధుమేహం, రక్తపోటు



బోస్టన్: మధుమేహం, అధిక రక్తపోటు బాధితుల సంఖ్య భారత్‌లో తీవ్రంగా ఉందని తాజా అధ్యయనం హెచ్చరించింది. మహిళల్లో 6.1%, పురుషుల్లో 6.5% మధుమేహం బారిన పడుతున్నట్లు లెక్కగట్టింది. మహిళల్లో 20%, పురుషుల్లో 24.5% అధిక రక్తపోటుకు గురవుతున్నట్లు పేర్కొంది. 2012-14 మధ్య దేశవ్యాప్తంగా 13లక్షలకుపైగా మందిపై జరిపిన పరీక్ష ఫలితాలను విశ్లేషించి హార్వర్డ్ టీహెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఈ విషయాలను వెల్లడించారు. కుటుంబ ఆదాయం, నివాస ప్రాంతం ప్రభావం కూడా బాధితుల సంఖ్యపై పడుతున్నట్లు ఈ అధ్యయనంలో తేలింది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద మధ్యవయస్కుల్లో 30% మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని వెల్లడైంది. వృద్ధులు, మధ్య వయస్కులతోపాటు యువకుల్లోనూ అధిక రక్తపోటు కేసుల సంఖ్య ఎక్కువగా ఉందని తేలింది. ఈ రోగాలను ఎదుర్కోవడంలో.. భారత వైద్యరంగంలో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయని హార్వర్డ్ ప్రొఫెసర్ రిఫాట్ ఆటన్ అన్నారు. లక్షల మందికి సేవలు చేరవేసేందుకు నూతన సాంకేతికతల అభివృద్ధికి ఆస్కారముందని చెప్పారు.

ప్రమాదకరంగా బ్యాక్టీరియాల నిరోధకశక్తి



బ్యాంకాక్: విచక్షణారహితంగా యాంటిబయాటిక్స్ వాడుతుండటంతో, ఇన్‌ఫెక్షన్‌కు కారణమవుతున్న బ్యాక్టీరియా దాదాపు లొంగని స్థాయికి చేరుకుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. ఈకోలి, క్లెబ్సియెల్లా న్యూమోనియే, స్టాఫిలోకాకస్ ఆరియస్, స్ట్రెప్టోకాకస్ న్యూమోనియే, సాల్మొనెల్లా ఎస్‌పీపీ బ్యాక్టీరియాలు నిరోధకశక్తిని బాగా పెంచుకున్నాయని తెలిపింది. డబ్ల్యూహెచ్‌వోకు చెందిన ప్రపంచ క్రిమినాశక పర్యవేక్షక వ్యవస్థ(గ్లాస్) ఈ నివేదికను విడుదల చేసింది. గ్లాస్‌లో 52 దేశాలకు సభ్యత్వం ఉంది. వివిధ ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్న 22 దేశాల్లోని ఐదు లక్షలమందిపై అధ్యయనం చేసి ఈ నివేదికను రూపొందించింది. రక్తంలో ఇన్‌ఫెక్షన్‌కు కారణమవుతున్న బ్యాక్టీరియాల నిరోధకశక్తి పలుదేశాల్లో సున్నా నుంచి 82 శాతానికి పెరిగిపోయిందని తేలింది. ఉదాహరణకు న్యూమోనియాకు మందుగా వాడుతున్న పెన్సిలిన్‌కు కూడా కొన్ని దేశాల్లో సున్నా నుంచి 51 శాతం వరకు మొండిగా తయారైంది. మూత్రమార్గంలో ఇన్‌ఫెక్షన్‌ను తగ్గించడానికి సిప్రొఫ్లోక్సాసిన్‌ను వాడుతున్నప్పటికీ, ఇ.కోలి బ్యాక్టీరియా 8 నుంచి 65 శాతం మేరకు బలపడింది. ప్రపంచవ్యాప్తంగా యాంటిబయాటిక్స్ కారణంగా బ్యాక్టీరియాల్లో మొండితనం ప్రమాదకరమైన స్థాయికి చేరుకుందని నివేదిక నిర్ధారించిందని డబ్ల్యూహెచ్‌వో క్రిమినాశక నిరోధకత కార్యదర్శి డాక్టర్ మార్క్ స్ప్రెంగెర్ పేర్కొన్నారు.

క్యాన్సర్ కణాలను నాశనం చేసే చికిత్స

★ ప్రస్తుత విధానం కంటే సురక్షితం, తక్కువ వ్యయం
★ కోచిలోని ఏఐఎంఎస్ శాస్త్రవేత్తల ఘనత



కోచి: రేడియో తరంగాల నుంచి వెలువడే వేడి ద్వారా క్యాన్సర్ కణాలను నాశనం చేసే సురక్షితమైన చికిత్స పద్ధతిని కోచిలోని అమ్రిత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఏఐఎంఎస్)కు చెందిన సెంటర్ ఫర్ నానోసైన్సెస్ అండ్ మాలిక్యులర్ మెడిసిన్(సీఎన్ఎంఎం) శాస్త్రవేత్తలు కనుగొన్నారు. మానవ ఎముకల్లో ఉండే కాల్షియం ఫాస్ఫేట్ సూక్ష్మాతిసూక్ష్మ కణాలను జీవక్షైధిల్య రేడియో పౌనఃపున్యం(ఆర్ఎఫ్) ఏజెంట్లుగా మార్చడంలో విజయవంతమయ్యారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌లోనూ వీటిని గుర్తించవచ్చు. దీనివల్ల క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స తక్కువ ఖర్చుతో, సురక్షిత పద్ధతిలో చేయవచ్చని సీఎన్ఎంఎం సంచాలకురాలు డాక్టర్ శాంతినాయర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ వారు ఈ ప్రాజెక్టుకు నిధులిచ్చారు. ప్రస్తుతం రేడియేషన్, గామా కిరణాలను ఉపయోగించి క్యాన్సర్‌కణాలను చంపుతున్నారు. దీని వల్ల ఆరోగ్యకరమైన కణాలు కూడా చనిపోతున్నాయి. సైబర్ నైఫ్‌తో రేడియేషన్ కచ్చితంగా ఇవ్వొచ్చు. కాకపోతే ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్న చికిత్స.

'నాసా' ఉపగ్రహం దొరికింది కానీ...



వాషింగ్టన్: దాదాపు 12 ఏళ్లక్రితం అనూహ్యంగా అదృశ్యమైన, అమెరికా అంతరిక్ష సంస్థ-'నాసా' ప్రయోగించిన 'ఇమేజ్' ఉపగ్రహం ఉనికి తెలిసింది. అమెరికా సైన్యం అవసరాల కోసం ఇటీవల ప్రయోగించిన 'జుమా' ఉపగ్రహం కూడా తాజాగా కనిపించకుండా పోవడంతో దీన్ని కనిపెట్టడానికి స్కాట్ టిల్లీ అనే ఔత్సాహిత ఖగోళశాస్త్రజ్ఞుడు విశ్వంలో శోధిస్తున్నాడు. ఆయన పరిశోధనలో భాగంగా ఓ సంకేతాన్ని గమనించాడు. దాన్ని డీకోడ్ చేయడానికి ప్రయత్నించగా, భూ-అయస్కాంతావరణంపై సౌరగాలుల ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి నాసా ప్రయోగించిన ఇమేజ్ ఉపగ్రహం నుంచి వెలువడిన సంకేతంగా నిర్ధారణ అయింది. సంకేతాలు ఇచ్చిపుచ్చుకునే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ మొత్తం ఇమేజ్‌లో పాడైపోయాయని నాసాకు చెందిన గాడ్డార్డ్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ తెలిపింది. మార్చి 25, 2000లో ఉపయోగించిన నాటి సాఫ్ట్‌వేర్‌లు పలుసార్లు వెర్షన్లు అప్‌డేట్ అయ్యాయని, ప్రస్తుతం ఇమేజ్‌లో సంకేతాలు ఇచ్చిపుచ్చుకునే వ్యవస్థ పనిచేయడం లేదని స్పష్టం చేసింది. రివర్స్ ఇంజినీరింగ్ అనే పద్ధతిలో అది పంపుతున్న సంకేతాలను అందిపుచ్చుకోవడానికి, విశ్లేషించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపింది.

క్యాన్సర్ మూలకణాలకూ నిద్రాణస్థితి

★ చికిత్సా ఏజెంట్‌ను కనుగొన్న పరిశోధకులు



లండన్: క్యాన్సర్ మూలకణాలను నిద్రాణస్థితిలోకి తీసుకెళ్లి, వాటి వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టే చికిత్సా ఏజెంట్ 'డైఫినైలీన్ అయోడోనియం క్లోరైడ్- డీపీఐ'ను పరిశోధకులు కనుగొన్నారు. సంప్రదాయ కీమోథెరపీతో పోలిస్తే ఎలాంటి దుష్ప్రభావాలు కలగజేయకుండా క్యాన్సర్ కణాలను నాశనం చేయడానికి ఈ మందు విజయవంతంగా పనిచేస్తుంది. క్యాన్సర్‌కు కారణంకాని కణాలకు ఇది ఎలాంటి హాని చేయకపోవడం విశేషం. మైటోకాండ్రియాకు ఆహారంగా ఉపయోగపడుతున్న 90కుపైగా ప్రొటీన్ ఎంజైములను డీపీఐ ఎలా లక్ష్యంగా చేసుకుంటుందో 'ఏజింగ్' అనే జర్నల్‌లో ప్రచురితమైన వ్యాసంలో ఇంగ్లాండ్‌లోని స్టాల్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు వివరించారు.

రాతప్రతి రహస్యం విప్పిన కృత్రిమ మేధస్సు

★ 15వ శతాబ్దంనాటి గజిబిజి సందేశం వెలుగులోకి



టొరంటో: చరిత్రకారులు, గూఢలిపిని తర్జుమా చేసేవారికి పెద్ద పజిల్‌గా మిగిలిపోయిన 15వ శతాబ్దంనాటి 'వోయెనిచ్ రాతప్రతి' రహస్యం ఎట్టకేలకు వీడిపోయింది. దీని అర్థం తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు కృత్రిమ మేధస్సును ఉపయోగించడం విశేషం. గజిబిజిగా, రకరకాల చిత్రపటాలతో ఉన్న ఈ రాతప్రతి గురించి కెనడాలోని అల్బెర్టా విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు ఎంతో శ్రమించారు. రాతప్రతిని కృత్రిమ మేధస్సు అర్థం చేసుకోవడం కోసం ప్రపంచవ్యాప్తంగా 400 విభిన్న భాషలను శాస్త్రవేత్తల బృందం ఉపయోగించుకుంది. రాతప్రతి అరబిక్‌లో ఉందని భావించామని, చివరకు హిబ్రూ భాషలో రాసినట్లు తేలిందని ప్రొఫెసరు గ్రెగ్ కొండ్రాక్ తెలిపారు. 80 శాతం పదాలు హిబ్రూ నిఘంటువులో ఉన్నట్లు తెలిసినప్పటికీ, రాతప్రతిలో ఏం రాశారో తర్జుమా చేయడం ఏ మేధావి వల్లా కాలేదన్నారు. చివరకు గూగుల్ ట్రాన్స్‌లేట్‌ను ఆశ్రయించామన్నారు. 'ప్రజలకు, నాకు, ఇంట్లో వ్యక్తికి, పూజారికి ఆమె సలహాలు ఇచ్చింది' అనే వాక్యంతో రాతప్రతి మొదలుకావడం నిజంగా వింతగా ఉందన్నారు.

కూలీల కష్టం.. తపాలాలో తిష్ట

పదేళ్లుగా నిరుపయోగంగా రూ.58.49 కోట్ల ఉపాధి నిధులు

ఈనాడు - అమరావతి, ఈనాడు డిజిటల్ - కర్నూలు: ఉపాధి కూలీల వేతనాలు అనేక ఏళ్లుగా పంపిణీకి నోచుకోక తపాలా కార్యాలయాల్లో మూలుగుతున్నాయి. అవి ఏకంగా రూ.58 కోట్లపైనే ఉన్నాయి. ఈ విషయం కూలీలకు తెలియదు... అలాగని వీరిని గుర్తించి తపాలా కార్యాలయాలకు తీసుకెళ్లాల్సిన ఉపాధి సిబ్బంది పట్టించుకోరు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) వేతనాలను 2016 డిసెంబరు వరకూ కూలీలకు తపాలా కార్యాలయాలద్వారా చెల్లించేవారు. ఆ తర్వాత పారదర్శకత, సులభతరం చేసే క్రమంలో కూలీల బ్యాంకు ఖాతాలకే నేరుగా వేతనాలు చేరేలా ఏర్పాట్లు చేశారు. కానీ 2016 డిసెంబరుకు ముందు కూలీలకు చెల్లించాల్సిన రూ.58.49 కోట్లు తపాలా కార్యాలయాల్లోనే ఉండిపోయాయి. కొత్త వ్యవస్థ అమల్లోకి వచ్చేలోగా చెల్లింపులన్నీ పూర్తి చేయిస్తే బాగుండేది. అలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఇప్పుడు పెద్ద సమస్యగా తయారైంది. ప్రకాశం జిల్లాలో అత్యధికంగా బకాయిలున్నాయి.



కారణాలనేకం...

■ ఉపాధి పనులకు హాజరైన వారిలో చాలామంది తరువాత ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలసలు వెళ్లిపోయారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇలాంటి పరిస్థితి ఎక్కువ. అలాంటి వారంతా మళ్లీ వేతనాల కోసం ప్రయత్నించి ఉండకపోవచ్చు.

■ కార్యక్రమ ప్రారంభంలో వృద్ధాప్య పింఛన్లు అందుకుంటున్న వారందర్నీ ఉపాధి పనులకు అనుమతించేవారు. కొన్నాళ్లకు వీరిని ప్రభుత్వ ఆదేశాలపై మినహాయించినా మొదట చేసిన పనులకు వేతనాలు రాకముందే చాలామంది అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చు.

■ బ్యాంకు ఖాతాల్లో వేయకముందు బినామీ పేర్లతో ఉపాధి నిధులు స్వాహా చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఆ విధంగా ఎవరైనా బినామీ పేర్లను సృష్టించి కొన్నాళ్లు నడిపించాక కూలీలే వేతనాలు తీసుకోవడానికి విధిగా తపాలా కార్యాలయానికి వెళ్లాలన్న నిబంధన వచ్చాక వెనక్కి తగ్గారా? అనే అనుమానమూ ఉంది.

మృతి చెందినా కనికరించలేదు...

కర్నూలు జిల్లా కౌతాళంకు చెందిన వీరేశ్ భార్య మాలశరణమ్మ ఏడాది క్రితం వరకూ (జాబ్ కార్డు నెం:131760116027011004) ఉపాధి కూలీ. పథకం ప్రారంభం నుంచి ఆమె పనులకు వెళ్లేది. ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందిన మాలశరణమ్మకు రూ.3,700 రావాలి. మృతి చెందక ముందు ఆమె అనేకసార్లు తపాలా కార్యాలయంచుట్టూ తిరిగినా ఉపయోగం లేకపోయింది. మాలశరణమ్మ మృతి చెందాక ఆమె భర్త వీరేశ్ భార్య మరణ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకొని కొద్ది నెలలుగా తపాలా, ఉపాధి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

పంచాయతీల వారీగా గ్రామాల్లో విచారణ...

తపాలా కార్యాలయాల్లోని ఉపాధి నిధులను కూలీలకు అందేలా పంచాయతీల వారీగా జాబితాలు సిద్ధం చేసి గ్రామాల్లో విచారించేలా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నాం. వేతనాలు అందని వారెవరైనా ఉంటే తమ సిబ్బందే తపాలా కార్యాలయాలకు తీసుకెళ్లి చెల్లింపులు చేయిస్తారు. ఎవరూ లేరనుకుంటే మూడు సార్లు ప్రకటనలు చేసి రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు జమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– బి.రామాంజనేయులు, కమిషనరు, పంచాయతీరాజ్. గ్రామీణాభివృద్ధిశాఖ



రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పంపిణీకి నోచుకోక తపాలా కార్యాలయాలకు పరిమితమైన ఉపాధి నిధుల వివరాలు

జిల్లా	కూలీల సంఖ్య	పంపిణీ చేయాల్సింది (రూ.కోట్లలో)
అనంతపురం	45,955	4,00,05,419
చిత్తూరు	39,298	3,17,74,864
తూర్పు గోదావరి	1,01,480	7,02,73,194
గుంటూరు	95,650	4,27,89,341
కడప	35,410	2,56,23,662
కృష్ణా	49,567	1,71,48,753
కర్నూలు	60,441	4,44,20,101
ప్రకాశం	1,32,307	9,47,80,776
నెల్లూరు	39,465	2,56,12,721
శ్రీకాకుళం	92,766	5,83,31,421
విశాఖపట్నం	63,133	4,93,90,785
విజయనగరం	51,615	3,51,86,372
పశ్చిమ గోదావరి	59,057	4,49,10,915

వుడా అధికారికి 12 రోజుల రిమాండ్

కృష్ణా జిల్లా జైలుకు తరలింపు

విజయవాడ, న్యూస్‌టుడే/ఈనాడు, విశాఖపట్నం: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ (వుడా) అదనపు ముఖ్య నగర ప్రణాళిక అధికారి పసుపర్తి ప్రదీప్‌కుమార్‌కు విజయవాడలోని అనిశా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆయనను కృష్ణా జిల్లా జైలుకు తరలించారు. విశాఖతోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 12 చోట్ల సోమవారం అనిశా నిర్వహించిన సోదాల్లో ప్రదీప్‌కుమార్‌కు చెందిన రూ.40 కోట్లకుపైగా అక్రమ ఆస్తులు బయటపడిన విషయం తెలిసిందే. కృష్ణా జిల్లా అనిశా డీఎస్పీ ఆధ్వర్యంలోని అధికారులు.. ప్రదీప్‌కుమార్‌ను సోమవారం రాత్రి విశాఖలో అరెస్టు చేసి మంగళవారం రాత్రి విజయవాడలో ఏసీబీ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్న మూడు లాకర్లలో ఏముందన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. సింగపూర్ పర్యటనకు వెళ్లిన ప్రదీప్‌కుమార్ భార్య ఫిబ్రవరి 2న విశాఖ రానున్నారని.. ఆమె వచ్చాకే లాకర్లలో ఏముందన్నదానిపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

సాగు భూములు.. చేపల చెరువులా!

- ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని అధికారులకు హైకోర్టు ఆదేశం
- జస్టిస్ ధర్మారావు లేఖను పిల్‌గా పరిగణించి ధర్మాసనం విచారణ

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు, పశ్చిమ గోదావరిజిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లోని అత్యంత సారవంతమైన భూముల్ని నిబంధనలకు విరుద్ధంగా చేపల/రొయ్యల చెరువులుగా మారుస్తున్నారని పేర్కొంటూ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఈ.ధర్మారావు రాసిన లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా (పిల్) పరిగణించిన హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది.

ఏపీ మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శి, అటవీ శాఖ కార్యదర్శి, నీటిపారుదలశాఖ కార్యదర్శి, మత్స్యశాఖ కమిషనర్, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు, ఆయా జిల్లాల మత్స్యశాఖ అధికారులకు నోటీసులు జారీచేస్తూ పూర్తి వివరాలతో ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ఆదేశించింది. వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎమ్మెస్కే జైశ్వాల్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈమేరకు ఆదేశాలు జారీచేసింది.

ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా, మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే)గా పనిచేసి పదవీ విరమణ పొందాక సొంత గ్రామం తూర్పుగోదావరి జిల్లా ఐనవల్లి మండలం క్రాపలో స్థిరపడిన జస్టిస్ ధర్మారావు.. 'విచక్షణారహితంగా పంటభూముల్ని చేపల చెరువులుగా మార్చడంపై' హైకోర్టుకు లేఖ రాసిన సంగతి తెలిసిందే. సారవంతమైన భూములను చెరువులుగా మార్చడం ద్వారా ఆ ప్రభావం పర్యావరణంపై, ఆ ప్రాంతంలోని వృక్ష, జంతు జాతులపై పడుతుందన్నారు. చేపల చెరువులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు. ఫలితంగా వ్యవసాయ పనులు లేకుండా పోయి వాటిపై ఆధారపడి నివసించే కూలీల జీవనాధారం దెబ్బతింటోందని జస్టిస్ ధర్మారావు లేఖలో పేర్కొన్నారు.

కోడిపందేల విషయంలో ప్రజాప్రతినిధులపై కేసుల్లేవు!

హైకోర్టులో వ్యాజ్యం

ఈనాడు, హైదరాబాద్: కోడిపందేలు నిర్వహించడం, ప్రోత్సహించినందుకు ప్రజాప్రతినిధులపై ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసులు నమోదు చేయలేదని పేర్కొంటూ న్యాయవాది టి.భానుప్రకాశ్ హైకోర్టును ఆశ్రయించారు. వ్యాజ్యంలో ప్రతివాదులుగా రేపల్లె ఎమ్మెల్యే ఎ.సత్యప్రసాద్, ఎమ్మెల్సీ ఎ.సతీష్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు దేవినేని మల్లికార్జునరావు, ముమ్మనేని వెంకటసుబ్బయ్యలను ప్రతివాదులుగా చేర్చారు. గుంటూరు జిల్లా చెరుకుపల్లి ఠాణాలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయలేదన్నారు. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి మంగళవారం ఈ వ్యాజ్యంపై విచారణ జరిపారు. కోడిపందేల వ్యవహారంపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరుపుతున్న నేపథ్యంలో ప్రస్తుత వ్యాజ్యాన్ని అక్కడికే పంపించేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రీ(పరిపాలనా విభాగం)ని ఆదేశించారు.

కస్తూర్బా విద్యాలయాల్లో ఇక ఇంటర్ వరకు విద్య

- పొడిగించేందుకు కేంద్రం అంగీకారం

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో ఇంటర్ వరకు విద్యను అందించేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యనందించేందుకు కేంద్ర మానవవనరుల శాఖ తనవంతు ఆర్థికవాటాను భరిస్తోంది. తెలుగు రాష్ట్రాలు మాత్రం సొంత నిధులతో 10వ తరగతి వరకు విద్య అందిస్తున్నాయి. బాలికావిద్యపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఛైర్మన్‌గా కేంద్రం ఉప సంఘాన్ని నియమించగా.. పలు సిఫారసులతో తుది నివేదికను ఆయన ఈ నెల 16న కేంద్రానికి సమర్పించారు. ఈ క్రమంలో పలు అంశాలపై అభిప్రాయాలను, అభ్యంతరాలను చెప్పాలని కేంద్రం ఆయా రాష్ట్రాలకు లేఖ రాసింది. అందులో ఒకటి కేజీబీవీల్లో 12వ తరగతి వరకు విద్యనందించడం. దీనిపై దిల్లీలో మంగళవారం అన్ని రాష్ట్రాల విద్యాశాఖ ఉన్నతాధికారులతో కేంద్ర మానవవనరుల శాఖ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేజీబీవీల్లో 12వ తరగతి వరకు పొడిగించడంపై అన్ని రాష్ట్రాలు అంగీకరించాయి. ప్రతి వెనకబడిన బ్లాక్‌కు కనీసం ఒక కేజీబీవీ ఏర్పాటు చేస్తామని కేంద్ర అధికారులు స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో బ్లాకులకు బదులు...మండలాలు ఉన్నాయి. తెలంగాణలో ప్రస్తుతం 475, ఏపీలో 352 కేజీబీవీలున్నాయి. వాటిల్లో ఇంటర్ వరకు విద్యనందిస్తే ఆ మేరకు కేంద్రం తనవంతు వాటా నిధులను మంజూరు చేయనుంది. అంతేకాకుండా సర్వశిక్షాఅభియాన్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్(ఆర్ఎంఎస్ఏ) పథకాలను విలీనం చేసి ఒకటే పథకంగా చేయనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లోనూ గ్రంథాలయాల ఏర్పాటు, ఆటవస్తువులకు రూ.3 వేల చొప్పున అందించనున్నారు.

'భోగాపురం'లో భారీ కుంభకోణం!

- ప్రధానికి వైకాపా నేత బొత్స లేఖ

విజయవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అభివృద్ధి ముసుగులో దోపిడీ జరుగుతోందని వైకాపా నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) దాఖలు చేసిన బిడ్‌ను రాష్ట్ర మంత్రి మండలి రద్దు చేయడం వెనుక పెద్ద కుంభకోణం దాగి ఉందన్నారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాసిన లేఖను మంగళవారం ఆయన విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాకు చూపించారు. "విమానాశ్రయం నిర్మాణానికి 2016లో టెండర్లు పిలవగా.. ఏఏఐతో పాటు మరో ప్రైవేటు సంస్థ బిడ్లు వేశాయి. విమానాశ్రయానికి వచ్చే ఆదాయంలో ఏఏఐ సంస్థ 30.2 శాతం, ప్రైవేటు సంస్థ 21.6 శాతం ప్రభుత్వానికి ఇస్తామని బిడ్‌లో పేర్కొన్నాయి. అధిక మొత్తం ఇస్తామన్న ఏఏఐకే బిడ్ దక్కింది. ఏఏఐ ప్రభుత్వ సంస్థ కావడంతో ముడుపులు దక్కే అవకాశం ఉండదని.. ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ఆ బిడ్‌ను రద్దు చేశారు. భూసేకరణ, ఎకనమిక్ జోన్‌తో కలిపి ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తామని సాకులు చెప్పారు. దీనిపై కేంద్ర మంత్రి అశోక్‌గజపతి రాజు సమాధానం చెప్పాలి" అని బొత్స డిమాండ్ చేశారు.

విజయవాడలో ఎమ్మెల్యే బొండా ఉమా కబ్జాల వెనుక ముఖ్యమంత్రి హస్తం ఉందని బొత్స విమర్శించారు. వాక్‌విత్ జగన్ కార్యక్రమానికి మంచి స్పందన రావడాన్ని తట్టుకోలేక మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు. . వైకాపా నేత జోగి రమేష్‌పై అక్రమంగా కేసు పెట్టారని చెప్పారు. ఇబ్రహీంపట్నంలో గుండెపోటుతో కార్యకర్త మృతి చెందితే ర్యాలీ వల్లే జరిగిందని చెప్పడాన్ని తప్పుబట్టారు.

స్వేచ్ఛతోనే పరిశోధనలకు ఊతం

- బయోటెక్నాలజీలో అంకురాలకు అడుగులు
- సవాళ్లున్నా.. సత్తా చాటే అవకాశాలు
- యువకుల ఆలోచనలకు విలువివ్వాలి
- 'ఈనాడు'తో అభిప్రాయాలు పంచుకున్న పరిశోధకులు

ఈనాడు, హైదరాబాద్: ఐటీ తరహాలో భారత్‌లో బీటీ (బయోటెక్నాలజీ) దిశగానూ అంకుర సంస్థలు అడుగులు వేస్తున్నాయి. వినూత్న ఆలోచనలు, సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలో వాటికి ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రతి పదింటిలో ఒకటి లేదా రెండు మాత్రమే విజయవంతమయ్యే అవకాశం ఉందని ఈ రంగంలోని నిపుణులు అంటున్నారు. సవాళ్లు ఎక్కువగా ఉన్నా.. విజయవంతమైతే మాత్రం మానవ జీవితాల్లో ఎంతో మార్పునకు ఇవి దోహదం చేస్తాయంటున్నారు. దేశంలో వీటిని ప్రోత్సహించాలని సూచిస్తున్నారు. యువ పరిశోధకులు స్వేచ్ఛగా పరిశోధించే వాతావరణం కల్పించాలని అంటున్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న జీవకణ శాస్త్ర అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడానికి వచ్చిన పలువురు పరిశోధకులు 'ఈనాడు'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు. వివరాలివీ..

భారత్‌లో బయోటెక్ రంగం క్రమంగా పుంజుకుంటోంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో మూడో స్థానంలో ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా బయోటెక్‌లో ఔషధ, సేవలు, వ్యవసాయం, పరిశ్రమ, ఇన్ఫర్మేటిక్స్‌గా ఐదు విభాగాల్లో అవకాశాలు ఉన్నాయంటున్నారు. ప్రభుత్వాలు సైతం దృష్టి పెట్టడంతో ఈ రంగంలో పెట్టుబడులు పెరగడమే కాదు, ఎగుమతులు పెరగడానికీ దోహదం చేస్తున్నాయని చెబుతున్నారు. డీబీటీ, డీఎస్‌టీ, సీఎస్ఐఆర్, బీఐఆర్ఏసీ సంస్థలు ఇంక్యుబేషన్ కేంద్రాల ఏర్పాటుతో అంకుర సంస్థలను ప్రోత్సహిస్తున్నాయి. సీసీఎంబీలో గత ఏడాది అంకుర సంస్థల కోసం ఐ-హబ్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇవన్నీ కూడా ఆరోగ్యరంగంలో అంకురాలు పెరగడానికి దోహదపడుతున్నాయి. వేర్వేరు ప్రాంతాలు, భిన్న జాతులు, భౌగోళిక పరిస్థితులు ఉండే భారత్‌లో కలిసి పరిశోధించేందుకు ఇతర దేశాల వారికి మంచి అవకాశముందని పరిశోధకులు అంటున్నారు. విదేశాల్లో స్థిరపడిన భారత శాస్త్రవేత్తలు, పరిశోధకులు సైతం తిరిగి స్వదేశానికి వచ్చి వారి మేధస్సును ఇక్కడివారికి ఉపయోగించేలా ప్రభుత్వాలు సైతం అటువంటి వాతావరణం కల్పించాలని కోరుతున్నారు.

ఏకకాలంలో జరగాలి..



ఐటీలో అంకుర సంస్థలన్నీ ప్రజల సమస్యలకు, బ్యాంకింగ్‌కు సాంకేతిక పరిష్కారాలు చూపుతున్నాయి. వీటి ఫలితాలు త్వరగా కనిపిస్తాయి, వ్యయమూ తక్కువే. బీటీ పూర్తిగా భిన్నం. చాలా సమయం పడుతుంది. ఫలితం వస్తుందో లేదో తెలియని అనిశ్చితి ఎక్కువ. ఈ రంగం ఇప్పుడిప్పుడే విస్తృతమవుతోంది. ఇందులో అంకుర సంస్థలను ప్రోత్సహించాలి. ఇవన్నీ ఏకకాలంలో జరిగితే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి.

– సత్యజిత్ మేయర్, సంచాలకులు, జాతీయ జీవశాస్త్రాల కేంద్రం, బెంగళూరు

యువతకు పెద్దపీట వేస్తే..




ఐటీలో యువకులు అద్భుతాలు చేస్తున్నారు. శాస్త్ర పరిశోధనల్లోనూ యువకుల ఆలోచనలకు విలువివ్వాలి. స్వేచ్ఛగా పరిశోధించే అవకాశాలు కల్పించాలి. వయసును బట్టి బాధ్యతలు కాకుండా ఆలోచనలను బట్టి పరిశోధనలకు నేతృత్వం కల్పిస్తే భారత బీటీ రంగంలోనూ మంచి ఆవిష్కరణలు వచ్చే అవకాశం ఉంది. అమెరికాలో బయో అంకురాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ప్రైవేటు వ్యక్తులు ముందుకొస్తారు. ఇక్కడ అలాంటి పరిస్థితి లేదు. ప్రైవేటు పెట్టుబడులు వచ్చేటువంటి వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలి. చైనా శాస్త్ర పరిశోధకులు వేరే దేశాల్లో స్థిరపడినా.. వారి సేవలను ఆ దేశం అత్యుత్తమంగా వాడుకుంటుండటంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. మన దేశంలోనూ బయట స్థిరపడిన పరిశోధకులు, శాస్త్రవేత్తల సేవలను వినియోగించుకోవాలి. సదస్సులో పరిశోధక విద్యార్థుల ఆలోచనలు, పరిశోధనలకు సంబంధించిన 200దాకా పోస్టర్లు ప్రదర్శించారు. వాటిలో 16 వరకు మంచి ఆవిష్కరణలు అవుతాయనిపించింది.

–డా.రఘు కల్లూరి, ఎండీ అండర్సన్ క్యాన్సర్ సెంటర్

న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం

- 'కేశవరెడ్డి' బాధితుడు శ్రీనివాసులు వేదన

ఈనాడు డిజిటల్, అమరావతి: కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత కేశవరెడ్డి తన నుంచి తీసుకున్న రూ.5లక్షలు ఇప్పించి న్యాయం చేయాలని కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గంగుల శ్రీనివాసులు కోరారు. తనకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసేందుకు వస్తే లోపలకు అనుమతించడం లేదని మంగళవారం సచివాలయం ఎదుట విలేకరుల వద్ద వాపోయారు. ముగ్గురు పిల్లలు, భార్యతో కలిసి ఆయన సచివాలయానికి వచ్చారు. 2012లో కేశవరెడ్డి డిపాజిట్ కింద రూ.5 లక్షలు తీసుకున్నారని చెప్పారు. వడ్డీ, అసలు కింద రూ.2 లక్షలు చెల్లించారని వెల్లడించారు. అనంతరం మంత్రి ఆదినారాయణ రెడ్డి.. డబ్బులు చెల్లిస్తానని హామీ ఇచ్చి, మాట మార్చారని శ్రీనివాసులు ఆరోపించారు. ముఖ్యమంత్రిని కలవకుండా ఆయనే అడ్డుపడుతున్నాడన్నారు. 4 రోజుల్లోపు ముఖ్యమంత్రిని కలిసే అవకాశం రాకుంటే భార్యా బిడ్డలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని శ్రీనివాసులు పేర్కొన్నారు.



కేశవరెడ్డికి డబ్బిచ్చినట్లు ధ్రువీకరణ పత్రాలను చూపుతున్న బాధితుడు శ్రీనివాసులు, ఆయన కుటుంబ సభ్యులు

గుంటూరు మున్సిపల్ కమిషనరుకు కోర్టు ధిక్కార నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: ఓ కబేళా మూసివేత వ్యవహారంలో వాస్తవాల్ని దాచిపెట్టి కోర్టులో ప్రమాణ పత్రం దాఖలు చేసినందుకు గుంటూరు మున్సిపల్ కమిషనరు అనూరాధపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. క్రిమినల్ కోర్టు ధిక్కారం కింద ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను 4వారాలకు వాయిదా వేసింది. తప్పు చేసిన అధికారులను వదిలేస్తే న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం పోతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. గాడిదల్ని వధించి విచ్చలవిడిగా మాంసం విక్రయిస్తున్నా అధికారులు నివారణా చర్యలు తీసుకోవడం లేదంటూ కాకినాడకు చెందిన యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్ కార్యదర్శి గోపాలరావు మరో ముగ్గురు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. గతంలో ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం.. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బొంగరాలబీడులో నిర్వహిస్తున్న కబేళా మూసివేతపై వివరాలు సమర్పించాలని ఆదేశించింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00